ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న "ఈ మాట" పాఠకులకు సుస్వాగతం!

ఈ సంచికలో ఒక విశేషం ఉంది. అందువల్లనే ఇది బయటకు రావటం కొంత ఆలస్యం అయింది కూడ. తానా వారు ఈ వారాంతంలో జరగబోతున్న మహాసభలను పురస్కరించుకొని జరిపిన కథల పోటీలో వచ్చిన 700 పైగా కథల్నుంచి ఆరింటిని ఉత్తమమైన వాటిగా నిర్ణయించి బహుమతులు ప్రకటించారు. ఆ ఆరు కథల్నీ ఈ సంచికలో ప్రచురిస్తున్నాం!

శ్రీ జంపాల చౌదరి గారు ఇందుకు ప్రేరకులు, కారకులు. వారికి మా హార్దిక కృతజ్ఞతలు!

ఈ కథల గురించి, ప్రస్తుత తెలుగు కథా సాహిత్య స్థితిని గురించి అభిప్రాయాలు, చర్చలు ఆహ్వానిస్తిన్నాం.

ఈ సందర్భంలో మరొక శుభవార్తను "ఈ మాట" పాఠకులకు తెలియజెయ్యటానికి ఎంతో సంతోషిస్తున్నాం. కొన్ని సంవత్సరాలుగా అమెరికాలో తెలుగు సాహిత్య సృష్టిని ప్రోత్సహించటానికి పోటీలను నిర్వహిస్తున్న వంగూరి ఫౌండేషన్ వారు ఈ సంవత్సరం వారు ఎంపిక చేసిన రచనలను "ఈ మాట"లో ప్రచురణకు ఇవ్వటానికి సహృదయంతో అంగీకరించారు. శ్రీ వంగూరి చిట్టెన్ రాజు గారికి మా కృతజ్ఞతలు.

మరో విశేషం ఏమిటంటే, ప్రఖ్యాత సాహితీ పరిశోధకులు శ్రీ వెల్చేరు నారాయణరావు గారి ఆధ్వర్యంలో అమెరికా తెలుగు సాహితీప్రియులు కొందరు తయారు చేసిన "ఈ శతాబ్దపు పుస్తక శతం" కూడ ఈ సంచికలో ప్రచురిస్తున్నాం! తెలుగు సాహిత్యంలో అభిరుచి ఉన్నవారు వీటిలో వీలైనన్నింటిని చదవాలని వారి ఆకాంక్ష. ఈ పట్టిక మీద కూడ అభిప్రాయాలను, చర్చలను ఆహ్వానిస్తున్నాం!

ఎందరో పాఠకులు పత్రికను ఇంకా అభివృద్ధిపరచటానికి రకరకాల సూచనలు చేస్తున్నారు. ఐతే ఈ పత్రికను నడపటానికి మేం ఇవ్వగలిగిన కాలం కేవలం పరిమితం కావటం వల్లను, కొన్ని సూచనలను అమలుపరచటానికి కావలసిన సాంకేతిక కౌశలం కూడ మాదగ్గర లేనందు వల్లను అందరినీ తృప్తి పరచలేక పోవచ్చు. సాంకేతికంగా సహాయం చెయ్యగలిగిన వారు సహృదయంతో వారి కాలాన్ని, జ్ఞానాన్ని యివ్వదలిస్తే ముందుకు రావచ్చును. వారికి మా స్వాగతం. మాకు యీ-మెయిల్ పంపితే వారి సహాయాన్ని తీసుకుంటాం.

ఈ సారి కూడ శ్రీ మంథా లక్ష్మణమూర్తి గారు ముఖచిత్రం వేసి యిచ్చారు. వారికి మా కృతజ్ఞతలు.



# 1998

---- అర్నాథ్

ఆమె వెళ్ళిపోతోంది.

పుట్టింటికి వెళ్ళిపోతోంది.

భాస్కర్ని విడిచి వెళ్ళిపోతోంది.

అందుకు రేపే ముహూర్తం !

పద్మ పుట్టిల్లు వంద కిలోమీటర్ల దూరంలో ఉంది. వాళ్ళపై తను అర్ధంతరంగా వాలిపోవడం ఆర్థికంగా ఇబ్బంది వ్యవహారం అయినప్పటికీ కూతురిని బరువుగా తలచే తల్లితండ్రులు కారు.

జీవితాంతం వాళ్ళకి బరువు కాకుండా తనకి ఉన్న డిగ్రీ చదువుకి ఏదో చిన్న ఉద్యోగం దొరక్కుండా పోదు. వాళ్ళకి కూతురుకన్నా ఏడేళ్ళ మనవరాలు సుస్మిత, అయిదేళ్ళ సమీర్ అంటే పంచప్రాణాలు.

ఆమె పుట్టింటికి వెళ్ళిపోతున్న విషయం భాస్కర్ కి తెలీదు. తెలియజేయడం కనీస ధర్మం. ఆమె అతనితో మాటాడదు. మాటాడ బుద్ధికాదు. అంచేత కూతురు సుస్మిత చేత తెలియపరచింది. తను పక్కనే ఉండి గమనిస్తోంది. భాస్కర్లో చలనం ఆమెకు కనిపించలేదు. మరోసారి సుస్మిత చెప్పింది. అయినా లేదు చలనం. "వెళితే వెళ్ళండి" అన్లేదు. "వెళ్ళడానికి వీల్లేదు" అని కూడా అన్లేదు. ఒక చిన్న నిట్టూర్పు కూడా లేదు. నిర్ఘాంతపోయింది పద్మ. అతడు అవుతాడనుకొన్న షాక్ ఆమెకే తగిలినట్టయింది –.

ఏంమనిషి ? పదేళ్లబంధం ఒక్కసారిగా తెంచేసుకొవడం సామాన్యమైన విషయమా ? మనిషి అన్నాక పోజిటివ్ గానో, నెగిటివ్ గానో ఏదో వల్లకాడు గానో స్పందించాలికదా!

అతనిలో ఏ స్పందనా లేకపోవడం ఆమెను ఇంకా వెర్రెత్తించింది. మరింత అశాంతికి గురి చేసింది.

ఇతనితోనా ఇన్నాళ్ళుగా కాపురం చేసింది.

అవును. చేయగలిగింది. ఆమె కాబట్టి చేయగలిగింది.

మరో ఆడదయితే అతనితో పట్టున పదిమాసాలు కూడా కాపురం చేయలేదని పద్మ ప్రగాఢ అభిప్రాయం.

అది సరే!

భాస్కర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇప్పటికి అతని సర్వీసు పదిహేనేళ్ళు !

భాస్కర్ని అతను పనిచేస్తున్న కంపెనీ ఎలా భరిస్తుందనేది ఆమెకి అందని విషయం. ఈపాటికే అతను సర్వీసునించి టెర్మినేటు చేయబడి ఉండాలి !

భాస్కర్ ఒక అసమర్ధుడు. ఏ పనీ చేతా వాతా కాని వాజమ్మ. దద్దమ్మ. అతడు వంటింట్లోకి చొరబడి స్టవ్ వెలిగించలేడు. వెలిగించి ఇస్తే పాలు కూడా మరిగించలేడు. ఇల్లు శుభ్రం చేయాలి. వంట చేయాలి. అదే సమయంలో పిల్లలు ఇద్దరినీ స్కూలికి తయారు చేయాలి . . . ఇంట్లో సవాలక్ష పనులతో పెళ్ళాం ముండ ఒక్కతే గింజుకు ఛస్తుంటే చూస్తూ ఊర్కుంటాడు తప్ప తనుకూడా చేయి వేసి సహకరించడు. హుషారుగా ఏ పనిలోకి చొరబడడు. చాకిరీకి ఆమె రెండు చేతులూ చాలక, పిలిచి ఏదైన పని చెబితే ఖర్మ ! పనికి రెండు పనులవుతాయి. మళ్ళీ ఆమే చావాలి.

చిన్న సంసార నావకి చుక్కాని కాలేని భర్త, ఏట్లో తెడ్డు వేయడం చాతకాని భర్త, నావ ఎలా నడపాలో చెప్పినా నడపలేని భర్త, అంత పెద్ద కంపెనీలో ఎలా నెగ్గుకు వస్తున్నాడనేది ఆమెకు అర్ధం కాని విషయం.

అతను పనిచేస్తుండగా తనివి తీరా చూడాలని ఆమె ముచ్చట. తన ముచ్చట తీర్చమని చాలాసార్లు బతిమాలుకొంది పద్మ.

నవ్వేస్తాడు భాస్కర్ . అదొకటొచ్చు ! ఆమె రెట్టిస్తే "రా! వచ్చి చూడు" అంటాడు. ఎలా చూస్తుంది? తీసుకెళ్ళాలి కదా ! ఆ పని కూడా చేత కాదు.

నవ్వేస్తూ, ఆమెను దగ్గరకు తీసుకొని అంటాడు - " ఏదో పోనిద్దూ! నీ లాగే మా కంపెనీ కూడా చూసీ చూడనట్టు వదిలేస్తోంది. పాపం నీవు భార్యగా భరిస్తుంటే, కంపెనీ కన్న తల్లిగా నన్ను సాకుతోంది. అయితే ఒకటే తేడా ! భార్య భరిస్తున్నాననుకొని నొప్పులు పడిపోతోంది. తల్లికి భరిస్తున్నట్టే తెలియదు !"

"చాల్లెండి! మీ అమ్మే మిమ్మల్ని పాడు చేసింది. ఎందుకూ పనికిరాకుండా పెంచి, నా మీదకి ఆంబోతులా వదిలేసింది" అంటుంది పద్మ.

అక్కడితో వదలకుండా అతని మిత్రుల వద్ద కదుపుతుంది. " ఈ చేతకాని మనిషి ఉద్యోగం ఎలా వెలగబెడుతున్నాడయ్యా బాబూ" అని సాగదీస్తుంది.

"అమ్మమ్మమ్మా ! భాస్కర్ని అలా తీసిపారేయకండి మేడాం ! అతడు డ్యూటీలో రెచ్చిపోతాడండీ బాబూ! అతనికి సరిరారు ఎవరూ ! మా బాస్ కి భాస్కరంటే ప్రాణం"

"నేను నమ్మను. మీ స్నేహితుడు కదా! వెనకేసుకొస్తున్నారు"

"అంత దారుణంగా మమ్మల్ని తీసి పారేయకండి మేడాం ! అతని పనితనం గురించి మీకు ఒకటే ఉదాహరణ . . . మాకు ఇన్ టైములో రాని ప్రమోషన్లు మీశ్రీవారికి ప్రత్యేకంగా అవుటాఫ్ టర్న్ లో వస్తున్నాయి. ఇంతకన్నా గుర్తింపు ఏముంటుంది?"

"ప్రమోషన్లకీ, పనికీ సంబంధం లేదు. మీ మిత్రుడు కాకా మాష్టారు! వాళ్ళ బాస్ ని పాలిష్ చేసి, మస్కా కొట్టి ప్రమోషన్లు కొట్టేస్తాడు. కాదంటారా ?"

"కుండ బద్దలు కొట్టినట్టు మీరంత గట్టిగా చెబుతుంటే . . ఎలా కాదనగలం మేడాం ? కాని మాకిది న్యూడిస్కవరీ"

"నోర్ముయ్యండ్రా స్టుపిడ్స్ " నవ్వేస్తాడు భాస్కర్. స్టుపిడ్స్ నోర్ముయ్యలేదు.

"మేడం ! మీవారి పాలిష్, మాలిష్ వ్యవహారం మేం అణుమాత్రం కూడా పసిగట్టలేనిది మీరెలా కనిపెట్టేశారు ?" ఉత్సాహంగా అడిగేరు.

"బాబూ ! నాకు ఆయనతో పదేళ్ళ అనుభవం ! నాకు తెలీకపోవడం ఏమిటీ ? దయచేసి వివరాలు అడక్కండి"

అడగలేదు వాళ్ళు. భాస్కర్ మాత్రం అడక్కుండా ఉండలేకపోయాడు. అడిగిన సమయం చిక్కని రాత్రి. బెడ్ రూం లో ఆమెతో సరసం. శృంగారం. "నీ అనుభవం నుంచి నా పాలిష్ వివరాలు చెప్పవా పద్మా !" అడిగేడు. "ఇది మరీ బాగుంది. మీ గురించి మీకే చెప్పడం ఏమిటి ?" "నాకు

తెలీదు కనక" "తెలీకుండానే పాలిష్ కొడతారా ? గొప్ప కళే ?" "నీ పదేళ్ళ అనుభవంనుంచి నేను ప్రదర్శించిన ఆ కళగురించి చిన్న ఇన్సిడెంటు చెబుతే సంతోషిస్తాను"

"చాల్లెండి. నంగనాచి కబుర్లు. తెలీనట్టు నాపకాలు. మీరు ఇప్పుడు చేస్తున్నది ఏమిటీ ? నాపై అప్లయ్ చేస్తున్నది అదికాదా !"

ఆమె నగ్న శరీరంపై అతని చేతులు చేస్తున్న విన్యాసాలు క్షణకాలం ఆగిపోయాయి. "దీన్ని పాలిష్ అంటారా !" అన్నాడు తెల్లబోతూ.

"నన్ను నిద్రపోనివ్వకుండా మెత్తగా దువ్వి నన్ను రంగంలోకి దింపడాన్ని ఏమంటారు ? మీబాస్ కి పాలిష్ తో ప్రమోషన్. నాకు పాలిష్ తో మీకు అమర సుఖం !"

"సెక్సు ప్రిపరేషన్ కి నీవు పెట్టిన పేరా ఇది ! నీ ఉద్దేశ్యం ఏమిటీ ? నీ దగ్గరే కాకుండా మాబాస్ దగ్గర పడుకొంటున్నానా ? హెూమో సెక్సు మాకు అంటగడుతున్నావా ?"

"ఛీఛీ. చెత్త మాటలు మాటాడకండి"

"పాలిష్, మాలిష్ అంటూ కొత్త విషయాలు చెప్పి చెత్త అంటావేమిటి ? సరే. నేను పాలిష్ కొట్టి నీదగ్గర సుఖాన్ని దోచుకొంటున్నాను. మరి నీ సంగతి ఏమిటి ? పాపం ! నీకిందులో సుఖం లేదా ?"

"ఆ మాట నేను అనలేదు. నాకూ సుఖమే. కాని ఇక్కడ తేడా ఉంది" "చెప్పు "

"మీరు నాదగ్గర చేరేది నాకు సుఖాన్ని ఇవ్వడానికి కాదు. మీరు తీసుకోవడానికి. అందులోకి దింపేక, రగిలించేక ఏం చేస్తుందీ ఆడది ? స్త్రీ నుంచి మగాడికి కావల్సింది సుఖం. ఆ సుఖం కోసం ప్రేమిస్తాడు. స్త్రీకి కావాల్సింది ప్రేమ. ఆ ప్రేమకోసం ఇస్తుంది తన శరీరం. సుఖం. కాదంటారా ?"

"ఇదేదో కొటేషన్ ఏ పుస్తకంలోనో చదివి పాలిష్ మాలిష్ అని నా ప్రేమను శంకిస్తున్నావు" అన్నాడు.

అతనికి ఆమె అంటున్నది కొత్త విషయంగా తోచింది. పూర్తిగా ఏకీభవించలేక ఆమెతో ఆరాత్రి వాదన పెట్టుకొన్నాడు కాసేపు.

ఆమె చెప్పిన దాంట్లో స్త్రీ యొక్క త్యాగ గుణం, పురుషుడిలో జంతు స్వభావం కనిపించి జీర్ణించుకో లేకపోయాడు. అయితే –

అప్పటికా విషయం ఆ రాత్రి ఆమె ఇచ్చిన సుఖంలో మర్చిపోయాడు.

గత నాలుగైదు రోజులుగా –

అతను ఆమెనుంచి ఆ సుఖం పొందటంలేదు. ఆమె అతని నించి తీసుకోవటం లేదు.

రోజూ రాత్రి ఇద్దరూ బెడ్ రూం లో డబుల్ కాట్ పైకి చేరుతున్నప్పటికీ ఒకరి శ్వాస మరొకరికి తగలనంత దూరంగా నిశ్శబ్దం మధ్య మంచం అంచుల వైపు అటు ఆమె ఇటు అతడు.

రేపటినించి ఆ రకం పడక గూడా ఉండదు. ఇక ఇంటోనే ఉండదు పద్మ. అతనికి దూరంగా పుట్టింటికి పయనం. ఇద్దరి మధ్య గొడవ కారణంగా ఆ పయనం. ఇంతాచేస్తే అంతగొడవకీ కారణం చిన్న ఉల్లిగడ్డ ! 1998 ఉల్లిపాయికి అంత పవరు లేదని ఎవరూ అనలేరు.

నెలరోజుల క్రిందట – ఉల్లిపాయలు అయిదు కేజీలు పద్మ ఒక్కసారిగా కొనబోతూంటే వద్దని వారించేడు భాస్కర్.

చిచ్చు అక్కడే రగులుకొంది.

సాధారణంగా బజారుకి భాస్కర్ పద్మతో వెళతాడు. సరదాగా, తోడుగా మాత్రమే వెళతాడు. అతడు ఆమె పక్కనే ఉన్నప్పటికీ బజారులో కూరగాయలు బేరమాడుట, ఎంపిక చేయుట సమస్తం పద్మ మాత్రమే చూసుకొంటుంది.

అందుకు బలవత్తరమైన కారణం ఉంది.

భాస్కర్ ఒక్కసారి సాయంత్రం డ్యూటీనుంచి వస్తూ కూరగాయలు కొని తెచ్చాడు. ఆమె తెమ్మంటేనే తెచ్చాడు. తీరా తెచ్చాక ఒకటీ, ఒకటీ గెలికి పుచ్చుకొని, చచ్చువి, ముదరవి అంటూ ప్రతి కూరగాయికీ వరుసగా రకరకాల పేర్లు పెట్టింది. ఆమే కాదు చదువుకొంటున్న ఇద్దరు పిల్లలనూ పిలిచి వింత వస్తువులను చూపించినట్లు చూపించింది. పిల్లలతోపాటు ఆమె ఆ రోజంతా పకపక నవ్వింది. ఆమె అక్కడితో ఆగకుండా అతని నిర్వాకాన్ని మరుసటి రోజు ఇరుగు పొరుగు ఆడవాళ్ళ మధ్య్య ఒక చోద్యంగా చూపించి వినోదాన్ని పంచింది.

మరోసారి భాస్కర్ ఒళ్ళు దగ్గర పెట్టుకొని జాగర్తగా తెచ్చాననుకొంటే పద్మ ఆ కూరగాయలను సీరియస్ గా కోపంగా గబగబా బయటకు తీసుకువెళ్ళి పెంటకుప్పపై విసిరేసింది. అతని మనస్సు

చివుక్కుమంది. ఆమె తననే మూట కట్టి పెంటపై పడేసినట్టు ఫీలయ్యాడు. ఆ రోజునుంచీ తను బజారు తీసుకు రావటంలేదు. ఆమె తెమ్మనటం లేదు.

అప్పటి నుంచీ భాస్కర్ ఆమెకు తోడుగా మాత్రమే వెళతాడు. కూరగాయల వ్యవహారం మొత్తం పద్మే చూసుకొంటుంది. పొరపాటున ఆమె చచ్చువి, పుచ్చువీ తను చూస్తుండగా ఏరినా, చూస్తూ ఊర్కొంటాడు తప్ప మాటాడడు. అంతేకాదు ఆమె సెలక్షన్ లో పుచ్చులను ఎత్తిచూపి ఎద్దేవా చెయ్యడు. "ఇపుడేమంటావ్ ?" అని రెచ్చగొట్టడు. పుచ్చులను ఆమె సైలెంటుగా ఏడుచుకొంటూ పారేయటం చూస్తాడు. బయటకి కనపడనివ్వని ఆమె ఏడుపుని చూసి, ఆమెకు కనపడకుండా, వినపడకుండా అతను నవ్వుకుంటాడు. అంతే తప్ప దొరికింది ఛాన్సు కదా అని ఓపెన్ గా ఏడిపించడు.

ఏదైన సరే వినియోగవస్తువుల కొనుగోలు విషయంలో తలదూర్చకుండా జాగర్తలు పాటించే భాస్కర్ . . . ఆ రోజు అతనికేమయిందో తెలీదు . . . ఉన్నపాటున దభీమని ఉల్లిగడ్డ ఊబిలో పడిపోయాడు.

ఉల్లి సలహాతో అడ్డంగా దొరికి పోయాడు.

కత్తిపీట తగలకుండానే పద్మకి కళ్ళనీళ్ళు రప్పిస్తున్నాయి ఉల్లిపాయలు.

పక్కింటి సరోజ సలహాపై హోల్ సేల్ కొట్లో కొనాలని బయల్దేరింది. అలా కొంటే కేజీ దగ్గర రెండు రూపాయల తేడా ఉంది. అంచేత పద్మ సంచితో బాటు భర్తను కూడా వెంటేసుకొని హోల్ సేల్ కొట్టుకి పరుగున వెళ్ళింది.

అక్కడ ఉల్లిపాయలు మినిమం అయిదు కేజీలు కొనాలి. లేకుంటే అమ్మడు. తర్వాత అవి సగానికి పైగా కుళ్ళిపోయి బయటకు పారేయవలసి వస్తుందని భాస్కర్ కి ఎందుకో అనిపించింది. తన భయాన్ని ఆమె ముందు వెలిబుచ్చలేదు. డైరెక్టుగా దుకాణుదారునే అడిగేసాడు. "ఉల్లిపాయలు స్టాకు ఉంటే పాడవ్వవు సార్" అన్నాడు. "మీకా భయం ఉంటే రెండు రోజులు ఎండబెట్టి, గాలి తగిలేలా స్టోర్ చేస్తే కుళ్ళకుండా కావల్సినంత కాలం ఉంటాయి" అన్నాడు.

అంతవరకూ బాగానే ఉంది. ఆ తర్వాతే పప్పులో అతని కాలు పడింది ! ఏ కొట్టులో నయినా బేరమాడకుండా కొనదు పద్మ. బేరమాడిందని కాబోలు కేజీపై రూపాయి పెంచేడు షావుకారు. పద్మ నివ్వెర పోయింది. గాభరాతో ఆమె మాట తడబడింది. "అదేమిటండీ మాపక్కింటి ఆవిడ మీ దగ్గర గంట క్రితమే కొంది" అన్నది. "అది గంట క్రితం రేటు తల్లీ " అన్నాడు షావుకారు. ఆమె

బ్రతిమిలాడింది. "ఇక్కడ బేరాలు ఉండవమ్మా. మీకు అనుమానం ఉంటే బయట మార్కెట్ రేటు ఎంత ఉందో కనుక్కోండి " ముందుగానే ఆమె అక్కడకి వచ్చేముందు మార్కెట్ రేటు కనుక్కొనే వచ్చింది. కేజీ 16 రూపాయలు. హెూల్ సేల్ రేటు 14 రూపాయలు. పక్కింటి సరోజ అదృష్టవంతురాలు. 13 రూపాయలకే కొన్నది. హుషారైన మొగుడు కాదు భాస్కర్ . సరోజలా అదృష్టాలు ఎలా తగుల్తాయి తనకి !

పక్కన చెట్టంత మగవాడు ప్రేక్షకుడిలా ఉండిపోతే, ఆడకూతురు అరగంట సేపు ప్రాధేయపడిందని కాబోలు షావుకారు . . . ఏదో స్పెషల్ కేసుకింద కిలోపై ఒక అర్ధరూపాయి తగ్గిస్తానన్నాడు.

"ఏంచేద్దాం " అన్నట్టు భర్త వైపు చూసింది పద్మ. చూడక పోయినా బావుణ్ణు. "వద్దు. కొనద్దు" అన్నాడు భాస్కర్ . రెండు రోజులాగి చూద్దాం అన్నాడు. "మీ ఇష్టం" అని పద్మ ఉల్లిపాయలు కొనే ప్రపోజల్ ని విరమించుకుంది. మాటాడకుండా భర్త అడుగులో అడుగువేస్తూ ఇంటి ముఖం పట్టింది. ఇంటి వ్యవహారాల్లో, తప్పనిసరి పరిస్థితుల్లో భాస్కర్ తలదూర్చి సరైన నిర్ణయాలు తీసుకొన్న అరుదైన సందర్భాలు లేకపోలేదు.

"నా మంచి మొగుడు. సమయానికి ఎంత గొప్ప నిర్ణయం తీసుకొన్నాడు " అని పద్మ ఏనాడు కొనియాడలేదు. అందుకు భాస్కర్ బాధపడలేదు. అది ఆమె స్వభావంగా భావిస్తాడు.

భాస్కర్ మాత్రం ఆమె ఏ పని చేసినా అభినందిస్తాడు. "అది నిజంగా నీకే సాధ్యం పద్మా !" అంటాడు. "వండర్ ఫుల్ ! నీకు నీవే సాటి ! అంటాడు. అతని పొగడ్తలకి పడిపోతుంది. పడగొట్టటంలో భాస్కర్ ఘనుడు. దానినే అతనిలో "కాకా" గుణంగా గుర్తించింది. ఆ రోజు – భాస్కర్ ఉల్లిపాయలు కొనవద్దు అన్నది కేవలం సలహా మాత్రమే. "కొనేద్దాం అంటే అతను కాదంటాడా ?" కాదనడు. వద్దు అన్నది కూడా రెండు రోజుల్లో ఉల్లి ధర తగ్గుతుందనే నమ్మకంతో అన్నాడు. అతను ఆ ముందురోజే పేపర్లో చదివాడు.

"ఎప్పుడూ లేని విధంగా నిత్యావసర సరకుల ధరలు దేశం మొత్తాన్ని గజగజ వణికించేస్తున్నాయి. ఉల్లిపాయల ధరలైతే అందుబాటులో లేకుండా పోయాయి. ఒకటీ, రెండు నెలల్లో ఎన్నికలను ఎదుర్కోవలసి ఉన్నందు వలన ప్రభుత్వం కళ్ళు తెరిచింది. ధరలు తగ్గేలా తగిన చర్యలు చేపట్టింది. ఓట్ల బ్యాంక్ దిగువ తరగతితో ముడిపడి ఉండడంచేత ఆ స్థాయికి ధరలు మరి రెండు రోజుల్లో కిందకి దిగేలా ముమ్మరం చేసింది. "

భాస్కర్ పేపర్లో వచ్చిన వార్త నమ్మేడు.

అతని మిత్రుల మధ్య టీ కబుర్లలో వేడి వేడి రాజకీయాలు దొర్లేయి. వాళ్ళు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో ధరలు తగ్గటం అనివార్యం అని అభిప్రాయ పడ్డారు. భాస్కర్ అభిప్రాయం కూడా అదే అయ్యింది.

పద్మకి ఇంటి సమస్యలు తప్ప దేశ రాజకీయాలు పట్టవు. ఉల్లిగడ్డ ధర ఎందుకు పెరిగి ఎందుకు తగ్గుతుందో, అందులో అసలు రాజకీయం ఉందా, ఉంటే ఏ మేరకు ఉంది అనేది ఆమెకు అందదు. సంసారం ఒడుదొడుకులు లేకుండా హాయిగా పూలపడవలా సాగాలని భగవంతుని ప్రార్ధించుట, భర్త పిల్లలను ప్రేమగా చూచుకొనుట, ఉన్నంతలో మానేజ్ చేస్తూ ఇల్లుని చక్కబరచుకొనుట – అవి మాత్రమే ఆమెకు తెల్సు. ఆమెది చాలా చిన్న ప్రపంచం.

రెండు రోజుల తర్వాత –

ధరలు అదుపులోకి రాలేదు. సరికదా కళ్ళేలు తెంచుకొని ఏ తరగతికీ అందనంత ఎత్తుకి ఎదిగిపోయాయి.

కేజీ ఉల్లిపాయలు విశ్వ రూపం దాల్చి పాతిక రూపాయలు పలికింది. హోల్ సేల్ రేటు, రిటైల్ రేటు ఒకటే అయింది.

పేపర్లో ప్రభుత్వం తన తప్పు లేదని ప్రకటించుకొంది –

ధరలు పెరగడానికి కారణం ప్రభుత్వం కాదు, బ్యూరో క్రాట్లు అంది. బ్లాక్ మార్కెటీర్లను నిందించింది. ధరలు పెరగకుండా చూసుకోవలసిన బాధ్యత ఆయా రాష్ట్రాలదే అంది. మరో వైపు వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ యొక్క ప్రభావం లేకపోలేదు అంది. సందేహంలేదు, ఇందులో విదేశీ హస్తం ఉందనే రహస్యం ఒకటి బహిరంగ పరచింది ప్రభుత్వం.

వీళ్ళంతా గవర్నమెంటుకి అతీతులు. కాదుకాదు గవర్నమెంటోళ్ళే. ఆ శక్తులకి తొత్తులు అని భాస్కర్ కి జ్ఞానోదయం అయ్యేటప్పటికి ఆలస్యమయిపోయింది.

ఉల్లి బోనులో దోషిగా నిలబడ్డాడు. పద్మ పదమూడున్నర రూపాయలకి కొనబోయిన కేజీ ఉల్లి రేటు అతని కారణంగా కేజీ పాతిక రూపాయలకి కొనవలసిన పరిస్థితి దారి తీసింది.

పద్మ ఏమి శిక్ష విధించింది ? అందులో భాస్కర్ తప్పు ఎంతవరకు ఉంది ? ఈ మాత్రానికే ఆమె అతణ్ణి విడిచి వెళ్ళిపోవడానికి సిద్ధపడిందా ? సిద్ధపడితే ఆమెదే తప్పు. అసలు భాస్కర్ భర్తగా లభించడం ఆమె ఎంతో అదృష్టంగా భావించాలి. ఈ రోజుల్లో భాస్కర్ లాంటి అమాయకులు అరుదుగా

కనిపిస్తారు. అతడు సకల సద్గుణ సంపన్నుడు. సరదాకికూడా మందు కొట్టడు. సరసానికి మరో స్త్రీకి కన్ను కొట్టడు. అంతేకాదు నెలాఖరులో మొత్తం జీతం కవర్ తో సహా పెళ్ళాం చేతిలో పెడతాడు. జీతమంతా ఆమె చేతికిచ్చేసి నెలనెల పాకెట్ మనీ అడగడానికి మొగమాటపడతాడు. ఆమె పాకెట్ మని ఎంత ఇస్తే అంత కిక్కురుమనకుండా తీసుకుంటాడు.

ప్రతినెల బుద్ధిగా జీతం ఇచ్చేసే భాస్కర్ ని "నా మంచి మొగుడు" అని ముద్దులతో ముంచెత్తేయదు.

వచ్చే జీతం ఎక్కువ, ఇంట్లో ఖర్చు తక్కువ అయితే ఆమె అంతపని తప్పక చేయగలదు. ముద్దు చేదు కాదుకదా !

వచ్చే జీతం గొర్రె తోక. ఖర్చులు చూస్తే హనుమంతుని తోక.

బుద్ధిగా జీతమంతా తన చేతిలో పెట్టేసి ఎంచక్కా భాస్కర్ చేతులు దులిపేసుకోవడం ఒక కుట్రగా, అతని గడుసుదనంగా ఆమె భావిస్తుంది. ఎవరైనా అతను అమాయకుడు అంటే ఇదే సమాధానం చెబుతుంది.

జీతం కవరు అనే చిన్న కొరడా చేతిలో పెట్టి సమస్యల పులి బోనులోకి తనని చాకచక్యంగా నెట్టేసి తప్పుకు తిరిగే తెలివితేటలున్నవారిని అమాయకులంటారా ?

అతన్ని ఎన్నోసార్లు సంసారం చేయమంది. చేతులెత్తి నమస్కారం పేట్టేస్తాడు. అది తప్ప ఇంకేంపనైనా చెప్పు చేస్తాను అంటాడు. చేయడానికి ఇంకేముంటుంది ?

పెళ్ళాం పెట్టింది వేడి వేడిగా రుచి రుచిగా తినడం, పెళ్ళాం పక్కలో వెచ్చ వెచ్చగా హాయి హాయిగా "సుఖం" జుర్రుకొని చల్లగా నిద్ర పోవడం. అంతకన్నా ఇంకేం పని చేస్తాడు ?

అంత సుఖాన్ని పొందే అదృష్టం ఎంతమందికుంటుంది ? అంచేత అదృష్టవంతులు ఆమె కాదు – అతడే ! నిజమేనని ఒప్పుకుంటాడు భాస్కర్.

పద్మ తలపగల కొట్టుకునేలా ఆలోచిస్తూ, ఆదాయానికి తగ్గట్టు ప్రతి నెలా బడ్జెట్ రూపొందిచేటప్పుడు గెడ్డం తీసేసి చీరె చుట్టుకున్న మన్ మోహన్ సింగులా సీరియస్ గా కనిపిస్తుంది. అయితే జోక్ గా కూడా ఆమెతో ఆ మాట ఆ సమయంలో అనడు. ఆ మాటే కాదు. ఏ మాటా అనడు. పలకరించడు. పిల్లలనుకూడా వెళ్ళనీయడు ఆ పరిసరాలకి. ( ఆ రాత్రిమాత్రం సింగ్ జోకులు కురిపిస్తాడు. ) అప్పుడామెను చూస్తే ఎనలేని గౌరవం కలుగుతుంది. బడ్జెట్ రచన సామాన్యమైనది కాదని అతనికి

తెల్సు. పాపం ఈ మధ్య ఆమె ఎంత పకడ్బందీగా బడ్జెట్ ప్లాన్ చేస్తున్నా తరచుగా బెడిసి కొడ్తోంది. గమనిస్తున్నాడు తను. ఏం చేయగలడు ? రాబడిని బట్టి ఆమె ప్రయారిటీస్ నిర్ణయించడంలో రిక్రియేషన్ కి సంబంధించిన అంశాలు ఒక్కొకటీ కలంపోటుకి విలవిల్లాడుతూ బడ్జెట్ నుంచి నేలరాలిపోతున్నాయి. పద్మకి పెళ్ళికాకముందు ఎన్నెన్నో సరదాలు . . .

కాలేజీ లైఫ్ లో ఆమెకు సినిమా అంటే మహా పిచ్చి. ఇప్పటికీ ఆ సరదా ఉంది. సరదా ఒకటే ఉంటే సరిపోదు. పిల్లలతో కలసి సినిమాకి వెళ్ళాలంటే వంద చాలదు. సినిమాలకు వందలు వేసే శక్తి లేదు ఆమెకు.

అంచేత పిల్లలను ఇంట్లో ఉంచి బయట తాళం వేసి భాస్కర్ తో రెండు, మూడు సినిమాలు చూసింది. అయితే ఏమాత్రం ఎంజాయ్ చేయలేకపోయింది. తెరమీద బొమ్మలు బదులు పిల్లలు కనిపించే వారు. హాలులో ఉన్నంత సేపు పిల్లలు ఇంట్లో ఎలా ఉన్నారో, ఏమి చేస్తున్నారో అని ఒకటే దిగులు అదే ధ్యాస. పిల్లలు ఇద్దరకీ ఒక్క క్షణం పడదు. కొట్టుకొని, కలియబాడి ఇల్లుని ధ్వంసం చేయడం లేదు కదా ! వంట గదిలో గ్యాస్ సిలిండర్ తో పిల్లలు ఆడుతున్నట్టు పిచ్చి పిచ్చి ఆలోచనలు. సినిమా చూడలేక పోయింది. ఆట మధ్యలోనే భర్తతో ఇంటికి వచ్చేసింది. ఆ తర్వాత సినిమా సరదాలు పూర్తిగా మానుకుంది. టీవీ సినిమాలతోనే తృప్తి చెందుతోంది.

ఆదివారం సాయంత్రాలు సినిమా బదులు సముద్ర తీరానికి భర్తా పిల్లలను బయలు దేరతీస్తోంది. అక్కడ పడి లేచే కెరటాలను చూసి ఆనందిస్తోంది. భర్త సరసన ఇసుక తిన్నెపై కూర్చొని సాయం సంధ్యలో ఎర్రటి సూర్య బింబాన్ని పలకరించి పరవశించి పోతోంది. ఆమె పిల్లలు కాసేపు కెరటాలతోనూ, తర్వాత ఇసుక గూళ్ళతోనూ ఆట. ఈ రిక్రియేషన్ కి సినిమా ఖర్చులో నాల్గవ వంతు చాలు !

సరదాలంటే ఇంకా చాలా ఉన్నాయి. చీరలూ, నగలూ చాలా మంది స్త్రీలకి మల్లే ఆమెకూ ఇష్టం. సరదా పడి అవి కొనాలంటే బడ్జెట్ అరలో ఇమడవు. అలాంటి సరదాలు క్రమక్రమేణ మర్చిపోవడం అలవర్చు కుంటోంది. గుర్తు చేసుకోంటే దిగులు తప్ప సుఖం ఏముంది ?

ఆమె సరదాలు ఏమీ తీర్చలేకపోతున్నాననే బాధ అతనికి ఎంతో ఉంది. ఏమి చేయగలడు ? ఏమైనా చేయాలనుకోంటే అతని జీతం వెక్కిరిస్తుంది.

ధరలు అనూహ్యమైన పెరుగుదలముందు అతని జీతం వెలవెల బోతున్నది. కొనుగోలు శక్తి రోజు రోజుకీ క్షీణించి పోతున్నది. రూపాయికి విలువలేదు. ఇలా వంద తీస్తే మంచు గడ్డలా మరుక్షణం కరిగిపోతున్నది.

జీవన వ్యయంతో సమంగా అతని జీతం పెరగడం లేదు. జీతాలు నాలుగేళ్ళ కొకసారి పెరుగుతాయి. ఆ పెరుగుదల మహా ఉంటే మూడు నాలుగు వందలు. ఏడాదికొక ఇంక్రిమెంటు. అంటే జీతంలో మరో ఏభై చేరుతుంది. ఏ మూలకొస్తుంది ఆ పెరుగుదల !

పెరిగే ధరలముందు అతని జీతం పెద్ద గీతముందు చిన్న గీతలా వెలవెల బోతున్నది.

ఈ మధ్య బజారుకు వెళ్ళాలంటే గుండెలు దడదడ మంటున్నాయి.

నిత్యావసర సరుకులూ, కూరగాయలపై చేయి వేయబోతే కాటేస్తున్నాయి. ఉల్లి గడ్డలు ముట్టుకోబోతుంటే నాటు బాంబుల్లా భయ పెడుతున్నాయి.

ఉల్లిధర ఒక్కసారిగా పాతిక రూపాయలు అయిన తర్వాత –

పద్మకి దుఃఖమే వచ్చింది. ఇంట్లో భర్త పిల్లలు లేనప్పుడు కళ్ళనీళ్ళు వచ్చేలా ఏడ్చిన రోజులున్నాయి.

భాస్కర్ రాంగ్ గైడెన్సు ఇచ్చి అయిదు కేజీల ఉల్లిపాయలు చవగ్గా కొననీయలేనందుకు ఆమెకు కోపం వచ్చింది.

ఒక్క అయిదు కేజీలకి అతన్ని నిందించగలదు. తర్వాత ఎవరిని నిందిస్తుంది ?

మరి రెండు రోజుల్లో ఉల్లి ధర పాతిక నుంచి ముప్ఫైరెండు వరకూ వెళ్ళింది. ఇప్పుడెవరిని నిందిస్తుంది ?

ఉప్పెనలా వచ్చిన ఈ విపరీత పరిణామాలకి – హడలి పోయిన పద్మ ఇంటో ఎమర్జన్సీ విధించింది. అన్నిటిపై కఠినంగా ఆంక్షలు.

సెల్ఫ్ రేషనింగు అమలులో పెట్టింది.

భాస్కర్ కి ఉల్లికి సంబంధించిన కూరలూ, పులుసులూ ఇష్టం. అవి పూర్తిగా నిషేధించ బడ్డాయి. భాస్కర్ కి ఇది శిక్షే !

ఎవరూ పుట్టిన రోజున కూడా ఉప్మా, ఉల్లి పెసరట్లు కోరరాదు.

మసాలా కూరలు ఉపసంహరింప బడ్డాయి. రసం, పచ్చడి, పెరుగు. పెట్టింది తినడమే. మరేమీ అడగ రాదు.

అంతే కాదు –

రొటీన్ దినచర్యలో చాలా మార్పులు ప్రవేశించాయి.

రాత్రులు భాస్కర్, పిల్లలూ నిద్రపోయేముందు పాలు తాగే అలవాటు ఇక సాగదు. పాలు బదులు చల్లటి నీళ్ళు గడగడ తాగి పడుకోవాలి.

పద్మ రోజుకి అయిదారు సార్లు టీ తాగే అలవాటుని ఉదయం ఒక కప్పుతోనే సరిపెట్టుకుంటోంది. భాస్కర్ టీ పూర్తిగా మానేసాడు. అంతేకాదు. అతని పాకెట్ మనీ కూడా సగానికి సగం కత్తిరించ బడింది.

ఇంత చేసినా రోజులు నెగ్గుకు రావడం కష్టమవుతోంది.

భాస్కర్ ఏమి వండినా తింటున్నాడు. ఏమి చెప్పినా వింటున్నాడు. ఏది వద్దన్నా చిత్తం మహా రాణీ అంటున్నాడు.

అయితే మహారాణితో పువ్వుల దగ్గర పేచీ వచ్చింది.

భాస్కర్ డ్యూటీనుంచి వచ్చేటప్పుడు రోజూ గుర్తుగా మూడు రూపాయల పూలపొట్లం తీసుకొని వస్తున్నాడు.

పద్మ . . . పూలుకొనడం మానేయమని ఆదేశించింది.

భాస్కర్ స్పష్టంగా అది కుదరదు అన్నాడు. మరేదైనా చెప్పు వింటాను. పూల దగ్గర రాజీ పడేది లేదు అని నిక్కచ్చిగా తేల్చేసాడు. నెలనెల ఆమె ఇచ్చే పాకెట్ మనీలో సమస్తం వదులుకొని పూలు కొని తెస్తున్నాడు.

పూలు ఇంతకు మునుపు పద్మే కొనేది. రోజూ వీధిలోకి పూల కుర్రవాడు వాడుకగా ఇచ్చి వెళ్ళిపోయేవాడు. ఆ వాడుక మానిపించేసింది.

అయినప్పటికీ ఆమె జడలో పూలు గుభాళిస్తున్నాయి.

"పూలు లేకుండా నా పక్కన పడుకోరా " – పద్మ.

"పూలు లేకుండా ఎందుకు పడుకోవాలి అనేది నా పాయింటు" – భాస్కర్.

నెలనెలా బడ్జెట్ లోటు ఆమెను ఉక్కిరిబిక్కిరి చేసి ఊపిరి సల్ప నివ్వకుంటే – మల్లెపూలకోసం అతని మంకు ఏమిట్టి ! అర్ధం చేసుకోడు గదా మనిషి !

రోజూ మూడు రూపాయల ఖర్చు ఆమెను బాధిస్తున్నప్పటికీ – పూల పరిమళంలో, మత్తులో భాస్కర్ స్పర్శ ఆమెను శాంతింప చేస్తున్నాయి. పువ్వులు కొనవద్దని గట్టిగ అనలేకపోతోంది.

ఇంటి పెరట్లో మల్లె, సన్నజాజి, విరజాజి వేసింది. అవి పెరిగి పూలు విరగ పూసినపుడు తప్పక కొనడం మానేస్తానని ప్రామిస్ చేసాడు. "సంతోషం " అని వెక్కిరించింది పద్మ.

భాస్కర్ ప్రేమలో కృత్రిమత్వం లేదు. అతని ప్రేమ రోజూ తెచ్చే పువ్వుల్లా స్వచ్ఛమైనది. ఆ విషయం ఆమెకి తెల్సు. ఇంటి సమస్యలనుండి, ఇంటి చాకిరీ నుండి అతని ప్రేమే ఆమెను సేద తీరుస్తోంది. అలసటనీ, దిగులుని రేపు ఎలా గడుస్తుందనే భయాన్ని అతని బాహువుల మధ్య అల్లుకు పోయి సమస్తం మర్చి పోతోంది. సరదాలు, సినిమాలు, షికార్లు లేవనే దిగులు అతను అందిస్తున్న సుఖంలో మర్చిపోగల్గుతోంది. ఆ సుఖమే లేకుంటే ఈ పాటికి తను పిచ్చెక్కి పోయి ఉండేది. లేదా చచ్చిపోవాలనుకునేది.

సాయంత్రాలు భాస్కర్ డైరెక్టుగా డ్యూటీ నుంచి ఇంటికి వచ్చేస్తాడు. స్నేహితులూ, సరదాలూ మరో వ్యాపకం పెట్టుకోడు. పద్మ అలా ఆదేశిస్తుంది. అందులో ఆమె ప్రేమనే చూస్తాడు. ఒక్కోసారి అతనికి చిరాకు, కోపం వస్తుంది. ఏమిటీ ఆవిడ జులుం ? మగవాడు బయటకు వెళ్ళేక ఎన్నో పనులుంటాయి. అర్ధం చేసుకోకుండా ఆర్డర్లు జారీ చేయడం ఏమిటీ అనుకొనే సందర్భాలు లేకపోలేదు.

పద్మ పుట్టింటికి పిల్లల సెలవులకి వెళ్తుంది. ఇంటి నుంచి ఆమె పిల్లలతో వెళ్ళిపోగానే ఎంతో స్వేచ్ఛ వచ్చినట్టు ఎగిరి గంతేసేవాడు. అయితే కావాలని స్నేహితులతో చేసే కాలక్షేపం మజా లేకుండా

చప్పగా ఉండేది. కాళ్ళీడ్చుకొని ఇంటికి వస్తే భార్యా, పిల్లలూ లేని ఇల్లు భూతాల గృహంలా భయపెట్టేది. రెండు రోజులకే అతను బోరెక్కిపోయి, పిచ్చెక్కిపోయి రైలెక్కేసి పద్మను తీసుకొచ్చేసేవాడు. పిల్లలూ వచ్చేస్తే సంతోషం. రాకుంటే ఇంకా సంతోషం. ఆమెతో కావల్సినంత ఏకాంతం. అడ్డూ ఆపూ లేని ఆనందం.

ఒక రకంగా పద్మ స్వార్థపరురాలు. ఉదయం తనని విడిచి వెళ్ళి సాయంత్రం వరకూ రాని భర్త, సాయంత్రం వచ్చేక పిల్లలతో ఆడుతూనో, చదువు చెబుతూనో సమయం అంతా వాళ్ళతోనే గడిపేస్తే ఆమె చిత్రంగ అలుగుతుంది. పిల్లలతో గొడవపడి అతన్ని ఏకాంతానికి లాక్కెళ్ళిపోతుంది. అతని భుజంపైనో, గుండెలపైనో వాలి అతను చెప్పే ఖబుర్లు, కాకమ్మ కథలు వింటుంది. అది ఆమెకు ఆనందం. లేదా సోఫాలో అతని తొడని దిండుగా చేసుకొని, అతని చేయిని తన చేతుల్లోకి తీసుకొని ఎదురుగా టీవీ చూస్తూ గడుపుతుంది. నగరంలో ఆడే చిత్రాలను డబ్బుపోసి ఎలానూ చూడ లేదు. టీవీలో కావాల్సినన్ని సినిమాలు. నగరంలో ఆడే చిత్రాలు ఎంత మంచివి అయినా ఏదొక రోజు అవి టీ వీ సముద్రంలో కలవక మానుతాయా !

భాస్కర్ ఉద్యోగ రీత్యా ఏ ఊరు అయినా కాంప్ వెళితే భరించలేదు. అతన్ని వదిలి ఉండలేదు. ఆమెలో విపరీతమైన భయం చోటు చేసుకొంటుంది. అతను లేకుండా ఇంట్లో ఉండలేదు. అతను లేని ప్రపంచం ఆమెకు శూన్యం. అంతకన్నా ముఖ్యంగా ఆమెకి అలజడి కలిగించేది ఆ జిడ్డు మనిషి మాయాప్రపంచంలోకి ఎలా వెళ్తాడో, ఏం తింటాడో, ఎలా తిరిగి వస్తాడో అని దిగులు.

ఆమె అభిప్రాయం ఏమిటంటే భాస్కర్ కి ఏమి కావాలో భాస్కర్ కే తెలియదు. తెలిసినా చేసుకోలేని అమాయకుడు. అతని గురించి ఆమెకు మాత్రమే తెల్సని ఆమె నమ్మకం. అంచేత అతన్ని ఒక్కోసారి చంటి పిల్లాడిలా సాకుతుంది. ఆమె గైడెన్సు లేకుంటే ఖచ్చితంగా తప్పుడిపోయే, పాడైపోయే పిల్లవాడుగా భాస్కర్ ని భావిస్తుంది.

"ఈ నెల జీతం ఎంత అందింది" అని అడిగితే అతను వెంటనే సమాధానం చెప్పలేడు. సమాధానంగా జేబులో డబ్బు, పే స్లిప్పూ ఆమె చేతిలో పెట్టేస్తాడు.

అవును. అతనికొచ్చే జీతంలో బేసిక్ పే ఎంతో అతనికి గుర్తు ఉండదు. డి. ఎ. పాయింట్లు ఎంత పెరిగిందో తెలీదు. ఏ లోను ఎంత కటింగు అయి, నెట్ ఎంత వస్తున్నదీ చెప్పలేడు.

విశేషం ఏమిటంటే అతని సేలరీ స్లిప్పుని ఆమే స్టడీ చేస్తుంది. జీతం గ్రాసూ, నెట్టూ పరీక్షగ చూస్తుంది. నెలనెలా ఎంత రావాలనేది ఆమెకి లెక్కే. లోన్ కటింగ్ లో ఏదైన తిరకాసు వస్తే, అదేమిటో అతనికి

వివరంగ చెప్పి ఆ సంగతి ఏమిటో చూడమంటుంది. ఆ తప్పుని కంపెనీ ఒప్పుకొని సరిదిద్దేవరకూ భాస్కర్ ని నిద్ర పోనీయదు.

భాస్కర్ ని సడెన్ గా రెండో ఎక్కం చెప్పమంటే తడబడతాడు. అతను ఏదైనా లెక్కచేసినా, చేసింది కరెక్టే అనే కాన్ఫిడెన్సు తక్కువ. నిదానంగా చేయనీయకుండా, గాభరా పెడితే అంకెలు అతనికి గొంగళి పురుగుల్లా కనిపిస్తాయి. అదృష్టవశాత్తు అతను చేస్తున్న ఉద్యోగం అంకెలతో అంత సంబంధం లేనిది.

పద్మ ఒకసారి కిరాణా దుకాణంలో సరుకులు కొంటున్నప్పుడు కేజీ పప్పు పదహారున్నర అయితే మూడు కేజీలు ఎంత అని అడిగింది. తను బియ్యం కొనడానికి తెచ్చిన డబ్బుల్లో ఏమైన మిగిలితే పప్పులు కూడా కొందామని ఆమె తాపత్రయం. ఆమె ఒక్కసారిగా లెక్క అడిగే సరికి అతని మెదడు బ్లాంక్ ! అతని ముఖం చూడగానే ఆమెకు వెంటనే అర్ధమయి పోతుంది. అతను చెప్పే లెక్కకోసం చూడకుండా తనే మూడు పదిహేనులు, మూడు రూపాయలు, మూడు అర్ధలు అని లెక్క వేసుకొని (అతను లెక్కకట్టే లోగ) పప్పులు పాక్ చేయించేసింది.

ఆమె సాధ్యమైనంత వరకూ లెక్కలు, సలహాలు అడగదు. అడిగితే ఉల్లిపాయల సలహాలాగే ఉంటుంది !

పద్మకి తలనొప్పి ఏమిటంటే చెప్పిన పని కూడా ఏదీ సరిగా చేసుకురాలేడు. చివరికి కరెంటు బిల్లు కూడా ఆమే వెళ్ళి కడుతుంది.

ఇంట్లో కావల్సినవన్నీ ఆమె చూసుకోవాలి. ఆమే ప్లాన్ చేసుకోవాలి.

ఆమె అతని చేత పి. యఫ్. లోను పెట్టించి సీజన్ లో కొన్ని రకాల పప్పులూ, చింతపండు లాంటి స్టాక్ అయిటంస్ ఏడాదికి సరిపడా కొనేస్తుంది. పెరుగుతున్న ధరలతో ఏ నెలకానెల కొనుక్కోవాలంటే ఆ జీతం లో సాధ్యమయ్యేపని కాదు. బోనస్ ని పిల్లల యూనీఫాం, పుస్తకాలకీ వినియోగిస్తుంది. ఫెస్టివల్ అడ్వాన్సుతో తన చీరతో సహా అందరకీ బట్టలు కొంటుంది. ప్రతి నెలా జీతం లో ఎంతోకొంత మిగిల్చి ఇన్స్టాల్మెంట్లలో ఇంటి వస్తువులు కొంటుంది. ఈ పదేళ్ళలో డైనింగ్ టేబుల్, సోఫా, ఫ్రిజ్, టీ. వీ, ఆ విధంగా కొన్నవే !

భాస్కర్ కి ఇదంతా అద్భుతమే !

చిన్న జీతంతో ఇంటిని చక్కదిద్దుతున్న ఆమె పనితనానికి, కష్టానికి, ప్లానింగ్ కి అభినందనలతోనే సరిపెట్టకుండా, ఆమె కోరుకొనే చిన్న చిన్న సరదాలు తీరేలా ఏదైన కొని బహూకరించాలని అతని మనస్సు ఉవ్విళ్ళూరుతుంది. కాని డబ్బుల పెత్తనం ఆమెది కాబట్టి అతని రిక్వెస్టుని నిర్దాక్షిణ్యంగా తోసి పారేస్తుంది. అది అతనికి బాధిస్తుంది. కోపాన్ని రప్పిస్తుంది. భర్తగా తనకి ఆ మాత్రం అధికారం లేదా ?

భాస్కర్ కొన్ని సార్లు మొండి. అతనిలో ఆవేశం వస్తే ఏమైనా చేస్తాడు. అప్పుడా ఇంట్లో పెద్ద గొడవే ! .... ఒకసారి ఏమయిందంటే –

ఆమె పుట్టిన రోజుకి కొత్తచీర కొని తీరాలని భీష్మించుకు కూర్చున్నాడు. ఆ నెల బడ్జెట్ లో కొంత చీరకి కేటాయించమన్నాడు. కేటాయించకపోతే ఒప్పుకోన్నాడు.

"కుదరదు" అంది పద్మ. "కుదరాలి" అన్నాడు. "కుదిరే పని కాదని చెబుతున్నాకదా !" ఆమె గొంతు పెంచింది. "అయినా నిన్ను అడిగే దేమిటి ? నేనే కొంటాను ?" "ఎలా కొంటావ్ ?" నిలదీసింది. "ఎందుకు కొనలేను. ఆ మాత్రం అప్పు పుట్టదా !"

"అప్పా !" ఆమెకు అప్పు అంటే హడలు. వడ్డీలు కట్టి డబ్బులు తేవడం అనేది ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమె సహించదు. ఒప్పు కోదు. ఆ విషయం చాలా సార్లు అతనికి స్పష్టం చేసింది.

"మీరామాట ఎత్తటానికి మీకెంత ధైర్యం ! అప్పు అనే మాట మరో సారి ఎత్తితే వీపు చీరేస్తాను."

"నీ చీర కోసం నా వీపు చీరించు కొంటాను."

ఆమె మెత్తబడి పోయింది. "ఏమిటండీ మీరు .. నన్ను అర్థం చేసుకోరు గదా "

" నేనెప్పుడూ నిన్ను అర్థం చేసుకోవాల్సిందే తప్ప – నన్ను కూడా అర్థం చేసుకోవాలనే సంగతి నీకు స్ఫురించదు."

"అమ్మో ! అయ్యగారికి కోపం వచ్చింది. మీ కోపం రాత్రికి తీర్చేస్తాను – మిమ్మల్ని చీరలా చుట్టేసుకొని " అంది పద్మ అతని చేతులను తన నడుం చుట్టూ వేసుకోంటూ.

ఆ రోజు పద్మ అతని చేతిలో మూడు వందల రూపాయలు పెట్టింది. చీరకోసం కాదు. బియ్యం కోసం..

నెల వాడుక కొట్టులో ఎప్పుడూ వాడే బియ్యం ఇరవై కేజీలు తెమ్మంది. తనేం మోసుకు రానక్కరలేదు. సాయంత్రం తను డ్యూటీ నుంచి తిరిగి వస్తున్నప్పుడు బియ్యం షావుకారుకి డబ్బులు ఇవ్వడమే అతని పని. ఒక గంటలో బియ్యం డోర్ డెలివరీ చెయ్యబడతాయి.

ఆ సాయంత్రం భాస్కర్లో ఒక మొండి ధైర్యం ప్రవేశించింది.

బియ్యం కొట్టుకి బదులు బట్టల కొట్టుకి వెళ్ళి మూడు వందలతో తనకు నచ్చిన చీర కొనేసాడు.

చీరను చూసి నిశ్చేష్టురాలయింది పద్మ.

ఆమె వేసే కేకలకీ, చీవాట్లకీ సిద్ధపడే ఆ పని చేసాడు భాస్కర్. ఆమె కేకలు వేయలేదు. చీవాట్లు పెట్టలేదు. గంభీరంగా మారిపోయింది. ఇంట్లో భయంకరమైన నిశ్శబ్దం.

ఆమె ముఖం అప్పుడు చూస్తే అది రాబోయేతుఫాను తాలుకు ప్రశాంతత అని ఆ ఇంట్లో చిన్న పిల్లడు సమీర్ కి కూడా అర్థమయిపోతుంది.

పద్మ తీరుబడిగా కూర్చొని వార పత్రిక తిరగేస్తోంది. పిల్లలు ఇద్దరికీ మినప దోసెలు వేసి తినిపించి పడుకోమంది. అతను లేచాడు. చేతులు కడుక్కొని వచ్చి డైనింగ్ టేబుల్ వద్ద భోజనానిక్ ఇ కూర్చొన్నాడు. ఆమె విసురుగా వచ్చి కంచం అతని ముందు పెట్టి కమ్మగా తినమంది. ఆమె పుట్టిన రోజు స్పెషల్ ! కంచం నిండుగా చీర. అతను ప్రేమగా కొని తెచ్చిన చీర.

"అలా మిడిగుడ్లు వేసుకు చూస్తారేం ! తినండి. నా పుట్టిన రోజు స్పెషల్. తినండి. మస్తుగా తినండి. నెమరు వేసుకు తినండి."

చీరని తినమనడమే కాదు. ఇంకా చాలా మాటలు అంది. భాస్కర్ చీరను తినలేదు. ఎదురు తిట్లు తిట్టలేదు. తను చేసిన తప్పుకి "సారీ" చెప్పేడు. ఆమె మళ్ళీ రయిజయ్యింది. "మీరు తెచ్చిన చీర, మీరు చెప్పిన సారీ ఈ నెల రోజులు మనకి అన్నం పెడతాయా ? చెప్పండి ? ఎంతకని నేను చచ్చేది. మీ ఇష్ట ప్రకారం మీరు చేసేయడమే తప్పా ఇంటి పరిస్థితిని అర్థం చేసుకోరు" అని ఆమె ఏడ్చింది.

పద్మ అక్కడితో ఊర్కోలేదు.

"మీకో నమస్కారం బాబూ ! నేను ఇక సంసారం చేయలేను దేవుడోయ్ ! నాకు పిచ్చెక్కి పోతోంది దేవుడోయ్ ! ఇక నావల్ల కాదు నాయినా, మహానుభావా. నేను చేయలేను. నాకు చేత కాదు." అని బీరువా తీసి జీతం డబ్బులు మొత్తం అతని చేతిలో పెట్టేసింది. జీతం అతను క్రితం రోజే ఇచ్చాడు.

"నీ డబ్బులు. నీ ఇష్టం. నీ పెళ్ళానికి చీరలే కొంటావో, నగలే చేయిస్తావో నీ ఇష్టం." అంది. రేపటినించి సంసారాన్ని అతణ్ణే ఎత్తమంది.

"నా కెందుకొచ్చిన బాధ ! ఏ రోజుకారోజు ఇంట్లోకి ఏ సామాన్లు కావాలో చెప్పి ఏడుస్తాను. కావాల్సినవి తెచ్చి తగలెట్టండి. వంట, పెంట నీ కెలాగూ రాదు కాబట్టి నీకూ, నీ పిల్లలకు ఇంతింత వండి పడేస్తాను."

ఇంటి భాధ్యత మొత్తం అతని నెత్తిన పడేసి చేతులు దులుపుకుంది.

అతని కాళ్ళ కింద నేల కంపించి, అమాంతం పాతాళంలోకి దిగి పోయేడు.

తను చేసిన పనికి చీవాట్లు ఊహించాడు తప్ప, ఇలా రియాక్ట్ అవుతుందనుకోలేదు. ఆమె చర్య తట్టుకోలేక చలి జ్వరం వచ్చినట్టు వజ వజ వణికి పోయాడు.

అతని చేతులో జీతం కవరు పర్వతమంత బరువయింది. ఇంటి ఖర్చులు సమస్యలూ తలచుకొంటే వాయుగుండాలు, ఉప్పెనలు గుర్తుకొచ్చి గడగడ లాడించేయి.

ఆమె రెచ్చగొట్టినా, పౌరుషానికయినా ఒకనెల ఇంటి బాధ్యత స్వీకరించడానికి సిద్ధంగా లేడు.

మరేమీ ఆలస్యం చేయకుండా, మరో ఆలోచన చేయకుండా ఆ రాత్రి ఆమె కాళ్ళను పట్టేసుకొన్నాడు. తను చేసిన పనికి ఆ శిక్ష తప్పించి మరే శిక్షయినా విధించమన్నాడు. క్షమించేవరకూ ఆమె కాళ్ళు వదలనన్నాడు.

"అయ్యో ! కాళ్ళు పట్టుకుంటారేమిటండీ ?" అనలేదు పద్మ.

"మీరు కాళ్ళు పట్టుకున్నంత మాత్రాన మీరు చేసిన వెధవ పనులు చక్కబడతాయా. పోయిన మూడు వందలూ వెనక్కి వస్తాయా. చెప్పండి. బాబూ ! నేనే మీ కాళ్ళు పట్టుకుంటాను. ఇక మీదట ఇలాంటి తెలివి తక్కువ పనులు చేయకండి. ఇలాటి పని మరోసారి చేశారంటే ఈ సారి మీకూ మీ ఇంటికీ నమస్కారం పెట్టేసి పుట్టింటి కెళిపోతాను " అంది పద్మ.

హమ్మయ్య ! తుపాను తీరం దాటింది.

ఆమె చెప్పిన ప్రతి మాటకి బుద్ధిగా గంగిరెద్దులా తలాడించేడు భాస్కర్. వెంటనే యమా స్పీడులో తన జీవితాన్ని ఆమె చెంగుకి ముడి వేసి ఇంటి బాధ్యతలని యధావిధిగా ఆమె నెత్తిపైకి నెట్టేసి తేలికైన మనసుతో నిద్రలోకి వెళ్ళిపోయేడు.

ఆమె లేపితే తుళ్ళిపడి లేచేడు. ఇది కలా! నిజమా ! ఎదురుగా కొత్త చీరలో ధగధగా మెరిసి పోతోంది పద్మ. తనకోసం వచ్చిన దేవతలా ఉంది. ఆమె అతని పైకి వంగి అధరాలను చుంబించింది. ఏదో మధురానుభూతి. కల కాదు. నిజమే. అతని నిద్ర మత్తు, మనసు బరువు వదిలిపోయింది. ఆకలితోనే నిద్రపోయిన సంగతి అతనికి గుర్తు లేదు. దేవత చేతిలో పళ్ళెం ఉంది. అందులో వేడి వేడి మినప దోశెలున్నాయి. ఆమె అతన్ని పసివానిలా దగ్గరకి తీసుకొంది. దోశెలు అతనికి తినిపించింది. ఆమెకి అతను తినిపించాడు. "మీరు నా పుట్టిన రోజు బహుమతిగా తెచ్చిన ఈ చీర ఎంతో బాగుందండీ. నా కెంతగా నచ్చిపోయిందో" అతణ్ణి ముద్దులాడింది. పద్మని అర్థం చేసుకోవడం కష్టమే అనుకొన్నాడు. ఆమె అతని కౌగిలిలో ఉంది. కాదు ఆమె కౌగిలిలో అతను ఉన్నాడు. ఆమె ముచ్చటగా కట్టుకొన్న కొత్త చీర విప్పేవరకూ అతను ఒప్పుకోలేదు. చీర నలిగి పోతుందని కాదు. ఆ సమయంలో ఆమె శరీరంపై గాని, తన శరీరంపై గాని చిన్న నూలు పోగు కూడా ఉండటానికి వీల్లేదు.

ఖచ్చితంగా ఆ నియమం పాటించవలసిందే. "కొత్త చీర కట్టుకున్న పుట్టిన రోజు కూడానా !" "ఏ రోజైనా సరే" "ఏమిటీ అల్లరి ! వద్దు అంటే చీర కొన్నారు. కట్టుకొంటే విప్పేయమంటున్నారు. అంతా మీ ఇష్టమేనా ?" "అవును. అంతా నా ఇష్టం." మంచంపై అతని ఇష్టప్రకారమే ఆమె నడవాలి. ఆ సమయంలో అతనికి ఎక్కడలేని హుషారు. అక్కడ అతనిదే పై చేయి. అక్కడ అతనిదే పెత్తనం. అతని ఇష్టాన్ని ఆమె తీర్చింది. కావాల్సినంత సుఖాన్ని ఇచ్చింది. "సుఖం కోసం స్త్రీని ప్రేమించే పురుషుడు పురుషుని ప్రేమ కోసం సుఖాన్ని అర్పించే స్త్రీ" పద్మ అన్న మాటలు అతనికి గుర్తుకు వచ్చాయి. సుఖం కోసం ఆమెను కలియని రోజు లేదు. కలిసేక ఆ కొటేషన్ గుర్తుకి రాని రోజు లేదు. అతని అనుభవం అది అక్షరాల నిజమేనని చెబుతోంది. మనుసు మాత్రం అంగీకరించకుంటోంది. ఏమైతేనేం – ఆ రాత్రి సుఖాంతం అయినప్పటికీ – ఆమెను కాదని చీరకొనడం లాంటి పొరపాట్లు ఇక జన్మలో చేయలేనంతగా అతణ్ణి కుదిపేసింది.

ఆ తర్వాత ఉల్లిగడ్డల వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయి స్కేప్‌గోట్ అయ్యేడు. ఒక ఉల్లిపాయ చిత్రంగా ప్రియాతిప్రియమైన పద్మని తనకు కానీయకుండా చేస్తోంది. ఆమెను తననుంచి నిర్దాక్షిణ్యంగా

పేరుచేసి పుట్టింటికి తరిమేస్తోంది. ఆ రోజు హెూల్‌సేల్ కొట్లో ఆమెను ఉల్లిపాయలు కొనవద్దు రెండు రోజులు ఆగమన్నాడు. రెండు రోజుల తర్వాత పాతిక రూపాయలకు పాకింది. తర్వాత కొండెక్కి నన్ను ముట్టుకుంటే ముప్ఫయిరెండు రూపాయలంది. పద్మ ఆ తర్వాత ఇంట్లో ఎమర్జెన్సీ విధించింది. సెల్ఫ్ రేషనింగ్ అమలుజరిపింది. అతన్ని ప్రత్యేకంగా నిందించలేదు. నిందిస్తే ఆమె కాళ్ళపై మళ్ళీ పడిపోవటానికి అతను సిద్ధం. అక్కడితో ఉల్లిసరసం ముగిసేది.

అంతలో ఢిల్లీలో ప్రకంపనలు! ఉల్లిపాయ అధికారపీఠం పునాదులను కుదిపేస్తుంటే ఇక్కడ తెలుగు ప్రభుత్వం గభాల్న నిద్ర లేచింది. తెలుగు బిడ్డకి కోపం రాదు. వచ్చిన కోపం పోదు. కోపం ప్రభంజనమై, తుపాను అలజడిగా పరిణమిల్లి విప్లవాలకే దారితీస్తుందని నేతలకు తెల్సు.

అధికారులు వెంటనే స్పందించి ధరల అదుపు కార్యక్రమాలు సిన్సియర్‌గా మొదలుపెట్టారు. అందులో భాగంగా ఉల్లిపాయలను తక్కువ రేటుకి అనగా 12 రూపాయలకే కేజి త్వరలో విక్రయించ బోతున్నట్టు ప్రకటించింది. ఎక్కడ? సూపర్ బజార్‌లో వెంటనే పద్మ భాస్కర్‌ని ఆదేశించింది. అతను ఏరోజు కారోజు వెళ్ళి సూపర్ బజార్‌లో ఎప్పుడు ఉల్లిపాయలు వస్తాయో తెల్సుకోవాలి. తెల్సుకొని ఉల్లిపాయల లోడు లారీలనుంచి దిగీ దిగగానే వాటిని కొనే మొదటి వ్యక్తి భాస్కరే అవ్వాలి.

కొడుకు సమీర్‌కి యూనిఫారం వేసి, వీపు వెనుక స్కూల్ బ్యాగ్ తగిలించి, చేతికి క్యారేజు ఇచ్చి జాగ్రత్తగా పంపినట్టు - భర్త చేతికి రేషన్ కార్డు, చేతిసంచీ, పందరూపాయల నోటు ఇచ్చి రోడ్డు మీదికి తోసేసింది. "దయచేసి ఈ పనైనా సవ్యంగా చేసుకురండి. ఈ పని నేనే చేసుకుందును. సూపర్ బజార్ దగ్గర్లో ఉంటే" అంది. అవును సూపర్ బజార్ దగ్గర్లో లేదు. భాస్కర్ ఆఫీసుకి వెళ్ళే తోవలో ఉంది. అతను ఆఫీసుకి సిటీబస్‌పై వెళ్తాడు. రోజూ బస్ ఎక్కుతాడు గనుక ప్రతినెలా బస్ పాస్ తీసుకుంటాడు. అంచేత అతను ఏ బస్ అయినా, ఏ రూట్ అయినా, ఎన్ని సార్లయినా పట్టణపరిమితుల్లో నిరభ్యంతరంగా తిరగవచ్చు. ఆఫీసు పని తర్వాత సాయంత్రాలు ఇంటి దగ్గర అతను చేసే రాచకార్యాలు ఏమీ లేవు గనక, బస్ పాస్ వుంది గనక ఉల్లిపాయలు సూపర్ బజార్‌కి వచ్చేవరకూ, వచ్చేక కొనేవరకూ అదే పనిపై ఉండమని హుకుం జారీ చేసింది పద్మ. భాస్కర్ తు. చ. తప్పకుండా రోజూ సూపర్ బజార్ చుట్టూ తిరుగుతున్నాడు. రోజుకు రెండుసార్లు ప్రదక్షిణం చేస్తున్నాడు. ఆఫీసుకి వెళ్ళేటప్పుడు, ఆఫీసునుంచి వచ్చేటప్పుడు.

అతను అక్కడికి ఏ రోజు వెళ్ళినా ఉల్లిపాయలుగాని, దానికి సంబంధించిన సమాచారం గాని లభించేది కాదు. ఎవరిని అడగాలో అర్థమయ్యేది కాదు. ఎవరినైనా అడిగితే పెదాలు విరిచేవారు.

భాస్కర్ కి గొప్ప చికాకుగా, న్యూసెన్సుగా ఉంది.

ఏమిటీ బతుకు ఇలా అయిపోయింది.

ఆమె తిరగమండం ఏమిటి ? తను గానుగెద్దులా తిరగడ మేమిటీ. . ? ఛఛ.

ఆమె పోరుపడలేక ఇలా రోజూ తిరుగుతున్నాడు తప్ప మనస్ఫూర్తిగా కాదు.

నాలుగు రోజులు వరుసగా సూపర్ బజార్ కి వెళ్ళేడు.

అయిదోరోజు ఉదయం వెళ్ళేడు. ఆ రోజు సాయంత్రం పని ఒత్తిడి ఎక్కువయి ఇంటికి ఒక గంట ఆలస్యంగా వెళ్ళేడు. కాస్త నీరసంగా ఉంది.

భాస్కర్ ఇంటి గుమ్మం ఎక్కుతుండగానే అతని చేతిలో ఉల్లిపాయల సంచి కోసం వెదికింది. కనిపించలేదు.

"ఉల్లిపాయలు తెచ్చారా ?"

ముందుగా భర్తని ఇంట్లోకి రానిచ్చి, గ్లాసుడు మంచినీళ్ళిచ్చి, లఘుశంక వగైరా ఏమైనా ఉంటే తీర్చుకోనిచ్చి, కాళ్ళూచేతులూ కడుక్కోనిచ్చి, సోఫాలో రిలాక్స్ అయ్యేక చేతికి టీ కప్పు ఇచ్చి అడిగితే ఎంత బాగుంటుంది !

"ఉల్లిపాయల గురించి మాట్లాడరేం ?" ఆమె రెట్టించింది. అతనికి ఇమిడియట్ గా బాత్రూం కి వెళ్ళవలసిన అవసరం ఉంది - పద్మతో గొప్ప చికాకు. చిరాకు కనపడనీయకుండా - "ఉల్లిపాయలు ఇంకా రాలేదు పద్మా. ఎప్పుడొస్తాయో సూపర్ బజార్ అధికారులకే తెలియదట" అన్నాడు. "ఆహా! అలాగటా!" నీ వెటకారాలు తర్వాత. ముందు నన్ను బాత్రూంకి వెళ్ళనీయ్ తల్లీ. ఒంటేలుకి కూడా వెళ్ళనీయకుండా ఉల్లిపాయల గోల. నీతో గొప్ప చిక్కు వచ్చింది. "మీరు నిజంగా సూపర్ బజ్జర్కి వెళ్ళేరా?" సూటిగా అడిగింది. "వెళ్ళేను" అతనికి తెలీకుండానే చిన్న అబద్ధం. అయినా సాయంత్రం వెళ్ళకపోయినా ఉదయం వెళ్ళేడుగా. అతనిలో స్థితిస్థాపక శక్తి అద్భుతంగా పనిచేస్తుండటం వల్ల యూరిన్ కంట్రోల్ చేసుకోగల్గుతున్నాడు. "మీరు వెళ్లలేదు. వెళ్ళానన‌డం పచ్చి అబద్ధం. ఉల్లిపాయలు ఇస్తున్నారక్కడ" బిక్కచచ్చిపోయేడు భాస్కర్. ఆడే అబద్ధాలు అతి చిన్నవి అయినా అప్పుడప్పుడు కొంపలు కూల్చును. అది నిన్ను కోలుకోని విధముగానూ, అతి పెద్దగానూ దెబ్బతీయును. అతనికి ఒక్కసారిగా ఒళ్ళంతా చెమటలు పట్టేయి. బాత్రూం అర్జెన్సీ ఆవిరైపోయింది.

"ఎవరు చెప్పారు నీకు ఉల్లిపాయలు ఇస్తున్నారని?" "మీరు చెప్పకపోతే నాకు తెలీదనుకున్నారా ? పక్కింటి వాళ్ళు తెచ్చుకున్నారు. ఇపుడేమంటారు ? ఎందుకండీ నన్నిలా మాయ చేస్తారు ? ఈ ఒక్క పనైనా ఒళ్ళు దగ్గర పెట్టుకొని చేయమన్నాను. మీరు చేయలేక కాదు. అది చెప్పితే ఎందుకు చేయాలి అనే నిర్లక్ష్యం ! నేను చేసిన పొరపాటు ఏమిటంటే ఈ పనికి నేనే తగలడకుండా బుద్ధి తక్కువై మీకు అప్పజెప్పడం."

పక్కింటి వాళ్ళు ఉల్లిపాయలు తెచ్చుకోగలిగి, భర్త నిర్వాకం వల్ల తాము తెచ్చుకోలేకపోవడం ఆమెను మరింతగా బాధించింది.

పద్మ ఉన్నపాటున సూపర్ బజార్ కి కట్టుబట్టలతో పరిగెట్టింది. ఆమె భాస్కర్ ని వెళ్ళమనలేదు. అతనిపై విశ్వాసం, నమ్మకం పోయింది. అతని ముఖమే చూడాలని అనిపించటం లేదు. ఆమె ఒక్కర్తే వెళ్ళిపోతుంటే భాస్కర్ కి ఏమిచేయాలో తోచలేదు. ఆమె పిలవలేదు కాబట్టి తను వెళ్ళక్కరలేదు. ఒంటరిగా వెళ్తుంది కాబట్టి తోడుగా వెళ్ళడం ధర్మం. బాత్రూం కి వెళ్ళడం అంతకన్నా అవసరం. అవసరాన్ని త్యాగం చేసి ధర్మ నిర్వహణకి పరిగెట్టేడు. అతనిని పద్మ గమనించి గమనించనట్టే ఊరుకొంది. సిటీ బస్ ఎక్కి సూపర్ బజార్ వద్ద దిగేరు. తోవలో ఆమె ఏమీ మట్లాడ లేదు. అతను కూడా. ధైర్యమేది ? సమయం ఏడు గంటలు. పద్మ అదృష్టం ! సూపర్ బజార్ లో ఉల్లిపాయలు ఇంకనూ ఇవ్వబడుతున్నాయి. అయితే ఉన్నపాటున ఆమెకి వెంటనే ఉల్లిపాయలు ఇచ్చేయడానికి వీలు లేకుండా ఆమె కన్నా ముందు వచ్చి వాళ్ళ వంతుకోసం వెయిట్ చేస్తున్నారు చాలా మంది. ఒక పెద్ద లైను వంకర్లు తిరిగి ఆమెను వెక్కిరించింది.

ఆమె అంత లైను చూసి బెంగపడిపోలేదు. ధైర్యంగా లైన్లో నించుంది. ఎలాగైనా ఉల్లిపాయలు తీసుకొనే ఆమె ఇంటికి బయల్దేరుతుంది.

లైన్ లో నించొని ఆమె షిరిడి శాయిని ప్రార్థించింది. కనక మహాలక్ష్మిని తలచుకొంది. ఆమెకు ఉల్లిపాయలు దొరుకుతాయనే నమ్మకం బలంగా ఏర్పడి పోయింది.

మగవాళ్ళ లైను, ఆడవాళ్ళ లైను రెండు పట్టాల్లా ఉన్నాయి. రెండు లైన్లూ పొడవుగానే ఉన్నాయి. పద్మ వెనుక అప్పుడే పది మంది చేరేరు.

భాస్కర్ ఆమె దగ్గరకి వెళ్ళి – "పద్మా ! నేను లైను కడతాను. నీవు అక్కడ కూర్చో " అన్నాడు భాస్కర్.

పద్మ వినిపించుకోలేదు. అతను ఇంకెవరినో అడుగుతున్నట్టు ఆమె ఉండిపోయింది. పద్మకి ముందు, వెనక ఉన్న స్త్రీలు అతని వైపు చూసేరు. అతను సిగ్గు పడి తర్వాత చిరాకు పడి విసురుగా, దూరంగా మగవాళ్ళ వైపు వచ్చేశాడు.

ఉల్లిపాయల కోసం లైన్లోనించున్న వాళ్ళ మధ్య ఉల్లిపాయల మీదే కబుర్లు దొర్లుతున్నాయి.

"రూపాయికి ఆపిల్ వస్తోంది గాని ఉల్లిపాయ రావడం లేదు."

"జగదాంబ సెంటర్ లో ఒక బట్టల షాపువాడు రెండు వందల రూపాయల బట్టలు కొంటే కేజీ ఉల్లిపాయలు గిఫ్టుగా ఇస్తున్నాడు. జనాలు విరగబడి కొంటున్నారట. అయితే ఉల్లిపాయలు సప్లయి చెయ్యలేక, స్టాకు లేక ఆ స్కీము ఎత్తేశాడట. "

"ఉల్లిపాయలు ఎగుమతి ఆపేసి, దిగుమతి చేసుకొంటున్నారని మనం పేపర్లో వినడమేగాని నిజంగా అమలు పరిస్తే ఉల్లి ధర తగ్గదా !"

"అదంతా బోగస్. ఉల్లిపాయల ఎగుమతి వల్ల రైతుకి గిట్టుబాటు ధర పెరిగింది లేదు. ప్రపంచ వాణిజ్య సంస్థతో ఒప్పందం వల్ల పప్పులూ, నిత్యావసర సరకులూ దిగుమతి అవుతున్నాయి. అంచేత గిట్టుబాటు ధర రైతుకి పెరగక చిక్కిపోయి బక్కగా మిగులుతున్నాడు. పోనీ దిగుమతులవల్ల ధరలు తగ్గి వినియోగదారుని శాంతింపచేసింది అంతకన్నా లేదు."

"ధరలు తగ్గితే మనకీ పడిగాపులు ఎందుకు సార్ ! కేజీ పాతిక రూపాయలకి తక్కువకి ఏ కూరగాయలు వస్తున్నాయి చెప్పండి. ఈ పరిస్థితి ఎప్పుడైనా ఉందా ?"

"ధరల పెరుగుదలకు ఆస్మానీ కారణం తప్ప సుల్తానీ కాదని వాజ్‌పాయిగారు ఉల్లిపాయి మీద కవిత్వం చెబుతున్నారు తీరుబడిగా ఫిడేలు వాయిస్తూ."

"ప్రభుత్వం మారాలండి."

"మారవలసింది ప్రభుత్వాలు కాదండీ. ఈ దళారీ దోపిడీ వ్యవస్థ మారాలి. అందుకు విప్లవాలే శరణ్యం."

అంతలో అక్కడ గొడవ ! గుంపులు గుంపులుగా జనం.

సమయం ఎనిమిది గంటలు కావడంతో సూపర్ బజార్ మూసివేసే ప్రయత్నం చేస్తుంటే జనం తిరగబడ్డారు. మరుసటి రోజు అమ్మకాలు కొనసాగిస్తామంటే ప్రజలు రెచ్చి పోయారు. ఒప్పుకో లేదు. రాత్రంతా ఉల్లిపాయలు అక్కడే ఉంటాయని ప్రజలకి నమ్మకం లేదు. అంతే కాదు రేపు ఉదయం మళ్ళీ లైనులో నించునే ఓపికల్లేవు. నించున్నా ఛాన్సు తగులుతుందనే గ్యారంటీ లేదు. ప్రజలు మీదు మిక్కిలి ఆగ్రహావేశాలతో ఉన్నారు. ఉల్లిపాయల కౌంటర్ మూసివేస్తే మొత్తం సూపర్ బజార్ అన్ని స్టాల్ లను లూట్టీ చేసేసి, తగలబెట్టి అడ్డుతగిలే అధికారుల కీళ్ళువిరిచి చంపేసేలా ఉన్నారు.

ఆ ఉద్రిక్త వాతావరణంలో సూపర్ బజార్ డైరెక్టరూ, జాయింట్ కలెక్టరూ రంగ ప్రవేశం చేయక తప్పలేదు. వాళ్ళు ప్రజలని శాంతించమన్నారు.

మీరు కోరిన ప్రకారమే టైముతో నిమిత్తం లేకుండా మొత్తం ఉల్లిపాయల స్టాకు

అయిపోయేవరకూ అమ్మకాలు కొనసాగుతాయన్నారు.

ఆ విధంగా ఆర్డరు జారీ చేసి అక్కడ నుంచి జారుకొన్నారు అధికారులు.

ఉల్లిపాయల కౌంటర్ మళ్ళీ తెరవబడింది. లైను పెరుగుతోంది. ఉల్లిపాయలు తరుగు తున్నాయి. జనం ఎక్కువ పెరిగి ఉల్లిపాయలు తరిగిపోతుండటం చేత మనిషికి అయిదు కేజీలనుంచి మూడు కేజీలకు, తర్వాత రెండు కేజీలకు కోటా తగ్గిపోయింది. రాత్రి పదవుతోంది. పద్మ వెనుక చాలామంది ఉన్నారు. పద్మ ముందు పది మంది కూడా లేరు. ఆమె తపస్సు ఫలించి ఉల్లిగడ్డలు దొరకబోతున్నాయి. అంతలోనే – ఆమె అదృష్టం పై పిడుగు పడ్డట్టు కౌంటర్ షట్టర్స్ బర్రున కిందకి దిగిపోయాయి. ఉల్లిపాయలు మొత్తం అయిపోయేయి. వందలాది జనం అలాగనే ఉన్నారు. గొడవ చేయడానికి ఉల్లిపాయలు ఉంటే కదా ! అరవడానికి ఒంట్లో శక్తి ఏదీ ? జనంలో నిరాశ, నిస్పృహలు. నీరసాలు, నిట్టూర్పులు. పద్మ కాళ్ళల్లో పీకు. కళ్ళల్లో నీళ్ళు. ఆ సమయంలో పద్మను చూడడానికి భయపడ్డాడు భాస్కర్. ఆమె సరదాగా సినిమాకి లైన్లు కాయడం ఎప్పుడో మానుకొంది. రేషన్ షాపుల్లో గంటా, అరగంటా లైన్ లో నించోడం అలవాటు ఉంది. అయితే రెండు కేజీల ఉల్లిపాయలకోసం చాంతాడు లైను కట్టి పడిగాపులుపడే రోజులు ఉంటాయని ఆమె ఏనాడూ ఊహించలేదు. పడిగాపులు పడినా ఫలితంలేదు.

నీరసంగా వేలాడిపోయి, స్పృహ కోల్పోయేలా ఉంది పద్మ స్థితి. భాస్కర్ ఆమెను కిళ్ళీ బడ్డీ వద్దకు తీసుకువెళ్ళి ఐస్‌సోడా కొట్టించేడు. ఆమె గబగబా తాగింది. మరో సోడా కావాలని సౌంజ్ఞ చేసింది. రెండో సోడా కొంత తాగి, మిగతాది ముఖం మీద జల్లుకున్నది. పద్మ కొంత స్వాధీనం లోకి

వచ్చింది. ఇంటికి చేరిన తర్వాత – అత్త మీద కోపం దుత్త మీద చూపినట్టు పద్మ భాస్కర్‌పై విరుచుకు పడింది. ఉల్లి దొరికి ఉంటే తుస్సుమని పోయే బాంబు భాస్కర్‌పై ఢన్‌మని పేలింది. అతను దెబ్బ తిన్నాడు. ఉల్లిపాయలు ఆమెకు అందినట్టు అంది దొరక్కుండా పోయేయి. భాస్కర్ తన బాధ్యతను గుర్తెరిగి ఆఫీసు నుంచి డైరక్టుగా సూపర్ బజార్ వెళ్ళి వుంటే తప్పక దొరికి ఉండేవి కదా!

ఇంటికి వచ్చేక తిండి లేదు. తిప్పలు లేవు.
ఆరాత్రి ఇద్దరి మధ్య పెద్ద రగడ. యుద్ధం.

అతణ్ణి నిందిస్తూ ఆమె అదే పనిగా అరుస్తుంటే – అతడు సహనం కోల్పోయేడు. ఒక్కసారిగా ఆమెకన్నా హెచ్చు స్థాయిలో అరవడం మొదలెట్టేడు. పిల్లలు నిద్రలేచి ఏడుపు ముఖాలతో నిలబడ్డారు. అతనిలో నిక్షిప్తమైన శాంతస్వభావం ఆమె అరుపులకి ఆవిరైపోయి మాటకి మాట విసిరి మానసికంగా ఆమెను గాయపరచి తను గాయపడ్డాడు. అంతేకాదు – అతని కోపం తారస్థాయికి ఎగసి ఆమెపై చేయి చేసుకున్నాడు. ఫడేల్మని ఒక లెంపకాయ ఆమెకి తగిలింది. ఆమె నిర్ఘాంతపోయి నోట మాట రాక అలా ఉండిపోయింది. తుపాను సద్దుమణిగింది.

పదేళ్ళలో ఏనాడూ జరగని సంఘటన!

భాస్కర్ ఈ పదేళ్ళ సంసారంలో ఏనాడూ ఆమెపై చేయిచేసుకోలేదు. ఆమెపై అంత రోతగా, బ్రూటల్‌గా విరుచుకుపడలేదు. ఆమె మంచంపై పిల్లలు మధ్య నిశ్శబ్దంగా ఏడ్వసాగింది. తల్లితోబాటు పిల్లలు కూడా. తనుకొట్టేడా? అప్రయత్నంగా ఆమె పైకి చేయి దూసుకుపోయింది! అతని ప్రవర్తనకి సిగ్గుపడ్డాడు. ఆమెను దగ్గరకు తీసుకుని ఓదార్చా లనిపించలేదు. ఆమెకు క్షమాపణలు చెప్పాలనిపించలేదు. ఆమె కనిపించకుండా, ఆమె ఏడుపు వినిపించకుండా పక్క గదిలోకి వెళిపోయి తలుపులు వేసుకున్నాడు భాస్కర్.

తనకు తెలిసీ ఏనాడూ పురుషుడిగా తన అహం ఆమెపై ప్రదర్శించలేదు. పైగా ఆమెను తృప్తి పరచడానికి, ఉత్సాహపరచడానికి ఆమె కన్నా తను ఒక మెట్టు దిగువనే ఉన్నట్టు ప్రవర్తించేడు. ఆమెకు ఇంట్లో పెద్ద పీట వేసి మహారాణిని చేశాడు. ఆమె అధికారాన్నీ, ఆధిపత్యాన్నీ ఆనందంగా శిరసావహించేడు. ఆమె పెత్తందారీ తనాన్ని మనస్ఫూర్తిగా ఆమోదించేడు. పద్మ ఎన్నోసార్లు తనపై అనవసరంగా, అకారణంగా అరిచేటప్పుడూ, విరుచుకుపడేటప్పుడూ, విసుక్కున్నప్పుడూ, నోరు జారేటప్పుడూ – తనది తప్పు అన్నట్టుగా ఒప్పుకోవడమో, తప్పుకోవడమో, లేదా నిశ్శబ్దంగా

భరించడమో తను చేసిన పొరపాటా? తను లోకువ అయ్యేడా? ఆమె శృతి మించడం వల్లే ఏనాడూ లేనిది కొట్టేడా? తన పాశవిక ప్రవర్తనకి కారణాలు వెదుకుతున్నాడా?

కారణాలు, పరిస్థితులు ఏమైనా కొట్టడం తప్పని అతనికి తెలుస్తోంది. స్త్రీలను తిట్టి, కొట్టి, హింసించే ఏ మగాళ్ళనయితే అసహ్యించుకుంటాడో తను కూడా అచ్చంగా అలాగే ప్రవర్తించేడు. ఎంతగానో ప్రేమిస్తున్న పద్మను కొట్టగలిగేడు. అతని మనసు వికలమయింది. కొట్టడం తప్పే కావొచ్చు. కాని ఆమె తనను భర్తగా గౌరవించకపోవడం, ఒక మనిషిగా నైనా చూడకపోవడం, ఉల్లిపాయ కన్నా హీనంగా చూడటం తను భరించలేక పోతున్నాడు.

ఆమెను క్షమించలేక పోతున్నాడు.
ఆరాత్రి నిద్ర పట్టలేదు అతనికి.
మరుచటి రోజు నుంచి పద్మది కొత్త అవతారం!
వింతగా కొత్తగా ప్రవర్తించడం మొదలుపెట్టింది.

దినచర్యల్లో విపరీతమైన, విలక్షణమైన మార్పులు. వంటగదిలో ధన్ ధన్ చప్పుళ్ళు. కొత్తరకం వంటలు. రుచి పచిలేని భయంకరమైన వంటలు. అవసరమైన కూరలోనైన ఒక్క ఉల్లిపాయ ముక్క కూడా వెయ్యని వంటలు!

"ఏమిటీ వంట? ఎందుకిలా తగలెట్టావ్. కుక్కలు కూడా తినవు" అని ముఖంపై కంచాన్ని గిరాటు వెయ్యటం లేదు. తనూ, పిల్లలూ రసంతో, పెరుగుతో ఏదో తిన్నాం అనిపించుకొని కంచాల నుంచి లేస్తున్నారు. వడ్డించేటప్పుడు డైనింగ్ టేబుల్‌పై కంచాల చప్పుడు విపరీతం. పద్మ ఏమి తింటున్నదో అతనికి తెలీదు. అతనికి అక్కర లేదు. ఆమెను పూర్తిగా పట్టించుకోవడం మానేశాడు. ఇద్దరి మధ్య మాటలు లేవు. పడకలు లేవు. ఎడమొగం. పెడమొగం. నాలుగైదు రోజులుగా ఇదే సీను. ఇన్నాళ్ళూ చిన్న చిన్న అలకలు, గిల్లికజ్జాలు వాళ్ళ మధ్యకి వచ్చి వెళ్ళేయి తప్పా - ఇంత భారీ ఎత్తున ఎడబాటు లేదు లేదు. పద్మకి దుఃఖం ఆగటం లేదు. అతనిపై కసికసిగా ఉంది. బతుకుపై రోతగా, విరక్తిగా ఉంది. ఎందులోనైనా పడి చావాలనిపిస్తోంది. పిచ్చెక్కి పోతోంది.

పద్మ అన్ని విధాల ఆలోచించుకొని ఒక నిర్ణయానికొచ్చింది. భాస్కర్‌కి దూరంగా పుట్టింటికి వెళ్ళిపోవడం ఉత్తమం, తక్షణ కర్తవ్యంగా భావించింది. అతణ్ణి విడిచి వెళిపోతున్న సంగతి ఆమెకు చెప్పాలనిపించలేదు. చెప్పక తప్పదు గాబట్టి కూతురు సుస్మిత ద్వార తెలియజేసింది. ఆరాత్రే సూట్‌కేస్‌లూ, ఇతరత్రా పట్టుకెళ్లవలసిన వస్తువులన్నీ సర్దుకొని ఓపిగ్గా ప్యాక్ చేసుకొంది.

ఇన్నాళ్ళు ఎంతో చక్కగా, తన అభిరుచికి అనుగుణంగా తీర్చి దిద్దుకున్న ఆ గృహముతో రేపటి నుంచి బంధం తెగిపోతుంది. ఈ పదేళ్ళు ఏమీ కాకుండా సాగిపోయేయి. ఈరాత్రి తెల్లవారడం ఎంతసేపు. ఇల్లు నిశ్శబ్దంగా రోదిస్తోంది. పిల్లలు వాళ్ళ గదిలో హాయిగా నిద్రపోతున్నారు. అంతే హాయిగా రేపు అమ్మమ్మ ఇంటిలో కూడా నిద్రపోగలరు. అదృష్టవంతులు.

నిద్రపోవడానికి ప్రయత్నిస్తోంది పద్మ.
ఆ మంచంపై భాస్కర్ కూడా ఉన్నాడు.
డబల్ కాట్ పై .. అటు పద్మ ఇటు భాస్కర్ నాలుగైదు రోజులుగా ఇదే తంతు.

ఆ మంచానికి ఈ అనుభవం కొత్తగా ఉంది. చెత్తగా ఉంది. చప్పగా ఉంది. భరించలేకపోతోంది.

మంచంపై భాస్కర్ ఆమెకి పొరపాటున కూడా తగలకుండా అటూ, ఇటూ దొర్లుతున్నాడు. రేపటి నుంచి ఆ జాగర్తలు అతనికి అవసరం లేదు. ఆమె వెళిపోతోంది.

ఆమె తనను విడిచివెళ్ళడం అనే సీను ఒకటి అతని జీవితంలో ఎదురవుతుందని ఏనాడు ఊహించలేదు. జీవితం కొంత కొంత అతని కిపుడిపుడే అర్థమవుతున్నట్టుగా ఉంది. ఎడబాటు పాఠాలు నేర్పుతోంది.

భార్య ప్రేమానురాగాలతో అతని జీవితం పెనవేసుకుపోయి చల్ మోహనరంగా అని హాయిగా హాయిగా సాగిపోతుందనుకున్నాడు తప్పా ఇలా ఉల్లిపాయలు, ఉప్పుపొప్పులూ మరొకటీ మరొకటితో అదే జీవితం ముడిపడి ఉంటుందనుకోలేదు.

అతనికి అర్థమవుతోంది. ఎగుడుదిగుడుగా ముళ్లకంపలతో రాళ్ళు రప్పలతో వికృతంగా, లోపభూయిష్టంగా వ్యవస్థ ఉన్నప్పుడు మన జీవితాలు, దాంపత్యాలు చలువరాతి గచ్చులా నున్నగా, సాఫీగా సాగాలనుకుంటే ఎలా సాగుతుంది? భార్యాభర్తల మధ్య ఎంత అండర్‌స్టాండింగ్ ఉన్నా జీవితాన్ని గిరిగీసుకొని ఎంత పకడ్బందీగా ప్లాన్ చేసుకున్నా, వాళ్ళు తప్పనిసరిగా సామాజిక పరిస్థితులకు కీలుబొమ్మలు. వాళ్ళ బతుకులపై సామాజిక ప్రభావం మంచికో చెడుకో, శాంతికో అశాంతికో గురిచేస్తూనే ఉంటుంది. ఈ సంవత్సరం ఆ దంపతులను అశాంతికే గురి చేసింది.

పద్మ అయితే తల్లడిల్లి పోయింది.
ఆమెపై జాలి వేస్తోంది అతనికి.

ఆమెది చాలా చిన్న ప్రపంచం. ఇల్లు, భర్త, పిల్లలు. అంతే. ఆ చిన్న ప్రపంచాన్ని గాజుబొమ్మలా చూసుకుంటుంది. ఆమె తెలివైనది. ఇంటిలోపల ఎంతైన ఆమె మానేజ్ చేయగలదు. ఇంటి బయట ఆమె అశక్తురాలు. ఆమె అధీనంలో లేని శక్తులే ఆమెను శాసిస్తున్నాయి. గాజు ఇంటిపై రాళ్ళు రువ్వుతున్నాయి. కనబడని రాయి ఎవరు విసిరిందో తెలియక, అర్థం కాక ఎదురుగా ఉన్న భర్తపై తన ఆక్రోశం, భయం వెళ్లగక్కుతోంది. ఆమె అర్థమవుతోంది. ఆమెను కొట్టిన చేయిని నరికివేసుకోవాలనిపిస్తోంది. అతని మనసెందుకో తేలికవుతోంది. అతడు నిద్రకి ఉపక్రమించేడు.

. . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .

అతను నిద్రపోతున్నాడు.
ఆమె నిద్రపోతోంది.
సమయం రాత్రి పావు తక్కువ పన్నెండు అవుతోంది.
ఆరాత్రి –
నాలుగురాత్రుల ఎడబాటు తర్వాత . . ఒక అద్భుతమైన క్షణాన . . ఒకరి శరీరం మరొకరికి తగిలింది.

ఎవరి శరీరం ఎవరికి తగిలిందో చెప్పడం కష్టం. ఆ రెండు శరీరాలు తగలాలని తగిలేయా, అనుకోకుండా తగిలాయా మన్మథుడిక్కూడా తెలియదు. కరెంట్ షాక్ తగిలినట్టు అంటుకుపోయేయి. వంటిమీద బట్టలు విడిచేసి త్రాచుపాముల్లా చుట్టుకుపోయేయి. పోట్లగిత్తల్లా దొర్లేయి. మంచమంతా పొర్లేయి. సుఖాన్ని పొందేయి.

ఆ శరీరాల వేడి రాపిడిలో అహాలు, కోపాలు, స్పర్థలూ బాధలూ ఒక్కసారిగా చల్లబడిపోయేయి. సెక్సు వాళ్ళతో మధ్యవర్తిత్వం నెరిపి రాజీ కుదిర్చింది.

చిత్రంగా – ఎవరికి వాళ్ళు తప్పు నాదంటే నాదన్నారు. ఎవరికి వాళ్ళు నన్ను క్షమించమంటే నన్ను క్షమించమన్నారు. "ఏదో కోపంలో ఏదో అంటే నన్ను నాలుగు రోజులు దగ్గరకు తీసుకోకుండా ఎలా ఉండగలిగారు. నాకు చాలా కోపం వచ్చింది తెల్సా" అంటూ అతని గుండెలపై వాలిపోయి ఏడ్చింది పద్మ – "ఏదో పిచ్చిదాన్ని ఏ చికాకులోనో ఏదో అంటాను. మిమ్మల్ని కించపరచాలని కాదు. ఏవండీ నేనెలా ప్రవర్తించినా నన్ను దగ్గరకు తీసుకోడం మానకండి. ఇంటి చాకిరీతో విసిగివేసారిపోయిన నన్ను మీరు దగ్గరకి తీసుకుంటే ఆ సుఖంలో అన్నీ మర్చిపోతాను. ఏవండీ దయచేసి నాకు ఎడంగా ఉండకండి. నాకున్నది ఈ సుఖమే. మీ సుఖమే"

ఆమె అతన్ని పూర్తిగా హత్తుకుపోయింది. అతని పొందులో ఏదో తన్మయత్వం. ఎంతో ఓదార్పు. మగవాడు సెక్సు కోసం స్త్రీని ప్రేమిస్తే, స్త్రీ ప్రేమకోసం, మగవానికి సెక్సు ఇస్తుందనే సూత్రం అక్కడ చెల్లలేదు. ఇద్దరిదీ ప్రేమే. ఏకకాలంలో రెండు శరీరాలు స్పందించి సెక్సు సుఖాన్ని పొందేయి. సెక్సు వాళ్ళని సామాజిక, శారీరిక, మానసిక వత్తిడిల నుంచి రిలీవ్ చేసి సుఖాన్ని, శాంతినీ ఇచ్చిందనేది ఇద్దరిలోనూ స్పష్టంగా తెలుస్తోంది. . . . . . . . . . . . . . . . . . . . . . . . .

మరుచటి దినం హుషారుగా తెల్లవారింది. ఆమె పుట్టింటికి బయల్దేరలేదు! భాస్కర్ ఆఫీసుకి బయల్దేరుతుండగా ఆగమంది పద్మ ఆగేడు అతని చేతికి యాభై రూపాయల నోటు చేతికిచ్చింది

"ఎందుకు?"

"ఆఫీసు నుంచి వచ్చినపుడు నాలుగైదు సాల్టు పేకెట్లు తీసుకురండి." తెల్లబోయి . . చూసేడు

ఏం మనిషి! ఈ రోజు పేపరు చూడలేదా!

ఉప్పుగాలి పేకెట్కి అరవై రూపాయల చొప్పున వీస్తోంది ఆ గాలి ఢిల్లీ నుంచి ఇక్కడికి రావడం ఎంతసేపు?

"పద్మా! నిజంగా నీకు మతిపోయింది"

పద్మకి కోపం వచ్చింది

ఆ కోపానికి అదిరేడు భాస్కర్.

అతనికి తెల్సు – ఆడది అలిగితే మగవాడికి మతి తప్పుతుంది. ప్రభుత్వాలకి గతి తప్పుతుంది. ఎగిసే ధరలను నేలకు చచ్చినట్టు దిగివచ్చేల కళ్ళెర్ర జేస్తుంది.

ఆ విషయం చరిత్ర చెబుతోంది.



# అమెరి - గల్పిక

## ఆదా

ఎస్. నారాయణస్వామి

ఒక శనివారం ఉదయం. ఖాళీ అయిన రిఫ్రిజిరేటర్ని తిరిగి నింపే సంకల్పంతో సుబ్బారావు భార్యా సమేతుడై సూపర్ మార్కెట్టుకి వేంచేశాడు. అక్కడ ప్రొడ్యూస్ సెక్షన్ లో ఇటాలియన్ ఎగ్ ప్లాంట్ (సన్న వంకాయలు) ఒక్క పౌనూ రెండు డాలర్లు ఉల్లిపాయలు పౌనూ డలరు (ఇదేవన్నా అమెరికానా, బీజేపీ పాలనలో ఉన్న ఇండియానా?) బాటిల్ స్క్వాష్ (సొరకాయ) చిన్నదీ డాలరు పెధవది, అరిటిపళ్ళు పౌనుకి అరవై సెంట్లు

ఈ మండే ధరల్చూసి సుబ్బారావుకి కడుపు మండిపోతుండగా (ఎసిడిటీ వల్లనే కాదు సుమండీ) సతీమణి చల్లటి మాట చెప్పింది .. ఫార్మర్స్ మార్కెట్లో కూరగాయలు కారు చౌకగా అమ్ముతున్నార్ట.

నాలుగు లీటర్ల ఎనిమిది సిలిండర్లూ నాలుగొందల గుర్రాలై లాగుతున్న స్పోర్ట్సు యుటిలిటీ మహా రథాన్నెక్కి పదిహేను మైళ్ళ దూరాన్ని పది నిమిషాల్లో దాటేశాడు సుబ్బారావు, హనుమంతుడు సముద్రం లంఘించినంత అవలీలగా. వారాని కొక రోజు మాత్రమే జరిగే ఈ సంతకి విపరీతమైన రద్దీ. పార్కింగ్ లాట్ లో చోటు దొరక్క, పార్కింగ్ మీటరుకి డాలరు ధార పోసేందుకు మనసొప్పక, అనతి దూరాన ఇళ్ళున్న ఒక బ్లాకులో వాహనాన్ని నిలిపి, సంతలో ప్రవేశించాడు సుబ్బారావు, పద్మవ్యూహంలోకి చొచ్చుకు పోయే అభిమన్యుడి లెవెల్లో - ఒక్కటే డిఫరెన్సు - అభిమన్యుడి వెనక ఉత్తర లేదు, సుబ్బారావు వెన్నంటి శ్రీమతి వుంది.

సంతలో సుబ్బారావు కళ్ళబడిన ధరలెట్టివనిన సన్న వంకాయలు ఎనభై సెంట్లే ఉల్లిపాయలు అర్థ డాలరు పెద్ద సొరకాయ ముప్పావలా అరిటిపళ్ళైతే పావలాయే

అబ్బ, ఎంత చౌక! ఇంతటి గొప్ప ఐడియా ఇచ్చిన పెళ్ళాన్ని అమాంతం ముద్దెట్టేసుకోవా లన్నంత ముచ్చటేసినా, తనలాంటి ఉత్తమ ఇండియన్ మొగుడు తనదైన ఇండియన్ పెళ్ళాన్ని అలా పబ్లిగ్గా

ముద్దెట్టుకోవడం బొత్తిగా ఇండియన్ వేల్యూ కాదని గుర్తించి, ఆ ఉత్సాహాన్ని కూరలు కొనడంలోకి మళ్ళించాడు.

ఇంత చౌకగా దొరుకుతుంటే వొదలడ మెందుకని అత్యవసర మైనవీ, అప్పుడప్పుడూ అవసరమయ్యేవీ, వాటితోపాటే అసలు అవసరం లేని కూరలూ పళ్ళూ కూడా కొనేసుకుని, కనీసం పది డాలర్లన్నా ఆదా చేశామన్న తృప్తితో సుబ్బారావు దంపతులు గృహోన్ముఖులై వాహనమెక్కారు.

స్టార్ట్ చేసి గేరు మారుస్తుండగా చూశాడు, వైపర్ బ్లేడ్ కింద రెపరెపలాడుతున్న కాగితాన్ని. ఏదో ప్రకటన పత్రం! విసుక్కుంటూ కిందకి దిగాడు దాన్ని తీసి చించి పారెయ్యడానికి. అది ప్రకటన పత్రం కాదు, పాతిక డాలర్లకి పార్కింగ్ టిక్కెట్టు. టిక్కెట్టెందు కిచ్చారబ్బా అని ఆశ్చర్యపడి లేచి చుట్టూ కలయ జూస్తున్న సుబ్బారావుకి, అక్కడ అంతకు ముందు లేని, ఉన్నా కనిపించని "రెసిడెన్షియల్ పెర్మిట్ పార్కింగ్ ఓన్లీ" అన్న బోర్డు ఇప్పుడు కనబడి వెక్కిరించింది.

ఇక గాసొలీన్ని కోక్ లాగా జుర్రుకునే స్పోర్ట్ యుటిలిటీ మహారథంలో రానూ పోనూ ముప్ఫై మైళ్ళకి గాస్ ఖరీదు ఎంతో సుబ్బారావుతో చెప్పకండి, మండి మసై పోగల్డు.

# అడుగుతున్నది మిమ్మల్నే! చెప్పండి సార్

--- పల్లేటి బాలాజీ

అంతస్తుకు రెండు అపార్ట్‌మెంట్స్ చొప్పున మూడంతస్తుల్లో ఆరు కాపురాలున్న అయిదారు వందల భవనాల కాలనీ మాది. తీర్చిదిద్దినట్టుండే వీథులు, పంచరంగుల కేకులతో కట్టిన మిఠాయి నిర్మాణాల లాంటి ముచ్చటైన భవంతులు, ఆగంతుకులెవరైనా వస్తే వచ్చిందెవరో తెలుసుకోవడానికి వీలుగా తలుపులో అమర్చి ఉంచిన 'అద్దపు కన్ను', వచ్చిన వాళ్ళెవరైనా ఏదైనా వస్తువులు తీసుకొచ్చి వుంటే చేయి మాత్రం బయటికి చాపి వాటిని తీసుకోవడానికి వీలుగా ఏర్పాటుచేసిన గొలుసు అమరిక.

పచ్చని చెట్లతో పూలమొక్కలతో పచ్చిక బయళ్ళతో ప్రశాంత మనోహరమైన వాతావరణం. కాలనీ చుట్టూ ఎత్తైన ప్రహరీ గోడ. మెయిన్ రోడ్డు పైనుంచి లోపలకు రావడానికి ఏర్పాటు చేసిన ఏకైక ప్రధాన ద్వారం. అక్కడ అహర్నిశలూ కాపలా వుండే ఘూర్ఖాలు. ఇదంతా చూస్తే పూర్వకాలంలో ప్రాగ్జోతిషం, పాటలీపుత్రం, కన్యాకుబ్జం లాంటి మహా నగరాల కెట్టి రక్షణ ఉండేదో అంతటి భద్రత మాకాలనీకీ ఉందని నిస్సందేహంగా చెప్పొచ్చు.

కాలనీ వాళ్ళం కదా! పడమట దిక్కున రెండు కిలోమీటర్ల దూరాన ఉన్న ఊరితో మాకట్టే సంబంధాలు ఉండవు. కిరాణాకొట్లు, ఫ్యాన్సీ షాపులు, ఫాస్ట్ ఫుడ్ సదుపాయాలు, పోస్టాఫీసు, లైబ్రరీ మొదలైన వన్నీ కాలనీలోనే ఉన్నాయి.

ఉద్యోగుల్ని తూర్పుగా పదహైదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కార్యాలయాలకు తీసుకెళ్ళడానికి డిపార్టుమెంటు వారి ప్రత్యేక బస్సు సర్వీసులున్నాయి. ఉదయం ఎనిమిది కొట్టగానే మెట్లపైనుంచి ప్రారంభమయ్యే బూట్ల టకటకలు రోడ్లపైకి వచ్చి అక్కడనుంచి ముందుకు సాగి ప్రధాన ద్వారం దగ్గర ఆగిపోతాయి.

"ఏమండీ సుందర్రావు గారూ .. నిన్న సాయంకాలం లైబ్రరీ దగ్గర కనిపించలేదే ..?"
"అయ్యా శ్రీనివాసన్ సార్! రండి రండి .. ఆనందవికటన్ కావాలంటిరే .. మాకోసరం తెస్తిని. తీసుకెళ్ళి సదువుకోండబ్బా ..!"

"అబ్బా నంజుండబ్బా! చిత్రదుర్గా నుంచి ఎప్పుడొస్తివి?"
"క్యాహైజీ అగర్వాల్?"
"ఈ రోజు పేపర్ చూశావా? అయినా చూసి ఏం లాభంలే .. న్యూస్ పేపర్లలో ఈ కుంభకోణాల్ని గూర్చిన వార్తలు చదువుతుంటే కడుపు తరుక్కుపోతుందయ్యా."

ఇలా పలకరింపుల సంబరాలతోనే ఉద్యోగులు బస్సెక్కేస్తారు. సరే, ఉద్యోగప్రయాణం గురించి మనకెందుకు? వదలిపెడదాం. పిల్లలు స్కూళ్ళకు వెళ్ళిపోయాక, మగవాళ్ళు ఆఫీసుల కోసం బయలుదేరాక కాలనీలోని సుగుణమణి, జలజలోచన, చారుమతి ఇళ్ళకు తాళాలు వేసుకొని పార్కులోకొచ్చి చెట్లనీడలో కూర్చుంటారు. శిరోమణి, దేవసేన, రాజేశ్వరి, విజయ, ప్రసూనలు సాధారణంగా రీడింగు రూములోనే కలుసుకుంటుంటారు.

అరవైయేళ్ళ భగీరథమ్మ వినాయకుడి గుడి మండువాలో ఆంధ్రవాల్మీకం చదివి పది పదిహేను మంది శ్రోతలకు (వీరిలో వయసు మళ్ళిన వాళ్ళతో బాటుగా వయసు మళ్ళని జిజ్ఞాసువులు గూడా వుంటారు) అర్థవివరణ చేస్తూ వుంటుంది. వాళ్ళంతా ఎవరిళ్ళకు వాళ్ళు చేరేది మధ్యాహ్నం పన్నెండుకే – పన్నెండున్నరకు బడినుంచి పిల్లలొస్తున్నారు గదా! వాళ్ళకన్నాలు పెట్టి మళ్ళీ బడికి పంపించేశాక విశ్రాంతి. టీవీ చూడ్డమైనా, పుస్తకం చదవడమైనా అర్థంతరంగా ఆగిపోవడమే మామూలు.

నిద్రకునుకు తీసుకునేటప్పటికి గంట నాలుగు దాటి వుంటుంది. "అమ్మో! పిల్లలొస్తారు, ఆయనొస్తారు ఆపురాపురుమంటూ – ఏదైనా టిఫిను చేసేయాలి." ఇక చూసుకోవలసిందే తమాషా.

కాలనీ అనే యంత్రం అమాంతంగా స్టార్టయిపోతుంది. కొళాయిల్లోంచి నీళ్ళు దూకుతాయి, మిక్సీలు గొంతు విప్పుతాయి, గ్యాస్ స్టవ్‌లు క్రమబద్ధీకరించిన మంటల్ని విరజిమ్ముతాయి.

అలాంటి ఒక సాయంకాలపు వేళ – చెట్ల నీడలు చూస్తూ, గాలి హాయిగా వీస్తూ, పక్షులు చెట్టు పైన్నుంచి చెట్టుపైకి ఎగురుతూ, పిల్లలు ఆటస్థలాల్లో ఆడుకుంటూ అందాలతో ఆనందాలతో ప్రకృతి పరవశించి పోతున్న వేళ – చామన చాయతో, పొందికైన క్రాఫింగుతో, నశ్యం రంగు ప్యాంటుతో, తెలుపు పైన ఊదారంగు చారల చొక్కాతో, ఖాళీ క్యారియరు వాటర్ బాటిల్ ఉన్న ప్లాస్టిక్ బుట్ట చేతబట్టుకుని ఒక ముప్పై అయిదేళ్ళ ఉద్యోగి బస్సు దిగాడు.

బస్సు దిగేటప్పటికతడు గుంపులో గోవిందయ్య. పాపం వార్తల్లో కెక్కాలన్న ఊహగానీ, ప్రయత్నం గానీ లేనివాడు. ఆనాటి సంఘటన కతడి ప్రమేయం ససేమిరా లేదు. అయితే అది జరిగిన తర్వాత

అతడి జీవితం అంతకు మునుపటి జీవితంతో పోల్చుకోవటానికి వీల్లేనంతగా మారిపోయింది. అతడు తనకు, ఊహకు, ప్రయత్నానికి అతీతంగా వార్తల్లోకెక్కిపోయాడు. వక్కపలుకు నోట్లో వేసుకొని కొరికినంతసేపట్లో అతడి ఊరూ, పేరూ, స్వభావం, హాబీలు, భార్యాబిడ్డల గుణగణాలు మొదలైనవన్నీ కాలనీలో ఒకరికొకరు చెప్పుకోవలసిన, చెప్పగా చెవి ఒగ్గి వినవలసిన ముఖ్యవిషయాలుగా మారిపోయాయి.

అతడిపేరు షణ్ముగసుందరం. స్వస్థలం చిదంబరం దగ్గర తిరుమంగళం. తండ్రి ప్రైమరీ పాఠశాల టీచరు. మేనమామ మద్రాసులో ఉండడం వల్ల అతడు పైచదువులు కొనసాగించ గలిగాడు. గిండీ ఇంజనీరింగు కాలేజీలో పట్టా పుచ్చుకున్నాడు. భార్య పేరు శివగామి. ఒక కూతురు, పేరు దేవయాని. వయస్సు తొమ్మిదేళ్ళు. కొడుకు ఏడేళ్ళవాడు, పేరు పార్థు. అన్యోన్య దాంపత్యం, కుదురైన బిడ్డలు. అతడి ఉద్యోగ జీవితం ప్రారంభం కావడం ఇక్కడే. కన్‌స్ట్రక్షన్ డిపార్టుమెంట్‌లో సెక్షన్ హెడ్. సాయంకాలం అతడిల్లు చేరుకునేటప్పటికి పిల్లలు ప్లేగ్రౌండుకు వెళ్ళి వుంటారు. ముఖం మాత్రం కడుక్కొని ఈవలికొచ్చేసరికి భార్య వేడిగా కాఫీ కప్పు చేతికిస్తుంది. కాఫీ సేవనంతో పిచ్చాపాటీ మొదలవుతుంది.

పత్రికలు చదువుకోవడం, టీవీ చూడ్డం, పిల్లలకు హోమ్‌వర్కులో సాయపడ్డం, తిరుమంగళం నుంచో మద్రాసునుంచో జాబులొస్తే ఒకొక్క వాక్యాన్ని చదివి అభిప్రాయాలు ప్రకటించడం – ఈ మాత్రమే వాళ్ళ వ్యవహార జగత్తు. సరే, షణ్ముగసుందరం ఆరోజు సాయంకాలం బస్సు దిగాడన్నది ప్రస్తుతాంశం. ఉత్తరంగా వెళ్ళే రోడ్డుపైన కమ్యూనిటీ హాలుదాకా వెళ్ళి అక్కడ పడమరకు తిరిగితే సన్నటిరోడ్డుకు ఎడమవైపు వున్న కట్టడంలోని రెండో అంతస్తులోని ఒక వాటాలో అతడి కాపురం. ఇంటి నెంబరు సి–123.

షణ్ముగసుందరం మెట్లెక్కాడు. ఎన్నడూ లేనిది మూసిన తలుపు బిగించిన తాళంతో వ్రేలాడుతూ ఉంది. "ఏమిట్రా ఇది. ఈ వేళప్పుడు ఈమె ఇంట్లో లేకుండా ఎక్కడికి పోయింది?" అనుకున్నాడు షణ్ముగసుందరం. ఎదురింట్లో వాళ్ళనడుగుదా మనుకుంటూనే కాళ్ళ క్రిందనున్న తివాచీ పైకి తీశాడు. తాళం చెవి కన్పించలేదు. మామూలుగా ఎక్కడికైనా వెళ్తున్నప్పుడు ఆమె తాళం చెవి తివాచీ క్రింద పెట్టి వెళ్ళడం మామూలే!

"ఈ వేళప్పుడు ఎక్కడికి వెళ్ళివుంటుందబ్బా?" అనుకుంటూ తన జేబులోని డూప్లికేటు తాళం చెవితో తలుపు తెరిచాడు. కథలో ఇక్కడిదాకా గీత గీస్తే ఇంతకు మునుపటిదంతా వెలుగనీ ఆపైన పరుచుకున్నదంతా చీకటనీ గుర్తించాలి.

లోపలి కెళ్ళిన షణ్ముగసుందరం రెండే రెండు నిముషాల్లో గావుకేకలు పెడుతూ బయటకు పారిపోయి వచ్చేశాడు.

ఏమిట్రా ఈ గగ్గోలు అన్నట్టుగా చుట్టుప్రక్కల కొన్ని ఇళ్ళలోని కిటికీలు తెరుచుకున్నాయి. కొందరు ధైర్యవంతులు గబగబా మెట్లెక్కి అపార్టుమెంటులోకి జొరబడ్డారు. క్రిందనే నిల్చుండి పోయిన వాళ్ళు "ఏమైంది ఏమైంది" అని పైకి వెళ్ళిన వాళ్ళని ప్రశ్నిస్తున్నారు. అంతా అయోమయం గందరగోళం!

వాస్తవం స్పష్టంగా అవగతం కావడానికి పదిపదిహేను నిముషాల కాలం పట్టింది. శివగామి వంటింట్లో అలమరాల నడుమ సన్నటి జాగాలో పొడవునా పడివుంది. అమ్మాయి బెడ్‌రూమ్‌లో మంచానికడ్డంగా పడివుంది. ముందువైపు హాల్లో కుర్రవాడు కుర్చీలోనే తల వాల్చేసి వున్నాడు. ముగ్గురి గొంతుకల చుట్టూ ఊపిరి తిరగకుండా ప్లాస్టిక్ తాడు లాంటి దానితో బిగించినట్టు కుశాగ్రబుద్ధులైన పరిశీలకులు పోల్చుకున్నారు. కాలనీ అన్నివైపుల నుంచీ కమ్యూనిటీ హాలు దిశగా జనసంచలనం ప్రారంభమైంది.

"ఏమండీ, 'షణ్ముగసుందరం' అంటున్నారు ఎలా వుంటాడతను? పొట్టిగా బొద్దుగా బట్టతలతో.." "అబ్బే అయివుండదండీ! బస్సులో కొందరు 'సుందరం, సుందరం' అని పిలుస్తుండగా చూశాను. అతను సన్నగానే ఉంటాడు. లేదంటే క్రమబద్ధంగా పెంచిన గుబురు గడ్డంతో ఎలుగుబంటిలా కనిపించినట్టు జ్ఞాపకం."

"పరవాలేదులెండి. మనిషి సజీవుడై వున్నాడు కదా! రేపో మాపో కనిపించక పోతాడా?" "ఏం సజీవుడో..! తగిలిన దెబ్బకింక కోలుకుంటాడా అనేదే అనుమానం. అయినా మానవ మాత్రుడికి రాదగిన కష్టమా?"

మరొకవైపు కాలనీ మహిళల ఆసక్తి ఇంకొక విధంగా కొనసాగుతోంది. "ఎవరో శివగామి అంటమ్మా! నాకైతే చూచిన జ్ఞాపకం లేదు. అరవావిడగదా! మిగిలిన వాళ్ళతో అంతగా కలిసేది కాదేమో .." "చొరవ రెండు పక్కల నుంచీ వుండాలి గదమ్మా రాజేశ్వరీ! మనమే ఆమెను ఆంతరంగికంగా దగ్గరకి చేరనివ్వలేదేమో..?"

"ఇంతకూ మనిషెవరో తెలియకపోయినా ఊహాగానాలెందుకు? నాకు తెలిసి ప్రతి శుక్రవారం ఉదయం తలంటిపోసుకొని వదులు జారుముడిలో పువ్వులు తురుముకొని విభూది పట్టెల పైన ఇంతేసి కుంకుమ బొట్టు పెట్టుకొని ఓ అరవావిడ వినాయకుడి గుడికొస్తుండేది. ఇదంతా మద్రాసు ఆడవాళ్ళ

సాంప్రదాయం. ఆ శివగామి కూడా మద్రాసే అంటున్నారు గదా.." ఇలా ఈ పరామర్శలన్నీ "బీటింగ్ అరౌండ్ ది బుష్"గా పరిణమించాయే గానీ అసలు మనుషులెవరో చాలామందికి స్ఫురించలేదు.

ఇంతకూ ఆ షణ్ముగసుందరమనే దైవోపహతుడితోను, శివగామి అనే అల్పాయుషును అదిగివచ్చిన ఆవిడ తోనూ ముఖపరిచయం కలిగిన వాళ్ళెందరు? పలకరించిన వాళ్ళెందరు? సన్నిహితంగా మిత్రత్వం కలిగిన వాళ్ళెందరు?

ఇంతకూ వాళ్ళు కొద్ది నెలల క్రితం వచ్చిన వాళ్ళేం గాదు. దాదాపుగా పదేళ్ళుగా వుంటున్న వాళ్ళ ఐడెంటిటీని గురించి కూడా కాలనీవాళ్ళు ఊహాగానాలు సల్పవలసి వచ్చిందంటే మానవతా సంబంధాలు మరమ్మత్తుకు వీలుబడనంతగా శైథిల్యం చెందినట్టు గాదా? "ఊరా అడివా" అంటుంటారు. మా కాలనీ వ్యవహారం చూస్తుంటే ఈ రెండింటికీ అట్టే తేడా వున్నట్టులేదు మరి!

ఎదురు చూడని దారుణసంఘటన ఏదైనా సరే అది జరిగిన తర్వాత కాసేపటి వరకు దాని తీవ్రత ఏపాటిదో తెలిసిరాదు. మనసు తాత్కాలికంగా మొద్దుబారిపోతుంది. మళ్ళీ దానిలో కదలిక రావాలంటే షాక్ ట్రీట్‌మెంట్ లాంటిది మరొకటి అవసరమవుతుంది. పరిపరి విధాలుగా నోటికొచ్చినట్టల్లా మాట్లాడుకుంటున్న జనం లోకి ఒక పోలీసు జీపు చొచ్చుకురావడం అలాంటి సన్నివేశమే!

ఆగిన జీపులోనుంచి లాఠీ లూపుకుంటూ అయిదారుగురు పోలీసులు దిగారు. సబ్ ఇన్స్‌పెక్టరు ముందు సీటులోంచి క్రిందికి దూకినంత పనిచేశాడు. పోలీసులు "తప్పుకోండి తప్పుకోండి .. అందరూ మీమీ ఇళ్ళకు వెళ్ళండి. వెళ్ళక పోయారో మా లాఠీలకు పని చెప్పవలసి వస్తుంద"ని హెచ్చరిస్తూ నేరస్థలాన్ని నిముషాల్లోనే నిర్మానుష్యం గావించారు.

ఇళ్ళకైతే వెళ్ళారుగానీ తలుపులు కిటికీలు బిగించుకున్నా జనానికి నిబ్బరం లేకపోయింది. లోకంలో ఎక్కడో ఉన్నారని భావించబడుతూ వచ్చిన హంతకులు ఇప్పుడు కాలనీలోనే వున్నారు. ఇప్పుడున్నా లేకపోయినా మధ్యాహ్నం పన్నెండూ ఒంటిగంటకు మధ్య ఇక్కడున్నారనడానికి మూడు నిర్జీవమైన శరీరాలు సాక్ష్యంగా వున్నాయి. ఈ స్పృహ కలగడంతో బయట ఏమాత్రం చిన్న అలికిడి అయినా గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. బిగ్గరగా మాట్లాడుకోడానికైనా నిబ్బరం లేకపోయింది. తలుపులకు తాళాలు బిగించి కాలనీ వాసులందరూ కమ్యూనిటీ హాల్లోకి వెళ్ళి అక్కడ

అల్లీబిల్లీగా పడుకోగలిగితే ఎంత బాగుండునోననిపించింది. భయం భయంగానే మరునాటి ఉదయం తెల్లవారింది.

"ఏవండీ! ఈ రోజు సెలవు పెట్టి ఇంటి దగ్గరే ఉండిపోగూడదూ?" ప్రతి ఇంట్లోని గృహిణి నోటి వెంట ఈ అభ్యర్థన వెలువడింది.

"పరవాలేదు. తలుపేసుకో. ఎవరైనా తలుపు తడితే గాజుకన్నులో నుంచి పరిశీలనగా చూసిగానీ తియ్యకు. పిల్లల్ని స్కూలుకు పంపొద్దు. ఎన్నో తతంగాలుంటాయి. వాళ్ళు జడుసుకోగలరు." గృహస్థులు మెలకువలు చెబుతూనే మెయిన్ రోడ్డు వైపు నడిచారు. అప్పటికి షణ్ముగసుందరం బంధువుల్లో ముఖ్యమైన వాళ్ళందరూ వచ్చి దిగేశారు. కమ్యూనిటీ హాలు ప్రాంతాలకు వెళ్తే అరవవాళ్ళ శోకాలు హృదయవిదారకంగా విన్పిస్తున్నాయి. అంతలో పోలీసులు కలగజేసుకొని కళేబరాలను పోస్టుమార్టంకి తీసుకెళ్ళిపోవడం కాలనీకంతా కొండంత రిలీఫయిపోయింది.

అయినా హంతకుల భయం పూర్తిగా వైదొలగలేదు. అది చిమ్మచీకటిలా, కారుమబ్బులా జనావాసం పైన క్రమ్ముకొనే వుంది. భయాందోళనలు పోగొట్టడానికి పోలీసులు తమ చేతనైన కృషి తాము చేస్తున్నారు. కాలనీలో ఓ పోలీసు ఔట్‌పోస్టు ఏర్పాటు చేశారు. పగటిపూట కూడా పోలీసులు కాలనీ వీధుల్లో గస్తీ తిరుగుతూ కనిపించిన ప్రతి వ్యక్తి పైన ప్రశ్నలు గుప్పిస్తున్నారు. మగవాళ్ళనడిగి లాభం లేదని వాళ్ళకు తెలిసిపోయింది. ఆ సమయంలో ఆఫీసు డ్యూటీలో వుండిపోవడం వాళ్ళ పాలిటికొక వరమై పోయింది. ఎటొచ్చీ స్త్రీలను, వృద్ధుల్ని ఇంటరాగేట్ చేయడమే ప్రస్తుతానికి పోలీసులకు అందుబాటు ఉన్న పరిశోధనాప్రక్రియ అయిపోయింది.

"ఏమ్మా! నీపేరేంఇటి?"
"నాపేరా సార్ ... నన్ను రూపకళ అంటారండీ!"
"ఇది మీఇల్లే కదూ?"
"అవునండీ!"
"సి-123 మీకెంత దూరంలో వుంది?"
"ఎంతో ఎక్కడిది సార్! మాపైనింటికి ఎదురువైపు ఇల్లేగదా!"

"మంచిదమ్మా! పోయిన బుధవారం పదో లేక పదకొండు గంటల ప్రాంతంలో నువ్వింట్లోనే వున్నావు గదా?"
"ఉన్నానండీ!"

"అప్పుడు నీకు ప్రాణాలు విలవిలలాడిపోయేటట్టుగా గావుకేక ఏదీ వినిపించలేదా?"
"అబ్బే .. లేదండీ!"
"చాలా ముఖ్యమైన విషయమమ్మా! కాస్త జ్ఞాపకం చేసుకొని మరీ చెప్పు తల్లీ ..?"
కాసేపు మౌనం, మనసులోనే ఏవో తర్జనభర్జనలు చేసుకుంటున్నట్టు నిల్చున్న రూపకళ నోటిలోంచి ఒక మాట (అదైనా ఎంత భాగ్యం!) బయటపడింది.
"తలుపులు వేసుకొని వున్నానండీ .. ఎవరో అరచినట్టే తోచింది. కోతి ఏదైనా ఇంట్లో దూరిందేమో అనుకున్నాను."
"మంచిదమ్మా! తలుపులు జాగ్రత్తగా వేసుకో తల్లీ.." అని ఆమెకు జాగ్రత్తలు చెప్పి వాళ్ళ ఎదురింటి తలుపు తట్టాడు పోలీసు ఇన్స్పెక్టర్.

"అమ్మా! నీపేరు?"
"ఇందుమతి సార్!"
"సి-123 మీకెంత దూరంలో వుంది?"
"ఎంతో దూరం ఎక్కడిది సార్ మాపై ఇల్లే కదా!"
"ఓహో పైదే కదూ .. చూడండి ఇందుమతి గారూ పోయిన బుధవారం పదీ పదకొండు గంటల ప్రాంతంలో మీరు ఇంట్లోనే ఉన్నారు కదా?"
"ఉన్నానండీ!"
"ఆ సమయంలో మీపై ఇంట్లోంచి ప్రాణాలు పోయేట్టుగా అరచిన గావుకేక ఏదీ నీకు విన్పించ లేదామ్మా?"
"అస్సలు విన్పించలేదండీ!"
"కొంచం ఆలోచించి చెప్పు తల్లీ!"
కాసేపు మౌన వ్రతం పాటించాక ఆమె నోటినుంచి ఒకమాట బయటపడింది. "ఆరోజు కాస్త ఎక్కువ టిఫిను తినడంతో ఆసమయంలో మంచి నిద్రలో ఉన్నానండీ .."
"మంచిదమ్మా! తలుపులు జాగ్రత్తగా వేసుకొని నిద్రపో తల్లీ .." అని ఇన్స్పెక్టర్ అనడమే తరువాయి రిమోట్ కంట్రోల్ స్విచ్ నొక్కినట్టుగా తలుపులు మూసుకుపోయాయి.

"ఏమండీ మీపేరు?"
"తణిగాచలం!"
"వయసు?"
"అరువది"

"ఏం జేస్తుంటారు?"
"నేనేం జేద్దునండీ .. మావాడుదా ఇక్కడ ఎంప్లాయీ"
"మీరేంజేస్తుంటారు?"
"ఏంజెయ్యను సార్! ఏదో టిఫిను, హిందూ పేపరు, మధ్యాహ్నం భోజనం, నిద్ర.."
"సరే సరే.. పోయిన బుధవారం ఉదయం పదికీ పదకొండుకీ మధ్య సి-123 నుంచి ఏదైనా చావుకేక విన్పించిందా?"

"విన్పించలేదని చెప్పేదానికి ఎట్లా మాళును సార్? మాది ఎదురిల్లే గదా .. పైగా అది నాను పేపరు సదివే టైం - మా ఫ్లాట్ ముందర కుర్సీ వేసుకొని పేపరు సదువుతా వుంటిని. పదకొండు గాక ముందే అనుకుంటా .. ఆ ఇంట్లో నించి ఎవురో ఆడమనిసి అరిసినట్టుదా అనిపించింది. ఆ యింటమ్మ బాత్ రూంలో గాన కాలుజారి పడిందేమో అనుకుంటిని."

ఒకవైపు ఇలా పరిశోధన కొనసాగిస్తూ ఇంకొకవైపున కాలనీలో నివశిస్తున్న వారి భయాందోళనలు పోగొట్టడానికి ప్రయత్నిస్తున్నారు పోలీసులు. పగటిపూట కూడ సాయుధ పోలీసుల గస్తీ కొనసాగుతోంది. కాలనీ ఆవరణలో ఏ అనుమానితుడు కనిపించినా పోలీసు గుప్పిట్లోంచి బయటపడేసరికి వాడికి తాత ముత్తాతలు కనిపిస్తున్నారు.

"మీరెవరు?"
"ఎక్కడికెళ్ళి వస్తున్నారు?"
"ఏ పని మీద వెళ్ళారు?"
"మీ అడ్రసేమిటి?"
"మీ ఇంటి నెంబరెంత?"
అన్న ప్రశ్నల్ని అక్కడ ఏండ్లుగా పూండ్లుగా నివశిస్తున్నవాళ్ళు కూడా ఎదుర్కోక తప్పడం లేదు. పాలు, పళ్ళు, కూరగాయలు అమ్ముకోవడానికి వచ్చిన వాళ్ళు గూడా "ఇదేం గొడవరా బాబూ! ఈ పోలీసులతో తంటా మనకెందుకు?" అనుకుంటూ మెయిన్ గేటు దగ్గర నుంచే తిరిగి వెళ్ళిపోతున్నారు.

"దాదాపు రెండు వారాలు గడిచినా నేరస్తుల్ని పట్టుకోలేక పోతున్నారంటే వీళ్ళేం పోలీసులండే?" సంశయాత్ములు చెవులు కొరుక్కోసాగారు.

ఇంతలో ఒక ఘోరవార్త గాలిలో కలిసి ఇంటింటికీ ప్రాకి వచ్చింది. "తల్లినీ, బిడ్డల్నీ గుట్టు చప్పుడు గాకుండా మట్టుబెట్టే అవకాశం వుంటేగింటే ఒక్కడికే వుంటుందండీ!"

"ఎవరికి?"

"ఇంకెవరికండీ? - ఆమె భర్తకే!"

"కారణం ..?"

కారణం పైన ఊహాగానాలు సాగిపోతున్నాయి.

అయితే ఈ ఊహాగానాలన్నింటినీ వమ్ము చేస్తూ నెలరోజుల నాటికి దినపత్రికల్లో కాలనీ హత్యలకు సంబంధించిన హంతకుణ్ణి గురించిన ప్రముఖవార్తలు వెలువడ్డాయి.

"మూడు ఘోరమైన హత్యలు చేసింది ఒక్కడే!"

"కిరాతక హంతకుడు పట్టుబడిన వైనం!"

"పోలీసుల దగ్గర నేరం ఒప్పుకున్న హంతకుడు!"

వాడి పేరేమిటో అనవసరం. అత్యవసరంగా వాడికి కొంత పెద్ద మొత్తం లోనే డబ్బు కావలసి వచ్చింది. కాలనీలో తొమ్మిదింటి పైన మగవాళ్ళుండరనీ, ఆడవాళ్ళని బెదిరించి నగలు లాక్కోవడం సులభమనీ లెక్కగట్టాడు. ఓ ఇల్లాలు కిరాణాకొట్టుకు వచ్చి తిరిగి వెళ్తోంది. ముద్దాయి (?) గమనించాడు. ఆమెను తాను వెంబడిస్తున్నట్లు అనుమానం రాకుండా జాగ్రత్త పడుతూ దూరం నుంచే ఆమెను వెంబడించి ఆమె ఇంట్లో కెళ్ళిన తరువాత తలుపు తట్టి రేషన్ కార్డులు పంపిణీ చేసే రెవెన్యూ బంట్రోతునని చెప్పుకున్నాడు. ఆమె లోపలికొచ్చి కూర్చోమంది.

"నీళ్ళు కాస్త ఇప్పిస్తారా?" అని అడిగాడు.

మంచి నీళ్ళు తేవడం కోసం ఆమె వంటగదిలోకి వెళ్ళగానే వీడు తటాలున ఆమెపైకి దూకి మెడలోని నగలు తెంచుకోబోయాడు. ఆమె బిగ్గరగా కేకపెట్టేసరికి జేబులోంచి నైలాను దారం తీసి దాంతో ఆమె గొంతు బిగించేశాడు. నగలు చేతికి చిక్కించుకోగానే బయటికొచ్చేసి తన దారిన వెళ్ళిపోయి వుండేవాడే .. తలుపు కాస్త తీసి చూసే సరికి ఎదురింటి ముసలాయన గుమ్మం ముందర కుర్చీ వేసుకొని పేపరు చదువుకుంటున్నాడు. ఆయన లేచి లోపలికి వెళ్ళే దాకా అతడు లోపల వుండక తప్పదు. శవంతో పాటుగా ఇంట్లో ఒంటరిగా ఉండడంతో వాడి మనసు పరిపరి విధాలుగా పోతోంది. ఇంతలో పన్నెండు కాగానే బడినుంచి పిల్లలొచ్చేశారు. వాళ్ళు తలుపు తడుతుంటే తీయకపోవడం ఎలా? అనుమానం రాదా? తలుపు తీసి వాళ్ళను లోపలకు రానిచ్చాడు.

అపరిచితుడ్ని చూసి పిల్లలు కంగారు పడిపోయారు. "అమ్మా! అమ్మా!!" అని ఎలుగెత్తి అరవబోయారు. హంతకుడికి మళ్ళీ నైలాన్ తాడుతో అవసరం తప్పలేదు. చంపాలనుకోలేదు. వాళ్ళ నోళ్ళు మూయించాలనుకున్నాడు. కానీ వాళ్ళే తొందరపడి పోయారు.

"అమ్మో! చూశారా? ఎలా జరిగిందో?! అబ్బబ్బ .. ఆ గుండెలు తీసిన బంటు ఎలా ఉంటాడో ఒకసారి చూస్తే బాగుండును కదండీ ..!"

కాలనీవాసుల సంకల్పబలం చాలా గొప్పది.

మరునాటి సాయంకాలం ఏడుగంటలప్పుడు ఎవరైనా పోల్చుకుంటారేమోనన్న ఉద్దేశంతో చేతులకు బేడీలు బిగించి వున్న ముద్దాయి (?) ని ఏడుగురు పోలీసుల రక్షణలో తీసుకొని కాలనీ వీధులన్నింటా త్రిప్పించాడు ఇన్స్పెక్టరు.

"అరరె .. ఇతడేనా! భుజాన ఓ సంచీ తగిలించుకొని కాలనీలో తిరుగుతూ ఒకటి రెండు సార్లు కనిపించాడండీ..!"

"సి-123 లో దారుణం జరిగిన మరునాడు కూడా చూసిన జ్ఞాపకం!" "అయినా మీసాలైనా సరిగ్గా రానివాడు ఇంతటి దుర్మార్గానికి ఒడిగట్ట గలడని ఎలా అనుకుంటాం సార్...?"

"అయ్యా! మీరు అనుకోవడానికి వీలున్నా ఏమీ అనుకోరు. చూడ్డానికి వీలున్నా చూడరు. స్పష్టంగా విన్పించినా వినిపించుకోరు. ఏమండీ సార్! అడుగుతున్నది మిమ్మల్నే! చెప్పండి .. ఇక్కడ జరిగిన ఘోర హత్యలకు ప్రత్యక్షంగా బాధ్యత వీడేనని నేను ఒప్పుకొంటున్నాను. మరైతే పరోక్షంగా బాధ్యత వహించాల్సిన వారి పరిస్థితి ఏమిటి?" నిక్కచ్చిగా ఓ ప్రశ్నను సంధించి జవాబు కోసం నిరీక్షిస్తూ ఉండిపోయాడు ఇన్స్పెక్టర్.

కాలనీ వాసులకు మతిపోయినంత పనైంది. వాళ్ళొకరి మొహం ఒకరు చూసుకున్నారు. ఇన్స్పెక్టర్ ఆరోపణ ఏమిటో అర్థం అయినా ఏం జవాబు చెప్పాలో తోచక నీళ్ళు నమలసాగారు.

"అయ్యా! మీరేమీ చెప్పరని నాకు తెలుసు. నేనే చెబుతున్నాను వినండి. హత్యలు జరిగిన ఇంట్లో నుంచి ఒక ఆడమనిషి చేత ఆర్తనాదం చేయించి ఆ తరువాత మేము వాకబు చేసి చూశాము. దాదాపు పది పన్నెండు ఇళ్ళ వాళ్ళకు ఆ కేక స్పష్టంగా వినిపించినట్టు తెలిసింది. అలా విన్న వాళ్ళలో కనీసం

ఒక్కరైనా తోటిమనిషి పట్ల కొంచం అక్కర, శ్రద్ధ చూపివుంటే మొదటి హత్య జరగగానే నేరస్తుడు దొరికిపోయి వుండేవాడు. కనీసం పిల్లలైనా బ్రతికి బయటపడి వుండేవారు.

ఆ ఇల్లాలును చంపిన వాడు వీడే! సరే అందుకు అభిప్రాయభేదం లేదు. కానీ పిల్లల హత్యలకు బాధ్యత వహించవలసిన వాళ్ళు ఇక్కడ ఇంచుమించు ఇరవైమందైనా ఉన్నట్టు మా విచారణలో మేము తేల్చుకున్నాము. వాళ్ళ కెవరు శిక్ష విధిస్తారు?"

నాటికీ నేటికీ ఆ ప్రశ్న మా కాలనీలోనూ అంతకన్నా ఎక్కువగా నాలోనూ ధ్వనిస్తూనే వుంటుంది. షణ్ముగసుందరం ఇంటికి సరిగ్గా వెనకవైపు ఇల్లు మాది. ఆరోజు నాకు మధ్యాహ్నం డ్యూటీ అవడంతో కాస్తంత తొందరగా భోజనాని కుపక్రమిస్తున్న వేళ లీలగా విన్పించిన కేక కలవరపెట్టినా ఎక్కడో గొడవలే అనుకొని తాపీగా భోజనం చేసి డ్యూటీకి వెళ్ళిపోయిన సందర్భం నన్ను వెంటాడుతూనే వుంటుంది. పోలీసు విచారణలో నిర్ధారించుకున్న చట్టాతీత బాధ్యతాయుతమైన ఇరవైమంది నేరస్థుల్లో నేనూ ఒకడినన్న విషయాన్ని మాత్రం ఎన్నటికీ మరువను.



# 3

వేమూరి వేంకటేశ్వరరావు

తెలుగులో మూడుకి సంబంధించిన మాటలు మూడొంతుల ముప్పాతిక వరకు సంస్కృతం నుండి దిగుమతి అయినవే అని అనిపిస్తుంది. తెలుగులో లేకపోలేదు, కాని వాటి వాడకం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లడం లేదు, అంతే. ఆరు మూడైనా, మూడు ఆరైనా, "మూడు" లేకపోతే ఇటువంటి రాతలు చదవ బుద్ధి కాదు కనుక మూడు నిమిషాల పాటు అ మూడేదో తెచ్చుకుని ఈ తరువాయి చదవండి.

ముప్పావలా అంటే మూడు పావులాలు. ముప్వన్నె అంటే మూడు రంగులు. ముప్వురు అంటే ముగ్గురు. ముప్వంద అంటే మూడు వందలు ట. ఇక్కడ ఏదో సంధి సూత్రం పని చేస్తూ ఉండి ఉండాలి కాని లేకపోతే .... కాస్తా .... ఎలాగవుతుంది?

ముప్పేటలో మూడు పేటలుంటే ఉన్నాయేమో కాని ముప్పేటకాయ అంటే మూడు పాళ్ళు ముదిరి ఇంకా ఒక పాలు లేతగా ఉన్న కొబ్బరి కాయ. ముక్కంటి అంటే మూడు కన్నులు కలవాడు - శివుడు; కలది - కొబ్బరికాయ.

విశాఖపట్నం జిల్లాలో ముచ్చిలక అనే మాటని ముప్పాతిక అనే అర్థంలో వాడడం నేను చూసేను. కాని నిఘంటువులో ముచ్చిలక అంటే భూస్వామి, కౌలుదారుల మధ్య ఖరారునామా అనే అర్థం ఒక్కటే ఉంది. ఇదే నిజమైన పక్షంలో ముచ్చిలకకీ, మూడుకీ మధ్యనున్న బాదరాయణ సంబంధమేమిటో?

ముమ్మారు అన్నా ముమ్మిడి అన్నా మూడు సార్లు అని అర్థం కదా, మరి ముమ్మిడివరం అంటే మూడు సార్లు వరం అని అర్థమా? దేవుడి దగ్గర మూడు వరాలు పుచ్చుకుందికేనేమో ముమ్మిడివరంలో బాలయోగి వెలిసేడు.

ముప్పది అంటే మూడు పదులు, వెరసి ముప్ఫయ్. ఇలాగే ముయ్యేడు అంటే మూడు ఏళ్ళు వెరసి ఇరవై ఒకటి. మున్నూరు 300 అయినట్లే మూడు మూళ్ళు తొమ్మిది కాస్తా ముమ్మూడు అవుతుందన్నది ముమ్మాటికీ నిజం.

మనిషిని పోలిన మనిషి కనిపిస్తే "ముమ్మూర్తులా మీలాగే ఉన్నాడండీ" అంటాం.

మార్గశిర శుద్ధ ఏకాదశి నాడు తిరుపతిలో స్వామి పుష్కరిణిలో మూడుకోట్ల తీర్థములు వస్తున్నవనే ఐతిహ్యం కారణంగా ఆ రోజుని ముక్కోటి ఏకాదశి అంటారు.

ఈ పైన చెప్పిన ఉదాహరణలన్నిటినీ వ్యాకరణంలో ఒక్క సూత్రంతో టూకీగా చెప్పెయ్యొచ్చు. "సమవాధికరణంబగు ఉత్తర పదంబు పరంబగునప్పుడు మూడు శబ్దమున డువర్ణంబునకు లోపంబును, మీది హల్లునకు ద్విత్వంబును అగు". కనుక మూడు + లోకములు = ముల్లోకములు. ఇదే విధంగా ముప్పాతిక, ముప్పిధం, ముక్కాలి పీట, ముత్తాత, ముజ్జగము, మొదలగునవి.

వ్యాకరణంలో ముఖ్యమైన సంధి త్రిక సంధి. ఈ సందర్భంలో అ, ఇ, ఎ అనే అక్షరాలని త్రికం అంటారు.

ముయ్యంచు అంటే త్రిభుజం అని ఎంతమందికి తెలుసు? ఈ త్రిభుజాన్ని త్రికోణి అని కూడ అంటారు.

"త్రి"తో మొదలయే సంస్కృతం మాటలు తెలుగులో కొల్లలు. త్రిమూర్తులు, త్రిలోకములు మనకు తెలిసున్నవే. ఆయుర్వేదంలో సొంఠి, పిప్పలి, మిరియాలని త్రికటుకాలనిన్నీ; కరక, తాడి, ఉసిరికలని త్రిఫలాలనిన్నీ; వాత, పిత్త, శ్లేష్మాలని త్రిదోషాలనిన్నీ అంటారు. వ్యాకరణంలో మాత్రం త్రిదోషాలంటే పద, వాక్య, అర్థ దోషాలు.

"ట్రిగొనామెట్రి" అన్న మాటని త్రి, గుణ, మాత్ర అని మూడు మాటలుగా విడగొట్టి "మూడు గుణాలని (సైను, కొసైను, టేంజెంటు) కొలిచే శాస్త్రం" అని అన్వయం చెప్పొచ్చు.

త్రిశూలం త్రినేత్రుడి ఆయుధాలలో ఒకటి. త్రిదండం అనేది మనోదండం, వాగ్దండం, కర్మదండం అనబడే మూడు వెదురు బద్దలతో కట్టిన దండం. శైవులు నుదుటి మీద అడ్డుగా పెట్టుకునే విభూతి పెండికట్లని త్రిపుండ్రం అంటే వైష్ణవులు నిలువుగా పెట్టుకునే బొట్టుని ఊర్థ్వపుండ్రం అంటారు.

బ్రహ్మపదార్థము సగుణబ్రహ్మము, నిర్గుణబ్రహ్మము అని రెండు రకాలే అయినా సగుణబ్రహ్మము మాత్రం త్రికాలాలలోనూ త్రిగుణాత్మకం (సత్వ, రజో, తమో గుణాలు) అని త్రిమతాచార్యులైన శంకర, రామానుజ, మధ్వాచార్యులు ఏకీభవించేరు. మనస్సులో అనుకున్నది ఒకటి, నోటితో చెప్పేది మరొకటి, చేత్తో చేసేది ఇంకొకటి అయితే ఆ పనిలో త్రికరణశుద్ధి లేదు.

"త్రి" అన్న అక్షరం మాటకి మొదట వచ్చినట్లే మూడుని సూచించడానికి "త్రయం" అన్న తోక సర్వసాధారణంగా మాటకి చివర వస్తుంది - త్రిమూర్తులలో ఒకడైన శివుడిని "త్రయంబకుడు" అన్నప్పుడు తప్ప. భారతాన్ని తెలిగించిన నన్నయ, తిక్కన, ఎర్రనలు కవిత్రయం. అవస్థా త్రయంలో ఒంటి మీద తెలివి ఉన్న పరిస్థితిని జాగ్రదావస్థ అనిన్నీ, తెలివి తప్పిన తర్వాత నిద్రావస్థ అనిన్నీ, కలలు కనే సమయాన్ని స్వప్నావస్థ అనిన్నీ లేదా సుషుప్తావస్థ అనిన్నీ అంటారు. ఈ సుషుప్తావస్థ గురించి మనకి అనాది నుండి తెలుసుకానీ, ఈ దృగ్విషయం ("ఫినామినన్") పాశ్చాత్యులకి ఈ మధ్యనే అవగాహన అయింది. దీనినే వీళ్ళు "రెం స్లీప్" అంటారు.

సులభంగా అర్థం అయే కవిత్వం ద్రాక్షాపాకం, కొంచెం కష్టపడితే కాని అర్థం కాకపోతే అది కదళీపాకం, బొత్తిగా కొరుకుడు పడనిది నారికేళపాకం. ఈ మూడింటిని గుమ్మగుచ్చి పాకత్రయం అంటారు. ఇలాగే ఈషణత్రయం అని ఒకటుంది. నారేషణ అంటే ఆడదాని యందు ఆశ. పుత్రేషణ అంటే కొడుకు పుట్టాలనే కోరిక, ధనేషణ అంటే డబ్బు కోసం తాపత్రయం. "తాపత్రయం" అన్న మాటకి అసలు అర్థం ఆధ్యాత్మికం, ఆధిభౌతికం, ఆధిదైవికం అయినప్పటికీ ఆ విషయాన్ని విస్మరించి మనకి తోచిన విధంగా వాడేయడానికి ఊరికే తాపత్రయ పడిపోతూ ఉంటాం.

మంత్రత్రయం (అష్టాక్షరి, ద్వయం, చరమశ్లోకం) లోని త్రయం గురించి గతంలో ఒకసారి ముచ్చటించేను. ఇక, "ఓం నమో నారాయణాయ" అన్నది అష్టాక్షరి. చరమశ్లోకం గురించి ఆఖర్న చెబుతాను.

కాళహస్తి, ద్రాక్షారామం, శ్రీశైలం ఉన్న త్రిలింగ దేశమే తెలుగు దేశం అని అంటారు కానీ రాజమండ్రి దగ్గర ఉన్న కోటిలింగాలని లెక్కపెట్టడం మరిచిపోయారా, ఏమిటి?

"త్రయం"కి ఇంగ్లీషులో సమానార్థకం "ట్రిపుల్" లేదా "ట్రయొ".

ఇంగ్లీషులోని "ట్రై", "ట్రి"లు తెలుగులోని "త్రి" జ్ఞాతులు కనుక "ట్రై ఏంగిల్" అన్న మాటకి సరి అయిన తెలుగు "త్రికోణం".

ఇదే బాణీలో ముయ్యాకు అంటే మూడాకుల దళం అని అర్థం. ఈ మూడాకుల దళాన్నే ఇంగ్లీషులో "ట్రైఫోలియేట్" అంటారు. "ట్రైడెంట్" అంటే "మూడు దంతాలు ఉన్నది" అనే అర్థం స్ఫురించినా ఇంగ్లీషులోనూ తెలుగులోనూ ఇది మూడు పళ్ళు ఉన్న త్రిశూలం.

"ట్రైక్లోరో మెథేన్" అన్న రసాయన నామాన్ని త్రిహరిత పాడేను అని నేను తెలిగించేను. దీని వ్యుత్పత్తి కావలసిన వారు నేను రాసిన "రసగంధాయరసాయనం" పుస్తకం చదవండి.

త్రిశంకు స్వర్గం, త్రిశంకు చక్కెర మొదలైన మాటలలోని "త్రి" కీ, మూడుకీ ఏమీ సంబంధం లేదని మనవి చేసుకుంటున్నాను. ఇంతకీ త్రిశంకు చక్కెర ఏమిటా అని ఆరాట పడకండి. అది "ఇన్వర్ట్ సుగర్" అన్న మాటకి నా తెలుగుసేత. దీని వృత్తాంతం కూడ "రసగంధాయరసాయనం" లో ఉంది.

కేమ్బ్రిడ్జి విశ్వవిద్యాలయంలో జరిగే పరీక్షలలో పరీక్షని పర్యవేక్షించే వ్యక్తి ("వాచరు") ముక్కాలిపీట మీద కూర్చునేవాడుట. అందుకనే ఈ పరీక్షలని "ట్రైపోస్" అనేవారు.

పాశ్చాత్యుల ప్రస్తావన ఎలాగూ వచ్చింది కనుక ఒక చిన్న పిట్టకథ చెబుతాను. రాజకీయాలలో మనం మన దేశాన్ని కుల వర్గాలుగా విడగొట్టినట్లే పూర్వం రోం సామ్రాజ్యాన్ని రోమను, సెబీను, ఆల్బను అని మూడు కుల వర్గాలుగా విడగొట్టేరు. లేటిన్ లో "ట్రైబస్" అంటే మూడో వంతు కనుక ఈ కుల వర్గాలని వారు "ట్రైబ్" అన్నారు. రాజాస్థానానికి వచ్చే రాబడిలో మూడో వంతు ప్రతి "ట్రైబ్" నుండి వస్తోంది కనుక ఆయా కుల వర్గాలు కట్టే పన్నుని "ట్రిబ్యూట్" అన్నారు. "కంట్రిబ్యూషన్" అన్న మాట ఇందులోంచి వచ్చినదే. ఉపనదిని "ట్రిబ్యూటరీ" అనడానికి కూడ కారణం ఇదే – నదిలోని నీటిని "కంట్రిబ్యూట్" చేస్తున్నాది కనుక!

రెండు పేటల దారంతో నేసిన బట్టని "ట్విల్" అన్నట్లే, మూడు పేటల దారంతో నేసిన బట్ట "డ్రిల్" బట్ట. ముప్పిరి అంటే మూడు పేటలు కనుక "డ్రిల్లు" బట్టని ముప్పిరి బట్ట అనొచ్చు.

"త్రిమితీయ" అన్న ప్రత్యయాన్ని "త్రీ డిమెన్షనల్" అన్న అర్థంలో వాడుతున్నారు కొందరు. ఈ లెక్కని ఈ "ఫోర్ డిమెన్షనల్" ప్రపంచాన్ని "చతుర్మితియం" అనొచ్చు. కాని "ఫోర్ డిమెన్షనల్" అన్న మాటకి "తురీయ మితీయం" అనే మాట మరొకటి ఉంది.

ఒక సంఖ్యని 3 చేత భాగించగలమా లేమా అని సంశయం వస్తే ఆ సంఖ్యలోని అంకెలని అన్నింటిని కలిపి ఆ మొత్తాన్ని మూడు చేత భాగించి చూడండి. ఈ మొత్తాన్ని 3 చేత భాగించ గలిగితే ఆ సంఖ్యని భాగించగలం. ఉదాహరణకి 531 లోని అంకెల మొత్తం $5 + 3 + 1 = 9$. ఈ 9 ని 3 చేత భాగించగలం కనుక 531 ని భాగించగలం.

వృత్తలేఖిని, కొలబద్ద సహాయంతో ఒక గీతని కాని, కోణాన్ని కాని సమద్విఖండన చేయవచ్చని రేఖాగణితంలో దిట్టలయిన గ్రీకులు ఎప్పుడో కనుక్కున్నారు కానీ ఒక కోణాన్ని "ట్రైసెక్ట్"

(సమత్రిఖండన) చెయ్యడం ఎలాగో వాళ్ళకి తెలియలేదు. ఈ పని చెయ్యడం అసంభవం అన్న విషయం మనకి ఇప్పటి కాలంలోనే అర్థం అయింది!

భూగర్భశాస్త్రంలో "మూడవ, తృతీయ" అన్న అర్థం రావలసినప్పుడల్లా "టెర్షియరీ, ట్రయాసిక్" అనే పూర్వప్రత్యయాలు వాడతారు.

"ట" మాషా ఏమిటంటే ఇంగ్లీషులో ట కార త కారాలకి ఒకే ఒక అక్షరం ఉన్నా భాష ఉచ్చారణలో ట కార త కారాలతో మొదలయే "మూడు" మాటలు చాల ఉన్నాయి. కాని తెలుగులో ట కార త కారాలకి విడివిడి అక్షరాలు ఉన్నా ట కారంతో మూడు మాటలు తెలుగులో లేవు.

రెండు రోడ్ల కూడలిని కూడలి కిందే లెక్కించరు, ఎందుకంటే రోడ్డు మీద ఎక్కడ నిలబడ్డా, ముందున్న రోడ్డు, వెనకున్న రోడ్డు కలిపి రెండు రోడ్ల కింద లెక్క లోకి వస్తుంది కనుక. మూడు రోడ్ల కూడలిని లేటిన్ లో "ట్రివియం" అంటారు. ఈ రకం కూడలిలో కూర్చుని ప్రజలు పనికిమాలిన కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేసేవారుట. మనదేశంలో ఇప్పటికీ ఇలా కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేసేవారు కనిపిస్తూనే ఉంటారు. ఇటువంటి "ట్రివియల్" కబుర్లు చెప్పి మీ కాలం వృథా చెయ్యడం నాకు ఇష్టం లేదు కనుక, ప్రస్తుతానికి ఈ బాతాకానీ ఆపుతాను.



# ఈ శతాబ్దపు రచనా శతం

(సంపాదకులు – వెల్చేరు నారాయణరావు)

ఒక విన్నపం.

శ్రీ వెల్చేరు నారాయణరావు గారి ఆధ్వర్యంలో కొందరు సాహితీప్రియులు తయారుచేసిన పట్టిక ఇది. తానా వారి 12వ "తెలుగు పలుకు"లో ప్రచురించబడుతోంది.

ఈ బృహత్కార్యాన్ని ప్రారంభించిన శ్రీ జంపాల చౌదరి గారి వివరణ ఇక్కడ ఇస్తున్నాం –

"ఇరవయ్యో శతాబ్దికి వీడ్కోలు చెపుతూ, కొత్త సహస్రాబ్దికి స్వాగతం చెపుతూ వున్న ఈ సంధి సమయంలో, గడిచిపోతున్న ఈ శతాబ్దంలోని గణించదగ్గ శతాలను ఎన్నటం పరిపాటయ్యింది. అలాగే, ఈ శతాబ్దిలో తెలుగులో వచ్చిన పుస్తకాలలో ప్రతి తెలుగువాడు చదువవలసిన 100 పుస్తకాల జాబితా తయారు చేయడానికి, యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్ లో కృష్ణదేవరాయ ఆచార్య పదవిలో ఉన్న ప్రసిద్ధ తెలుగు విమర్శకుడు, రచయిత శ్రీ వెల్చేరు నారాయణ రావు సారథ్యంలో కొందరు సాహితీ ప్రియులు ఈ క్రింది 100 పుస్తకాలను ఎంపిక చేశారు. ఈ జాబితాలో అనువాదాలు, అనుకరణలూ, అనుసరణాలూ, భాష్యాలూ, వ్యాఖ్యానాలూ, శాస్త్రీయ, వైజ్ఞానిక పుస్తకాలూ చేర్చబడలేదు. పుస్తకాల ఎన్నికలో వాడిన కొలబద్దలలో ముఖ్యమైనవి – తెలుగు సాహిత్యంపై, తెలుగు జీవితంపై ఆ రచనలకున్న ప్రభావం, ఈ శతాబ్దిలో తెలుగుదేశపు జీవన విధానం, చారిత్రక భౌగోళిక పరిస్థితుల గురించి సాధికారకమైన చిత్రణ, సాహిత్య చరిత్రలో ఆయా పుస్తకాలకూ, రచయితలకూ ఉన్న స్థానం, మొదలయినవి. లోకో భిన్న రుచిః! ఈ జాబితా మీకు సమగ్రంగా తోచకపోవచ్చు, అసంపూర్ణంగా అనిపించవచ్చు; మీ గొప్ప 100 పుస్తకాల జాబితా వేరే పుస్తకాలతో నిండి ఉండవచ్చు. ఈ జాబితా వెనుక ఏ రకమైన అధికారిక గుర్తింపు లేదు. ఇది కొంతమంది సాహిత్యాభిమానుల సమిష్టి ఎన్నిక. కొందరు పాఠకులతో ఈ పుస్తకాలను మొదటిసారో, మరోసారో చదివించటమే ఈ ఎన్నిక ఉద్దేశం.

---

గమనికలు.

1) కథారచయితల మంచి కథలు ఎక్కువ సంకలనాలలో వెలువడినప్పుడు, ఏ సంకలనాన్నీ ప్రత్యేకంగా పేర్కొనకుండా 'వివిధ కథలు'గా పేర్కొనడం జరిగింది.

2) వెల్చేరు నారాయణరావు 'తెలుగులో కవితావిప్లవాల స్వరూపం' ఈ జాబితాకోసం పరిగణింపబడలేదు. "

– జంపాల చౌదరి

వారి పట్టిక వంద రచనల్ని రచయితల పేర్ల అకారాదిగా వరసగా ఇచ్చింది. ప్రతి రచనకు ముందు మీరు చూసే అంకె వారి పట్టికలో ఆ రచన స్థానాన్ని తెలిపేది. ఐతే మేము (అంటే "ఈ మాట" సంపాదకులు) ఆ రచనల్ని వివిధ శీర్షికల కింద విభజించటానికి, అలాగే ప్రతి రచనకు అది వెలువడిన దశకాన్ని సూచించటానికి ప్రయత్నం చేశాము. మేము అన్ని రచనల్ని చదవని కారణంగా విభజనలో కొన్ని పొరపాట్లు జరిగే అవకాశం ఉంది. అలాగే ఒక రచన ఎప్పుడు వెలువడింది అనేది చెప్పటం చాలా క్లిష్టమైన వ్యవహారం – పాత పుస్తకాలను మళ్ళీ ప్రచురించేవారు వారు ఎప్పుడు తొలిసారిగా ప్రచురించారో చెప్తారే తప్ప ఆ పుస్తకం మొదటిసారి ఎప్పుడు ప్రచురించారనేది చెప్పరు. దీనికి తోడు కొన్ని పుస్తకాలు ఇప్పుడు దొరకటం కూడ లేదు. అందువల్ల దశకాల సూచన కేవలం సూచన గానే భావించవలసి ఉంటుంది. వాటిలో కొన్ని తప్పులున్నాయని మాకు తెలుసును. ఐనా ఈ సమాచారం ఎవరికైనా కొంతవరకైనా ఉపయోగపడుతుందేమో అనే భావంతో ఈ సాహసానికి ఒడిగడుతున్నాం.

ఈ పట్టికలోని సమాచారంలో ఉన్న పొరపాట్లన్నిటికీ బాధ్యత మాదే. శ్రీ వెల్చేరు గారు కాని ఈ పట్టిక తయారు చేసిన మిగిలిన వారు కాని ఇక్కడ మేము చూపిస్తున్న విభజన, దశక సూచనలకు బాధ్యులు కారు.

ఈ పట్టికను విశ్లేషిస్తే ఎన్నో కుతూహలం కలిగించే విషయాలు బయటపడతాయి. ఉదాహరణకు, కవిత్వ ప్రక్రియ 60లు, 70లు, కొంతవరకు 80లలో కూడ గుణాత్మకంగా చప్పబడి ఉండి 90లలో మళ్ళీ విజృంభించినట్లు కనిపిస్తుంది. అలాగే నవలా ప్రక్రియ ప్రస్తుతం కొంత క్షీణ దశలో ఉన్నట్లు కనిపిస్తుంది. ఇక నాటకాల గురించి చెప్పక్కర్లేదు – గత రెండు మూడు దశాబ్దాలలో మంచి నాటకాలే కనపడవు. ఆత్మకథలు అడుగంటినట్లున్నాయి (ఆదర్శవంతమైన జీవితాలున్న వారు ఈ మధ్య కాలంలో లేరా?).

ఈ పట్టిక పాఠకులను తెలుగులోని మంచి రచనలు చదవటానికి ప్రోత్సహిస్తుందని, రచనా సామర్థ్యం ఉన్న వారు అణగారిపోతున్న శాఖల, అంశాల పునరుద్ధరణకు నడుం కట్టడానికి దోహదం చేస్తుందని మా ఆకాంక్ష.

కవిత్వం (35)

| # | Author/Editor | Title | Decade First Published |
|---|---|---|---|
| 1. | 4. అజంతా | స్వప్నలిపి | (1990) |
| 2. | 6. ఆలూరి బైరాగి | ఆగమ గీతి | (1960) |
| 3. | 7. ఆరుద్ర | ఇంటింటి పజ్యాలు, త్వమేవాహం | (70, 1950) |
| 4. | 12. బోయి భీమన్న | రాగ వైశాఖి | (1960) |
| 5. | 20. దాశరథి కృష్ణమాచార్య | కవితా సంకలనం | (1950) |
| 6. | 22. దాసు శ్రీరాములు | తెలుగు నాడు | (1910) |
| 7. | 23. దేవులపల్లి కృష్ణ శాస్త్రి | కృష్ణపక్షము, ప్రవాసము, ఊర్వశి | (1930) |
| 8. | 24. దిగంబర కవులు | దిగంబరకవిత్వం | (1970) |
| 9. | 25. దువ్వూరి రామిరెడ్డి | పానశాల | (1940) |
| 10. | 29. గురజాడ అప్పారావు | ముత్యాల సరాలు | (1910) |
| 11. | 31. ఇస్మాయిల్ | చెట్టు నా ఆదర్శం | (1960) |
| 12. | 32. జాషువా | గబ్బిలం | (1950) |
| 13. | 33. జయప్రభ | చింతల నెమలి | (1990) |

| | | | |
|---|---|---|---|
| 14. | 41. ఖాదర్ మొహియుద్దీన్ | పుట్టు మచ్చ | (1990) |
| 15. | 43. కొండేపూడి నిర్మల | నడిచే గాయాలు | (1990) |
| 16. | 47. మహె జబీన్ | ఆకు రాలే కాలం | (1990) |
| 17. | 50. ముద్దుకృష్ణ (సం.) | వైతాళికులు | (1940) |
| 18. | 55. నగ్నముని | కొయ్య గుర్రం | (1970) |
| 19. | 57. నండూరి సుబ్బారావు | ఎంకి పాటలు | (1930) |
| 20. | 59. ఓల్గా, కన్నభిరాన్ (సం.) | నీలిమేఘాలు | (1990) |
| 21. | 62. పఠాభి | ఫిడేలు రాగాల డజన్ | (1930) |
| 22. | 63. పింగళి కాటూరి కవులు | సౌందరనందము | (1940) |
| 23. | 69. రాయప్రోలు సుబ్బారావు | తృణకంకణము | (1920) |
| 24. | 70. సతీష్ చందర్ | పంచమవేదం | (1990) |
| 25. | 72. శివారెడ్డి | శివారెడ్డి కవితలు | (1980) |
| 26. | 77. శ్రీశ్రీ | మహాప్రస్థానం | (1940) |
| 27. | 78. శ్రీశ్రీ | ఖడ్గ సృష్టి | (1950) |
| 28. | 81. తిలక్ (దేవరకొండ బాలగంగాధర) | అమృతం కురిసిన రాత్రి | (1950) |
| | 85. జి. | | |

| | | | |
|---|---|---|---|
| | లక్ష్మి నరసయ్య, త్రిపురనేని శ్రీనివాస్ (సం.) | పాట | |
| 30. | 86. తుమ్మల సీతారామమూర్తి చౌదరి | రాష్ట్రగానము | (1950) |
| 31. | 93. వేగుంట మోహనప్రసాద్ | చితి – చింత | (1980) |
| 32. | 94. విద్వాన్ విశ్వం | పెన్నేటి పాట | (1950) |
| 33. | 95. విశ్వనాథ సత్యనారాయణ | కిన్నెరసాని పాటలు | (1930) |
| 34. | 96. విశ్వనాథ సత్యనారాయణ | రామాయణ కల్పవృక్షము | (1950) |
| 35. | 100. ఏటుకూరి వెంకటనరసయ్య | మగువమాంచాల | (1940) |

కథలు (16)

| # | Author/Editor | Title | Decade First Published |
|---|---|---|---|
| 1. | 1. ఎ. ఎస్. మూర్తి | తానా తెలుగు కథ | (1990) |
| 2. | 3. అబ్బూరి ఛాయాదేవి | ఛాయాదేవి కథలు | (1960) |
| 3. | 9. భానుమతీ రామకృష్ణ | అత్తగారి కథలు | (1960) |
| 4. | 14. చాగంటి సోమయాజులు | చాసో కథలు | (1940) |
| 5. | 26. ఎం.ఎ. సుభాన్ (సం.) | కథాసాగర్ | (1990) |

| | | | |
|---|---|---|---|
| 5. | 26. ఎం .ఎ. సుభాన్ (సం.) | కథాసాగర్ | (1990) |
| 6. | 36. కాళీపట్నం రామారావు | కా.రా. కథలు | (1980) |
| 7. | 44. కొడవటిగంటి కుటుంబరావు | కథలు | (1950) |
| 8. | 46. మధురాంతకం రాజారాం | కథలు | (1980) |
| 9. | 51. ముళ్ళపూడి వెంకట రమణ | బుడుగు | (1950) |
| 10. | 52. ముళ్ళపూడి వెంకట రమణ | వివిధ కథలు | (1950) |
| 11. | 53. మునిమాణిక్యం నరసింహా రావు | కాంతం కథలు | (1940) |
| 12. | 56. నామిని సుబ్రహ్మణ్యం నాయుడు | పచ్చనాకు సాక్షిగా | (1990) |
| 13. | 60. పాలగుమ్మి పద్మరాజు | వివిధ కథలు | (1940) |
| 14. | 66. రాచకొండ విశ్వనాథ శాస్త్రి | వివిధ కథలు | (1960) |
| 15. | 71. సత్యం శంకరమంచి | అమరావతి కథలు | (1970) |
| 16. | 75. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి | వివిధ కథలు | (1940) |

## నవలలు (21)

| # | Author/Editor | Title | Decade First |
|---|---|---|---|

| | | | Published |
|---|---|---|---|
| 1. | 11. బీనాదేవి | పుణ్యభూమీ కళ్ళు తెరు | (1970) |
| 2. | 13. బుచ్చిబాబు | చివరకు మిగిలేది | (1940) |
| 3. | 15. చలం | మైదానం | (1940) |
| 4. | 17. చంద్రలత | రేగడివిత్తులు | (1990) |
| 5. | 19. చిలకమర్తి లక్ష్మీనరసింహం | గణపతి | (1920) |
| 6. | 27. గోపీచంద్ త్రిపురనేని | అసమర్థుని జీవితయాత్ర | (1930) |
| 7. | 34. జీ. వి. కృష్ణారావు | కీలుబొమ్మలు | (1940) |
| 8. | 40. కేశవ రెడ్డి | రాముడుండాడు - రాజ్జెవుండాది | (1990) |
| 9. | 42. కొడవటిగంటి కుటుంబరావు | చదువు | (1940) |
| 10. | 45. లత (తెన్నేటి హేమలత) | గాలిపడగలు - నీటి బుడగలు | (1970) |
| 11. | 48. మహీధర రామమోహన రావు | కొల్లాయిగట్టితేనేమి | (1960) |
| 12. | 49. మొక్కపాటి నరసింహ శాస్త్రి | బారిస్టర్ పార్వతీశం | (1940) |
| 13. | 54. రంగనాయకమ్మ | స్వీట్‌హోం | (1960) |
| 14. | 73. శ్రీదేవి | కాలాతీతవ్యక్తులు | (1940) |

| | | | |
|---|---|---|---|
| 15. | 87. ఉన్నవ లక్ష్మీనారాయణ | మాలపల్లి | (1920) |
| 16. | 88. ఉప్పల లక్ష్మణ రావు | అతడు - ఆమె | (1930) |
| 17. | 89. వడ్డెర చండీదాస్ | హిమజ్వాల | (1970) |
| 18. | 90. వాసిరెడ్డి సీతాదేవి | మట్టిమనిషి | (1970) |
| 19. | 97. విశ్వనాథ సత్యనారాయణ | వేయి పడగలు | (1950) |
| 20. | 98. యద్దనపూడి సులోచనారాణి | సెక్రటరి | (1970) |
| 21. | 99. యండమూరి వీరేంద్రనాథ్ | తులసిదళం | (1970) |

నాటకాలు - నాటికలు (10)

| # | Author/Editor | Title | Decade First Published |
|---|---|---|---|
| | | | |
| 1. | 8. ఆత్రేయ | నాటకాలు | (1940) |
| 2. | 10. భమిడిపాటి కామేశ్వర రావు | కచటతపలు | (1940) |
| 3. | 28. గురజాడ అప్పారావు | కన్యాశుల్కం | (1900) |
| 4. | 37. కాళ్ళకూరి నారాయణ రావు | వరవిక్రయం | (1920) |
| 5. | 58. నార్ల వెంకటేశ్వర | కొత్త గడ | (1940) |

| | | | |
|---|---|---|---|
| 5. | 58. నార్ల వెంకటేశ్వర రావు | కొత్త గడ్డ | (1940) |
| 6. | 67. పాకాల వేంకట రాజమన్నార్ | రాజమన్నార్ నాటికలు | (1960) |
| 7. | 83. తిరుపతి వెంకట కవులు | పాండవోద్యోగ విజయాలు | (1920) |
| 8. | 84. త్రిపురనేని రామస్వామి చౌదరి | శంబుక వధ | (1930) |
| 9. | 91. వాసిరెడ్డి, సుంకర | మాభూమి | (1930) |
| 10. | 92. వేదం వేంకటరాయ శాస్త్రి | ప్రతాపరుద్రీయం | (1910) |

ఆత్మ కథలు (9)

| # | Author/Editor | Title | Decade First Published |
|---|---|---|---|
| 1. | 5. ఆదిభట్ల నారాయణ దాసు | నాయెరుక | (1920) |
| 2. | 18. చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి | కథలు - గాథలు | (1940) |
| 3. | 21. దరిశి చెంచయ్య | నేనూ, నా దేశం | (1930) |
| 4. | 35. కాళోజీ నారాయణరావు | ఇదీ నా గొడవ | (1950) |
| 5. | 38. కందుకూరి వీరేశలింగం | స్వీయ చరిత్ర | (1920) |
| 6. | 64. పుచ్చలపల్లి సుందరయ్య | విప్లవ పథంలో నా పయనం | (1950) |

| | | | |
|---|---|---|---|
| 6. | 64. పుచ్చలపల్లి సుందరయ్య | విప్లవ పథంలో నా పయనం | (1950) |
| 7. | 74. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి | అనుభవాలు - జ్ఞాపకాలు | (1930) |
| 8. | 80. టంగుటూరి ప్రకాశం | నా జీవిత యాత్ర | (1940) |
| 9. | 82. తిరుమల రామచంద్ర | హంపీ నుంచి హరప్పా దాక | (1990) |

## సాహిత్య పరిశీలన (2)

| # | Author/Editor | Title | Decade First Published |
|---|---|---|---|
| 1. | 2. అక్కిరాజు ఉమాకాంతం | నేటికాలపు కవిత్వం | (1930) |
| 2. | 39. కట్టమంచి రామలింగా రెడ్డి | కవిత్వతత్త్వ విచారము | (1930) |

## వ్యాసావళి (7)

| # | Author/Editor | Title | Decade First Published |
|---|---|---|---|
| 1. | 16. చలం | స్త్రీ | (1930) |
| 2. | 30. గిడుగు రామమూర్తి | ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజం | (1920) |
| 3. | 61. పానుగంటి లక్ష్మీనరసింహా రావు | సాక్షి వ్యాసాలు | (1930) |
| 4. | 65. పురాణం సుబ్రహ్మణ్య శర్మ | ఇల్లాలి ముచ్చట్లు | (1970) |
| [illegible] | 68. రాళ్ళపల్లి | [illegible] | [illegible] |

| | | | |
|---|---|---|---|
| 5. | 68. రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ | నాటకోపన్యాసములు | (1940) |
| 6. | 76. స్త్రీశక్తి సంఘటన | మనకు తెలియని మన చరిత్ర | (1990) |
| 7. | 79. సురవరం ప్రతాపరెడ్డి | ఆంధ్రుల సాంఘిక చరిత్ర | (1950) |



# ఇస్మాయిల్ గారి కవితా తత్వం

విన్నకోట రవి శంకర్

---

ఇస్మాయిల్‌గారు కాకినాడ పి. ఆర్‌గవర్నమెంటు కాలేజీ లో చాలా కాలం ఫిలాసఫీ లెక్చరరు గా పని చేసి, కాలేజీ ప్రిన్సిపాలుగా పదవీవిరమణ చేసారు. కొంత కాలం అధికార భాషా సంఘం సభ్యునిగా కూడా ఉన్నారు. ఆరు కవితా సంకలనాలు, రెండు వ్యాస సంకలనాలు, "రెండో ప్రతిపాదన" అనే పేరుతో ఇతర భాషలనుండి అనువదించిన కవితల సంకలనం ప్రచురించారు. ఆయన "మృత్యువృక్షం" కి ఫ్రీవర్స్‌ఫ్రంటు అవార్డు, "కవిత్వంలో నిశ్శబ్దం"కి తెలుగు యూనివర్సిటీ అవార్డూ వచ్చాయి. ఇటీవల కళాసాగర్‌వారు *lifetime achievement* కింద లక్ష రూపాయల ప్రత్యేక పురస్కారంతో సత్కరించారు.

---

ప్రపంచం దుఃఖమయంగా కనిపిస్తుంది. నిత్య జీవితంలో ఎదురయ్యే బాధలు, నిరాశ, అభద్రత మొదలైనవి మనల్ని పీడిస్తూ ఉంటాయి. అలాగే తిరిగిరాని గతం, రాకతప్పని మృత్యువు, అంతుపట్టని భవిష్యత్తు వంటివి నిరంతరం మనని కలవరపెడుతూ ఉంటాయి. వీటివల్ల కలిగే మానసికోద్రేకాలు సహజంగానే అనేకమంది కవులకు కవితావస్తువులుగా సమకూరాయి. ఐతే దీనికి భిన్నంగా, ఆహ్లాదకరమైన, ఆరోగ్యవంతమైన "సజీవ సామగ్రి"తో అద్భుతమైన కవిత్వం సృష్టించిన అతికొద్దిమంది కవుల్లో ఇస్మాయిల్ గారు ముఖ్యులు.

కష్టాలుంటాయి. కాని, పాటతో వాటిని జయించాలి.

> సెలయేరా, సెలయేరా!
> గల గల మంటో నిత్యం
> ఎలా పాడగలుగుతున్నావు ?

చూడు, నా బతుకునిండా రాళ్ళు.

పాడకుంటే ఎలా ?

(పాట)

జీవన వైభవాన్ని, జీవన సౌందర్యాన్ని దర్శించి, వాటికి స్పందించటం ద్వారా యిటువంటి ధోరణి అలవడిందనుకొంటాను. సకల చరాచర సృష్టితోనూ ఒక మమేకత సాధించి, వాటితో సంస్పందించటం ఆయన కవిత్వంలో కనిపిస్తుంది. అందుకే సృష్టిలో ఉన్న రకరకాల వస్తువులగురించి ఆయన ప్రస్తావించినప్పుడు, కేవలం ఎఎషఎలలబఎబధథఎబలల మాత్రమే కాకుండా, ఒక సున్నితమైన హాస్యధోరణి అందులో ఉంటుంది. మనకు అతి సన్నిహితులైన వారిగురించి ప్రస్తావించేటప్పుడు మాత్రమే మనం ఇటువంటి హాస్య ధోరణిని పాటించగలం. ఉదాహరణకి – చప్పట్లుకొట్టే ఆకులు, తోక ఊపుకొంటూవచ్చే సూది, వొంతెనకిందుగా ఊహల్లోకి గెంతుతూ పారే ఏరు, గంపెడుకాయలతో ఆశ్చర్యపడి నిలుచున్న కొబ్బరిచెట్టు, ముప్పొద్దులూ కాలవలో మొహం చూసుకుని ఆశ్చర్యపోయే మబ్బు, భూమి బుగ్గపై చల్లటి నవ్వు సొట్టలా ముడుచుకొనే బావి – ఇలా ఎన్నైనా చెప్పుకోవచ్చు.

ఇస్మాయిల్ గారి కవిత్వంలో ఎక్కడా గతం గురించిన చింతకాని, భవిష్యత్తుగురించిన ఆందోళనగాని కనిపించదు. ఎల్లప్పుడూ వర్తమానంతోనే వాటికి ప్రమేయం. ఎక్కడా షఎయిఎ ఎబఎఊ ఉండదు. అల్లాగని కొంతమందిలాగా తనను తానొక ఉన్నత స్థానం మీద ఊహించుకుని ప్రవచించటం కూడా ఉండదు. కేవలం వర్తమానం పట్ల అనురక్తి, చెక్కుచెదరని ఆశాభావం మాత్రం కనిపిస్తాయి.

ఎరుపెక్కే
ఇవాళ్టి సంధ్యకానీ
నలుపెక్కివచ్చే
నిరాశాంధం కానీ
నా మనస్సులో
ఆనందపు తెరచాపలెత్తి
అనవరతం సాగిపోయే
ఈ కాంతిపడవల్ని
ఆర్పలేవనుకుంటాను

(శ్రావణ మంగళవారం)

జీవితంపై ఆయనకున్న ఎలషబ౨బవాఎ థ౨౨బ౨౨౨౨ఎకి మరొక సూచిక  పిల్లలగురించి ఆయన రాసిన పద్యాలు.  పిల్లల గురించి ఆయన చాలా పద్యాలు రాసారు.  వీటిలో పిల్లలపై  ఆయనకున్న ప్రేమ, వారిని జీవితానికి నిజమైన ప్రతినిధులుగా చూసే ఆయన దృష్టి స్పష్టంగా  తెలుస్తాయి. □ ట్వింకిల్ □,  □ ట్వింకిల్–కహుటెక్ □,□ ట్వింకిల్ నవ్వు □,□ నక్సల్ భావే □ , □ఆట ముఖ్యం □,□ పాపాయి ముందు నా పద్యం □,  ఇంకా లెక్క లేనన్ని హైకూలలో పిల్లల గురించిన ప్రస్తావన కనిపిస్తుంది.

కాళ్ళకి కాళ్ళు తొడుక్కుని
నీళ్ళల్లో నించున్నాడు కుర్రాడు
రెండు మొహాల్లోనూ ఆశ్చర్యం
(హైకూ)

ఎవరికోసం వర్షిస్తాయి మేఘాలు ,
పిల్లల కోసం కాకపోతే
గొడుగులడ్డు పెట్టుకునే వాళ్ళ కోసమా ?
(హైకూ)

పిట్టల్ని తోలమని
పాపని కాపలా పెడితే
కాకుల్తో స్నేహం చేస్తోంది
(హైకూ)

పిల్లలు జీవనవైభవానికి,  దాని కొనసాగింపుకీ ప్రతినిధులని  నాకనిపిస్తుంది.  చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూస్తున్నప్పుడు వారి దృష్టిలో ఉండే స్వచ్ఛత,  అమాయకత  కవులకి కూడా వాంఛనీయాలు కాబట్టి వారికి పిల్లలతో ఒక సన్నిహిత సంబంధం  ఉంటుందేమో.

నది బాజాని మోగించే
సదా బాలకుడు టాగోర్
(బోటులో టాగోర్)

ఇస్మాయిల్ గారొకసారి రాసారు – "పిల్లలంత ఆనందంగా  ఎందుకుంటారంటే వాళ్ళు నిజమైన కవులు కాబట్టి.  అసలు మనందరం పుట్టటం కవులుగానే పుడతాం" – అని.

ఇస్మాయిల్ గారు రాసిన పద్యాల్లో ప్రత్యేకంగా చెప్పుకోవలసినవి ఎఎషఎలలథయ ఎలఎంష – అంటే ఎవరైనా ఒక వ్యక్తిని సంబోధిస్తూ రాసినవి. తెలుగులో ఇటువంటి పద్యాలు తక్కువ. అంటే ఇటువంటివి లేవని కాదుగానీ చాలా సందర్భాలలో ఈ రూపాన్ని ఎలిజీల కోసమో, లేదా తిట్టు కవిత్వంగానో ఉపయోగించుకోవటం జరిగింది. ఇస్మాయిల్ గారు రాసిన ఎఎషఎలలథయ ఎలఎంషలో ఒక ఎఎషఎలలథయ ఎలఎధఫ ఉండటమే కాకుండా, ఒక మంచి ఉద్దేశ్యం, ఆకాంక్ష కనిపిస్తాయి. ఇవి జీవితం పట్ల, స్నేహం పట్ల ఆయనకున్న సదవగాహనని మనకి తెలియజేస్తాయి. □ శ్యామలరావు గారికి □, □ సదాశివ రావు గారికి □, □ ములిగిన ఓడలు □ (కాశీ గారికి), □ వైరు □ (నగ్నమునికి), □ కాలవ ఒడ్డున షికార్లు □ (బిట్ర మోక్ష లక్ష్మీ నరసింహస్వామికి) – వంటి పద్యాలు ఆయన స్నేహస్వభావానికి తార్కాణంగా నిలుస్తాయి.

ఆయన రాసిన పద్యాలలో ఒక్క పద్యంలో మాత్రమే మృత్యువుగురించిన ప్రసక్తి ఉంటుంది. అదే – □ మృత్యు వృక్షం □. ఇందులో కూడ మృత్యువు వల్ల కోల్పోయిన అనుబంధాల గురించి నిగూఢమైన ప్రస్తావన ఉంటుంది తప్పించి ఎక్కడా సెంటిమెంటాలిటీ కనిపించదు.

అకస్మాత్తుగా
ఒకరోజు
మృత్యువృక్షం
వ్యత్యస్తంగా
తలకిందుగా
మొలిచింది.

మూగిన బంధుమిత్రులు
మోసుకుపోయి అతణ్ణి
విత్తనంలా
పాతారు.

జనాల
మనోగగనంలో
చాపుకున్న
జ్ఞాపకాల కొమ్మల్ని
గాఢానురాగాల

ఊడల్నీ
వెనక్కి పీల్చేసి
ఈ మృత్యుబీజం
ఏమీ తిరిగివ్వదు.

కవిత్వంలో సెంటిమెంటాలిటీ ఉండకూడదనే విషయంలో ఆయనకి పట్టుదల ఎక్కువ. ఇదికొంత భిన్నమైన ధోరణి. ఎందుకంటే, సెంటిమెంటనేది మన సాహిత్యంలో చాలా కీలకమైన అంశమైపోయింది. మన కథలు, నవలలు, నాటకాలు, సినిమాలు – వీటన్నింటిలోనూ సెంటిమెంటొక జనరంజక సాధనం. విప్లవ కవిత్వంలో మృతవీరుల సంస్మరణార్థం రాసే పద్యాలలో కూడా కొన్ని సార్లు ఇది చోటుచేసుకోవటం కద్దు. కాని ఇస్మాయిల్ గారు సెంటిమెంటు నంగీకరించరు. కవిత్వం ఇంకా ఎబలఎష ఏఎలఏబదబయబఽబఎఏకి థఎఎథయ చెయ్యాలనేది ఆయన ఉద్దేశ్యం కావచ్చు.

ఇస్మాయిల్ గారు విధిగా పాటించిన మరొక సూత్రం తన కవిత్వంలో ఎక్కడా ఏఎఎఏఎలధఎఏ లేకుండా జాగ్రత్త పడటం. అంటే, ఆయన వాడే బంథఫఎఏకిగానీ, ఽఫఎంఎఏకిగానీ ఏరకమైన పౌరాణిక, చారిత్రక లేదా జానపద కథలు లేదా పాత్రలతో సంబంధం ఉండదు. ఒక పద్యానికి సంబంధించిన విషయమంతా అందులోనే ఉంటుందిగానీ, దానినర్థం చేసుకోవటానికి వేరే ఏరకమైన పరిజ్ఞానమూ సంపాదించవలచిన అవసరం ఉండదు. ఏఎఎఏఎలధఎఏ వల్ల పాఠకుడి దృష్టి మరలిపోయే ప్రమాదం ఉంటుందనేది ఆయన ఉద్దేశ్యం కావచ్చు. ఏఎఎఏఎలధఎఏ లేకపోవటంవల్ల పద్యానికొక ఎలబవాఎఏఏథయబఽఱ కూడా ఏర్పడుతుంది. ఐతే, ఇటువంటి ఏఎఎఏఎలధఎఏ సాధారణంగా ఒక జాతి సంస్కృతితో ముడిపడి ఉంటాయి కాబట్టి, వాటివల్ల పాఠకునికి ఇంకా దగ్గరగా వెళ్ళే అవకాశం ఉంటుందని కొందరు భావించవచ్చు. అందువల్ల, ఈ విషయంలో భిన్నాభిప్రాయాలకు ఆస్కారం ఉంది.

ఇస్మాయిల్ గారి కవిత్వంలో అనుభూతి సాంద్రత ఎక్కువ. ఆయనను "అనుభూతివాద కవి"గా వర్గీకరించిన విమర్శకులు, ఆయన కవిత్వంలో ఈ లక్షణం గురించి ఇదివరలో విస్తారంగానే రాసారు. ఈ సందర్భంలో ముఖ్యంగా చెప్పుకోవలసినవి – కేవలం ఒకే అనుభూతికి పరిమితమై రాసినపద్యాలు, లేదా అతి సాధారణమైన ఒక చిన్న సంఘటన ఆధారంగా రాసిన పద్యాలు. ఉదాహరణకి, ఎండాకాలంలో చల్లటి మంచినీళ్ళు తాగటం (దాహం), ఒకామె కప్పులో టీ

తీసుకొని రావటం (టీ కప్పు), నిద్రలో ఉలిక్కిపడటం (నిద్రలో ఆమె కళ్ళు) వంటివి చెప్పుకోవచ్చు.

ఇందుకు భిన్నంగా, ఒక ఆలోచనని చెప్పటానికి మాత్రమే రాయబడిన పద్యాలు కూడా లేకపోలేదు. ఉదాహరణకి, □ స్వేచ్ఛాగానం □. పేరుకి స్వేచ్ఛాగానమే అయినా,

దివిలో ఊగే విహంగాన్ని
భువిలో పాకే పురుగు బంధిస్తుంది

అని మొదలయ్యే ఈ పద్యంలో అన్నీ బంధాలే కనిపిస్తాయి. స్వేచ్ఛలో ఉన్న బంధాల్ని గుర్తించటమే ఈ పద్యంలో ప్రత్యేకత. అనేక బంధాలు చెప్పబడ్డాక

గురి మరచిన గాలి బాణాన్ని
తెరలెత్తిన నౌకా ధనస్సు బంధిస్తుంది
ఈ మనిషి ఆ మనిషిని బంధిస్తాడు
ఇద్దర్నీ బంధిస్తుంది మనీష

అనే వాక్యాలతో ఈ పద్యం ముగుస్తుంది. కృష్ణ శాస్త్రి గారి స్వేచ్ఛాగానం (1,2) పద్యాలతో ఈ పద్యాన్ని కూడా కలిపి విశ్లేషిస్తూ, ఇస్మాయిల్ గారే ఒకసారి వ్యాసం రాసారు.

స్పష్టంగా విడమరిచి చెప్పలేని ఒక అస్తిత్వ చింతన వంటిది "చెట్టు నా ఆదర్శం"లో ఒకటిరెండు పద్యాలలో మాత్రం కనిపిస్తుంది.

చిటపట ....
ఎడతెగక మ్రోగు విధిఢక్క
కడుపులో శూన్యపు ప్రేవుని
ఏల మోగు నగార
ఎచట దీనికి మేర ?

అకటకట
వికట ప్రతిబింబాల
అద్దాల చెరసాల

బందీని నేనె

బందిఖానాని నేనె

(ఎందుకయ్యా వుంచినావు, బందిఖానాలో)

చివరి రెండు పంక్తులలో చెప్పబడ్డ తాత్వికసత్యం విశేషమైనది.

ఇవిగాక, కేవలం యలఖబధతో రాసిన చిన్నపద్యాలు కొన్ని ఉన్నాయి. వీటికి పాఠకుడి దృష్టిని బట్టి, రకరకాల అర్థాలు చెప్పుకోవచ్చు.

బైట ఉండాల్సినవేమిటో

లోన ఉండాల్సినవేమిటో

అన్నీ నాకు తెలుసు.

ఐతే,

ఈ కిటికీకి

ఇక్కడేం పని ?

(గోడ)

దోవ బహు దుర్గమంగా ఉంది

ఆ వేపు కెప్పుడు చేరతానో

ఇప్పుడు మెళ్ళో ఇదోటి తగిలించారు

ఈ పని పూర్తయాక ప్రయాణం సాగిస్తాను

(మేకు)

అప్పట్లో కమ్యూనిస్టు విమర్శకుల్ని కవ్వించటానికి రాసిన కొన్ని పద్యాలు కూడా ఇదే కోవకి చెందుతాయి. వాటిలో ముఖ్యంగా  అనంతపురంలో రెండు గాడిదలు ,  వడ్రంగి పిట్ట  వంటివి చాలా వివాదానికి దారితీసాయి.

పైన చెప్పిన పద్యాలు కొన్ని మినహాయిస్తే, ఇస్మాయిల్ గారి కవిత్వంలో స్పష్టత, సరళత ఎక్కువ. గాఢతని కోల్పోకుండా స్పష్టతని సాధించటం వాటి లక్షణం. జీవితంలో ఉండే ధలంఎయఎక్షబఒఅకి జవాబుగా, కొందరు కవులు తమ కవిత్వంలో ధలంఎయఎక్షబఒఅతో దానిని సవాలు చేస్తే,

ఇస్మాయిల్ గారి వంటివారు తమ కవిత్వంలో సరళత ద్వారా దాని నెదుర్కొన్నారు. కవుల్లో నిజాయితీ ఉన్నంతవరకు, ఏ మార్గం అవలంబించినా కృతకృత్యులు కాగలుగుతారు.

ఇస్మాయిల్ గారు భాషలో పాటించిన నిరాడంబరత కూడా చెప్పుకోదగినది. ఆయన పద్యాలలో ఎక్కడా క్లిష్టమైన పదాలుగానీ, సుదీర్ఘమైన వాక్యాలుగానీ ఉండవు. "చెట్టు నా ఆదర్శం" లో కొన్ని గ్రాంధిక పదాలు కనిపిస్తాయిగానీ, తరువాతి పద్యాలలో వాటిని పూర్తిగా విడిచిపెట్టారు. భావానికి, పాఠకునికీ మధ్య భాష అడ్డు రాకూడదనేది ఆయన ఉద్దేశ్యం. సరళమైన చిన్న వాక్యాలతో ఉండే పద్యాలలో ఆయన, రెండో అక్షరం ప్రాసని మాత్రం చాలా వరకు పాటిస్తారు. తెలుగు భాషకి అంత్యప్రాసకంటె, అక్షరమైత్రి ఎక్కువ సొగసునిస్తుందని ఆయన భావిస్తారు.

ఇస్మాయిల్ గారి కవితా సంకలనాలు – "చెట్టు నా ఆదర్శం", "మృత్యు వృక్షం", "చిలకలు వాలిన చెట్టు", "రాత్రి వచ్చిన రహస్యపు వాన", "బాల్చీలో చంద్రోదయం", "కప్పల నిశ్శబ్దం" (హైకూలు) – వీటిలో ఏది తీసుకున్నా, ఆయన కవితా తత్వం స్పష్టంగా మనకు గోచరిస్తుంది. ఇవే కాకుండా, ఆయన రాసిన అనేక సాహిత్య వ్యాసాలలో కవిత్వం గురించి తన అభిప్రాయాలను విస్తారంగా చర్చించారు. ఆయన ప్రచురించిన రెండు వ్యాస సంకలనాలు – "కవిత్వంలో నిశ్శబ్దం", "కరుణ ముఖ్యం" – ఆయన కవితా దృక్పధాన్ని అర్థం చేసుకోవటంలో మనకుపయోగపడతాయి. ఈ వ్యాసాలలో ఆయన వెలువరించిన అభిప్రాయల వెలుగులో ఆయన కవిత్వాన్నే విశ్లేషించటం ఒక మంచి ప్రయత్నమౌతుంది. ఎవరైనా ఇటువంటి ప్రయత్నానికి పూనుకొంటే, ఇస్మాయిల్ గారి కవిత్వం గురించి మరిన్ని ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వస్తాయి.



# జవాబు – ఫలితం

కలశపూడి శ్రీనివాస రావు

"ఉఁ . ."

"ఆఁ . ."

"అలాగే . . ."

నన్ను మంచి వాణ్ణి చేశాయి

"ఎందుకు?"

"ఏమిటి?"

"ఎలా?"

నన్ను చెడ్డ వాడిని చేశాయి

# జీవితానికి ఎన్ని రంగులో!!!

-- శ్రీమతి ఎ. ఎస్. మణి

శ్వేత ఉత్తరం రాసింది! ఉత్తరం చదువుతుంటే నాలో సంతోషం ఉప్పొంగుతోంది. చిన్నారి శ్వేత పెద్దదయిపోయింది. పద్నాలుగేళ్ళు! బాల్యానికి గుడ్ బై చెప్పి యవ్వనంలోకి అడుగుపెడుతూ .. ఇంకా ప్రపంచం తెలియని ఊహాలోకంలో తేలిపోతూ ... ఇప్పుడు శ్వేత ఎలాగుందో! చూడటానికి బంగారుబొమ్మే! నా పోలికలేమైనా ఉంటాయా? మన పిల్లలలో మన ప్రతిబింబం చూసుకోవాలని ఉంటుంది. శ్వేతకు తెలుగు నేర్పిస్తున్నానని రాసింది మాలతి. ఐనా ఇంత బాగా రాయగలదా? నమ్మలేక పోతున్నాను. మాలతి రాసిందేమో! రైటింగు బాగుంది. ఉత్తరాన్ని మళ్ళీ మళ్ళీ చదువుకుంటున్నాను.

ప్రియమైన బామ్మా!
ఈ ఉత్తరం నేను స్వయంగా రాస్తున్నాను. నమ్మకం కలగటం లేదా? ప్రపంచపు ఎనిమిదో వింత లాగా ఉందా? ఇప్పుడు నేను చాలా ఎదిగాను. నా ఎత్తు ఐదు అడుగుల మూడు అంగుళాలు. మనసు ఎదిగిన ప్రతివ్యక్తి ఎనిమిదవ వింత అనవచ్చు. కాదు. మొదటి వింత! నన్ను చూస్తే ... ఆశ్చర్యపడతావేమో! అంతే కాదు. నేను తెలుగు నేర్చుకున్నాను. ఎలా, ఎందుకు నేర్చుకున్నానో చెప్తాను. ఏడాది క్రిందట మేము .. అంటే అమ్మ, డాడీ, నేనూ, దీపూ ఒక రిసెప్షన్‌కి వెళ్ళాము. ప్రమీల ఆంటీ కొడుకు రవీంద్ర పెళ్ళి అయింది. రవీంద్ర పెళ్ళికూతురు ఒక తెలుగు అమ్మాయి. పేరు అనూరాధ. పట్టుచీర కట్టి నగలు పెట్టారు. బుగ్గమీద చుక్క ఎంత బాగుందో!

"హార్వెస్ట్" అంటే అదొక పెద్ద రెస్టారెంట్. తెలుగు పద్ధతిలో రంగుముగ్గులతో, పూలమాలలు, దీపాలతో అలంకరించారు. నాకు ఆ అలంకరణ చాలా నచ్చింది. భోజనానికి ముందర కూచిపూడి డాన్స్ ప్రోగ్రాం పెట్టారు. అది అయ్యాక అనూరాధ పాట పాడింది. ఆ పాట చాలా బాగుంది. ఈ వసంతాలలో అనే పాట కళావతి రాగంట! ఆపాట నాకు చాలా నచ్చింది. ఆ రాగం చాలా బాగుంది. అమ్మ పాటకి అర్థం చెప్పింది. తెలుగు చాలా చక్కటి భాష అనిపించింది. తెలుగు సినిమాలు చూస్తుంటాము. నాకు ఆ భాష అర్థం కాదు. "ఉత్తి వాగుడు" అంటుంది అమ్మ.

కానీ కొన్ని సినిమా పాటలు చాలా బాగుంటాయి. నాకు సాఫ్ట్ మ్యూజిక్ ఇష్టం. అనూరాధ పాట విన్నాక నాకు తెలుగు నేర్చుకోవాలనిపించింది. సంగీతం కూడా! వెంటనే మొదలు పెట్టాను. ఆరు నెలల్లో చాలా నేర్చుకున్నాను. అక్షరమాల, గుణింతాలు, సంయుక్తాక్షరాలు వచ్చేశాయి. అమ్మ తప్పులు దిద్దుతుంటే ఒక ఏడాదిలో రాయటం కూడా వచ్చేసింది. వచ్చింది కదూ! మేము వచ్చే నెలలో అక్కడికి .. ఇండియా వస్తున్నాము. నాకు ఒక తెలుగు ఫ్రెండ్ ఉంది. "ఇండియా చాలా డర్టీ ప్లేస్. వేడి ఎక్కువ. ఆవకాయ, గోంగూర తింటారు. హారిబుల్. వొళ్ళంతా మండి పోతుంది" అని భయపెడుతోంది. ఐ డోంట్ కేర్. "మా బామ్మ ఎక్కడ వుంటే అక్కడికి, అరణ్యమైనా, మౌంట్ ఎవరెస్ట్ అయినా సరే, వెడతాను" అన్నాను. బాగా జవాబు చెప్పాను కదూ! నాకు మీ అందరినీ చూడాలని ఉంది. ఆంధ్రా చూడాలని ఉంది. హైదరాబాద్ చూడాలని ఉంది. తాతయ్యకి నా నమస్కారాలు. ప్రేమతో ... శ్వేత.

చక్కగా రాసింది! ప్రసాద్, మాలతి, పిల్లలు వస్తున్నారు. ఈ వయసులో కళ్ళారా పిల్లల్ని చూసుకోగలగటం కంటే ఆనందం ఏముంది! క్రిందటి సారి వచ్చినప్పుడు శ్వేత ఇంకా చిన్నపిల్ల. ఎన్ని పేచీలు పెట్టింది! పసిపిల్ల అప్పుడూ అంతే. నా ఒళ్ళో కూచోపెట్టుకుని గోరుముద్దలు తినిపించాలని, కథలు చెప్పాలని, జోలపాడి నిద్రపుచ్చాలని ఉబలాటపడిన నన్ను ఎన్ని తిప్పలు పెట్టేది! పిలిస్తే పారిపోయేది. దగ్గరగా వచ్చేది కాదు. క్రిందటి సారి వచ్చినప్పుడు సరికొత్త పేచీలు. "రైస్ తినను. పిజా, బర్గర్ కావాలి" అంది. ఇంగ్లీష్‌లోనే మాట్లాడుతుంది. అప్పటిదాకా అవేమిటో పేరుకూడా వినలేదు నేను. ఎక్కడనుంచి తీసుకురాను?

"అవన్నీ ఇక్కడ దొరకవు. నీకోసం ఆలూ కూర, పూరీ చేసింది బామ్మ. ఆ! చాలా టేస్టీగా ఉంది చూడు" అని మాలతి మరిపించాలని చూసింది. "పూరీ ... ఆలూ! షిట్. ఇక్కడ నాకు బాగా లేదు. స్విమింగ్ లేదు. సైకిల్ లేదు.." అని అలిగి పడుకుంది.

అప్పటికప్పుడు రమేష్ బజారుకి వెళ్ళి సైకిల్ కొనితెచ్చాడు. హొటల్స్‌కి తీసుకెళ్ళి పాస్ట్రీలు, ఐస్‌క్రీములు తినిపించాము. గ్రహచారం చాలక ఒకసారి చీమ కుట్టింది. "వాటే హారిబుల్ ప్లేస్! ఇప్పుడే వెళ్ళిపోదాం.." అంటూ గొడవ చేసింది. ఒకరోజు కోతులనాడించేవాడు వచ్చాడు. ఆట చూసినంతసేపు పకపకా నవ్వింది. తర్వాత కోతి కావాలని పేచీ పెట్టింది. డాబా మీదనుంచి దూకేస్తానంది. ఒకరోజంతా కాపలా కాశాము. హడలి చచ్చిపోయాం. రమేష్ ఊరంతా వెతికి ఒక రాబిట్‌ని కొనితెచ్చాడు. దానికోసం ఒక అట్టపెట్టె, చిల్లులతో. దానికి కారెట్ తినిపిస్తూ కోతిని మర్చిపోయింది శ్వేత. దాని తప్పులేదు.

దాని రెండవయేట తల్లి దాన్ని వదిలేసింది. ఏడాది పిల్ల! జాలికూడా లేదు. తల్లి వదిలేసిన పిల్లలు ఎలా ఉంటారు? ముత్యాల్లాగా, ముద్దబంతిపూలలాగ ఉంటారా? చచ్చుదద్దమ్మల్లాగో, రాక్షసుల్లాగో తయారవుతారు. టెర్రరిస్టులు అవుతారు. మాలతి పుణ్యమా అని శ్వేత మామూలు మనిషి అయింది. మంచిపిల్ల కాగలిగింది.

ఎంతచక్కగా రాసింది ఉత్తరం! ఇంతకన్న ఆనందమేమిటి అంటోంది మనసు. అంతా దేవుడి దయ అనుకోవాలి. ప్రసాద్ అమెరికా వెడుతున్నప్పుడు అనుకున్నానా! మమ్మల్ని లక్ష్యపెట్టకుండా అమెరికా అమ్మాయిని చేసుకుంటాడని! ఎదురుదెబ్బ తగిలింది. మధ్యతరగతి వాళ్ళం. ఎన్నో కోరికలు నిగ్రహించుకుని, మనసు సరిపెట్టుకుని పిల్లల్ని పెంచి పెద్ద వాళ్ళని చేశాం. ప్రసాద్ అమెరికా వెళ్ళి రెండేళ్ళు అయింది. ఆ ఉత్తరం వచ్చింది.

"నేను పెళ్ళి చేసుకుంటున్నాను. ఆనీ చాలా మంచి అమ్మాయి. ఇక్కడికి వచ్చాక ఇండియన్, అమెరికన్, నీగ్రో - తేడాలు మరిచిపోతాము. వాళ్ళూ మనలాంటి వాళ్ళే. ఎవరి విలువలు వాళ్ళకి ఉంటాయి. వాటిని గౌరవించాలి. మనిషి అంటే మంచి మనసు ఉండటం ముఖ్యం. పెళ్ళి అయాక మేము ఇండియాకి రావాలనుకుంటున్నాము. మీరు తప్పకుండా ఆనీని ఇష్టపడతారు. నాకు తెలుసు. మమ్మల్ని రమ్మంటారా?" అది వాడి ఉత్తరం సారాంశం.

కోడలంటే మన తర్వాత మన ఇల్లు నిలబెట్టేది. మన కుటుంబ మర్యాద, గౌరవం కాపాడే వ్యక్తి. మన అలవాట్లు, ఆచారాలు ఆ అమ్మాయికి అర్థమౌతాయా? గౌరవించగలదా? మన భాష కాదు. ఇంగ్లీషులో ఆంతర్యాలు విప్పుకుని మాట్లాడగలమా? గౌన్లు, స్కర్టులు వేసుకునే ఆ పిల్లని కోడలుగా మన్నించగలనా? మన పూజలూ పండగలూ వస్తే మనతో కలిసి ఆనందించగలదా? ఆచరించగలదా? కల్చర్ కదా మనుషుల్ని దగ్గర చేస్తుంది. ఆదూరం దాటగలమా? వాడు దేశాలు, సముద్రాలు దాటి వెళ్ళాడు. వాడికి తేడాలు లేకపోవచ్చు. మేము ఇక్కడే, పుట్టిన చోటే ఉన్నాం. ఏడుపు ఆపుకుని బాధని కంట్రోల్ చేసుకుని మార్పుని అంగీకరించాలని సమాధానపడి తప్పకుండా రమ్మని రాశాం. కన్నవాళ్ళని వొదులుకోలేము కదా! అప్పుడే లత పెళ్ళి కూడా కుదిరింది. పెళ్ళికి వచ్చారు ప్రసాద్, ఆనీ. అందరికోసం కానుకలు తెచ్చారు. ఆనీ నిజంగానే బాగుంది. సౌమ్యం గానూ ఉంది. అమెరికన్లు, యూరోపియన్లు పాలిపోయినట్లు తెల్లగా ఉంటారు కానీ వాళ్ళలో అందం లేదు అనుకునేదాన్ని. ఆనీని చూస్తుంటే నా అభిప్రాయం తప్పు అనిపించింది. ఆ శరీరంలో నునుపు, తెలుపులో గులాబీ కలిసిన రంగు, కళ్లలో మిలమిలలు, బంగారు రంగు జుట్టు, దేవకన్యలు ఇలాగ

ఉంటారేమో అనిపించింది. ప్రసాద్‌ని చూసి ముచ్చట వేసింది... మంచి భార్య దొరికిందని. పెళ్ళికి బంధువులంతా వచ్చారు. ఆనీ నమస్తే చెప్తే అందరూ సంతోషించారు.

ఆనీని పార్లర్‌కి తీసికెళ్ళి మన పద్ధతిగా మేకప్ చేయించి చీర కట్టి నగలు పెట్టాము. అన్నీ సరదాగా చేయించుకుంది. నాకెంపుల నెక్లెస్ ఇచ్చాను. చాలా సంతోషించింది. "థాంక్యూ మమ్మీ" అంది కౌగిలించుకుని. ఆయనని నన్ను డాడీ మమ్మీ అని పిలిచింది. మన వంటల పేర్లు కొన్ని తెలుసు. వెంకాయ్ కూర, కొథరి పచాడి అంటే సరదాగా నవ్వుకున్నాం. ముగ్గులు వెయ్యటం నేర్చుకుంది. గోరింటాకు పెట్టుకుంది. దూరం నుంచి చూస్తే ఏదైనా భయంగానే ఉంటుంది. ఈస్ట్, వెస్ట్ అనే పరిధులు మనం గీసుకున్నవే. మన మనసులో ఉంటాయి. మనసు విశాలమైతే అన్నీ చెరిగిపోతాయి. అడ్డు కాలేవు. జీవితం విశాలమౌతుంది. కావాలనుకుంటే కలిసిపోగలం. రంగులు, దూరాలు అడ్డురావు అనుకున్నాం. ఏదో అగాధం అనుకున్నది తేలికగా దాటేసినట్లు అనిపించింది. ఆ సంతోషంలో మనసంతా సందడి, వింత కాంతులు. ప్రపంచం అంచులు చూసినట్లు అనుభూతి. వాళ్ళ పెళ్ళయి రెండేళ్ళు అవుతుండగా పాప పుట్టింది. శ్వేత అని పేరు పెట్టారు.

ఆ పేరు నేనే చెప్పాను. ఆనీకి అభ్యంతరం ఉంటుందేమో అనుకున్నాను కానీ ఆనీ ఏమీ అనలేదు. మమ్మల్ని అమెరికా రమ్మని రాసేవారు. మాకు ఇక్కడ తీరిక ఏది! రమేష్ చదువుకుంటున్నాడు. లతా వాళ్ళు వస్తూ పోతూ ఉంటారు. లతకు నెల తప్పిందని తెలిసింది. ఏడవనెలలో సీమంతం చెయ్యాలి. తర్వాత పురిటికి తీసుకురావాలి. అమెరికా ఎలా వెళ్ళగలం! పైగా ఆయనకి కొడుకుల చేత ఖర్చు పెట్టించటం ఇష్టం లేదు. "నేను వెళ్ళగలిగితే నా డబ్బు తోనే వెడతాను" అనేవారు. మేము వెళ్ళకుండానే అంతా అయిపోయింది. ప్రసాద్, ఆనీ డైవోర్స్ తీసుకున్నారు. "పిల్లలి పాలు పట్టటం, గుడ్డలుతకటం, భర్త, వంట, రొటీన్. ఈ లైఫ్ నాకు బోర్ కొడుతోంది. నేను పిల్లని పెంచలేను" అందిట ఆనీ. పిల్లని సమంగా చూడటం లేదని ప్రసాద్‌కి కోపం వచ్చిందట. జాబ్ వదిలెయ్యమన్నాడుట.

"నువ్వు నీ జాబ్ వదిలేస్తావా?" అని అడిగిందట ఆనీ! బాస్‌తో కాంప్‌లకి వెళ్ళేది. ప్రసాద్ తరచూ ఆఫీసుకి సెలవు పెట్టాల్సి వచ్చేది. ఏమైనా అంటే "నువ్వు ఇండియన్ హజ్బెండ్‌వి. నిన్ను సహించటం నావల్ల కాదు. డైవర్స్ తీసుకుందాం. పిల్లని నువ్వే పెంచుకో" అందిట.

భార్య అన్నీ సహిస్తేనే వివాహబంధం అతుకుతుంది. ఇంకా ఏం గొడవలు పడ్డారో. భార్యా భర్తల మధ్య అనేకం ఉంటాయి. అదొక విచిత్రమైన బంధం!

ఇద్దరు ప్రత్యర్థులు తుఫానులో తప్పనిసరిగా ఒకే పడవ ఎక్కినట్లు! బ్రతకాలంటే, మునిగి పోకుండా ఉండాలంటే ఒకరికొకరు సహకరించక తప్పదు. వాళ్ళిద్దరి మధ్యా ఇంకా ఏంజరిగిందో మాకు ఎక్కువ తెలియదు. విడిపోయారు.

ఆ సంగతి తెలిసి చాలా బాధ పడ్డాము. కానీ ఏం చెయ్యగలం. ఇండియన్స్ మనం ఏవో విలువలు నమ్మి ఉన్నదాన్నే పట్టుకుని వేళ్ళాడతాం. చాలా కోల్పోతున్నామా? వాళ్ళు ఏవో వెతుక్కుంటూ ఉన్నదాన్ని వదిలేసి కొత్తదాని వెంట పరిగెడతారు.

ఏమైనా అధికంగా పొందగలుగుతున్నారా? ఇదివరకు పెళ్ళిచేసుకున్నాక ఇష్టం లేకపోయినా బలవంతంగా కలిసి బ్రతికేవారు. ఇప్పుడు ఇష్టపడి పెళ్ళి చేసుకుని కూడా విడిపోతున్నారు. ఎప్పుడూ మనసుకి సమాధానం లేదా! ఏమిటీ జీవితం! కొన్నాళ్ళు ఇంట్లోనే నానీని పెట్టి, కొన్నాళ్ళు డేకేర్‌లో ఉంచి ప్రసాద్ శ్వేతని పెంచుతున్నాట్ట.

పిల్లకి జ్వరంగా ఉన్నా ఆఫీసుకి, ఊళ్ళకి వెళ్ళాల్సి వచ్చేదిట. వింత వ్యథ! అంతదూరంలో పిల్లతో ప్రసాద్ ఎన్ని కష్టాలు పడుతున్నాడో! ఇంతమంది ఉండి కూడా శ్వేత అక్కడ అనాథలా పెరుగుతోంది. నాదగ్గర ఉంచమంటే ప్రసాద్ వినలేదు. ఎల్లలు లేవు అనుకున్న నా అభిప్రాయం మారిపోయింది. "కల్చర్‌గాప్ దాటడం కష్టం. అసాధ్యం. ద్వేషించక, విడిపోక తప్పదు. అది ట్రాజెడీ. దుఃఖం భరించాలి. మరిచిపోవటానికి కాలం కనికరించాలి" అనుకునేదాన్ని.

రమేష్‌కి పెళ్ళి నిశ్చయమైంది. ప్రసాద్ శ్వేతని తీసుకుని వచ్చాడు పెళ్ళికి.

"శ్వేతని మా దగ్గర ఉంచు. సంబంధాలు చూస్తాము. మళ్ళీ పెళ్ళి చేసుకో" అని చెప్పాం. "ఇప్పుడు చేసుకోను" అన్నాడు.

రమేష్ పెళ్ళి బాగా జరిగింది. పెళ్ళికి అన్నయ్య, వదిన వచ్చారు. వాళ్ళమ్మాయి మాలతి పోస్ట్ గ్రాడ్యుయేట్. సంబంధాలు చూస్తున్నారు. ఇంకా కుదరలేదు.

"నేను ప్రసాద్‌ని పెళ్ళి చేసుకుంటాను" అని వాళ్ళమ్మతో చెప్పింది. ఆ మాట అందరిలో సంచలనం కలిగించింది. ఇద్దరికీ ఎనిమిదేళ్ళ తేడా ఉంది. రెండవ పెళ్ళి. అన్నయ్యకి ఇష్టంలేదు. వదిన మాలతి మనసు మార్చాలని చూసింది కానీ అది వినలేదు.

"రెండో పెళ్ళి ఐతే ఏమిటి? ఎంతమందికి ఎఫైర్స్ ఉండటం లేదూ. అంతకంటె మంచిమనసుతో పెళ్ళి చేసుకుంటే తప్పేమీకాదు. నేను బేబీని పెంచగలను" అంది. అప్పటికే శ్వేతకి మాలతి దగ్గర చనువు ఏర్పడింది. శ్వేత పేచీలు పెడుతుంటే ఎలాగో మరిపించి నవ్వించేది. తనతో తిప్పుకుని ఆడించేది.

ప్రసాద్ ఇంకో రెండు వారాలు సెలవు పొడిగించి మాలతిని పెళ్ళి చేసుకుని తనతో తీసుకెళ్ళాడు. జీవితాలు ఎట్లా మలుపు తిరుగుతాయో ఆశ్చర్యం వేసింది. మూడేళ్ళ తర్వాత మాలతికి కొడుకు పుట్టాడు. అప్పుడు అన్నయ్య వదిన అమెరికా వెళ్ళారు.

ఆ మూడేళ్ళలో శ్వేత మాలతిని "అమ్మ" అని పిలవటం నేర్చుకుంది. శ్వేతకి మాలతి తన కన్నతల్లి కాదని తెలుసు. ఐనా మాలతంటే ప్రేమ. అలాగే అందరూ శ్వేత మాలతి సొంత కూతురు అనుకుంటారు. శ్వేతని ముద్దు చేస్తుంది. మళ్ళీ డిసిప్లిన్‌లో ఉంచుతుంది. ఆ చాకచక్యం ఉంది మాలతికి.

ఆనీ వెళ్ళిపోయిందన్న బాధ మరిచిపోయాను. ప్రసాద్ మీద, శ్వేత మీద నాకెంత ప్రేమ ఉన్నా, ఆనీ మీద నాకు రావలిసినంత కోపం రాలేదు. నాలో నాకే ఒక జిజ్ఞాస ఆనీ ఆంతర్యం గురించి. తనలో మమకారం లేదా? నేను ఇండియన్‌ని గనుక కుటుంబం యొక్క ఆనందం ఆలోచించి సమాధాన పడ్డాను. ఆనీ అమెరికన్! తన ఇష్టాలు, ఆంబిషన్స్ ముఖ్యం. భర్త, పిల్లలు దాని తర్వాతే.

భారతీయుల కున్న విశాలదృష్టి, విశ్వశ్రేయోభిలాష, ఇంకెవరికీ లేవు. అదే కదా మన సంస్కృతిలో ఉన్న గొప్ప! విశిష్టత! నేను ఆ నాడు సమాధాన పడబట్టే ఈనాడు మా కుటుంబం ఇంత ఆనందంగా ఉన్నాము. నాలో నేను ఇండియన్ని అయినందుకు గర్వం, తృప్తి కలుగుతుంటాయి. ఆనీ తన సుఖం చూసుకుని వెళ్ళిపోతే ప్రసాద్ ఎన్ని కష్టాలు పడ్డాడు! మళ్ళీ మాలతి ధర్మమా అని ప్రసాద్ కుటుంబం నిలబడింది. ఆయన ఉత్తరం చదివి "శ్వేతకి నీ పోలిక వచ్చింది రాయటంలో!" అన్నారు పరిహాసంగా. అందరూ వస్తున్నారంటే . . . చాలా సంతోషంగా ఉంది. జీవితానికి ఎన్ని రంగులు!

. . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .

వాళ్ళు వచ్చారు. అందరి కోసం రెండు సూటుకేసుల నిండా గిఫ్ట్‌లు తెచ్చారు. చీరలు, షర్టులు, బెడ్‌షీట్స్, వాచీలు, నైటీలు, చాకొలెట్లు, మేకప్ సామాగ్రి, టూల్స్ . . . ఒకటా అమెరికన్ వస్తువుల అందమే, నాణ్యతే వేరు. అందుకే అందరికీ అంత క్రేజ్! రమేష్ ముందరే వచ్చాడు భార్యని కూతుర్ని తీసుకుని, సాయంగా ఉండాలని.

అన్నయ్య వదిన వచ్చారు. లత కుటుంబంతో సహా వచ్చింది. నాలుగు రోజులు ఉండి వెళ్ళారు. ఆ నాలుగు రోజులు పెళ్ళివారి ఇల్లులా ఒకటే సందడి. భోజనాలు కాఫీ ఫలహారాలతో క్షణం తీరేది కాదు. మధ్య మధ్య షాపింగులూ, ఔటింగులూ. ఎక్కడికి వెళ్ళినా రెండు కార్లలో అందరం బయల్దేరే వాళ్ళం. లైఫ్ ఎంజాయ్ చెయ్యటం అంటే ఇదే అనిపించింది.

అందరం తలా ఒక పని చేస్తుంటే అలసట ఉండేది కాదు. రమేష్ బజారు పనులు చూస్తుంటే ప్రసాద్ కూరలు తరిగేవాడు. దోసెలు వేయటం కూడా వచ్చు. లత భర్త శ్రీను పిల్లల్ని తయారుచేసేవాడు. ఆవకాయ గోంగూరే కాదు, అవియల్, ఆవడలు, పాలక్ పనీర్, కొఫ్తా .. చేసి తినిపించాం శ్వేతకి. రాత్రి కథలు చెప్పమని పిల్లలందరూ నాదగ్గర చేరేవారు. దీపూకి తాతయ్య దగ్గర బాగా చేరిక అయింది. తెలుగు మాట్లాడటం వచ్చేది కాదు వాడికి. పిల్లలందరిలో శ్వేత ప్రత్యేకంగా కనిపించేది. నిజంగా ప్రత్యేకమైనదే. ఆ వొంటిరంగు, నీలికళ్ళు, ఎర్రజుట్టు! బంగారుబొమ్మ అనిపించింది చూడగానే. సన్నగా పొడుగ్గా కాళ్ళు, తీరైన ముక్కూ కళ్ళూ బార్బీ డాల్ అనాలేమో! స్కర్ట్, జీన్స్, ఫ్రాక్ .. ఏది వేసుకున్నా అందంగా ఉంటుంది.

తెలుగు రాయటం, చదవటం నేర్చుకున్నందుకు శ్వేతని అందరూ అభినందించారు. రాయటం బాగానే వచ్చింది కానీ మాట్లాడితే అమెరికన్ ఏక్సెంట్ ఉంటుంది. తరచూ ఓ.కె! అంటుంది. అమరచిత్రకథ, పంచతంత్ర .. పిల్లల పుస్తకాలన్నీ చదివేసింది అప్పటికే. నవలలు చదువుతోందిట! పొయిట్రీ ఇష్టం అంది. ఒకరోజు శ్వేత బుక్ రాక్ లోంచి ఒక పుస్తకం తీసి చూస్తుంటే "ఆ నవల బామ్మ రాసింది" అన్నారు ఆయన. శ్వేత నమ్మలేనట్లు చూసింది. "బామ్మ రాసిందా? ఇది ఒకటేనా? ఇప్పుడు కూడా రాస్తున్నావా?" అని అడిగింది.

"అది ఒకటే. రాయటం ఎప్పుడో మానేశాను" అన్నాను. "ఇప్పుడెందుకు రాయటం లేదూ?" అని అడిగింది నాకు దగ్గరగా వచ్చి. ఏమని చెప్పను? శ్వేతకి అర్థమవుతుందా? నిజానికి ఈ వయసులోనే ఎక్కువ అనుభూతి, ఆర్ద్రత, సాంద్రత ఉంటాయేమో! ఔను. సరోజినీనాయుడు ఆ వయసులోనే చక్కటి కవిత్వం చెప్పింది.

"అది ఒక పెద్దకథ!" అన్నాను నవ్వుతూ.

"పెద్దకథా? ఏమిటది?" అని అడిగింది శ్వేత.

"ఆకథకి నేను విలన్ని" అన్నారు ఆయన మధ్యలో కల్పించుకుని నవ్వుతూ. శ్వేత ఆశ్చర్యంగా మా ఇద్దర్ని మార్చిమార్చి చూసింది.

"మీ బామ్మ నాకు దుష్టుడు, రాక్షసుడు అనే బిరుదులు ఇచ్చింది" అన్నారు  మళ్ళీ నవ్వుతూ.

"చెప్పు బామ్మా" అంది శ్వేత సోఫాలో నాపక్కనే కూర్చుంటూ. నేను ఆయన వైపు చూశాను. "చెప్పు. నీకథ! మంచి శ్రోత దొరికింది. దీపూ ఎవరైనా మనని పొగుడుతుంటే మనం అక్కడ ఉండకూడదు. పద గార్డెన్‌లోకి వెడదాం" అంటూ దీపూని తీసుకెళ్ళారు. శ్వేత కుతూహలంగా చూస్తోంది.

"చెప్పాలంటే చాలా ఉంది. నువ్వు ఇప్పుడు చూస్తున్న ప్రపంచం వేరు.  ఆడవాళ్ళు చదువుకుంటున్నారు. మొగవాళ్ళతో సమానంగా ఉద్యోగాలు చేస్తున్నారు.  ప్రపంచసుందరి పోటీల్లో కూడా పాల్గొంటున్నారు. ఆరోజుల్లో అంటే సుమారు నలభై ఏళ్ళ క్రిందట  స్త్రీకి ఇల్లే ప్రపంచం. చదువుకున్నా సరే ఇంట్లో ఉండి, వంట చేస్తూ పిల్లల్ని  పెంచుకుంటూ భర్తకి సేవచేస్తూ ఆనందించాలి. ఇంటి గడప దాటటమే తప్పు. ఆరోజుల్లో మా అమ్మ మెట్రిక్  పాసయింది. నాన్న గారికి ఆడపిల్లలు కూడా చదువుకోవటం, సంగీతం పాడటం ఇష్టం.  అక్కయ్యకి సంగీతం చెప్పించారు. పన్నెండేళ్ళకే శ్రావ్యంగా త్యాగరాజ కీర్తనలు  పాడుతుంటే ముచ్చటపడి కచేరీ చేయించారు. పెళ్ళయిన రోజు వాళ్ళ అత్తవారు అక్కయ్య చేత పాడించి  మెచ్చుకున్నారు. కానీ తర్వాత అక్కయ్య మళ్ళీ పాడలేదు. అక్కయ్యకి రేడియోలో పాడాలని చాలా కోరిక ఉండేది. ఎప్పుడూ కాన్పులూ,  పిల్లలూ, వంట, అనారోగ్యాలు. కోరికలు తీరటానికి అవకాశమేదీ!

ఐనా దేవుడి దగ్గర పాడుకుంటూ కంఠం నిలబెట్టుకుంది. పిల్లలు  పెద్దవాళ్ళై కొంచెం అవకాశం చిక్కాక రేడియో ఆడిషన్‌కి వెడతానంది.

"ఈ వయసులో నీకు ఇదేం బుద్ధి! నలుగురూ నవ్వుతారు. నువ్వు స్టేజీ ఎక్కి  కచేరీలు చెయనక్కర్లేదు. నేను సంపాదిస్తున్నది చాలటంలేదా" అంటూ బావగారు  కేకలేశారు. దానిపాట ఏడుపుగా మిగిలిపోయింది.

"వెరీ అన్‌ఫెయిర్. ఇన్‌హ్యూమన్!" అంది శ్వేత. "ఔను. అమానుషమే. అన్యాయమే. ఆడపిల్లగా పుట్టటమే శాపం. మా  అత్తయ్య కూతురు లలితకి పదహారవ ఏట పెళ్ళి చేశారు. దాని దురదృష్టం! పెళ్ళయిన ఏడాదికే  భర్త పోయాడు. అత్తవారింట్లో మాటలు పడలేక, చాకిరీ చెయ్యలేక పుట్టింటికి వచ్చేసింది. మళ్ళీ స్కూల్లో చేరింది. వాళ్ళ అత్తయ్య కొడుకు రఘు దాని పెళ్ళి చేసుకుంటానన్నాడు.  తండ్రి ఒప్పుకోలేదు. లలిత కూడా "మళ్ళీ పెళ్ళి" చేసుకోను అంది.

అప్పటికే వీరేశలింగం గారు వితంతువివాహాలు జరిపించి సంఘంలో సంస్కరణ తెచ్చినా వితంతువివాహానికి ఆమోదం లేదు. ఏదో తప్పుగా అపవిత్రంగా భావించేవారు. రఘు ఇంటికి వస్తూ తనతో స్నేహంగా ఉండటంతో లలిత అతనితో ప్రేమలో పడింది. ఒకరోజు కోరికకు లొంగి పోయారు. లలిత తను తప్పు చేశానని చెప్పి ఆత్మహత్య చేసుకుంది." "ఆత్మహత్య ఎందుకు?" శ్వేత ప్రశ్నించింది. "ఆడవాళ్ళ మెదడు అట్లాగ కండిషన్ చెయ్యబడింది. పవిత్రంగా ఉండాలని, నిప్పులాంటిది అనిపించుకోవాలని. ఏదైనా పొరపాటు జరిగితే ఆత్మహత్య చేసుకునేవారు... బావిలో పడి, విషం తాగి" "పవిత్రమంటే?"

ఎన్నో మాటలు అలవాటుగా అనేస్తాము కానీ అర్థం చెప్పాలంటే ఆలోచించాల్సి వస్తుంది. "పవిత్రమంటే శుద్ధమైంది. కల్మషం లేనిది. ప్యూర్! పెళ్ళికాక ముందు అమ్మాయి వర్జిన్‌గా ఉండాలి. పెళ్ళి అయాక పతివ్రతగా ఉండాలి. పరాయి మొగవాళ్ళతో స్నేహం చెయ్యకూడదు. బోయ్‌ఫ్రెండ్స్ ఉండకూడదు..." అంటూ వివరిస్తున్నాను. "ఓ అదా!" అంది శ్వేత అర్థమైనట్లు. నేను నవ్వాను. "ఆ. అదే. భార్య మీద అనుమానం వస్తే రాముడు సీతని అడవికి పంపించినట్లు పుట్టింట్లో వదిలేసేవారు. భర్త మళ్ళీ పెళ్ళి చేసుకునేవాడు. మొగవాడు ఎన్ని పెళ్ళిళ్ళు చేసుకున్నా తప్పులేదు. భార్య పుట్టింట్లో అందరికీ చాకిరీ చేస్తూ ఏడుస్తూ బ్రతకాలి!" "అన్యాయం! డబుల్ స్టాండర్డ్స్! తాతయ్య ఏం చేశారూ! నువ్వు ఏం తప్పు చేశావూ?" శ్వేత కుతూహలం ఆపుకోలేక పోతోంది.

"నాది వేరేకథ. మా నాన్న గారికి ఆడపిల్లలు కూడ చదువుకోవటం ఇష్టం అని చెప్పాను కదూ. నన్ను కాలేజీలో చేర్పించారు. అప్పటికి ఆడవాళ్ళు చదువుకుంటున్నారు. అంటే డిగ్రీ చదువులు. రెండేళ్ళు చదివాక మంచి సంబంధం వచ్చిందని పెళ్ళి చేశారు. పెళ్ళి అవగానే నాచదువు ఆగిపోయింది. ఇంకా చదువుకుంటానని అడగాలని కూడా తెలీదు. పెద్దవాళ్ళు చెప్పిన మాట వినటమే తప్ప స్వంత ఆలోచన ఉండేది కాదు. ఆ దశలో అత్తవారింటికి వచ్చాను. నేను కవిత్వం రాస్తుండేదాన్ని. కథలు రాయాలని ఉండేది. ఆలోచనలు చెప్పిరావు కదా! మనకి తీరికగా ఉంది రమ్మంటే రావు కదా!

ఏ పని చేస్తుండగానో ఒక ఊహ వస్తే గబుక్కున వదిలేసి వెళ్ళి రాసేదాన్ని. అందమైన ఊహలు మనసులోంచి జారిపోకుండా పట్టుకోవాలని ఆతృత. ఒకసారి ఆయన చూశారు.

"తాతయ్యా?" అని అడిగింది శ్వేత.

"ఆ. ఏం రాస్తున్నావు, మీ అమ్మకు ఉత్తరమా?" అనడిగారు.

"కాదు. కథ" అన్నాను. తీసుకుని చూశారు.

కొత్తగా బయటి ప్రపంచాన్ని, జీవితాన్ని చూస్తున్న అనుభవం. వెల్లువలా జలపాతంలో ఉక్కిరి బిక్కిరి చేసే అనుభూతులు. నన్ను మెచ్చుకుంటారని ఎదురుచూస్తున్నాను.

"ఎందుకీ పిచ్చిరాతలు! వేళకి పనులు చేసుకోక ఎందుకీ కవిత్వాలు! వెళ్ళు గుండీలు కుట్టు" అన్నారు కాగితాలు పారేస్తూ.

లేత మనసేమో కన్నీళ్ళు జలజలా రాలాయి. అవమానం, మనసులో రోషం. ఆ షర్టు రేపు వేసుకోవటానికి కావాలి. తొందర లేదు. నేనేదో పనిమనిషినైనట్టు ఆర్డర్.

కాఫీ వేడిగా ఇచ్చినా చల్లారిపోయిందని మళ్ళీ చెయ్యమనటం, కూర బాగా చేసినా "వంట ఇలా తగలడిందేం? పొయ్యిమీద పడేసి కథ రాస్తున్నావా?" అని దెప్పటం. భర్తలు ఇలాగే ఉంటారా? ఎందుకిలా హింసిస్తారు? అని ఆశ్చర్యపడేదాన్ని.

"భర్త ఇంకొంచెం తెలివిగా, అనురాగంతో ఉంటే ఎంత ఆనందంగా ఉంటుంది!" అనుకునే దాన్ని. ఆయన ఇంట్లో లేనప్పుడు, నిద్రపోతున్నప్పుడు భయపడుతూ రహస్యంగా రాసేదాన్ని. పుస్తకాలు చదివేదాన్ని. నాలో ఆలోచనలు పెరిగాయి. వివేచన కూడా పెరిగింది.

"ఆడవాళ్ళయితే ఏమిటి? వాళ్ళకి మనసులేదా బుద్ధిలేదా మనుషులు కారా! మనిషి అనేవాడు తనకే కాదు ఎక్కడ అన్యాయం జరుగుతున్నా సహించకూడదు. ఎదుర్కోవాలి. పోరాడాలి!" అనుకునేదాన్ని. అప్పుడు ప్రసాదు పుట్టాడు. అమ్మా వాళ్ళింట్లో ఉన్నప్పుడు అన్నయ్య చేత కథ పోస్టు చేయించాను.

అది పత్రికలో వచ్చింది. ఆయనకి చెప్పాలని కూడా అనిపించలేదు. మా అత్తగారికి తెలిసింది. సంతోషిస్తూ ఉత్తరం రాశారు. ప్రసాద్‌కి మూడవ నెల వచ్చాక వచ్చాను. మళ్ళీ పాతకథ మొదలు. ఒక కథ పత్రికలో పడింది. అంటే నాకు కథలు రాసే టాలెంట్ ఉందన్నమాట. ఇంకా కథలు రాయాలి అనుకున్నాను. వీలు చేసుకుని రాస్తుండేదాన్ని. మా అత్తగారు మా దగ్గర కొన్నాళ్ళూ, మా మరిది దగ్గర కొన్ని రోజులూ ఉండేవారు. నాకు మళ్ళీ నెల తప్పింది. మా అత్తగారు మా దగ్గర ఉండటానికి వచ్చారు.

నేను పురిటికి వెడితే కొడుకు దగ్గర ఉండాలని. ఒకరోజు ఆయన ఆఫీసు నుంచి వచ్చేటప్పటికి ప్రసాదు ఏడుస్తున్నాడు. నేను పాలు కలుపుతున్నాను.

అత్తగారు ఎత్తుకుంటారనుకున్నాను. వాడు ఆగకుండా ఏడుస్తున్నాడు. "నువ్వు కథలూ కావ్యాలూ రాసుకుంటూ మాకు తిండి పెట్టవా? పిల్లవాడికి పాలు పట్టక చంపేస్తావా? నీకు సన్మానాలూ పేరూ కావాలనుకుంటే పెళ్ళెందుకు చేసుకున్నావూ? నీకు మొగుడెందుకు పిల్లలెందుకు! రచయిత్రివై పోవాలనుకుంటే మీ అమ్మ దగ్గర పుట్టింట్లో పడి వుండాల్సింది" అన్నారు.

మనసులో భయపడుతూనే "పెళ్ళయ్యాక ఇదే నా ఇల్లు కదా! పుట్టింటికి ఎందుకెళ్ళాలి? ఇక్కడ రాసుకోకూడదా, చదువుకోకూడదా?" అనడిగాను.

"అదంతా నాకు తెలీదు. మా అవసరాలు చూడాలి. అంతే" అన్నారు. అవసరాలు తీరుస్తూనే ఉన్నాను కదా. మరి ఎందుకీ నిర్బంధం? అది పురుషాహంకారం. ప్రేమని చంపేస్తుంది. అప్పుడది భార్యాభర్తల అనుబంధం కాదు. బానిసత్వం.

ఎంతో శ్రద్ధతో రాసి ఒక కథ పూర్తిచేశాను. అత్తగారితో చెప్పి పోస్టాఫీసుకి వెళ్ళి పోస్ట్ చేసి వచ్చాను. ఆయన మధ్యాహ్నం ఆఫీసు నించి ఇంటికి వచ్చారు. భోజనాలయ్యాక గదిలో పడుకున్నారు.

"ఇవేళ పత్రికకి కథ పంపించాను" అన్నను సంకోచిస్తూనే. కథ పడితే తెలుస్తుంది కదా.

"నువ్వే వెళ్ళావా?" అంటూ లేచి కూర్చున్నారు.
"దగ్గరే కదా. నేనే వెళ్ళాను"

"ఇవేళ పోస్టాఫీసంటావు. రేపు కోర్టుకి వెడతావు విడాకులు కావాలని!" తప్పు చేశానా అని ఆలోచిస్తున్న నా చెంపమీద చెళ్ళుమని దెబ్బ పడింది.

"కొట్టారా! నిజంగా కొట్టారా! నన్ను కొట్టారా?" చెంప తడుముకుంటున్నాను. నమ్మలేకపోతున్నాను. తల తిరిగిపోతోంది. మనసు విరిగిపోతోంది. నా మీద అసహ్యం. జీవితం మీద అసహ్యం నిండిపోతోంది. వీడెవడు అసలు? వీడితో నాకేం సంబంధం!.. ఉండకూడదు అనుకుంటూ చెంపమీద చెయ్యితో అలాగే గది బయటికి వచ్చాను.

"ఏమిటి . . ఏమైంది!" అనడిగారు అత్తయ్య గారు ఆదుర్దాగా. అప్రయత్నంగా చెయ్యి తీశాను. ఆవిడ చూశారు. . . ఎర్రగా కందిన బుగ్గ. "వాడి గొంతు వినిపిస్తుంటే ఏమిటో అనుకున్నాను. కొట్టాడా?" అంటూ ఆవిడ నా కళ్ళలోకి చూశారు. వెంటనే గదిలోకి వెళ్ళారు.

"నీకేమైనా బుద్ధుందా! భార్య మీద చెయ్యి చేసుకుంటావా? మన ఇంటా వంటా లేదు. ఇంకెప్పుడూ ఇలాగ జరగటానికి వీల్లేదు" అంటూ కేకలు వేశారు. ఆయన తల వంచుకున్నారు. ఆ రాత్రి మామధ్య మాటలు లేవు. మర్నాడే మా నాన్నగారు వచ్చారు నన్ను తీసికెళ్ళటానికి. నేను వెళ్ళేముందర మా అత్తగారు నాతో, "మనసులో పెట్టుకోకు. మరిచిపో. వాడి తప్పు ఉంది. వాడికి తెలీటం లేదు. నీ తప్పూ ఉంది. వాడి విషయంలో కొంత నిర్లక్ష్యం జరిగింది. కానీ వాడంత తొందర పడకూడదు.

కూర నీకైనా మాడచ్చు నాకైనా మాడచ్చు. వాడి కోపమంతా నువ్వు తనని లక్ష్య పెట్టటం లేదని. ఎంతో తొందర పడ్డాడు. నువ్వు కూడా తొందర పడకూడదు" అన్నారు.

నేను నాన్న గారితో వచ్చేశాను. ఇంక మళ్ళీ ఆ ఇంటికి వెళ్ళను అనుకున్నాను. మనసులో బాధ అవమానం రగిలిపోతుండగా ఒక నవల రాశాను. పోటీకి పంపించాను. స్త్రీలుతలుచుకుంటే ఏమైనా చెయ్యగలరు. ఎంతమంది స్త్రీలు ఉద్యోగాలు చెయ్యటం లేదూ. . ఆఫీసర్లు, ఇంజనీర్లు, డాక్టర్లు. . పుస్తకాలు రాస్తున్నారు. మంత్రి పదవుల్లో ఉన్నారు. రిసెర్చి కూడా చేస్తున్నారు.

కానీ భర్త పిల్లలు అనే బంధాలకి లొంగిపోతుంది. తనే బంగారు సంకెళ్ళు వేసుకుంటుంది స్త్రీ. మరి పురుషుడికి ఆ బాధ, బంధం ఎందుకు లేవు? నా భార్య, నా పిల్లలు అని మమకారం ఉండదా? ఈ భార్య పోతే ఇంకొక భార్య వస్తుందని ధీమా! స్త్రీకి ఈ మమతానుబంధం లేకపోతే జీవితానికి అర్థమే పోతుంది. జీవించాలనే కోరికే ఉండదు. ఒక కళాకారిణికి ఒక గమ్యం సాధన ఉంటాయి. ఒక భక్తురాలికి అన్వేషణ ఉంటుంది. కానీ ఒక సాధారణ స్త్రీ ఎలా బ్రతుకుతుంది ఒక గమ్యం లేకుండా, నా అనేవాళ్ళు లేకుండా? స్త్రీని చిన్నచూపు చూసే ఈ సంఘంలో స్వతంత్రించిన స్త్రీ జీవితం తెగిన గాలిపటం అవుతుంది. స్త్రీ ఎవరికోసమో కాక తన కోసం బ్రతకటం ఇంకా నేర్చుకోలేదు. ఈ సంఘంలో, కుటుంబంలో ఇంకా గౌరవనీయమైన స్థానం సంపాదించాలి.

దానికోసం పోరాడాలి. అంటే ఆర్థికస్వాతంత్ర్యం ఉండాలి. తనని తను పోషించుకోగలగాలి. ఉద్యోగం చెయ్యాలి. నేను నా చదువు పూర్తి చేస్తాను. . . ఈ ఆలోచనలలో నేను ఉండగా రమేష్ పుట్టాడు. బారసాలకి ఆయన, అత్తగారు వచ్చారు. "మూడవ నెల రాగానే పిల్లల్ని తీసుకుని

వచ్చెయ్" అన్నారు అత్తగారు. "బి.ఏ. పరీక్ష రాద్దామనుకుంటోంది" అంది మా అమ్మ. "అక్కడే చదువుకోవచ్చు. నేను ఇంకా కొన్నిరోజులు అక్కడే ఉంటాను" అన్నారావిడ.

ప్రసాద్ వాళ్ళ నాన్నని వదలటం లేదు, నా వొళ్ళో రమేష్ ఉండటం చూసి. "ఎప్పుడు వస్తావ్?" అని అడిగారాయన.
"ఇప్పుడు రాను. రాయాలనుకుంటే పుట్టింట్లోనే ఉండమన్నారు కదా!" అన్నాను.
"ఎందుకు రావు? చదువుకుంటానని అమ్మతో చెప్పావుట. అది నాకెంత అవమానమో బాధో నీకు తెలుసా? . . . మాట్లాడవేం?"

"మీకేనా అవమానం? బాధ! నాకు లేవా? నాకు అవమానం జరగదని నమ్మకం కలిగినప్పుడు వస్తాను" అన్నాను. ఆయన ముభావంగా ఉండిపోయారు.

నా నవలకి రెండవ బహుమతి వచ్చింది. నాకు కొత్తగా ఒక శక్తి వచ్చినట్లనిపించింది. ఆత్మవిశ్వాసం కలిగింది. నేను "రచన" చేస్తూ జీవించగలను అనుకున్నాను.

ఆయన, అత్తగారు కంగ్రాచ్యులేట్ చేస్తూ ఉత్తరం రాశారు. అప్పుడే ప్రసాద్‌కి జబ్బు చేసింది. టైఫాయిడ్. హైఫీవరు. నాన్న అని పలవరించేవాడు. వాళ్ళ నాన్న కోసం బెంగ పెట్టుకున్నాడు. జ్వరం తగ్గటంలేదు.

నాన్నగారు ఆయన్ని రమ్మని రాస్తానన్నారు. అప్పుడే నాలో మథనం మొదలైంది. నా సంగతి ఎట్లా ఉన్నా పిల్లలకి తండ్రి కావాలి. పిల్లలకి ఆయన్ని దూరం చెయ్యకూడదు. ఆయన ప్రవర్తనలో తప్పు ఉంది. ఐనా పెళ్ళి చేసుకున్నాక ఆ ప్రమాణాన్ని పాటించకపోవటం నేను కూడా తప్పు చేస్తున్నానేమో.

సుఖం లోనూ కష్టంలోనూ కూడా ఒకరికొకరు తోడుగా జీవిస్తాం అని కదా ప్రమాణం. "చావు మనని విడదీసేదాకా" అని వివాహం శాశ్వతబంధం. మెడలో మంగళసూత్రం కట్టించుకున్నాను. తలంబ్రాలు పోసుకున్నాము, మధుపర్కాలు కట్టుకుని. కొంగులు ముడివేసుకుని అగ్నిచుట్టూ ప్రదిక్షిణాలు చేశాము. అన్నీ బూటకమేనా! నాటకమేనా!

ఇప్పుడు లొంగిపోయినా జీవితంలో ఓడిపోకూడదు. ప్రమాణం పాటించాలి. ప్రసాద్ కోసం వెళ్ళిపోతాను. వెళ్ళటం అవమానం కాదు. వెళ్ళటం నా ధర్మం అనుకున్నాను. అందరి

సుఖసంతోషాల కోసం అనుకున్నాను. ప్రసాద్ బెంగపెట్టుకున్నాడు మీకోసం. రమ్మని రాశాను. వెంటనే వచ్చారు. ఆయన్ని చూడగానే ప్రసాద్ ముఖంలోకి నవ్వు వచ్చింది.

ఆయనే దగ్గర ఉండి మందులూ అవీ ఇచ్చారు. ఆరాత్రే జ్వరం తగ్గు ముఖం పట్టింది. నాచేతికొక పెద్ద బౌండు బుక్ ఇచ్చారు చూడమని. తెరిచిచూస్తే దానిలో పేజీల నిండా క్షమించు క్షమించు అని రాసి ఉంది.

లక్ష సార్లు రాశారుట. నేను కదిలిపోయాను. కరిగిపోయాను. కళ్ళలో నీళ్ళు వచ్చాయి. పిల్లలిద్దర్నీ తీసుకుని ఆయనతో ఇంటికి వచ్చాను. అంతా మా అత్తగారి చలువ. ఆవిడ మూలంగానే ఆయనలో అంత త్వరగా మార్పు వచ్చింది. ఆవిడే గనుక మామూలు అత్తగార్లలా కొడుకుని రెచ్చగొట్టి ఉంటే మేము విడిపోయి ఉండేవాళ్ళం..." అంటూ చెప్పటం ముగించాను.

"ఐతే తాతయ్య విలన్ నించి హీరోగా మారిపోయారు. మరి ఆ తర్వాత నువ్వెందుకు రాయలేదు. ఎందుకు మానేశావు?"

"తాతయ్య నన్ను "కథలు రాయి" అనేవారు. కానీ నేను మళ్ళీ రాయలేకపోయాను. ఎందుకో నాకే తెలియదు. సృజనాత్మక లక్షణం చచ్చిపోయిందేమో! ఇంటి పనులు శ్రద్ధగా చేసేదాన్ని. పిల్లలకి చదువు చెప్పేదాన్ని. పనివాళ్ళ పిల్లలకి కూడా చదువు చెప్పేదాన్ని. పిల్లలకి గుడ్డలు కుట్టేదాన్ని. మహిళాసమాజానికి వెళ్ళి సేవాకార్యక్రమాల్లో పాల్గొనేదాన్ని. అది నాకు తృప్తినిచ్చేది. ఒక ప్రయోజనం ఉన్న పని చేస్తున్నాను అనే భావం నాకు సంతోషం కలిగించేది." శ్వేత నారెండు చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంది.

"నీ పెద్దకథ ఇంకా పూర్తికాలేదు బామ్మా. నువ్వు మళ్ళీ కథలు రాయాలి ఇంకా రాయాలి" అంది ఒక మంచి మిత్రుడు సలహా ఇస్తున్నాట్లు. "నువ్వు రాయగలవు" అంది నాకు నమ్మకం కలిగిస్తూ.

శ్వేత దగ్గర ఒక డైరీ ఉంది. దానిలో ఆరోజు తను కొత్తగా నేర్చుకున్న తెలుగు పదాలు రాసుకుంటుంది. వాటిని మననం చేస్తుంది. ఒకప్పుడు తెలుగు భాష నాప్రాణం. కవిత్వం చదువుతుంటే ఆరుచి అమృతం తాగినట్లు ఉండేది. ఆమత్తులో నేనూ రాసేదాన్ని.

తర్వాత నా గురించి నేనే పట్టించుకోలేదు.

ఇన్నాళ్ళకి ఇప్పుడు నా మనవరాలు అడుగుతోంది. ఇక్కడ పిల్లలకి ఇంగ్లీష్ తప్ప తెలుగు రావటం లేదు ఇప్పుడు. ఎవరూ తెలుగు పుస్తకాలు చదవటం లేదు. సినిమాలు తీసినా, చూసినా అది తెలుగా? ఎప్పుడో ఒక మంచి తెలుగు సినిమా వస్తుంది.

ఇంక తెలుగు భాష అంతరించిపోతుందా? పోదు. తెలుగు భాష చిరంజీవి. అమరమూర్తి. ఎక్కడో అమెరికాలో పుట్టి పెరుగుతున్న నా మనవరాలు తెలుగు నేర్చుకుని నా గుండె తట్టి లేపుతోంది. అమెరికాలో ఆంధ్ర! దూరాలు తగ్గిపోతున్నాయా! భాష వారధి!

..............................................

వాళ్ళు ఇంక నాలుగు రోజుల్లో వెళ్ళిపోతారు. మధ్యలో నాలుగు రోజులు మెడ్రాస్ వెళ్ళి వచ్చారు అన్నయ్య దగ్గరికి. మాలతికి తల్లిదండ్రుల దగ్గర ఉండాలని ఉంటుంది కదా.

ఉయ్యాల బల్ల మీద కూర్చుని పుస్తకం చదువుతోంది శ్వేత. నా నవల చదవటం మొదలుపెట్టింది. నేను మాలతి తీరికగా వరండాలో కేన్ చెయిర్స్‌లో కూర్చున్నాం. మాలతి కబుర్లు చెప్తోంది. దీపు స్కూల్లో చేరాక మాలతి కూడా ఉద్యోగం చేస్తోంది.

"అక్కడ పనిమనుషులు ఉండరు. ఎవరిమీదా ఆధారపడకుండా ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటాం. ఇక్కడలా పవర్ లేకపోవటం, నీళ్ళు రాకపోవటం లాంటి ప్రాబ్లెంస్ ఉండవు. చాలా స్మూద్‌గా జరిగిపోతాయి పనులు. చాలా సుఖంగా ఉన్నామనిపిస్తుంది. కానీ సడన్‌గా ఏదో జరుగుతుంటుంది. ఎందుకో ఎక్కడికో తెలియకుండానే పరుగులు పెడుతున్నట్లు ఉంటుంది. హెల్ప్‌లెస్‌గా అయిపోతాం..."

"ఎందుకేమిటి? డాలర్ల కోసం!" అన్నాను నవ్వుతూ.

"ఔను. అక్కడ మాల్స్ చూస్తుంటే నాకూ అనిపిస్తుంది ఇన్ని వస్తువులు, ఇంత ఉత్పత్తి అవసరమా అని. ఇక్కడ మనం ఒకే వస్తువుతో కాలం గడుపుకుంటాం సాధారణంగా. అక్కడ ఒక వస్తువులో డిఫెక్టును మాడిఫై చేస్తూ దానికంటే నాణ్యమైన వస్తువును మార్కెట్ చేస్తూనే ఉంటారు. సెక్యూరిటీకి చాలా ప్రాధాన్యత ఇస్తారు. బద్ధకం అనేది ఉండదు. చూడము. కానీ ఇన్ని జాగ్రత్తలూ ఎందుకూ పనికిరాలే దనిపిస్తూ పెద్దవీ, చిన్నవీ కూడా ఆకస్మిక సంఘటనలు జరుగుతుంటాయి. ఏదో టెన్షన్ ఉంటుంది."

"మనం ప్రకృతికి దూరంగా పోతున్నకొద్దీ ఎక్కువ రక్షణ కావాల్సి వస్తుంది. అప్పుడప్పుడు ప్రకృతి ప్రతీకారం తీర్చుకుంటూనే ఉంటుంది" అన్నాను.

"టీవీలో లోకల్ న్యూస్ చూపిస్తుంటారు. బ్రతకటం ఎంత బాధ అనిపిస్తుంది అత్తయ్యా. ఒక బేబీ సిట్టర్ తన బాయ్ ఫ్రెండ్‌తో గడపాలని బేబీకి నిద్రమందు ఇస్తే ఆ బేబీ చచ్చిపోయింది. తల్లి తర్వాత ఏడిస్తే ఏం లాభం! ఇంకొక పిల్లవాడు డే కేర్లో ప్లే-పెన్‌లో ఆడుకుంటుంటే ఏదో డిఫెక్ట్ వల్ల ప్లే-పెన్ ముడుచుకుపోయింది. ఆ రాడ్స్ మధ్య పిల్లవాడి మెడ ఇరుక్కుపోయి ఊపిరాడక చచ్చిపోయాడు. అందులో డే కేర్ ఆవిడ తప్పులేదు. కానీ పిల్లవాడి ప్రాణం రాదు కదా. అక్కడ పిల్లల్ని పెంచటం చాలా కష్టం, ఇద్దరూ ఉద్యోగాలు చేస్తూ. ఇక్కడైతే ఇంట్లో పెద్దవాళ్ళు ఎవరో ఒకరు ఉంటారు పిల్లల్ని చూడటానికి." అని చెప్తోంది మాలతి.

"లేదు మాలతీ. ఇప్పుడు ఇక్కడా అంతా మారిపోయింది. పెద్దవాళ్ళతో కలిసి ఉండటం లేదు ఎవరూ. ఇక్కడా క్రెష్‌లూ అవీ వచ్చేశాయి. పిల్లల్ని ఇక్కడ పెట్టి అక్కడ పెట్టి నానా ఇబ్బందులూ పడుతున్నారు. ఆడవాళ్ళు ఉద్యోగాలు చేస్తున్నారు. సంపాదిస్తున్నారు. కావలసిన వస్తువులు కొనుక్కుంటున్నారు. టీవిలు ఫ్రిజ్‌లు మాత్రమే కాదు. స్కూటీలు, కార్లు, కొత్తగా మార్కెట్‌లో ఏ పరికరం వస్తే అది . . ఇంక డ్రెస్సులూ అవీ చెప్పక్కర్లేదు. కానీ మనస్థిమితం లేకుండా పోయింది ఈ సుఖాలు ఉన్నా. ఇది పోటీ ప్రపంచం. కనపడని హింస అనుభవిస్తున్నాడు మనిషి" అంటున్నాను. ఫోను మోగింది. మాలతి అందుకుని మాట్లాడింది. "ప్రసాద్, నీకు ఫోను. ఢిల్లీ నుంచి." అని పిలిస్తే ప్రసాద్ వచ్చి అందుకున్నాడు.

ప్రసాద్ మాట్లాడుతూ "ఆనీ" అనగానే ఉలికిపడ్డాను. మనసులో తెలియని ఆందోళన. ఫోన్ పెట్టేశాక ప్రసాద్ చెప్పాడు. "ఆనీ చేసింది. ఢిల్లీ నుంచి. వాళ్ళ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ పనిమీద వచ్చారుట. ఇక్కడ ఒక మల్టీ నేషనల్ కంపెనీ ప్రాజెక్ట్ ఒకటి స్టడీ చెయ్యటానికి. వచ్చే ముందర అక్కడ మా ఆఫీసుకి ఫోన్ చేసిందిట. ఇండియా వెడుతున్నానని చెప్పటానికి. నేను ఫామిలీతో హైదరాబాద్ వెడుతున్నానని తెలిసిందట." "ఆనీతో నీకు మాటలు ఉన్నాయా?" కనుబొమలు చిట్లిస్తూ అడిగాను. "ఎప్పుడేనా ఫోన్ చేస్తుంది. తన సంగతులు చెప్తుంది. అప్పుడు వెంటనే మళ్ళీ పెళ్ళి చేసుకుని మళ్ళీ విడిపోయారు. ఇప్పుడు చాలా మంచి పొజిషన్‌లో ఉంది. బాగా సంపాదిస్తోంది." అన్నాడు. "ఐతే ఏమంటుంది?" కంట్రోల్ చేసుకోలేక పోతున్న అసహనం నా గొంతులోకి వచ్చింది.

"శ్వేతని చూడాలని ఉందిట. చూపిస్తావా అని అడిగింది"
"చూపించటమంటే మన ఇంటికి వస్తుందా?"

"ఒబెరాయ్‌లో ఉంటాను, రమ్మంది. మాలతి ఇష్టం." అన్నాడు ప్రసాద్.
"అత్తయ్యని, మామయ్య గారిని చూస్తానందా?" మాలతి అడిగింది.
"లేదు" అన్నాడు ప్రసాదు.
"మమ్మల్ని అప్పుడే మరిచిపోయి ఉంటుంది" అన్నాను నేను.
"ఐతే శ్వేతని తీసుకుని నువ్వూ నేనూ వెడదాం. శ్వేత చూస్తానంటే. ఇష్టపడితే." అంది మాలతి.

మాలతి మామూలుగానే ఉంది. ఏ విధమైన ఆదుర్దా కనిపించలేదు. భర్త మీద నమ్మకం! నా మనసుకే ఏదో కంగారు. ఏదైనా సమస్య వచ్చిపడదు కదా!

"ఐ హావ్ నథింగ్ టు డూ విత్ దట్ లేడీ!" అంది శ్వేత ముందు, వినగానే. మాలతి ఏమని నచ్చచెప్పిందో, వెళ్ళటానికి ఒప్పుకుంది చివరికి. "ఆనీ ఏం చెయ్యగలదు? శ్వేత మీద హక్కు లేదు తనకి. చూస్తానంది. అంతే. తల్లి కదా!" అంది మాలతి నా అనుమానాలు గ్రహించి. ఇన్నేళ్ళ తర్వాత ఆనీ ఎందుకు వచ్చింది మా మధ్యకి!

తనకి శ్వేత కావాలంటుందా? ఆనీ రమ్మంటే శ్వేత వెళ్ళిపోతుందా! మనసు లోపలి పొరల్లో ఒణుకు. సముద్రంలో వాయుగుండంలా కడుపులో బాధ కదులుతూ దిగులు నన్ను కృంగదీస్తోంది. వాళ్ళు ముగ్గురూ వెళ్ళారు.

ఆనీకి ఇస్తానని పెర్‌ఫ్యూం ఇండియాస్ స్పెషల్ "జీనత్" తీసికెళ్ళింది మాలతి. బ్లూజీన్స్ మీద ఎంబ్రాయిడరీ చేసిన వైట్ బ్లౌజ్ వేసుకుంది శ్వేత. జుట్టుకి స్కార్ఫ్ కట్టుకుంది. కట్ చేసిన ముంగురులు నుదుటి మీద పడుతూ ముద్దు వస్తోంది.

మాలతి మైసూర్ సిల్క్ చీర కట్టుకుంది. ముత్యాలు పెట్టుకుంది. ఈ కాలం ఆడపిల్లలు అందంగా ఉండటం తెలుసుకున్నారు.

.........................................

వాళ్ళు ముగ్గురూ తిరిగివచ్చేదాకా నాప్రాణం .. నాలోలేదు. వాళ్ళు లోపలికి వచ్చి మాట్లాడకుండా కూర్చున్నారు. నేను ఆగలేకపోతున్నాను.

"హొటల్ ఎలా ఉంది? కృష్ణ ఒబెరాయ్‌కేనా వెళ్ళారు?" ఏదో అడిగాను.
"ఫైవ్ స్టార్ హొటల్‌కేం. దివ్యంగా ఉంది" అన్నాడు ప్రసాద్.

"ఆనీని చూశారా? శ్వేతని చూసి ఏమంది?" మళ్ళీ ప్రశ్నించాను.

"నాకళ్ళని నమ్మలేక పోతున్నాను అంది" అంది శ్వేత కొంటెగా నవ్వుతూ.

"చాలాసేపు తను వచ్చిన పని గురించి చెప్పింది. ఏం తింటారని అడిగింది. కాఫీ చాలు అన్నాము. కాఫీ తాగాము" అంది మాలతి.

"నీకు ఏ ఐస్‌క్రీం ఇష్టం అనడిగింది నన్ను. బటర్‌స్కాచ్, కసాటా ఇష్టం అన్నాను. కసాటా తెప్పించింది." అంది శ్వేత. "శ్వేతకి ఒక గిఫ్ట్ ఇచ్చింది. శ్వేత తీసుకోలేదు. గోల్డ్ చైన్. "నేను శ్వేత నించి ఏమీ అడగటం లేదు. ఈ చిన్న గిఫ్ట్ ఉంచుకోమను. లేకపోతే నేను బాధపడతాను అంది ప్రసాద్‌తో.

"యూ నీడ్ నాట్" అంది శ్వేత ఆనీతో.

"యు ఆర్ ఎ చార్మింగ్ లిటిల్ డెవిల్" అంది శ్వేత తలమీద ముద్దు పెడుతూ ఆనీ.

తర్వాత మేము వచ్చేశాము. వచ్చినందుకు మాకు థాంక్స్ చెప్పింది. " అంటూ ముగించింది మాలతి. తర్వాత నా వెనకాల లోపలికి వచ్చి నాచేతిలో చిన్న వెల్వెట్ బాక్స్ ఉంచి. "ఇది ఆనీ ఇచ్చింది. తర్వాత ఎప్పుడో శ్వేతకి ఇమ్మంది. ఇది శ్వేతకి చెందాలి అంది. నన్ను లోపలికి పిలిచి శ్వేతకి తెలియకుండా ఇచ్చింది" అంది.

పెట్టె తెరిచి చూశాను. నా కెంపుల నెక్లెస్. ఏవో బాధ సంతోషం కూడా కలిగాయి. "ఆనీ ఎలాగుంది?" అని అడిగాను.

"ఆనీ! .. ఇండిపెండెంట్‌గా ఉన్న లేడీని చూస్తే చాల ఎడ్మిరేషన్ కలుగుతుంది" అంది మాలతి. వాళ్ళు వెళ్ళిపోతే ఈ కబుర్లు చెప్పుకోటాలు, నవ్వుకోవటాలు, పిల్లల తగువులూ ఉండవు. మనసులో ఏ ఉత్సాహమూ ఉండదు. పూలన్నీ కోసేసిన చెట్టులా ఉంటుంది. బెడ్‌రూంలో ప్రసాదూ మాలతీ సూట్‌కేసులు సర్దుకుంటున్నారు. దీపూ వాళ్ళ తాతయ్య దగ్గర ఉన్నాడు. ఇద్దరూ విడియో గేంస్ ఆడుతుంటారు. శ్వేత ఉయ్యాల మీద కూర్చుని పుస్తకం చదువుతోంది. షాంపూ చేసిన జుట్టు మెరిసిపోతోంది. దగ్గరగా వెళ్ళి జుట్టు బాగా ఆరిందా అని చూస్తూ పక్కనే కూర్చుని "నీ జుట్టు బాగుంటుంది" అన్నాను.

"ఈ షాంపూకి మంచి బౌన్స్ వస్తుంది" అంది. అంటే పట్టుకుచ్చులా జారటం కాబోలు. ఏం చదువుతోందో నని భుజం మీదుగా చూశాను. "జురసిక్ పార్క్"! రెండుసార్లు చదివింది మళ్ళీ చదువుతోంది.

నేను చదువుతానని రమేష్ కొత్త పుస్తకాలు కొనితెస్తుంటాడు. మళ్ళీ చదువుతోంది. "నిన్న "సినారే గజళ్ళు" తీశావు చదవటానికి. చదివావా?" అనడిగాను. "రెండు పాటలు చదివాను. కవులు చిన్న మాటలతోనే బయటి ప్రపంచాన్ని లోపలి మన మనసుకి చూపిస్తారు కదు బామ్మా!" అంది.

నాకు ఆనందం కలిగింది. ఆశ్చర్యం కూడా వేసింది. "నీకు ఇదంతా అర్థమవుతుందా?" అన్నాను.

పుస్తకం పక్కన పెట్టి నా మొహంలోకి తీక్షణంగా చూసింది. చూస్తూ "నేను పదేళ్ళ నించీ స్కూల్‌కి వెడుతున్నాను. చదువుకుంటున్నాను. ఈ మాత్రపు జ్ఞానం నాకుండదా?

నేనంత బుద్ధి తక్కువ దాన్ని స్టుపిడ్‌ని అనుకుంటున్నావా?" అని అడిగింది. దాని మొహం ఎర్రబడింది కూడా. అట్లా అడిగినందుకు నొచ్చుకుంటూ "నా బంగారు తల్లికి కోపం వచ్చిందా! నువ్వు బాలసరస్వతివి. నీకు దిష్టి తగులుతుందని నాభయం. చీ చీ స్టుపిడ్ అనుకుంటానా? నానవల బాగుంది అన్నావు. బాగా రాశాను అన్నావు.

నువ్వు తెలుగు నేర్చుకున్నావు. ఊహాలు ఉన్నాయి. నువ్వు రైటర్‌వి ఐతే సంతోషిస్తాను. ఇంకా బాగా తెలుగు అభివృద్ధి చేసుకుని నా నవలని ఇంగ్లీషులో రాస్తావా" అనడిగాను దాని మొహం నావైపు తిప్పుకుని. వెంటనే చప్పట్లు కొట్టి నవ్వుతూ "నాకు నిజంగా కోపం వచ్చిందనుకున్నావా బామ్మా! నేను ఆక్ట్ చేశానంతే. నేను నటించగలను. మా స్కూల్లో నాకు డ్రమటిక్స్‌లో ప్రైజ్‌లు వచ్చాయి." అంది. నేను కూడా నవ్వేశాను. "ఔను. నీకు నిజంగా కోపం వచ్చిందనుకున్నాను. అది సరే. నిన్ను చాలా రోజుల నించి ఒక విషయం అడగాలనుకుంటున్నాను. నిజం చెప్తావా మరి!" అన్నాను అనునయంగా.

"నిజమే చెప్తాను. అడుగు బామ్మా" అంది శ్వేత నన్ను ఉత్సాహపరుస్తూ. చాలా సార్లు శ్వేతను అడగాలనుకున్నాను ఆ ప్రశ్న. అడగలేకపోయాను ఇప్పటిదాకా.

"నీకు ఆనీ అంటే కోపమా?" అడిగాను.
కొంచెంసేపు ఆలోచిస్తున్నట్లు సీరియస్‌గా ఉండిపోయింది శ్వేత.
"నాకు కోపం లేదు. కోపమెందుకూ?" అంది.

"ఆనీ చేసింది తప్పు కాదూ! అప్పుడు నువ్వు బేబీవి. నిన్ను వదిలేసి వెళ్ళిపోయింది. అందుకని నీకు ఆనీ మీద కోపం ఉంటుంది అనుకుంటున్నాను." అన్నాను.
"తప్పేముంది? తనకు ఏం కావాలో వెతుక్కుంది!" అంది.
"ఐతే మంచి - చెడు, తప్పు అనేవి లేవా?"

"మనిషికి ఫ్రీడం ఉండాలి. మనకి ఎందులో సంతోషం దొరుకుతుందో ఆ విధంగా జీవించటం స్వేచ్ఛ అంటే. నిర్బంధం ఉండకూడదు. లైఫ్ అంటే జీవించటం.. సంతోషంగా బ్రతకటం. నీ ఇష్టాల్ని చంపేసుకోవటం కాదు." అంది తనకి గట్టి అభిప్రాయాలున్నట్లు. "నిర్బంధం లేకపోతే తాగుతారు. డ్రగ్స్‌కి అలవాటు పడతారు. దొంగతనాలు చేస్తారు" అన్నాను.

"అవి చెడు అలవాట్లు. మానసిక బలహీనత. వాళ్ళు చాలా కష్టాలు అనుభవిస్తారు" అంది. "మరి వాళ్ళని ఎవరు రక్షిస్తారు? తన సుఖం చూసుకోవటం స్వార్థం కాదా! కుటుంబం కోసం త్యాగం చెయ్యటం గొప్ప విషయం కాదా!" అన్నాను. "గొప్ప ఏముంది! నీకు అందులో సంతోషం ఉంది. నీకు నీ ఫామిలీ కావాలి. వాళ్ల కోసం పని చెయ్యటంలో నీకు ఆనందం దొరుకుతుంది. నీకు ఏది చెయ్యాలని ఉందో అది చెయ్యగలగటం మంచి.

మీరాని ఎందుకంత ఆరాధిస్తారు? కుటుంబంకోసం ఏం చేసింది! తన సంతోషం భజనలు పాడుకోవటంలో ఉంది. భక్తిలో ఉంది! అది స్వార్థం కాదా! తన ఆనందం కోసం భర్తని, రాజుని, సంఘాన్ని లెక్క చెయ్యలేదు. నువ్వు కోరుకున్న లాగ జీవించాలి! కోరుకున్నది సాధించాలి. అదే పరిపూర్ణమైన జీవితం. నీ శక్తి సామర్థ్యాలని బట్టి మదర్ థెరెసా కావచ్చు. టెన్నిస్ ప్లేయర్ కావచ్చు. స్పేస్‌లోకి వెళ్ళచ్చు... ఒక ఆర్టిస్ట్ కావచ్చు. ఇంత ప్రపంచం ఉంది. భర్త, పిల్లల నీడలో ఉండటం సెక్యూరిటీ కోసం స్వేచ్ఛని జీవితానందాన్ని వదులుకోవటం చీమ జీవితం. ఇంకా హీనం.."

ఆ తరవాత శ్వేత ఏమంటుందో నాచెవులకి వినిపించలేదు. చీమ జీవితమా!

గుహల కాలం, అడవిలో అరాచకం, అభద్రతా భావం, స్వేచ్ఛా ప్రణయం దాటి సుస్థిరమైన శాంతి భద్రతల కోసం ఈ సాంఘిక వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ ఏర్పాటు చేసుకున్నాం. వ్యక్తి స్వేచ్ఛ అవాంఛనీయం అనుకున్నాం. ఆపాఠం మరిచిపోయామా! మళ్ళీ ఆ చక్రం లోకే వెడుతున్నామా?

"శ్వేత చిన్నపిల్ల! దాని మాటలకేమిటి?" అనుకుని ఊరుకోలేకపోతున్నాను. స్త్రీ ఈ గృహపరిధిని ఛేదించుకుని ఎదిగి ఇంకా ఉన్నత శిఖరాలని అందుకుంటుంది. దీన్ని మించిన బ్రహ్మానందమేదో

పొందుతుందా? అటువంటి ఆనందం నిజంగా ఉందా? ఎవరు చెప్తారు? ఆనీ చెప్పగలదేమో! ఔను. ఆనీ చెప్పగలదు అనుకున్నాను. ఏ పని చేస్తున్నా ఊరికే ఉన్నా కూడా శ్వేత మాటలే గుర్తుకు వస్తున్నాయి.

"నాది చీమ జీవితమా!" అనుకుంటే నాలో ఉన్న గర్వమంతా కూలిపోతున్నట్లుగా ఉంది. నిజమైన ఫెమినిజం ఏమిటి? నేను పొందుతున్నాననుకుంటున్న ఆనందం అబద్ధమా? ఆడవాళ్ళు ఉద్యోగం చెయ్యటం, మొగవాళ్ళు వంటపని ఇంటిపని చెయ్యటమా? ఫెమినిజం. ఇది కూడా డివిజన్ ఆఫ్ లేబరే కాదూ! ఇప్పుడు మొగవాళ్ళు ఇంటిపనులు చేస్తూనే ఉన్నారు. ఆడవాళ్ళు చేసిన ఇంటిపనికి లెక్కకట్టి డబ్బులు పుచ్చుకోవటమా? అది యజమాని - పనిమనిషి సంబంధమౌతుంది కానీ భార్యాభర్తల సంబంధం కాదు.

స్త్రీకి తనకు నచ్చిన పురుషుణ్ణి పెళ్ళి చేసుకునే స్వతంత్రం ఉండాలి. ఇద్దరికీ కలవనప్పుడు వివాహబంధం శాశ్వతం కానవసరం లేదు. వివాహబంధంలో పవిత్రత, శారీరకమైన అపవిత్రత కూడా బూటకాలే. ఒక స్త్రీ, పురుషుడు మనసా వాచా ఇష్టపడి దాంపత్యం చెయ్యటమే రైటు. ఇవన్నీ నేను అర్థం చేసుకోగలిగాను. అంగీకరిస్తున్నాను. అంతేకాదు. మేము - నేను, ఆయనా ఒక స్థాయీభావాన్ని చేరుకున్నాం అనుకుంటున్నాను. సంసారంలో భార్యాభర్తల మధ్య ఎన్నో భేదాలు, అపార్థాలు వస్తాయి. వాళ్ళ మధ్య కొంచెం సహనం, కొంచెం అనురాగం ఉంటే క్రమంగా ఆ సంచారీభావాలు అంతరించి ప్రేమ ఏర్పడుతుంది. రససిద్ధి కలుగుతుంది.

ఇద్దరూ కలిసి జీవితాన్ని అనుభవించటం, ఆనందించటం నేర్చుకుంటారు. ఒకే స్త్రీ, ఒకే పురుషుడు జీవితాంతం కలిసి ఉండాలా? ఆ సెక్స్‌లైఫ్ బోర్ కొట్టదూ అని ప్రశ్నిస్తుంటారు ఆధునికులం అనుకునే భౌతికవాదులు. కేవలం శారీరిక సుఖమే కోరుకుంటే .. విసుగే పుడుతుంది. భార్యాభర్తల మధ్య సంబంధం కేవలం శారీరికం గాక మానసికమైన అనుబంధం. ఆత్మల సంయోగం ఐతే - ప్రతిరాత్రి వసంతరాత్రి కాకపోయినా - జీవితంలో ప్రతిరోజూ ఒక నూతనమైన అనుభూతి, మానసిక పరిణతి అనుభవంలోకి వస్తాయి. ఇదే భారతీయుల ప్రణయ సిద్ధాంతం. వివాహం యొక్క ఆదర్శం. మేము ఈ స్థితిని చేరుకున్నాం అనుకుంటున్నాను. అది కూడా భ్రమేనా! ఆరోజు రాత్రి డబుల్‌బెడ్ మీద నేను ఇటూ అటూ కదులుతున్నాను నిద్రపట్టక.

"ఏమిటాలోచిస్తున్నావ్!" అనడిగారు ఆయన నానడుం మీద చెయ్యివేసి. నవ్వాను.
"ఏమీలేదు. శ్వేత మాటలు గుర్తువచ్చాయి. నేను చీమని అనుకుంటున్నాను... మనిషి ఎంత గొప్ప వాడు! అనుకుంటాం. ఈ అనంతమైన సృష్టిలో మనిషి ఒక చీమ. మనమంతా చీమలమే!"

అన్నాను.

"ఒక చీమ ఇంకొక చీమకి గుడ్‌నైట్ చెప్తోంది" అన్నారు ఆయన దగ్గరగా జరిగి.

.............................................................

వాళ్ళు వెళ్ళిపోయారు. చేరినవెంటనే ఫోన్ చేశారు. మమ్మల్ని అమెరికా రమ్మని చెప్పారు. ఆయనకేం, ఇంజనీరింగు స్టూడెంట్స్‌కి పాఠాలు చెప్తూ రోజు గడిపేస్తారు. టి వి చూస్తారు. నేను పనిలేనప్పుడు ఉయ్యాల బల్ల మీద కూర్చుంటున్నాను.

అక్కడ కూర్చుంటే శ్వేత గుర్తు వస్తుంది. ఎన్ని సంగతులు చెప్పేది! కబుర్లపోగు. "అక్కడ కూడా వైఫ్ బీటింగ్ ఉంది బామ్మా. నా ఫ్రెండ్ మాగీ ఉంది. వాళ్ళ అమ్మా, నాన్నా ఇద్దరూ తాగుతారు. బాగా తాగుతారు. తాగి కొట్టుకుంటారు. మాగీ స్కూలికి రాగానే "ఇవేళ మామాం పెదవి చిట్లి రక్తం వచ్చింది" అని ఒకరోజు చెప్తే మర్నాడు "మాడాడ్ తలకి బొప్పి కట్టింది ఇవేళ" అని చెప్తుంది. వాళ్ళిద్దరూ రోజూ కొట్టుకోవాల్సిందే. ఇంట్లో వస్తువులన్నీ పగిలిపోతుంటాయి. దాని గురించి మళ్ళీ కొట్టుకుంటారు" అని పకపకా నవ్వి నన్ను నవ్వించింది.

అది గుర్తుచేసుకుని నవ్వుకుంటుంటే ఫోన్ రింగయ్యింది.
వెంటనే లేచి వెళ్ళి అందుకున్నాను.
"హల్లో.."
"హలో .. అమ్మా! నేను ప్రసాద్‌ని"
ప్రసాద్! పేరు వినగానే సంతోషం. దూరాన ఉన్నప్పుడు మాటవినిపిస్తేనే చూసినంత సంతోషం.
"ప్రసాద్! అంతా కులాసా యేనా!" ముందర క్షేమ వార్త వినాలి.
"ఆ! నాన్న గారికి దగ్గు తగ్గిందా! మందు వేసుకుంటున్నారా?"
"అన్నీ తగ్గాయి. ఇప్పుడు బాగున్నారు. క్లాసులు చెప్తున్నారు. విశేషాలేమిటి.."
"అమ్మా! ఒక సంగతి చెప్పాలి. ఒక రకంగా బాడ్ న్యూస్ ... " అని ఆగాడు.
"శ్వేతకి ఏమీ అవలేదు కదా .. దీపూ.." నా గుండె వేగంగా కొట్టుకుంటోంది.
"శ్వేతకి ఏమీ అవలేదు. మేమంతా క్షేమమే. ఆనీ .. ఆనీ చచ్చిపోయింది. షి ఈజ్ డెడ్" అన్నాడు.
"అయ్యో! ఆనీ .. ఎప్పుడు? ఎట్లాగ?" నాకు మాటలు రావటం లేదు.
చాలాసేపు అనిపించిన అరనిముషం నిశ్శబ్దం తరవాత చెప్పాడు.
"ఆనీ మళ్ళీ పెళ్ళి చేసుకుందని చెప్పాననుకుంటాను. అప్పుడు ఒక కొడుకు పుట్టి ఆ కొడుకుని ఆనీ

భర్తే చూసుకునేవాడు. పెంచాడు. రెండేళ్ళ తర్వాత అతను ఆక్సిడెంట్‌లో చచ్చిపోయాడు... రిచ్ ఫెలో. చాలా ఆస్తి వదిలిపోయాడు."

"ఊ."

"పిల్లవాడి బాధ్యత ఆనీ మీద పడింది. ఇదంతా న్యూస్ పేపర్లో, టి.వి.లో వచ్చింది. ఆనీ జీవితమంతా రాశారు."

"అప్పుడేమయింది?"

"నాలుగో ఏట స్కూల్లో వేసింది. అప్పటినించే మాట వినేవాడు కాదుట. ఆరో ఏట హాస్టల్లో చేర్పించింది. పిల్లల్ని కొట్టేవాడుట. వస్తువులు దొంగిలించే వాడుట. స్కూళ్ళు మార్పించింది. పదేళ్ళు వచ్చేసరికి రెండు సార్లు హాస్టల్ నించి పారిపోయాడుట. ఇంట్లోంచి డబ్బు తీసుకుపోయి ఫ్రెండ్స్‌తో తిరిగేవాడుట. వాడికి టీనేజ్ ఫ్రెండ్స్ ఉన్నారుట. డబ్బు ఇవ్వాలి. దొంగతన ంగా డబ్బు, విలువైన వస్తువులు తీసుకెళ్ళేవాడు. నగలు కూడా దొంగతనం చేశాడుట. వారం క్రిందట హాస్టల్ నించి వచ్చాడుట. డబ్బు కావాలన్నాడుట. ఆనీ డబ్బు ఇవ్వను .. ఏం చేస్తావ్ అందిట. వెంటనే పిస్టల్ తీసి రెండు సార్లు కాల్చాడు. వెంటనే పారిపోయాడు... పోలీసులు పట్టుకున్నారు. పన్నెండేళ్ళు ఉంటాయేమో! ఏం చెయ్యగలము!.. నీకు చెప్పాలనిపించింది.. చాల బాధ అనిపించింది. ఆనీ ఇంక లేదు. ఎక్కువ వరీ అవకు... చేసేదేమీ లేదు.. బై .. ఫోన్ పెట్టేస్తున్నాను.." పెట్టేశాడు ప్రసాద్.

ఎక్కడిదో అర్తనాదం ... నా గుండెలో ప్రతిధ్వనిస్తుంది. ఎవరిది! పన్నెండేళ్ళవాడు. తల్లిని చంపాడు –. ఎందుకు? ఎందుకు! ఏం చెయ్యలేము. ఏం చెయ్యలేమా? ఎందుకూ? ఎందుకని! ఏమీ చెయ్యలేము... తల పట్టుకుని కూర్చుండిపోయాను. ఆయన గార్డెన్‌లో ఉన్నారు.

ఆయన వచ్చేదాకా అలాగే కూర్చున్నాను. రాగానే అంతా చెప్పాను. పదేళ్ళపిల్లవాడు ... జైల్లో ... పోలీసుల మధ్య! కొడుతుంటారేమో! బాధపడతాడా! భయపడతాడా! మొండికేస్తాడా? వాడు ఏం చేశాడో వాడికి తెలుసా అసలు!

ఆరాత్రి నాకు నిద్ర పట్టలేదు. "రేపు గుడికి వెడదాం" అన్నారు ఆయన. నాకు నిద్ర పట్టని రాత్రి "రేపు గుడికి వెడదాం" అంటారు.

...........................................

ఒక వారం గడిచింది . . . మెల్లగా . . భారంగా.
సాయంత్రం పిల్లలు చదుకోటానికి వచ్చారు. పనివాళ్ళ పిల్లలు ముగ్గురు. "ఎవరి భవిష్యత్తు ఎలా ఉంటుందో! వీళ్ళు పెద్దవాళ్ళై తమని ఉద్ధరిస్తారని, ముసలి తనంలో పోషిస్తారని వాళ్ళ తల్లిదండ్రులు ఆశపెట్టుకుంటారు వీళ్ళ మీద. నాలుగు అక్షరాలు నేర్పించి మంచి పౌరులు కావాలని నేను ఆశపెట్టుకుంటున్నాను" అనుకుంటున్నాను.

ఫోను రింగయింది. అందుకున్నాను. మాలతి! ఎదురుచూస్తున్నాను . . మళ్ళీ ఫోను వస్తుందని. చాలా మాట్లాడాలని ఉంది.

"మాలతీ ఎలాగున్నారు? శ్వేత ఏమంటోంది? తనకి అంతా తెలిసిందా!" అడిగాను.

"తెలిసింది. తెలియకుండా ఎలా ఉంటుంది? టి.వి. చూస్తుంది. పేపర్స్ అన్నీ చదువుతుంది. ఏదీ దాచలేము. ఒక రోజంతా చాలా మూడీగా ఉంది. ఎవరితోనూ మాట్లాడలేదు. ఆరాత్రి శ్వేత దగ్గరే పడుకున్నాను. మర్నాడు దానికి ఇష్టమైన గోల్ఫ్ ఆడటానికి వెళ్ళింది. అక్కడినించి వచ్చాక మామూలుగా అయిందనిపించింది. నా చెయ్యి పట్టుకుని "ఐ హావ్ నథింగ్ టు డు విత్ డట్ ఉమన్" అంది. హేరీ గురించి మేము మాట్లాడుకుంటుంటే "ఆ పిల్లపాముని మన ఇంటికి తీసుకురావద్దు" అంది గట్టిగా. తీసుకురాము అని చెప్పాను. ఆ ఉద్దేశం మాకు లేదు. కానీ ప్రసాద్ వాడికి తక్కువ శిక్ష పడేలాగ చూడమని, మేము గార్డియన్స్‌గా ఉంటామని జువెనైల్ కోర్టుకి ఎప్పీల్ చేశాడు." అని చెప్పింది.

ఒక సంతోషరేఖ విరిసింది నాలో.
నేను చీమని కాదు. నాది తల్లిమనసు. ప్రపంచాన్ని పాలించే తల్లి మనసు.

నా నమ్మకాలు నా ఊహలూ తప్పుకావు.
తన సంతానాన్ని పెంచే బాధ్యత స్త్రీది. అందుకే నేను స్వేచ్ఛని సమర్ధించలేకపోయాను.

పిల్లల్ని కనటమే కాదు, సక్రమంగా పెంచాల్సిన బాధ్యత స్త్రీది. బాధ్యత బానిసత్వం కాదు.

స్త్రీకి స్వతంత్రం ఉండాలి. తగిన భర్తని పొందటానికి, కోరుకున్న జీవితం సాగించటానికి.

కానీ అంతకంటె ముఖ్యమైన బాధ్యత ఉంది. పిల్లల్ని ప్రేమతో పెంచటం. తల్లి ప్రేమలో పెరగని పిల్లలు ఆర్ద్రత ఎరగని రాక్షసులవుతారు. తల్లిప్రేమలో పెరిగిన పిల్లలు సత్వసంపన్నులవుతారు. ఈ నాటి స్త్రీ పురుషుడితో పోటీ పడి సుఖం, ధనం, అధికారం వెంట పరుగుపెడుతుంది.

మగవాడిని మించాలని స్త్రీ సహజమైన కరుణని ప్రేమని చంపేసుకుంటోంది. ఈనాటి ప్రపంచంలో హింస పెరగటానికి కారణం మగవాడి ఐశ్వర్యకాంక్ష, అధికారదాహం. స్త్రీ కూడా పురుషుణ్ణి అనుకరిస్తే ఈ ప్రపంచాన్ని ఎవరు రక్షిస్తారు? స్త్రీ మూలశక్తి!

ఆడని మగని కూడ స్త్రీ తన గర్భంలో మోసి కంటుంది. కనటమే కాదు. ప్రేమతో పెంచుతుంది. రక్షిస్తుంది. అదే మాతృప్రేమ. మొగవాడు తేనెటీగ! కనటానికి పనికివస్తాడు. కండబలంతో పరిశ్రమ చెయ్యగలడు.

ఆడదాని గుండెలో ఉండే అమృతపు పొంగు వాడికేది! తన సంతానాన్ని రక్షించుకోవటం వాడికేమి చాతనవును! వాడికి గర్భసంచీ లేదు. ఈ తల్లిప్రేమ లేదు. ఈ రక్షణ బాధ్యత సహజంగా లేదు.

తరతరాల సంస్కారంతో ఇప్పుడు బాధ్యత నేర్చుకుంటున్నాడు. ఈనాటి సంస్కారంతో స్త్రీ తన బాధ్యత మరిచిపోతోంది. ఆనాటి స్త్రీ పరిధి ఇల్లు. ఈనాటి స్త్రీ పరిధి ప్రపంచం. ఆనాటి గృహిణి తన సంతానాన్ని సత్ప్రవర్తనులుగా తీర్చినట్లు ఈనాటి స్త్రీ ఈ ప్రపంచాన్ని మరమ్మత్తు చెయ్యాలి.

ఆధునిక స్త్రీ ఇష్టంలేని దుష్టుడైన భర్తని తిరస్కరించినట్లు సమర్థురాలు శక్తిమంతురాలు అయిన స్త్రీ దోపిడీని హింసని పెంచే ప్రభుత్వాల్ని పడగొట్టాలి.

శ్వేతా! వింటున్నావా? ఈ బామ్మ ఆత్మఘోష. నువ్వు ఈ సందేశాన్ని ప్రపంచానికి అందించాలి! ఇంత హింస విజృంభిస్తున్నా ఇంకా ఈ ప్రపంచంలో ఇంకా ఇంత ఆనందం, అందం మిగిలే ఉన్నాయంటే – మంచి తల్లిదండ్రులే కారణం!!!!



# కావలెను

నివాసి

ఆంధ్రా నుండి అమెరికాలో రెండు మూడు నెలలు పర్యటించి తిరిగి ఆంధ్రాకు వెళ్ళటానికి ఇష్టపడే కళాకారుల దగ్గర్నుంచి (రాజకీయ కళలో ఉద్దండులు మాత్రం వద్దు; మరే కళైనా ఫరవాలేదు) దరఖాస్తులు కావలెను. క్రింద విధింపబడిన షరతులకు పూర్తిగా అంగీకరించిన కొందరు వ్యక్తులను మేము ఎంచుకున్న తర్వాత వారికి మా ఖర్చులపై వీసా, ఎయిర్ టికెట్స్ ఇప్పించటమే కాకుండా కొంత ధనరూపంలో ముట్టచెప్పటానికి వీలు కావచ్చునని చెప్పటానికి చాలా సంతోషిస్తున్నాము. ఐతే ఎంత ఇవ్వగలం అనేది ముందుగా చెప్పలేము. అది ఎంపిక కాబడ్డ వ్యక్తుల సామర్థ్యం మీద చాలా వరకు ఆధారపడుతుంది.

నిబంధనలు.

1. దరఖాస్తుదారుడు ఏ కళ లోనూ నిష్ణాతుడు కాకూడదు. కాని ధనాకర్షణ, సమయానుకూల కులతత్వ ప్రదర్శనల్లో మాత్రం నిష్ణాతుడు కావాలి.

2. ఏ విషయం మీదనైనా అనర్గళంగా, అమితమైన ఆత్మవిశ్వాసంతో, జనాన్ని (తాత్కాలికంగా నైనా) నమ్మించ గలిగేట్లుగా మాట్లాడ గలగాలి.

3. ఎంపిక చేయబడ్డ వ్యక్తి అమెరికాలో మేము నిర్ణయించే ప్రదేశాలలో మాత్రమే ప్రదర్శనలు ఇవ్వాలి.

4. ఈ ప్రదర్శనలకు వచ్చే రాబడి మొత్తం నిర్వహకులదే (అంటే, మాదే)!

5. ప్రతి ప్రదర్శనలోను ఇద్దరు ముగ్గురు నిర్వాహకులు (మా వాళ్ళు) తప్పకుండా వేదికమీద ఉన్నతాసనాలు ఎక్కి కూర్చుంటారు. వారి పని కేవలం అప్పుడప్పుడు చిరునవ్వులు నవ్వుతూ ఉండటమే అయినా ప్రదర్శకుడు ఏ మాత్రం అభ్యంతర పెట్ట కూడదు.

6. అవసరం ఉన్నా లేకపోయినా సదరు ప్రదర్శకుడు వీలైనన్ని సార్లు మమ్మల్ని పొగడాలి. ఒక్కో సభకు కనీస సంఖ్య పది సార్లు.

7. ప్రదర్శకుడు ప్రేక్షకులు తనకు పాదాభివందనాలు చేసేటట్లు తన వాచా, కర్మణా సర్వ ప్రయత్నాలు చెయ్యాలి. (డబ్బు ఎక్కువ పోగుచేయటానికి ఇది ఉండితీరవలసిన సన్నివేశం.)

8. ఏ సందర్భంలో నైనా ఎవరైనా దుండగులు నిర్వాహకులని గాని, ప్రదర్శకుడిని గాని తిట్టినట్లైతే, దానికి ప్రదర్శకుడు ఏ మాత్రం బాధ పడక పోవటమే కాకుండా నిర్వాహకులను తన శక్తి మేర సమర్థించాలి.

9. ఈ పర్యటనలో ప్రదర్శకుడిని మా వ్యతిరేక వర్గం వాళ్ళు ఎవరైనా తమ వైపుకు లాగాలని ప్రయత్నించినా తను లొంగకూడదు. ఒకవేళ ప్రదర్శకుడు ఇంకెవరితోనైనా చేతులు కలిపితే మాకు 10,000 డాలర్లు నష్టపరిహారం చెల్లించాలి. తన తిరుగు ప్రయాణం బాధ్యత మేము ఆపై ఏమాత్రం భరించము.

10. అమెరికాలో ఉన్నన్ని నాళ్ళు, ఎవరెవరి ఇళ్ళలో ఉంటాడో వాళ్ళకు రెండు వందల డాలర్ల వరకు మాత్రమే ఫోన్ బిల్లులు వచ్చేట్లు చూడాలి (అంతకన్న ఎక్కువైతే అనవసరపు దుష్ప్రచారం జరగొచ్చు). వారిచ్చే ఎలాటి ఘన, ద్రవ పదార్థాలు పుచ్చుకున్నా మాకు అభ్యంతరం ఉండదు - వాళ్ళ బాత్ రూమ్‌లు గలీజ చెయ్యనంత వరకు.

11. ప్రదర్శకుడు తనంత తానుగా ఎటువంటి ధనార్జనకు పూనుకోకూడదు. అయితే కొన్ని అసాధారణ పరిస్థితుల్లో నిర్వాహకుల అనుమతితో వారికి కొంత డిపాజిట్ ముందుగా చెల్లించి ఇటువంటి పనులు చెయ్యవచ్చును. కాని అలా వచ్చిన దానిలో నిర్వాహకుల వాటా కనీసం 50 శాతం ఉంటుంది.

12. ప్రదర్శకుడు తప్పనిసరిగా తిరిగి ఇండియాకు వెళ్ళి తీరవలెను. (ఇక్కడే ఉండి మా పరువు తియ్యటానికి మేము ఒప్పుకోము)

13. పర్యటన పూర్తి అయి తిరిగి వెళ్ళిన తరువాత మా గురించి, మేము చేస్తున్న కళాసేవ గురించి విరివిగా వ్యాసాలు రాయాలి, ఉపన్యాసాలు ఇవ్వాలి. వ్యాసాలు స్థానిక పత్రికల్లో ప్రచురించే బాధ్యత కూడ మీదే!

14. ఒక్కసారి అమెరికా వచ్చిన వ్యక్తికి సాధారణంగా మరో సారి వచ్చే అవకాశం ఇవ్వము. కాని కొన్ని సందర్భాలలో హెచ్చు రుసుము వసూలు చేసిన మీదట తిరిగి తీసుకువచ్చే అవకాశం ఉంది. కనుక తిరిగివెళ్ళాక మా మీద నిందలు వేసే ప్రయత్నాలు చెయ్యకూడదు.

ఈ నిబంధనలకు అంగీకరిస్తున్నట్లు స్టాంప్ పేపర్ మీద సంతకం చేసి 25,000 రూపాయల డిపాజిట్‌తో ఈ క్రింది చిరునామాకు మీ దరఖాస్తులు పంపవచ్చును. మామూలుగానే, ఇంకా ఎక్కువ పంపిన వారికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

భవదీయుడు
సన్మాన చక్రవర్తి



# CAROWIN RIDES

విన్నకోట రవి శంకర్

'భయం' అంటే – ముసుగువేసుకొని,
హఠాత్తుగా ఎదురొచ్చే అపరిచితవ్యక్తి గదా!
మాయలు చేసి హింసించే వికృత మంత్రగత్తె గదా!
వీళ్ళు తమ ఊహాశక్తితో దాన్ని,
కితకితలుపెట్టి నవ్వించే సొగసుగత్తెగా మార్చారు.

రుచిని, వాసనని, వెచ్చటి మృదుస్పర్శని,
అందమైన వస్తువులుగాచేసి అంగడిలో పెట్టవచ్చు.
కాని ఇక్కడ, భయాన్ని వాణిజ్యవస్తువుగా చేసి,
బారులుతీరి నిలబడ్డ జనానికి అపురూపంగా అందించారు.

నీరు ఆకర్షిస్తుంది, నిప్పు ఆకర్షిస్తుంది,
అంటుకొమ్మని సాహసవంతుల్ని ఆకాశం ఆకర్షిస్తుంది.
కాని, నేల ఆకర్షించటం ఇక్కడి విచిత్రం!
భూమ్యాకర్షణశక్తినిక్కడ వలయాలుగా చుట్టి,
ఆనందోద్రేకాలతో హాహాకారాలు చేసే మనుషుల్ని
ఒడుపుగా వాటిలో ఒడిసిపట్టారు.

ఆదిమ మానవుడు ప్రతినిత్యం
తినకతప్పని ఒక చేదు ఫలాన్ని,
అందమైన ఆపిల్ గా మార్చి,
రుచిచూడండని యిక్కడ కోసిపెట్టారు.

ఇక్కడ మనగురించిమనం మరికొంత తెలుసుకోవచ్చు.
మనలో ఎప్పుడూ తెరవని అరల్ని తెరుచుకోవచ్చు.
మన మనసుల స్థితిస్థాపకతని అంచనావేసుకోవచ్చు.
మన రూపాల్ని మార్చిచూపే మాయాదర్పణంలో,
సరదాగా ఒకసారి చూసుకోవచ్చు.



# కృష్ణ ప్రేమ

-- శ్రీమతి జొన్నలగడ్డ రామలక్ష్మి

చెట్టంత మగాడు అలా భోరున ఏడుస్తుంటే రాధకు ఎబ్బెట్టుగానూ, ఇబ్బందిగానూ అనిపించింది. కానీ ఏంచేయాలో తోచక అటూ ఇటూ చూసి ఎవరూ తమను గమనించడం లేదని గ్రహించి కొంత ఊరటపడింది. బీచివద్ద జనం బాగానే ఉన్నా తమకు దగ్గర్లో ఎవరూ లేరు.

"ఛీ - ఏమిటిది - చిన్నపిల్లాడిలా -" అందామె

తమాయించుకునేందుకు కృష్ణకు కాసేపు పట్టింది. అప్పుడతడు రుమాలుతో కన్నీళ్ళుతుడుచుకొని, "చిన్నపిల్లాడినైనా బాగుండేది. ప్రేమించినవాళ్ళకు దగ్గరవడానికిబ్బంది ఉండేదికాదు" అన్నాడు.

రాధ సముద్రంవైపు చూసింది. సముద్రుడు కూడా కృష్ణలాగే ఘోషపెడుతున్నాడు. ఆఘోషలో ఎన్నిప్రాణుల ప్రేమకథలున్నాయోమరి - సముద్రుడిది మనకు తెలియని మరో పెద్దలోకం.

"ప్రేమ తాత్కాలితం. జీవితం శాశ్వతం . . . " అంది రాధ.

"నువ్వు దక్కితే నాప్రేమ శాశ్వతం. అప్పుడు జీవితం క్షణభంగురమైనా నాకభ్యంతరం లేదు --" అన్నాడు కృష్ణ.

"ఆడపిల్లను. కాబట్టి నేను నీకంటే అసహాయురాలిని . ."

"అలాగనకు రాధా! నువ్వు తలచుకుంటే శివరావుని ఒప్పించగలవు --" అన్నాడు కృష్ణ.

రాధ సూపర్ వరల్డ్ కంప్యూటర్ కన్సల్టెంటు కంపెనీ మానేజరు శివరావుకు పర్సనల్ సెక్రటరీ. అతడామెను ప్రేమించాడు. పెళ్ళి చేసుకుంటానన్నాడు.

అప్పటికే కృష్ణ రాధను ప్రేమిస్తున్నాడు. అతడు ఆమెను పెళ్ళి చేసుకుంటానన్నాడు. రాధకు అతడంటే అయిష్టంలేదు. కట్నం వద్దన్నాడని రాధ తల్లితండ్రులూ కాస్త ఉత్సాహపడ్డారు. కానీ ఉద్యోగం లేదని తటపటాయిస్తున్నారు.

కృష్ణ ఉద్యోగం కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు. రాధ కోసమే కాదు. అతడి తల్లితండ్రులకీ కొడుకు సంపాదన అవసరం. అలాంటి పరిస్థితుల్లో కృష్ణకు సూపర్ వరల్డ్ కంప్యూటర్ కన్సల్టెంటు కంపెనీలో అకౌంట్స్ ఆఫీసరు ఉద్యోగానికి ఇంటర్వ్యూ పిలుపు అందింది. ఉద్యోగం వస్తుందా రాదా అన్నది శివరావు నిర్ణయిస్తాడు.

శివరావు తన ప్రేమగురించి రాధకు చెప్పినప్పుడు ఆమెకూడా అతడికి కృష్ణప్రేమ గురించి చెప్పింది.

"నువ్వు అతణ్ణి ప్రేమిస్తున్నావా?" అనడిగాడు శివరావు.

"చదువు లేని వికలాంగుడు కూడా మగాడినని అహంకరించి పెళ్ళికి ఆడపిల్లను కట్నమడుగుతున్న ఈ రోజుల్లో ప్రేమ పేరుచెప్పి కట్నం వద్దన్నాడు కృష్ణ. అదీ అతడి తల్లితండ్రులకు డబ్బవసరం బాగా ఉన్నపరిస్థితుల్లో. కాబట్టి అతడి ప్రేమ నిజమైనది -- " అంది రాధ.

"మరి ఇంకా పెళ్ళి ఎందుకు కాలేదు?" అన్నడు శివరావు.

"అతడికి ఉద్యోగం లేదని ఆగారు అమ్మా, నాన్నా !" అంది రాధ.

"అయితే అతడికి ఉద్యోగం రాకుండా చూసే పూచీ నాది - "

"ప్లీజ్ - అలా అనవద్దు. అతడికి ఉద్యోగం చాలా అవసరం -"

శివరావు క్షణం ఆలోచించి, " ఓకే - అతడికి ఉద్యోగం వచ్చేలా చేస్తాను. నిన్ను మరచిపోవాలని చెప్పు - " అన్నాడు

"కానీ అతడు నన్ను ప్రేమిస్తున్నాడు -" అంది రాధ.

"నువ్వు అతడిని ప్రేమిస్తున్నావా ?"

"అతడి ప్రేమ నిజమైనది"

"నా ప్రేమ నిజమైనది కాదని నీకు సందేహమా ?"

"మీరు ప్రేమించగల స్థితిలో ఉన్నారు. అతడు నన్ను ప్రేమిస్తే అది త్యాగమవుతుంది - " అంది రాధ.

"మా కంపెనీలో అకౌంట్స్ ఆఫీసరుద్యోగానికి ఎందరో అనుభవజ్ఞులు పోటీ పడుతున్నారు. నేను కృష్ణకు ఉద్యోగాన్నిస్తే అదీ త్యాగమే అవుతుంది. నేనందుకు సిద్ధంగా ఉన్నాను --- "

"అతడి ప్రేమనిలా దెబ్బతీయడం మీకు న్యాయం కాదు --" అంది రాధ.

"అతడితోటీ, అతడి ప్రేమతోటీ నాకు నిమిత్తం లేదు. నువ్వు అతణ్ణి ప్రేమిస్తూంటే మాత్రం చెప్పు -" అన్నాడు శివరావు.

"చెబితే ఏంచేస్తారు ?"

"నీకోసం నా ప్రేమను త్యాగం చేస్తాను. కృష్ణకు ఉద్యోగం ఇస్తాను"

"నేను కృష్ణను ప్రేమిస్తున్నాను - " అంది రాధ

శివరావు నవ్వి, "నేను నీ పెదవుల కదలిక చూసాను. కనుల బాసలు విన్నాను. కృష్ణను ప్రేమించడంలేదని చెప్పినందుకు థాంక్స్ !" అన్నాడు.

"అలా నేనెప్పుడు చెప్పాను ?" అంది రాధ.

"అయితే ఇప్పుడు మళ్ళీ అడుగుతున్నాను. కృష్ణను నువ్వు ప్రేమిస్తున్నావా ?"

"ఊఁ" అంది రాధ.

శివరావు బిగ్గరగా నవ్వాడు.

" ఎందుకలా నవ్వుతారు ?" ఆశ్చర్యంగా అంది రాధ.

" ఆడపిల్లలు వయసుకు మించి ఎదుగుతారు. నీ ముఖం చూస్తే పదేళ్ళ పాపవనిపిస్తుంది. మాటలు వింటూంటే నీకు ఐదేళ్ళుకూడా ఉన్నాయా అనిపిస్తోంది"

"ఎందుకని?"

అతడు వివరించాడు.

ఐదేళ్ళ పాపని బడికి పెడతావా అంటే వెళ్ళనని అంటుంది. ఆమెకు భవిష్యత్తు గురించిన ఆలోచన లేకపోవడమే అందుకు కారణమని గుర్తించిన తల్లితండ్రులు పాపను బడికి పంపిస్తారు. పెద్దయ్యాక పాప తల్లితండ్రులు చేసిన పనికి సంతోషిస్తుంది.

"కాబట్టి నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను --" అన్నాడు శివరావు.

"నా ఇష్టంతో నిమిత్తం లేకుండానా ?" అంది రాధ.

"స్త్రీకి ప్రేమ దేవుడిచ్చిన వరం. ఆమె ఎవరన్నా ఇష్టపడగలదు. ఎవరినయినా ప్రేమించగలదు. భర్తప్రేమ స్త్రీకి అరుదయిన వరం. అది నీకు నేనిస్తాను -"

అప్పుడే అతడు తనకు భర్త అయిపోయినట్లు మాట్లాడటం నచ్చక, "మీరు మాటల్లో చాలా దూరం వెడుతున్నారు" అంది రాధ.

"దూరం వెళ్ళడంలేదు. సూటిగా మాట్లాడుతున్నాను. నువ్వు సూటిగా మాట్లాడ్డం నేర్చుకో. స్పష్టంగా ఆలోచించడం అలవర్చుకో . . " అన్నాడు శివరావు.

"నా ఆలోచనలు స్పష్టం. నా మాట సూటి" అంది రాధ కాస్త ఉక్రోషంగా.

"అయితే నన్నుప్రేమిస్తున్నానని ఒప్పుకోవేం?" అన్నాడు శివరావు.

రాధ తడబడింది.

తన ఆలోచనలు స్పష్టంగా లేవా?

తను కృష్ణను కాక శివరావును ప్రేమిస్తోందా?

శివరావును పెళ్ళాడితే ఈకంపెనీ యాజమాన్యంలో ఉంటుంది తను. కృష్ణను పెళ్ళాడితే తనహోదా తక్కువగా ఉంటుంది. అయినా శివరావును ప్రేమిస్తున్నానని అనడంలేదంటే అది కృష్ణ ప్రేమతోనే కదా!

శివరావు ఒప్పుకోలేదు.

"మధ్యతరగతి ఆలోచనలన్నీ గజిబిజిగా ఉంటాయి. అక్కడ తర్కం, సంప్రదాయం, త్యాగం, ప్రేమ, ఆత్మీయత వగైరాలన్నీ ఉన్నట్లే ఉంటాయి. ఉండవు. స్వార్థం, అసూయ, ద్వేషం, అసహనం, మూఢనమ్మకం లేనట్లే అనిపిస్తాయి. కాని ఉంటాయి. కృష్ణను నువ్వు ప్రేమిస్తున్నవనుకొంటున్నావు. అదీ భ్రమే !" అన్నాడు శివరావు.

"మీప్రేమ ఒక్కటే భ్రమకాదు .." అంది రాధ వ్యంగ్యంగా.

"నిజం చెప్పావు. నాప్రేమ నిజం. నువ్వు నన్ను పెళ్ళిచెసుకోకపోతే నువ్వు సుఖంగా ఉండాలనుకొంటాను. నన్ను పెళ్ళిచేసుకొంటే సుఖపెడతాను. అదే కృష్ణను పెళ్ళి చేసుకొంటే కట్నం తీసుకోకుండా త్యాగం చేసాననుకొంటాడు. ఆర్థిక పరిస్థితి బాగోకపోతే నీమీద చికాకు పడతాడు. కాంప్లెక్స్ తలెత్తినపుడల్లా నీకూ నాకూ సంబంధం అంటగడతాడు. అలా అదోలా చూడకు. సూటిగా మాట్లాడ్డం నా అలవాటు. ఈ అలవాటువల్ల మనసు నిర్మలంగా ఉంటుంది .." అన్నాడు శివరావు.

అప్పటికీ తల్లి పుట్టింటివారి గురించి తండ్రి అడపా తడపా చేసే విసుర్లు

గుర్తుకొచ్చాయి రాధకి. శివరావు నిజమే చెబుతున్నాడేమో అనిపించినా, "నేను మధ్య తరగతి దాన్ని. నా ఆలోచనలు గజిబిజి. నామాట వంకర. మీరు నన్నెందుకు

ప్రేమిస్తున్నట్లు ?" అంది.

"ప్రేమ ఒక స్పందన. దానికి కారణాలుండవు .." అన్నాడు శివరావు.

"అయితే నేనిప్పుడేం చెయ్యాలి ?" అంది రాధ.

"కృష్ణకు వాస్తవాన్ని వివరించి చెప్పు .."

రాధ చెప్పింది కృష్ణకు. అతడు రాధ లేకుండా బ్రతకలేనన్నాడు.

శివరావు కంపెనీలో ఉద్యోగం గురించి ప్రకటన వచ్చింది.

కృష్ణ దానికి అప్లై చేసాడు.

శివరావు రాధకు స్పష్టంగా చెప్పాడు. ఉద్యోగమా, రాధా అన్నది కృష్ణ తేల్చుకోవలసి ఉన్నది.

కృష్ణకిది బంగారు అవకాశం. ఇలాంటి ఉద్యోగం దొరికే అవకాశాలు ఇంచుమించు లేవు.

తల్లిదండ్రులు కృష్ణకు రాధను మరచిపొమ్మని చెప్పారు.

"రాధే నా ప్రపంచం. రాధ లేకుండా నేనీ ప్రపంచంలో జీవించను" అన్నాడు కృష్ణ.

ఈ మాటలు తెలుసుకొన్న శివరావు, "కృష్ణది ప్రేమ కాదు. వయసు నిషాలో తన అనుభూతికి ప్రేమ అని పేరు పెట్టుకున్నాడు. నిషా దిగగానే తన తప్పుకు చింతిస్తాడు. అతడి నిషాను నువ్వే దింపాలి . . " అన్నాడు రాధతో.

రాధ శివరావు మాటల్లో నిజముందని అనుమానించింది. కృష్ణను కలుసుకొని మాట్లాడాలనుకొంది. బీచికి పిలిపించింది.

"నేను నిన్ను ప్రేమించడంలేదు " అందామె అతడితో.

కృష్ణ నమ్మనన్నాడు.

"నేను శివరావును ప్రేమిస్తున్నాను . ." అందామె దృఢంగా.

"నా ఉన్నతి కోసం నన్నే త్యాగం చెయ్యకు " అన్నాడు కృష్ణ.

"నేను శివరావును పెళ్ళిచేసుకుంటాను . ." అంటూ బాంబు పేల్చిందామె.

అప్పుడు చెట్టంత మగాడు కృష్ణ భోరున ఏడ్చాడు.

ఆడపిల్లను, నీ కంటే అసహాయురాలినని ఆమె అంటే "అలాగనకు రాధా ! నువ్వు తలచుకొంటే శివరావుని ఒప్పించగలవు . ." అన్నాడు కృష్ణ.

మన సమాజపు సాంప్రదాయంలో ఆడపిల్లకు వ్యక్తిత్వం ఏర్పడాలంటే ఒకోసారి జీవితకాలం పడుతుంది. అలా పట్టనివాళ్ళు స్త్రీవాద ముద్రతో మసులుతున్నారు.

రాధకూ వ్యక్తిత్వం ఏర్పడలేదు. ప్రేమ అంటే అది ప్రేమికుల సమస్య. పెళ్ళి అంటే అది తల్లితండ్రుల సమస్య. ఎవరో ఒకరి మాట వినాలనే తప్ప నిర్ణయం తీసుకోవాలని రాధ ఎప్పుడూ అనుకోలేదు.

కృష్ణకు వ్యక్తిత్వం ఏర్పడలేదు. అందువల్ల రాధ కృష్ణతో ఎంతో ఈజీగా మసలుతుంది. ఫ్రీగా మాట్లాడుతుంది.

కాని శివరావు విషయంలో అలాకాదు.

అతడు వ్యక్తిత్వమున్న మనిషి. అతడు రాధంటే ఇష్టపడతాడు. తార్కికంగా ఆమెతో చర్చిస్తాడు. ఆమెను అప్పుడప్పుడు చిన్నబుచ్చినా -- అథార్టీతోనూ, అహంకారంతోనూ కాక తన జ్ఞానంతో ఆమె అజ్ఞానం మీద దాడి చేయటంలో జరిగే ప్రక్రియ అది !

శివరావు తన మాట వినడని ఆమెకు తెలుసు. అందుకు తానతణ్ణి తప్పుపట్టలేననీ ఆమెకు తెలుసు.

"నా వల్లకాని పనిని నాకు బాధ్యతగా అప్పగించకు -" అంది రాధ.

"ప్లీజ్ రాధా! నాకోసం నువ్వీ బాధ్యతను తీసుకోవాలి"

"ఎందుకంటే మన ఈప్రేమ ఈ జన్మది కాదు. నీకోసం నేను ఇంకో జన్మ ఎత్తాను --" అన్నాడు కృష్ణ.

"జన్మజన్మల బంధం . . ." అన్న మాట అప్రయత్నంగా రాధ నోటివెంట వచ్చింది.

అందుక్కారణం ఆపేరుతో తయారవుతున్న టీవీ సీరియల్ గురించి ఆమెకు తెలుసు. అది తీస్తున్నది ఆమె కజిన్ చలపతి.

రాధ చటుక్కున లేచి, "నీకోసం నా ప్రయత్నం నేను చేస్తానులే -- " అంది.

ఉన్నట్లుండి ఆమె అలా ఎందుకన్నదీ తెలియకపోయినా ఆమె గొంతులో ధృఢ నిశ్చయం ధ్వనించి సంతోషపడ్డాడు కృష్ణ.

---------------------------------------

చలపతి చలాకీ మనిషి. ఓ టీవీసీరియల్ గురించి హీరోయిన్ కై అన్వేషిస్తూ ఆ ఊరు వచ్చాడు. రాధకు ఆవేషం ఇస్తానన్నాడు.

రాధ సీరియల్ స్క్రిప్టు చదివింది. పునర్జన్మ కథ. ఒక జన్మలో ప్రేమ ఫలించకపోగా ఆప్రేమికులు మళ్ళీ జన్మ ఎత్తారు. ఈ జన్మలో ఆప్రేమ ఫలించడానికి పూర్వజన్మ కథ సహకరిస్తుంది.

"సమాజాన్ని మీరు ఎటువైపు తీసుకొని పోతున్నారు? ఈ కథతో మీరేం సాధిద్దామని ?" అంటూ ఆమె టీవీసీరియల్ బృందాన్నుద్దేశించి చలపతిని నిలదీసింది.

"ఇది ప్రజాసామ్యం. ప్రజల అభిరుచి ఎటుమొగ్గుతున్నదీ మన నాయకులను చూసి తెలుసుకోవచ్చును. ఆ దారిలోనే మా కథలూనూ !"

"నాకీ దారి వద్దు -" అంది రాధ.

"నటనవేరు. జీవితంవేరు. నాకోసం ఈ రోల్ ఒప్పుకో . ."

"షబానా అజ్మీలా తెలివైన పాత్రవేస్తాను -" అంది రాధ.

"అయితే నువ్వు పర్వాంష్ చూడలేదా ?" అన్నాడు చలపతి.

"నటన ఆమెకు వృత్తి. అందుకని అన్ని రకాల పాత్రలూ వేయాల్సి ఉంటుంది. నాకు నటన వృత్తి కాదు. వేస్తూ వేస్తూ ఇలాంటి పాత్ర వేయను . . ."

"స్క్రిప్టుచూసి పాత్ర గురించి నిర్ణయం తీసుకోకు. నాలాంటి దర్శకుడి దగ్గర పనిచేస్తే ఆ పాత్రనెలా తీర్చి దిద్దుతున్నానో గ్రహించి స్టన్నై పోతావు" అన్నాడు చలపతి.

"దర్శకుడిగా నీ స్థాయి ఏమిటో నువ్వెంచుకొన్న కథే చెబుతోందిగానీ - నేను శివరావు పర్సనల్ సెక్రటెరీని. తెలివితేటల్లో ఎవరైనా ఆయన తర్వాతనే. ఆయన దగ్గర పనిచేసాక నువ్వు నాకు ఆనవు -" అంది రాధ.

చలపతి నవ్వి, "నాతో పనిచేయలేదు కాబట్టి ఇలాగంటున్నావు. నాకో అవకాశం ఇస్తే నా కథతో శివరావునే మెప్పించగలను తెలుసా ?" అన్నాడు.

సంభాషణ అక్కడ ఆగిపోయింది. చలపతికి శివరావును మెప్పించే అవకాశం వస్తుందని రాధ ఎప్పుడూ అనుకోలేదు. కృష్ణ తనకోసం మరోజన్మ ఎత్తాననగానే ఆమెకు "జన్మజన్మల బంధం –" టీవీసీరియల్ గుర్తుకొచ్చింది.

ఆ సీరియల్ ఇంకా తయారవుతోంది. చలపతి ఆ వివరాలకు ఎక్కువగా ప్రచారాన్నివ్వలేదు. ఒకేసారి తెలుగు, హిందీల్లో తీస్తున్నాడు. వీలునిబట్టి దాన్ని సినిమాగా మార్చాలనుకొంటున్నాడు. అందుకోసం ఒక చిన్న పల్లెటూళ్ళో కొన్ని ఇళ్ళుకూడా కట్టాడు.

ఏదో పనిమీద అతడు నిన్ననే విశాఖపట్నం వచ్చాడు మళ్ళీ. సీరియల్ ప్రోగ్రెస్ గురించి ఆమెకు చెప్పాడు. సీరియల్ గురించి ఎక్కడా అనవద్దని, అదో సీక్రెట్ ప్రోజెక్ట్ అనీకూడా చెప్పాడు. రేపు అతడు వెళ్ళిపోతాడు. మకాం రాధ ఇంట్లోనే కాబట్టి అతణ్ణి పట్టుకొవడం ఆమెకు కష్టం కాదు.

రాత్రి ఎనిమిదింటికి భోజనలయ్యాక ఆమె అతడికి తన ట్రై యాంగిల్ లవ్ స్టోరీ చెప్పింది.

చలపతి ఆసక్తికరంగా విని "కథ బాగుంది. దీన్ని డెవెలప్ చేసి సినిమా తియ్యొచ్చు –" అన్నాడు.

"ఎలా డెవెలప్ చేయాలో నేను చెబుతాను. అప్పుడు నీకు శివరావును నీకథతో మెప్పించే అవకాశమూ వస్తుంది –" అంది రాధ.

"ఎలా ?" అన్నాడు చలపతి.

"కృష్ణ నాకోసం మరో జన్మ ఎత్తానంటున్నాడు. దాన్ని నిజం చెయ్యగలవానువ్వు ?"

"ఎలా ?"

"కోట్లాది ప్రజల్ని పునర్జన్మ కథతో నమ్మించాలనుకొంటున్నావు. కృష్ణ కోసం ఓ పునర్జన్మ కథను అల్లి శివరావును నమ్మించలేవా ?"

"అందువల్ల ప్రయోజనం ?"

"శివరావును సెంటిమెంటుతో జయించాలని నా ఉద్దేశ్యం –"

"శివరావు చాలా తెలివైనవాడని నువ్వే అన్నావు. తెలివైనవాళ్ళు సెంటిమెంటును వాడుకొంటారే తప్ప దానికి పడరు –" అన్నాడు చలపతి.

"అందుకే అటునుంచి నరుక్కుని వస్తున్నా –" అంది రాధ.

ఆమె అతడికి తన పథకాన్ని వివరించింది.

పూర్వజన్మలో రాధా కృష్ణల ప్రణయగాథను చలపతి రసవత్తరంగా తయారుచేసి శివరావుకు వినిపిస్తాడు. నమ్మిస్తాడు.

శివరావు పూర్తిగా నమ్మినా నమ్మకపోయినా రాధ, కృష్ణ ఆ కథను పూర్తిగా నమ్మినట్లు గ్రహిస్తాడు. ఆ సెంటిమెంటులో రాధ కృష్ణను ప్రేమిస్తున్నదంటే అతడిక ఆప్రేమకు అడ్డు తగలడు. కృష్ణకు రాధ భార్యవుతుంది. ఉద్యోగమూ వస్తుంది.

అంతావిన్నాక, "నువ్వు తెలివైన దానవే. అలాంటప్పుడా తెలివిని కృష్ణను వదిలించుకుందుకు ఉపయోగించుకోవచ్చుగా !" అన్నాడు చలపతి.

"ఏమో – శివరావంటేనే నాకు భయం. కృష్ణంటే లేదు –"

"తప్పటడుగు వేస్తున్నావేమో ఆలోచించు. నా అభిప్రాయంలో నీకు శివరావే మంచి మొగుడు –"

"ఏయ్ –" అంది రాధ రవంత సిగ్గభినయిస్తూ, "శివరావును పునర్జన్మ కథతో నమ్మించడం నీవల్లకాదని ఒప్పుకోవచ్చుగా. ఈ డొంక తిరుగుడు సలహాలన్నీ ఎందుకు ?"

"ఛాలెంజ్ –" అన్నాడు చలపతి – "సెట్టింగు సిద్ధంగా ఉంది. కథ సిద్ధంగా ఉంది. నీ ఫోటో ఒకటివ్వు – చాలు. నీ పూర్వజన్మ కథ పకడ్బందీగా తయారైపోతుంది –"

"ఎలా ?"

వివరించాడు చలపతి.

పూర్వ జన్మలో రాధ పేరు సీత. కృష్ణ పేరు రామం. ఇద్దరూ చిన్నప్పట్నించీ కలసి పెరిగారు. ఆడారు, పాడారు. పెద్దవగానే ప్రేమించుకొన్నారు. పెళ్ళి చేసుకోవాలనుకొన్నారు. అంతలో ఆ రెండు కుటుంబాలమధ్యా కలతలు రేగాయి. తండ్రి సీతకు వేరే సంబంధం చూసాడు. రామం ఆమెను తనతో లేచివచ్చేయమన్నాడు. ఆలా చేస్తే సీత తండ్రి ఆత్మహత్య చేసుకుంటానన్నాడు. సీతకు శివయ్యతో పెళ్ళయింది. ఆమె రామాన్ని కూడా వేరే పెళ్ళి చేసుకోమంది. అతడామె కోసమే అలమటించాడు. ఎలాగైనా ఆమెను మంచి చేసుకొని తనతో తీసుకొని వెళ్ళిపోవాలనుకొన్నాడు. సీత సాంప్రదాయపు పరిధుల్లోనే ఉంటానంది. రామం ఆమెను విడిచి పెట్టలేదు. భర్త ఆమెను అనుమానించి హింసించసాగాడు. ఆమె కడుపులో పెరిగే బిడ్డ తనది కాదన్నాడు. భర్త గెంటివేస్తే ఆమెను చేరదియ్యాలని రామం ఆశ. కానీ తనమీద పడ్డ నిందను భరించలేక సీత ఆత్మహత్య చేసుకుంది. సీత అలా చేస్తుందని ఊహించని రామం తనూ ఆత్మహత్య చేసుకొన్నాడు.

"ఆ పల్లెటూళ్ళో ఈ కథకు అవసరమైన పాత్రలూ, సెట్టింగులూ ఉన్నాయి. ఎటొచ్చీ సీత, రామంల ఫోటోలు మార్చాలి. నువ్వా ఫోటోలిస్తే కంప్యూటర్లో స్కాన్‌చేసి బ్లాక్ అండ్ వైట్ లోకిమార్చి పాతలుక్స్ తెస్తాను -" అన్నాడు చలపతి.

"మరి కృష్ణ ఫోటో నేనెలా ఇవ్వగలను ?" అంది రాధ.

"వాడి ఫోటోలు పెద్ద ప్రోబ్లం కాదు. నాకు ఫొటోగ్రఫీ హాబీ కదా - చిన్నప్పటినించీ! మన బంధువుల ఫోటోలు చాలా ఉన్నాయి నాదగ్గర. కృష్ణది మాఇంట్లో పదేళ్ళప్పటిది గ్రూప్ ఫొటో ఉంది. పద్దెనిమిదేళ్ళది పాస్ పోర్టు సైజు ఉంది. లేటెస్టుది లాస్ట్ టైం వచ్చినపుడు తీసాను -"

"అయినా అతడినడిగి తీసుకోవచ్చును కదా -" అంది రాధ.

"అడగొచ్చు. కానీ అడగను. ఎందుకంటే నా టీవీ సీరియల్ కథ హీరోయిన్ వి కాబట్టి నీకు చెప్పాను. కృష్ణకు సీరియల్ తీస్తున్నట్లు తెలుసునుగానీ కథ తెలియదు. ఇప్పుడు నేను నా కథతో కృష్ణను నమ్మిస్తాను . . . "

"కృష్ణనెందుకూ నమ్మించడం . . . . నువ్వు నమ్మించాల్సింది శివరావును . ."

"ఈ కథలో నువ్వూ, కృష్ణా పాత్రలు. ఇది కథ అని నీకు తెలుసు. కృష్ణకు తెలియదు. పాత్రచేతే కథను నిజంగా నమ్మించగలిగితే ఆ తర్వాత శివరావును నమ్మించడం పెద్ద కష్టం కాదు ...." అన్నాడు చలపతి.

---

చలపతి కృష్ణను కలుసుకొన్నాడు. తను వీరాపురంలో టీవీ సీరియల్ తీస్తున్నాననీ – అప్పుడక్కడ ఓ అద్భుతం చూసానని చెప్పాడు. గతజన్మలో రాధ, కృష్ణ అక్కడ ప్రేమికులుగా వర్ధిల్లిన విషయం తెలుసుకొని నమ్మలేకపోయానని అది చెప్పడానికే ఇక్కడకి వచ్చాననీ అన్నాడు.

"నువ్వు నాతో వేళాకోళా మాడుతున్నావు .." అన్నాడు కృష్ణ నమ్మలేక.

"నేనబద్ధమాడనని రాధకు తెలుసు. అందుకే ఆమె ఈ కథను వెంటనే నమ్మింది. అంతేకాదు – ఆమెకు పూర్వజన్మ స్మృతికూడా వచ్చింది. నీకూ పూర్వజన్మ స్మృతి ఉండే ఉంటుందనీ అందుకే మొన్న ఆ ప్రసక్తి తెచ్చాననీ కూడా అంది. నాకథ విని నీకు వీరాపురం పరిసరాలు గుర్తు రావడంలేదా ?" అన్నాడు చలపతి.

"రాధకు గుర్తొచ్చాయా ?" అన్నాడు కృష్ణ ఆశ్చర్యంగా.

"నేను వీరాపురంలో నెలల తరబడి ఉంటున్నాను. అయినా నాకింకా తెలియని విశేషాలా ఊరి గురించి ఎన్నో చెప్పింది రాధ. నేనాశ్చర్య పోయాను. తను వెంటనే వీరాపురం వస్తానంటోంది. నిన్నూ రమ్మంది –" అన్నాడు చలపతి.

కృష్ణకు అంతా కలలాగానూ, కథలాగానూ ఉంది.

---

వీరాపురంలో రాధ చెట్టునూ, చేమనూ, చెరువునూ, చేపనూ, పక్షినీ, గాలినీ కూడా గుర్తు పట్టి చెంగుచెంగున గంతులువేసింది.

డైలాగులామె నోట ధారాపాతంగా వర్షిస్తుంటే, కృష్ణ ఆమెను చూసి నివ్వెరపోతూంటే – నా సీరియల్ ఎంత మంచి నటిని మిస్సయింది ? అని బాధపడ్డాడు కూడా చలపతి.

కొందరామెను గుర్తుపట్టారు. రాధ వారిని ఉత్సాహంగా పలకరించి ఎన్నో వివరాలడిగింది.

శివయ్య ఇంకా బ్రతికే ఉన్నాడు. అతడికిప్పుడు అరవై ఉండొచ్చు. రాధను చూస్తూనే – "సీతా !" అంటూ మూర్ఛపోయాడతడు. సపర్యల అనంతరం తేరుకొన్నాక అతడికి కృష్ణ కనిపించాడు.

"దుర్మార్గుడా – నాభార్యను పొట్టబెట్టుకొన్నావు కదరా –" అంటూ శివయ్య అతడిమీదకు వచ్చాడు. అతి కష్టం మీద అంతా అతణ్ణి ఆపారు.

సీత రాధగా మళ్ళీ పుట్టిందని తెలిసిన శివయ్య ఆమెతో, "నువ్వు నాతో సుఖపడలేదు. ఆ జీవితమొక పీడకలగా మరచిపో. ఇంకెవ్వరికీ మన కథ చెప్పకు. హాయిగా కొత్త జీవితం అనుభవించు. అయితే ఈ దౌర్భాగ్యుణ్ణి మాత్రం పెళ్ళిచేసుకోకు. వీడు నీకు ప్రాణాంతక మవుతాడు. – " అన్నాడు కృష్ణ గురించి.

రాధ శివయ్యను మాత్రం గుర్తుపట్టక, "గొంతు విన్నట్లే ఉంది కానీ రూపం పూర్తిగా మారిపోయింది. –" అంది.

ఇంకా ఊళ్ళో ఒకటి రెండిళ్ళల్లో కృష్ణ, రాధల ఫోటోలు దొరికాయి. అవన్నీ సెట్టింగులనీ, వారందరూ పాత్రలనీ తెలియని కృష్ణ అయోమయంలో పడిపోయి, "రాధకు గుర్తొస్తున్న విశేషాలు నాకెందుకు గుర్తుకురావు ?" అనుకొని మథన పడ్డాడు.

ఊళ్ళో తన ఫోటో చూసేక కృష్ణకు ఈకథపై కొంత నమ్మకం కుదిరింది. అయినా అతడు రాధ దగ్గర కొద్దిగా సందేహాన్ని వెలిబుచ్చాడు.

"కృష్ణా ! నాకిక సందేహంలేదు. మనది జన్మజన్మల బంధం. గతజన్మలో చేసిన తప్పు ఈ జన్మలో చేయను. విధి నన్ను నీకు దూరంగా తరమాలనుకోవడం విశేషం. అప్పుడు శివయ్య. ఇప్పుడు శివరావు. కానీ నేను శివరావుకు చెప్పేస్తాను. – మనం ప్రేమికులమనీ మన మధ్య తను అడ్డుగోడలా నిలువకూడదనీ . . ." అంది రాధ ఉత్సాహంగా.

"అయితే నువ్వు సీత కథను నమ్ముతున్నావా ?"

"నేనే సీతనైతే - నమ్మడం ప్రసక్తి ఎక్కడ? ఈ కథలో నీకెక్కడెక్కడ సందేహాలున్నాయో అడుగు చెబుతాను. బహుశా నీప్రేమ నాప్రేమ అంత గొప్పది కాదేమో - అందుకే నీకు గతం గుర్తు రావడం లేదు -" అంది రాధ.

"ఈ కథను శివరావు నమ్ముతాడా ?" అన్నాడు కృష్ణ.

"అతడి నమ్మకంతో నాకేంపని? ఇది కథ కాదు. వాస్తవం. నేను నిన్ను ప్రేమించాను. ప్రేమిస్తున్నాను -" అంది రాధ.

క్రమంగా కృష్ణకు అనుమానాలు తొలగి పోతున్నాయి.

వాళ్ళు తిరుగు ప్రయాణమైనప్పుడు తనూ వాళ్ళతో వస్తూ, "రాధ గత జన్మలో సీత అని రూఢి అయింది. నీవు గత జన్మలో రామం అనీ రూఢి అయింది. ఇప్పుడు వీరాపురంలో సీత భార్త శివయ్య తప్ప ఆమెకు అయినవాళ్ళెవరూ మిగల లేదు. తెలిసిన వాళ్ళు కొందరు ఆమెకూ నీకూ కొందరున్నా - నీకైతే ఆ ఊళ్ళో అయిన వాళ్ళెవరూ మిగలలేదు. కాబట్టి మీరిద్దరూ ఆ జన్మను మరచి పొండి. కొత్త జన్మలో కొత్త బంధువులకి ఏమాత్రమూ అసంతృప్తి కలిగించకుండా మీరు సుఖపడుతూ వారిని సుఖపెట్టండి -" అన్నాడు.

"మేము సుఖపడాలంటే ముందు నువ్వు శివరావుకు మా పూర్వజన్మ కథను చెప్పి అతడు నన్ను మరచి పోయేలా చేయాలి. కృష్ణకు ఉద్యోగం రావాలి. . . ." అంది రాధ.

"మనతోపాటు శివరావునూ తీసుకొని రావాల్సింది -" అన్నాడు చలపతి సాలోచనగా.

-------------------------------------------

ఆరోజు ఆఫీసుకు వచ్చిన రాధను ఉత్సాహంగా పలకరిస్తూ - "కంగ్రాట్యులేషన్స్ -" అన్నాడు శివరావు.

"దేనికి ?" అంది రాధ ఆశ్చర్యంగా.

"నీకూ నాకూ ఓ సమస్య తీరిపోయినందుకు -" అన్నాడు శివరావు.

"ఏమిటా సమస్య ?" అంది రాధ ఎరుగనట్లుగా.

"కృష్ణకు మన ఆఫీసులో ఉద్యోగమివ్వాలని నిర్ణయించాను . . ."

"వ్వాట్ ?" అంది రాధ నమ్మలేనట్లుగా. అంతలోనే ఏదో అనుమానం కలిగి, "నా కజిన్ చలపతి గానీ మిమ్మల్ని కలుసుకొన్నాడా ?" అంది.

"చలపతి ఎవరో నాకు తెలియదు . ." అన్నాడు శివరావు.

"మరి మీ సడెన్ డెసిషన్ కు కారణం ?"

"కృష్ణ ఉద్యోగాన్ని కోరుకొని నిన్ను నాకు వదలి పెట్టాడు . ."

"ఈజిట్– . . " అంది రాధ. ఆమెకు నోట మాట రాలేదు.

-----------------------------------------------

సాయంత్రం కృష్ణ కోసం ప్రయత్నించింది రాధ. అతడామెకు దొరకలేదు. ఉస్సురంటూ ఇల్లు చేరితే చలపతి ఆమెను నవ్వుతూ పలకరించాడు.

"కృష్ణ నిన్ను కలిసాడా ?" అడిగింది రాధ.

"ఊఁ "

"ఇప్పుడెక్కడుంటాడు ?"

చలపతి నవ్వి, "కొన్నాళ్ళపాటు అతడు నీకు దొరకడు" అన్నాడు.

"ఎందుకని ?"

"నీకు తెలుసు –"

రాధ ఆశ్చర్యంగా "నాకేం తెలుసో నీకు తెలుసా ?" అంది.

"ఊఁ "

"కృష్ణ శివరావును ఉద్యోగమిస్తే ప్రేమను మరచిపోతానన్నాడు –"

"అదే నాకు తెలుసు - "

"కృష్ణ అలా ఎందుకు చేసాడు ?"

"అతడికి ఉద్యోగం కావాలి. ఉద్యోగముంటే నీ కంటే మంచి పిల్లలు పెద్ద పెద్ద కట్నాలిస్తామంటూ క్యూలో నిలబడతారు. నిన్ను చేసుకొంటే కట్నం రాదుగా మరి -"

"నేను నమ్మను. నాకోసం ఉద్యోగం వదులుకొన్నాడు కృష్ణ -"

"వదులుకోలేదు. వదులుకుందామనుకొన్నాడు. అదీ నీ మెప్పుకోసం. నువ్వెలాగూ శివరావు వైపే మొగ్గుతావని నమ్మాడు. ఎప్పుడైతే నువ్వు తనవైపు మొగ్గావని ఖచ్చితంగా తెలిసిపోయిందో హడలిపోయాడు తనకిక ఉద్యోగం రాదని ! అందుకని తనే వెళ్ళి శివరావుకు చెప్పేసాడు -"

"నువ్వు కృష్ణ ప్రేమను అనుమానించి అవమానిస్తున్నావు -"

చలపతి నవ్వి, "ప్రేమ సబ్జెక్టు మీద పనిచేసి పండిపోయాను. నువ్వు తట్టుకోగలనంటే కృష్ణ ప్రేమ అసలు స్వరూపాన్ని వివరించాలనుకొంటున్నాను. వింటావా ?" అన్నాడు.

"ఊఁ " అంది రాధ.

"రామావతారంలో రాముడు సీతను ప్రేమించాడు. పరాయివాడి ఇంట ఉందని అగ్ని పరీక్ష పెట్టడం, ఓ పౌరుడేదో అన్నాడని అడవులకు పంపడం - సీతకు జరిగాయంటే అది ఆ ప్రేమ ఫలితమే. రాముడి తర్వాత వచ్చింది కృష్ణావతారం. అన్ని విధాలా ఆడవాళ్ళ విషయంలో రాముడి కంటే ఓ మెట్టు పైనుంటాడు కృష్ణుడు. రాముడు ఏకపత్నీ వ్రతుడు. కృష్ణుడు బహుపత్నీ వ్రతుడు. రాముడు బుద్ధిమంతుడు. కృష్ణుడు అల్లరివాడు. రాముడు నీతిపరుడు. కృష్ణుడు రాజకీయవాది. అయితే కృష్ణ ప్రేమ రామ ప్రేమ కంటే ఓ మెట్టు ఎక్కువుండాలంటే ఇవి చాలవు. పరాయివాడింట ఉన్నదని సీతను కష్టాల పాలు చేశాడు. మరి కృష్ణుడేం చేయాలంటావ్ ?" అన్నాడు చలపతి.

"ఏం చేయాలేమిటీ - ఏంచేశాడో చెప్పు - .." అంది రాధ.

"కృష్ణుడేం చేశాడో చెప్పడానికి ఆయన పురాణాలన్నీ నాకు పూర్తిగా తెలియవు. కానీ నీకృష్ణ కృష్ణప్రేమను నిర్వచించగలడని ముందే నాకు తెలిసే నీ పూర్వ కథను నాపూర్వ కథలో కలిపాను ..." ఆగాడు చలపతి.

"మా పెళ్ళి జరగదని తెలిసి భోరున ఏడ్చాడు కృష్ణ. ఆప్రేమ గురించి నువ్వేదో వ్యంగ్యపు విసుర్లు విసరాలనుకొన్నట్లుంది ..." అంది రాధ అయిష్టంగా.

"వ్యంగ్యపు విసురు కాదు. ఉన్న మాటే అంటున్నాను. గత జన్మలో నువ్వు శివయ్య భార్యవు. అతడితో కాపురంచేసి అతడి బిడ్డను కడుపులో మోస్తూ ఆత్మహత్య చేసుకున్నావు. ఆ శివయ్య ఇంకా జీవించే ఉన్నాడు. జన్మజన్మల బంధమని నీవంటున్న ఆ బంధంలో కళంకం కూడా కలిసింది. కృష్ణకు సంబంధించినంత వరకూ నీవు కళంకితవు. గత జన్మలో పర పురుషుడుతో సంబంధం పెట్టుకొన్న నిన్నతడెలా పెళ్ళిచేసుకొంటాడు ? కృష్ణ నీ పూర్వజన్మ కథను నమ్మితే చాలు – నేనిక శివరావును కలుసుకోకుండానే నీ సమస్యకు పరిష్కారం లభిస్తుందని నాకు తెలుసు. నమ్మడం, నమ్మకపోవడం నీ ఇష్టం –" అన్నాడు చలపతి.

రాధ ఆలోచిస్తోంది – తన ఆలోచన లింతదూరం ఎందుకు వెళ్ళలేదా అని! ఎందుకంటే కృష్ణ ఆమెను మళ్ళీ కలుసుకొనే ప్రయత్నం చెయ్యలేదు.

రాధ ఆలోచిస్తోంది – శివరావుకీ కథ చెప్పాలా వద్దా అని ! ఆమె శివరావు మాటల్ని పదే పదే గుర్తు చేసుకొని చివరికతడికి చలపతి ఆడిన పూర్వజన్మ నాటకం చెప్పింది.

శివరావు ముందు విరగబడి నవ్వి తర్వాత నెమ్మదిగా, "ఆ ఇప్పుడన్నీ గుర్తుకు వస్తున్నాయి ..." అన్నాడు.

"ఏమిటి ?" అంది రాధ ఆశ్చర్యంగా.

"పూర్వజన్మలో నాతో కాపురం చేస్తూ నువ్వు కృష్ణ మీద చెప్పిన జోకులు ..."

"అంటే ?"

"ఇంకా అర్థం కాలేదా –- నేను శివయ్యని ..."

"శివయ్య సీరియల్ నవల్లో పాత్ర..."

"కాదు – చలపతి నిన్నలా నమ్మించాడు ..."

"అయితే శివయ్య ఇంకా బ్రతికే ఉన్నాడు ..."

"లేడు. చలపతి కృష్ణ కోసం తన టీంలోంచి ఓ వ్యక్తి చేత శివయ్యలా నటింప జేశాడు ..."

"మరి అసలు శివయ్య ఏమైపోయాడు ?"

"భార్య పోగానే మనసు పాడై వెంటనే తనూ ఆత్మహత్య చేసుకొని ఇలా శివరావై పుట్టి మళ్ళీ రాధ కోసం ఎదురు చూస్తున్నాడు ...."

"బాగుంది - మీ కథ -"

"ఏం బాగుందీ - ఈ జన్మలోనూ కృష్ణ మనిద్దరి మధ్యా అడ్డుగోడైపోయాడు ..."

"అంటే పునర్జన్మ కథ నిజమంటారా ?"

"అక్షరాలా నిజం. పూర్వ జన్మ జ్ఞానంతోనే నువ్వు కృష్ణను అభిమానించావు. ఆ జన్మలో నీ కోసం పరితపించాడని ఈ జన్మలో జాలిపడుతూ అదే ప్రేమనుకొన్నావు. కృష్ణ ప్రేమ నిజస్వరూపం తెలిస్తే తప్ప నీలో మార్పు రాదని నేననుకొన్నాను. కాగల కార్యం చలపతి తీర్చాడు...."

"మరి నేను మిమ్మలెందుకు గుర్తు పట్టలేదూ ?" అంది రాధ.

"ఎలా గుర్తు పడతావు ? అప్పటికీ ఇప్పటికీ నాకు రూపం మారిందిగా -"

కిసుక్కున నవ్వింది రాధ.

శివరావు ఆమెవంక అబ్బురంగా చూసి, "ఆ నవ్వే జీవితాంతం నీకు తోడుగా ఉండాలి. ఆ నవ్వుతో నువ్వే జీవితాంతం నాకు తోడుగా ఉండాలి. మనది జన్మజన్మల బంధమనీ, అదీ కళంకం లేని బంధమనీ ఇప్పుడర్థంచేసుకొన్నావుగా - నాకెంతో సంతోషంగా ఉంది -" అన్నాడు.

అప్పటికి రాధకు అతడేమిటో అర్థమై, "అమ్మో - పొరపాటున కూడా ఎవరూ కృష్ణప్రేమ భ్రమలో పడకూడదు. నాకు శివ ప్రేమే నచ్చింది -" అనుకొంది.

# "ఫూ . . ."

-- డా. వి. చంద్రశేఖర రావు

తెలుగు డిపార్ట్మెంటు ముందున్న వరండా పిట్టగోడపై కూర్చుని ఉండగా మోహన సుందరంతో సహా ప్రత్యక్షమయ్యింది మాలతి. మోహన సుందరం అట్లా నా కళ్ళలోకి సూటిగా చూస్తూంటే – గొప్ప భయం, జలదరింత. ముఖ్యంగ అతని గద్దర్ ముఖం. ఆ గడ్డం, భుజంపై వేలాడే సంచీ, అతన్ని చూసినపుడల్లా ఏదో తెలియని పశ్చాత్తాపం నన్ను చుట్టుముట్టేది. విశాలమైన చేతులు అట్లా ముందుకూ వెనక్కూ ఊగుతూంటే, నడుస్తున్న శిలువ గుర్తుకొస్తుంది. ఏదో ఒక రోజు శిలువపై వేళ్ళాడుతూ చౌరాస్తాల నడుమ అతని శవం ఎదురుకావచ్చునేమోనని భయం ఎందుకో నన్ను వెంటాడేది. అతన్ని హఠాత్తుగా నా ముందు ప్రత్యక్షం చేయించి, ఏ వార్నింగ్ లేకుండా, నా చేతిని అతని చేతిలో పెడుతూ "మోహనా! ఇతనో గొప్ప రొమాంటిక్ పోయెట్! తనను తానో గొప్ప విధ్వంస గీతం అని కూడా అనుకుంటాడు. కవిగా ఇతని భవిష్యత్తు గురించి రెండు ముక్కలు చెప్పు" అంది మాలతి.

నేను వారించే లోపలే అతను సంచి లోంచి ఒక ఊదా రంగు పువ్వు, బెల్స్ ఫ్లవర్ బయటకు తీసాడు. దాన్ని నా అరచేతిలో పెట్టి, గుప్పిడి బిగించి, "గొప్ప నీలి కవితలు సృష్టిస్తావు!" అంటూ నా వైపు చూసి కన్నుగీటి "అనార్కిస్టు ముఖం తొడుగుకున్న సుఖవాదివి! పద్యాన్ని అట్టుకుని దేశాలన్నీ తిరుగుతావు!" అన్నాడు. ఊదా రంగు పువ్వు అట్లా నా చేతిలో నలిగి పోతూనే ఉంది. మహాభినిష్క్రమణం కోసం వెడుతున్నవాడిలా అతనట్లా చేతులు ఊపుకుంటూ వెళ్ళిపోయాడు. మోహన సుందరం కాస్త దూరం వెళ్ళి, ఆగి "స్వప్నలో ఫైర్ సినిమా ఆడుతూంది. మీరిద్దరూ కలిసి చూడటం నాకానందం" అంటూ రెండు సినిమా టిక్కట్లు మావైపు విసిరి చకచకా రెక్కలు వచ్చిన సిలువలా వెళ్ళిపోయాడు.

మాలతితో సహా నెంబర్ 136 బస్సు ఎక్కి, కోఠీ దగ్గర దిగి, అట్లాగే ఆబిడ్స్ వైపు నడుచుకుంటూ వెళ్ళి, మధ్యలో బస్సుల, ఆటోల, స్కూటర్ల వరదల్ని దాటుకుంటూ హుస్సేన్ బుక్ షాపు దగ్గర ఆగాము. నేను లోపల ఎక్కడో ఉన్న పొయిట్రీ పుస్తకాల్ని బయటకు తీయించా – ఈలోగా మాలతి కౌంటర్ దగ్గర కూర్చున్న వృద్ధుడి పక్కన కూర్చుని అతనిపాలిపోయిన ముఖాన్ని, రహస్యమైన

తప్పులా అతని చేతిలో మండుతున్న సిగరెట్లనూ విస్మయంగా చూస్తూ – హఠాత్తుగా అతనో గజల్ గా ట్రాన్స్ ఫారం కావటాన్ని ఆనందిస్తూంది. నది, నావ, మనిషి, చావు అంతా ఒకటే అని అర్థం వచ్చే ఉర్దూ పాటను అతను ఆలపిస్తున్నాడు. చార్లెస్ బాడేర్ కవితల పుస్తకాన్ని తిరగేస్తూ నేనూ గొప్పగా ఎంజాయ్ చేస్తున్నానా పాటను.

పాట అయిపోయాక గొప్ప ఆయాసం వచ్చి, భీకరంగా దగ్గి, అతను హడావుడిగా నడుచుకుంటూ వచ్చాడు. పక్కన ఉన్న సింకు దగ్గర బుళుక్కున రక్తాన్ని కక్కి – భయంతో బిగుసుకు పోయాను. "బేటా! ఇంకెంత సిర్ఫ్ పంద్రహ్ దిన్ " అన్నాడు నవ్వుతూ నావైపు చూస్తూ. "కాన్సర్ చివరి దశ" అన్నాడు. "అబ్బా! రెండు లైన్ల పోయిట్రీ ఏదైనా చెప్పు" అన్నాడు నా పక్కనే ఉన్న స్టూల్ మీద కూలబడుతూ.

బాడ్లేర్ పుస్తకాన్ని చటుక్కున తెరిచి " I cast her to the bottom of a wall; and on top of her I piled; All the stones of the parapet - I will forget her, if I can!" అనే కవిత చదివాను.

"వాహ్వా! వాహ్వా!" అంటూ పరవశంతో పెద్దగా అరిచి, జేబులోంచి బంగారు పూతపూసిన పెన్ను ఒకటి తీసి చేతిలో పెట్టాడు. "గొప్ప అనుభవాల్ని కవితల్ని విన్నాక మనసు ఊరుకోదు. ఏదైనా నజరానా ఇవ్వాలనిపిస్తుంది" అని సంజాయిషీలా చెప్పాడు.

"డాక్టర్ బెడ్ దిగద్దన్నాడు. హాస్పిటల్ లో ఎవరికీ తెలియకుండా ఇట్లా వచ్చాను. ఈ పుస్తకాల్ని చూస్తూ, మీలాంటి పిల్లల్ని చూస్తూ, ఇట్లా నాలుగు మంచి షాయిరీలు వింటూ – మంచి గజల్ వింటూనో, పాడుతూనో చనిపోవాలని నా కోరిక" జేబులోంచి నలిగిన కాగితాలు తీశాడు. ఆయన రాసిన కవితలు కాబోలు. ఆ కాగితాల మధ్య ఆయన చేతిగుడ్డా, రక్తంతో బాగా స్టైన్ అయ్యి – మరింక అక్కడ ఉండాలని అనిపించలేదు. మాలతి చేతిని అందుకొని గబగబా పేవ్ మేంట్ పైకి వచ్చి – చాలాదూరం నడిచాక, జేబులోంచి ఊదా రంగు పువ్వును బయటకు తీసి – గుప్పిటిలో బిగించి, క్రూరంగా నలిపి – "మనం ఇక్కడ విడిపోవాలి! నువ్వు నిజం కాదు! మోహన సుందరం నిజం కాదు! ఆ ముసలి కవి మరణం నిజం కాదు! ఇదిగో ఈ పువ్వు నిజం కాదు! దీని డెడ్ బాడీ సాక్షిగా – ఇవాళ మనమూ కవిని కలవలేదు! ఇవాల్టిని కొట్టేస్తున్నాను! గుడ్ బై!" అంటూ చరచరా నడుచుకుంటూ వెళుతూండగా ..... "ఇవాళ గొప్ప చారిత్రాత్మకమైన రోజు! ఈ శతాబ్దానికి ఇది ఆఖరు రోజు. డిసెంబరు ముప్పై ఒకటి పందొమ్మిది వందల తొంభైతొమ్మిది!" మాలతి సన్నని నవ్వు నా కాళ్ళకు చుట్టుకుంటూ ఉండగా నేను కోఠీ బస్ స్టాప్ వైపు నడిచాను.

**** **** ****

అంతా గమ్మత్తు, అంతా వెర్రే అనుకున్న కబుర్లన్నీ పచ్చినిజాలనీ - నీలాకాశం, సూర్యుడి దిగులు, కృశించిన ముఖాలు, ఆకలి, శరీరహింస-ఇవన్నీ ఒక వాతావరణం కోసం మనం సృష్టించుకొన్న నేపథ్యం అనుకున్నానుగానీ అవన్నీ ఒక మిస్టరీలా మనల్ని వెంటాడుతాయని ఎట్లా అనుకోను? ఈ మాలతి మాత్రం "పొంచి ఉన్న దుఃఖం! ఆమె ఒక దుఃఖగాథ!" అంటాడు మోహన సుందరం ఆమెను గురించి. మాలతి మాత్రమేనా? మోహన సుందరంలోనూ, ఆఖరికి నాలోనూ, కెలికి చూస్తే లోపలో దుఃఖం పురాణం ఉంటుంది.

కోఠీ బస్ స్టాండ్ హడావుడిగా, రద్దీగా ఉంది. రోడ్డుపొడుగునా వందలుగా వాహనాలు ఆగిపోయి ఉన్నాయి. ట్రాఫిక్ జాం కాబోలు. ట్రాఫిక్ జాంను చీల్చుకుంటూ ఒక ఊరేగింపు. ఎవరినో డౌన్ డౌన్ అంటూ. ఇంకెవరినో జిందాబాద్ అంటూ. ఈ ఊరేగింపులు చూస్తే నాలో ఉలికిపాటు. ఇలాంటి ఊరేగింపుల మధ్యనెక్కడో మాలతి హఠాత్తుగా ప్రత్యక్ష్యం అవుతుంది. ఆసక్తిగా ఊరేగింపు వెనకనే చాలా దూరం వెళ్ళేవాణ్ణి. హఠాత్తుగా ఏ పోలీసు లాఠీ ఛార్జితోనో, అందర్నీ పోలోమంటూ పోలీస్ వ్యాన్ లో తోయటంతోనో ఆ ఊరేగింపు ముగిసేది. ఒకసారి జైలు గోడల మధ్య మాలతి మోకాలుపై తల ఆంచుకుని, నిస్సహాయపు మౌనంలా ఎదురైన దృశ్యం - చాన్నాళ్ళ పాటు నాలోంచి చెరిపి వేసుకోలేకపోయేవాణ్ణి. "ఈ ఉద్యమాలు, ఈ ధర్నాలు, ఎందుకీ కంఠశోష! ఉద్యమాల కాలం వెళ్ళిపోయింది! ఇప్పుదంతా రాజకీయం. పవర్ గేం ! కొంచం కులం, మరికాస్త మతం - ప్రతి గ్రూపుకీ ఇంతని కోటాలు-".

నా మాటల్ని మధ్యలో ఆపివేసి "నీ ఆలోచన్లు ఎంత మురుగు వాసన వేస్తోందో, నీ మెదడులో శవాలున్నయని నా నమ్మకం!" అనేది మాలతి. నాలో ఒక రోషం. ఒక దుఃఖం. "అవును. నువ్వు పుట్టకముందే ఒకసారి చచ్చిన వాణ్ణి! నేనేమిటి, నా తల్లీ తండ్రీ, నా జాతి మొత్తం, కత్తివేటుకు టప్ టప్ మంటూ తలలు తెగి . . . చాన్నాళ్ళుగా శవాలుగా ఉన్నవాళ్ళం! మా పునరుత్థానానికి ఇంకా చాలా కాలం పడుతుంది!" అనేవాణ్ణి ఆక్రోశంగా. "ప్రభో! ఫ్రాయిడ్! ఇక ఈ శవాల కథలు ఆపెయ్యి! తట్టుకోలేను!" అంటూ చిన్న జోకుతో వాతావరణాన్ని తేలిక పరచేది మాలతి.

మళ్ళీ 136 ఎక్కి ఉస్మానియా వైపు ప్రయాణం. నగరమంతా రంగు కాగితాలు. పెద్ద పెద్ద బానర్లు "వెల్ కం టు న్యూ మిలినియం!". మైకులు. హడావుడి. రంగుదీపాల తోరణాలు దండలు దండలుగా రోడ్డు చివరన వేలాడుతున్నాయి. ఈ సంబరాల్ని చూస్తే నాలో వింత ఎలర్జీ. కోపం.

ఇంత దుఃఖాన్ని, అశాంతిని మరచి, ఆల్ ఈజ్ వెల్ ! అంతటా గొప్ప ఆనందమే అని మోసపుచ్చే ఉత్సవాలివి.

ఒకసారి యూనివర్సిటీ ఆడిటోరియంలో ఇండో-జర్మన్ మైత్రో పంకాయో - సింఫనీ ఏర్పాటు చేసారు. రిథమిక్ హాయి, సుఖమతమైన శబ్దం, శరీరంపై సన్నని గగుర్పాటు - లోపలి నుండి స్వరాల ఫౌంటెన్ ఎగజిమ్ముతున్నట్లుగా - ఎంతో హాయిగా ఉంది. అయితే ఆవేళే మాలతి వాళ్ళ నాన్న పెట్టుకున్న అప్పీలును కొట్టేసింది హైకోర్టు. కింద కోర్టు వేసిన యావజ్జీవ కారాగార శిక్షను ఖరారు చేసింది. తీర్పు వెలువడి 4, 5 గంటలైనా కాలేదు. ఏమీకానట్లు గంభీరంగా నాప్రక్కన కూర్చుంది మాలతి. నాలో వింత కసి! అప్పుడు హఠాత్తుగా లేచి - టాయిలెట్స్ వైపు వెళ్ళి - "ది ప్రాసెస్ ఆఫ్ యూరినేషన్ అండ్ ది రిథమిక్ బ్లిస్ ఆఫ్ సింఫనీ - ఎ కంపారిజన్" అంటూ రెండు పేరాల సిద్ధాంతచర్చని రాసి వచ్చాను. ఆ తరువాత వారం రోజులపాటు యూనివర్సిటీ అంతా "ది సిమ్ఫోనిక్ యూరినేషన్ " అంటూ ఒకటే చర్చ. "బాస్టర్డ్! బ్లడీ అనార్కిక్ ఫగ్!" అంటూ మాలతి ఆవారమంతా నన్ను తిడుతూనే ఉంది. ఆ తరువాత చాలా రోజుల పాటు టాయిలెట్ గోడలు గొప్ప పోయిట్రీ టాబ్లాయిడ్స్ అయ్యాయి! నిప్పుకోడి రెక్కలు, చెల్లని నాణాలు, మంత్రశిలాజాలు, ఎండుచేపలు, ఫైవ్ స్టార్ ఫింప్ , లోర్కా, గిన్స్ బర్గ్ - నెలల తరబడి ఉస్మానీయులకు డిలైట్ నిచ్చాయి ఈ పోర్నో కవితలు.

నిజానికి ఇవాళ మాలతితో కలిసి అడ్వకేటు దగ్గరకి వెళ్ళాల్సింది! కొత్త మిలెనియం సంబరాలకోసం కోర్టుకూడ ముస్తాబవుతుందిట! "రెండు వారాలు ఆగి రాకూడదూ!" అన్నాడాయన. మాలతి ముఖంలో నిరాశ. అట్లా నిరాశతోనూ, దిగులుతోనూ ఉన్న మాలతిని చూస్తే, చర్మం వలుస్తున్నట్టుగా, కడుపులో చేతులు పెట్టి కెలుకుతున్న అనుభూతి కలుగుతాయి.

**** **** **** ****

డిసెంబరు ముప్పయి ఒకటి రాత్రి. ఒక అసాధారణమైన అనుభవాన్ని - రెండు వందలు తగలేసి - రహస్యమైన అనుభవం ఒక సినిమా. సినిమా కూడా కాదు. పదిహేను నిముషాల డాక్యుమెంటరీ. ఒక బాంబ్ పేలుడు సంఘటన. బ్లాస్ట్ అవటం దగ్గర మొదలు పెట్టి - దృశ్యం ఒకటి - ఎర్రటి ధూళి లాంటి భయం గొలిపే విస్ఫోటనము. శరీరంలోంచి ఒక కాలు తెగి, లేచి అట్లా ఎగిరి, పందమీటర్ల దూరంలో పడటం. దృశ్యం రెండు - ఎర్రగా, వెచ్చగా రక్తం బుసబుస మంటూ తెగిపడిన కాల్లో - ఒక కదలిక. దృశ్యం మూడు - ప్రాణం పోయే ముందర విలవిల. నిస్సహాయమైన, భయకంపితమైన మరణపు కేక. సిటీలోనే ఒక నెల క్రితం జరిగిన బ్లాస్టింగ్. ఇంకో కార్యక్రమాన్ని

షూట్ చేస్తున్న విడియో కెమేరా వాడి టేపులోకి ఈ పావుగంట విధ్వంసం రికార్డు అయ్యింది. హాస్టల్స్‌లో బాగా పాపులర్ అయ్యిందీ కాసెట్!

"ఎందుకోసం ఈ అనుభవాన్ని చూస్తున్నట్లు?" అని నాకు నేనే ప్రశ్న వేసుకున్నాను. "విధ్వంసం, మరణం నాకు ప్రియమవుతున్నాయా?" అని కూడా ప్రశ్నించుకున్నాను. ఈ భీభత్సంలోంచి ఏమి వెతుకుతున్నాను. మరణమా? దానితో కలిగే భయమా? లేక ఒక పోరాటానికి సిద్ధం అవటమా? విడియో కాసెట్ చూస్తుండగా, మధ్యలో తలుపు చప్పుడు. కంగారుగా తలుపు తీస్తే మాలతి, మోహనసుందరం. ఇంకా నాలుగైదు నిముషాలుందంటున్నా – బయటకు లాక్కు వచ్చింది మాలతి.

"ఏమైంది నీకు? మరణాన్ని ఎంజాయ్ చేసే స్థితికి వచ్చావా?" మాలతి కోపంగా ఉంది. మోహనసుందరం కల్పించుకొని "రాబోయే శతాబ్దాన్ని ముందుగానే విడియోలో చూస్తున్నాడు!" అన్నాడు సరదాగా. "ఇవాళనుంచి నీపేరు నిరంజన కాదు! డెత్!" అంది మాలతి, తగ్గని కోపంతో. "రేపు కొత్త మిలెనియం సందర్భంగా ఆడిటోరియమ్‌లో ఒక ప్రోగ్రాం జరుగుతుంది. మోహనసుందరం ఒక నాటకాన్ని రాశాడు, ఆ ప్రోగ్రాంలో ప్లే చెయ్యటానికి. నాటకంలో డెత్ అనే కేరెక్టరు ఉంది. దానికి ఎవరినన్నా సజెస్టు చేస్తావని నీ దగ్గరకు వచ్చాము. ఆరూమ్‌లో నిన్ను చూశాక డెత్ పాత్రకు నువ్వే కరెక్టుగా సరిపోతావు అనిపిస్తుంది. రేపుదయం ఏడింటికి మోహనసుందరం ఇల్లు పొయిట్రీ కేఫ్‌కి రా! అక్కడో రిహార్సల్ వేసుకొని, సరాసరి ఆడిటోరియంకు వెళదాం!" మాలతికి ఇంకా కోపం తగ్గినట్లు లేదు. మాలతి, మోహనసుందరం వెళ్ళిపోయారు. చీకటి. నిశ్శబ్దం. ఎక్కడో క్వేక్, క్వేక్ అంటూ విశృంఖలంగా అరుస్తున్న పక్షి. ఆ అరుపు భయం గొలిపేదిలా ఉంది. అద్భుతమైన రంగులు, మత్తయిన సౌగంధాలు, రాత్రిపాటలు, లలితలలితంగా, భగవంతుని వాగ్దానంలా ఉండే రాత్రులు కావివి.

...............................................

నిద్ర లేచాను. చల్లనిగాలి ఒంటినిగిల్లి నిద్రలేపింది. కళ్ళు మూసుకొనే ఉన్నాను. ఎదురుగా గోడనిండా బొమ్మలు. అతికించినవి. బొమ్మలే కాని అవి అనుభవానికి సింబల్స్. మంచుకొండలు, నీలాకాశం, ఎగిరేపక్షి, ఆకుపచ్చనిలోయ, ఫాక్టరీ పొగగొట్టం, హెూచిమిన్, చెగువేరా, యుద్ధనౌక, లామినేట్ చేయించిన నాన్న ఫోటో, గౌతమ బుద్ధుడూ, అంబేద్కరూ, థాయ్‌లాండ్ ఫుడ్ఐటెంస్, సుమో మల్లయోధుడు, జాకీచాన్, షారుక్ ఖాన్, కాజోల్ . . . ఇవాళ ఎవరు? ఏ అనుభూతి నారోజును నింపబోతుంది. ఎ టెస్ట్? కుడికన్ను తెరిచాను. డెమీమూరు నగ్నవక్షం. కంటినిండా కోర్కె, కామం, ఎరోటిక్ ఫాంటసీలు నిండి, కుడిరెప్ప మూసి, ఎడమ కన్ను

తెరిచాను. రిజర్వు బ్యాంక్ ఎంబ్లమ్. దానిపై ఎగురుతున్న మనీబర్డ్స్ – గొప్ప కాంబినేషన్. ఈ రోజు పేరు శృంగారగీతం. అందులో కాస్త ధనయోగం కూడా.

లేచి, చకచకా తయారై, రోడ్డు పైకెక్కి – ఎకనామిక్ టైంస్ పేపరు చదువుకొని, షేర్సు కాలం పేజీని చించుకొని, జేబులో కుక్కుకొని – మిగతా పేపరును నలిపి రోడ్డు చివర విసిరి – టీ స్టాల్‌కు వెళ్ళి – వెచ్చని ఇరానీ ఛాయ్ నాలుకపై పడి – మెల్లగా గొంతులోకి దిగుతుంటే – హుషారుకు బదులు – ఒక దుఃఖం, ఒక క్రోధం – ఐ వజ్ హర్ట్ – గాయం గాయం ఎంత మాటంది మాలతి – మరణానికి ప్రవక్తనని – షి యీజ్ క్రేజీ! ఈ మోహనసుందరం మాత్రం – నిన్న నిన్న నిన్నలోకి ప్రపంచాన్ని నెడతానంటాడే – గోడమీద ఎప్పటిదో ఒక చిరిగిపోయిన బొమ్మను పెట్టుకొని – అట్లాగే జీవించాలంటాడే – నిన్నకు జబ్బు చేసిందంటే వినడేం? కుళ్ళుతున్న వాసన తెలియటం లేదూ! జరగాల్సిన విధ్వంసం జరిగే పోయింది! ఎవడో మనల్ని ముందుకో, వెనక్కో వాడిష్టం వచ్చిన దిశలో నడిపే రోజులొచ్చాయి. దేన్ని అపుతాడీ మోహనసుందరం? సెల్ ఫోను, యూరోడాలర్, బులియన్ మార్కెట్టు, టెర్మినేటర్ విత్తనము, పోర్నో వెబ్‌సైటు, పతనమవుతున్న రూపాయి, మల్టీ నేషనల్స్, అమెరికన్ ఈగిల్ కింద వున్న మన దేహాలు – దేన్ని ఆపుతాడు? ఎదురుగా ఐదో నంబరు బస్సు. మెహిదీపట్నం. పొయిట్రీ కేఫ్, మోహనసుందరం ఇంటికి. బస్సులోకి అడుగుపెడుతున్నానా? ఏదో గొప్ప వాయేజ్‌లోకి వెళుతున్నట్లుగా – కిటకిట క్రిక్కిరిసి వున్న మానవసమూహం లోకి, బలవంతంగా లాగబడుతున్నట్లుగా – "కొత్తదనం, కొత్తదనం కావాలి!" "అన్నా! నువ్ సంజాయించరాదూ?" "ఇండికా, ది డ్రీం కార్ –" "ఎలియనేషన్ ఎక్కడ లేదు! ఊపిరిలో, ఇట్లా చూడు నా కంటి పాపలో!" "డోంట్ బి ఎగ్జైటెడ్!" "దె కిల్డ్ యూనిట్ ట్రస్ట్!" "పిల్లగాని సంజాయించరాదూ!" "కిర్ర్ర్.." "అబ్బా షడన్ బ్రేకు వేసినాడు!" "గుండె జల్లుమన్న దనుకో!" "ఎర్ర జెండా గుంపు" "డ్రైవర్! ఎంత సేపు ఆగాలి!"

చప్పుళ్ళు చంపివేసి, నిశ్శబ్దాన్ని మాత్రమే, రోజులో ఒక్క క్షణమైనా – మొత్తం ప్రపంచంలో శబ్దాలు ఆగిపోయి – ఎంతగొప్పగా ఉంటుందో? అంతటా నిశ్శబ్దం! ఒక్క సన్నటిగొంతు, ఏదో ఒక ఆలాపన – చల్లగా మృదువుగా గొప్ప బాల్యపు స్వప్నంలా – మధురంగా వినిపిస్తుంటే – ఎప్పుడైనా తటస్థపడుతుందా? జనం ఒక్కొక్కళ్ళే దిగుతున్నారు. ఇద్దరో ముగ్గురో ఉన్నారు. బయట ఒక పెద్ద ఊరేగింపు. స్త్రీలపై అత్యాచారాలకు వ్యతిరేకంగా. అన్ని ప్రజాసంస్థల ఊరేగింపు. ఊరేగింపు సుదీర్ఘంగా సాగిపోతుంది. ఊరేగింపులోంచి జారి ఓ ముగ్గురు బస్సులోకి ఎక్కారు. డప్పు, కంజర, పొడవాటి ఫ్లూట్. అలసటగా, నిశ్శబ్దంగా ఉన్నారు వాళ్ళు. ఊరేగింపు వెళ్ళిపోయి, బస్సు కదిలింది. బొయ్ మంటూ సన్నగా ఫ్లూట్ మోగింది. పక్కనున్న డప్పు, కంజెర

కుర్రవాళ్ళలోనూ ఉత్సాహం రగిలింది. గొప్పలయ. మత్తుగా మోగుతున్న ఫ్లూటు, గొప్ప దృశ్యం. దిగంతాల వైపుకు ప్రయాణిస్తూ - వెనుక నేపథ్యంగా వేణువు పాట. చిన్న జెర్క్‌తో బస్సు ఆగింది. కలలాగా హఠాత్తుగా వాళ్ళు ముగ్గురూ అదృశ్యం అయ్యారు.

బరువుగా ఊపిరి తీస్తూ యాభై యేళ్ళ మనిషి. ఆస్త్మా పేషెంట్ కాబోలు. తలచుట్టూ మఫ్లర్ చుట్టుకొని, ఒంటినిండా బూడిదరంగు శాలువా కప్పుకొని - మాంసం ముద్ద లాగా సీట్లో ముడుక్కొని కూర్చున్నాడు. జేబులోంచి నెబ్యులైజర్ తీసుకొని ఉఫ్... ఉఫ్... మంటూ ముక్కులోపలికి స్ప్రే చేసుకున్నాడు. కొంచెం రిలీఫ్ వచ్చినట్లుంది. ఊపిరి కాస్త తేలికయి - అతని ముఖంలో ఉత్సాహం రాజుకోవటం మొదలుపెట్టింది. నావైపు చూసి సన్నగా నవ్వి, "ఈ నెబ్యులైజరు నాకు గొప్ప వేదాంతాన్ని నేర్పుతుంది! ఎప్పటికప్పుడు ప్రాణం దుర్భరంగా అనిపించి - ఇంక చాలు ఈ జీవితం అనిపిస్తుంది. యుథనేషియా గురించి సీరియస్‌గా ఆలోచించటము మొదలు పెడతాను! ఇది స్ప్రే చేసినాక మళ్ళీ రెండు గంటల ఆయువు వస్తుంది. మళ్ళీ ఉత్సాహం! చాలా మైళ్ళు ప్రయాణించాలని కోరిక!" నెబ్యులైజరే కాదు అతనే గొప్ప ఫిలాసఫర్‌లా కనిపిస్తున్నాడు. బోలెడంత సఫరింగ్, కొంచెం రిలీఫ్ - ఇందాకటి మధురమైన సంగీతమూ నిజమే, ఈ సఫరింగ్ నిజమే! ఈ బస్సు నా వేదాంత పాఠశాల. బస్సు దిగి, మసాబ్ టాంక్ పైన. ఇంకా ఫర్లాంగు దూరం నడవాలి మోహనసుందరం పొయిట్రీ కేఫ్‌కి. కలలు, కోర్కెలు, చెమట, చిత్తడి, నవ్వులు, కేరింతలు అనంతమైన శబ్దాలుగా ఉంది చౌరస్తా. తోసుకుంటూ, త్రొక్కుకుంటూ, ఎడాపెడా ఉర్దూ పదాల సెంటు పూసుకున్న తెలుగు మాటల్ని వెదజల్లుతూ, హడావుడిగా ఉంది.

మాసాబ్‌టాంక్, బ్రిడ్జి మధ్యన, మెట్ల పక్కన - వాటే సీన్? చిలుక పస్తీ చెప్పేవాడు. పంచె, తలకట్టు, ఊహు! వీడు ఆధునికుడు - ఫాంటు, షర్టు, కళ్ళజోడు. కళ్ళజోడు వెనుక లోతుగా బురదగుంటల్లా ఉన్న కళ్ళు. అటువైపు నడిచాను. నన్ను ట్రాప్ చేశానని సంబరపడుతున్నాడు వాడు. "కూర్చోండి సార్! గొప్ప భవిష్యత్తు ఉన్నవాళ్ళు! మహానుభావుల జాతకం మీది!" మైగాడ్ వీడు బలమైన గాలమే వేశాడు. టప్ మంటూ తగులుకుంది గుండెకు. కూర్చుని, "కొత్త శతాబ్దం వచ్చింది. ఈ శతాబ్దంలో నా భవిష్యత్తు ఎట్లా ఉంటుందో చెప్పగలవా?" అన్నాను ఆసక్తిగా. వాడు సీరియస్‌గా ముఖం పెట్టి, నిజంగానే గొప్ప సూత్-సేయర్‌లా ఫీలయి, ఇష్టమైన రంగు, పూవు ఏవేవో అడిగి, చివరగా "తరచూ వస్తుండే కల ఏమిటో చెప్పండి!" అన్నాడు. ఇదో హిప్నోసిస్. వెనక్కు వెళ్ళే మార్గమే లేదు. అసంకల్పితంగానే నోరు తెరిచాను. "గొప్ప సముద్రం. ఒడ్డున స్నేహితులం అందరం. మాలతి పాట పాడుతుంది. అనంతమైన దుఃఖం. మాలతి చరిత్ర గురించి పాడుతుంది. ఇవాల్టిని ఇక్కడే ఆపేద్దామా? అని పాడుతుంది. సర్వశక్తుల్ని ఉపయోగించి

కాలాన్ని ఆపివేద్దామా అని పాడుతుంది. నేను ఒడ్డు పైనే కూలబడి ఇసుకను తవ్వుతున్నాను. ఎప్పుడు చిన్నతనంలో పాతిపెట్టిన నా కలల కోసం, తవ్వుతూనే ఉన్నాను. లోతుగా, లోతుగా ఊహు! ఏమీ కనబడటం లేదు. దుఃఖం వస్తుంది.

సముద్రపు హోరు, మాలతి పాట, నా దుఃఖం – హఠాత్తుగా మోహనసుందరం వచ్చాడు. సింఫొనీ కండక్టర్‌లా "ఇక చాలు ఆపండి! ఇళ్ళకు పోదాం!" అంటున్నాడు. అనటం కాదు అదో కమాండ్! షాట్ చిత్రించిన తర్వాత పేకప్ చెప్పే దర్శకుడిలా. "వద్దు ఈ రోజు వెళ్ళిపోతుంది" అంటూ మాలతి పాడుతూనే ఉంది. "డోంట్ వర్రీ! రేపుంది కదా! రేపటికోసం జీవిద్దాం!" అంటున్నాడు మోహనసుందరం. ఊడివచ్చిన పెయింటింగ్‌లా సముద్రాన్ని, గుప్పిటి మధ్య యిమిడ్చిన పిట్టలా పాటను, చిన్న పాపాయిలాగా భుజంపై చేయి వేసి మాలతినీ – అందర్నీ వెంట తీసుకెళుతున్నాడు మోహనసుందరం. నేను అరుస్తూనే ఉన్నాను "రేపటిలో ఏముంది?" అంటూ.

చిలకపస్తీ వాడు కంగారు పడ్డాడు. ముఖం తెల్లబోయింది. వాడికేమీ అర్థం అయినట్లు లేదు. బుర్ర గోక్కుంటూ పంజరంలోంచి చిలుకను బయటకు తీశాడు. కుర్ర్ కుర్ర్ అంటూ శబ్దం చేస్తూ, చిలుక బయటకు వచ్చింది. వందకు పైగా ఉన్న కవర్లపై అటూ ఇటూ తిరిగింది. చిలుకపస్తీ వాడు నాపేరు చెప్పి "సార్ కోసం ఒక కార్డు తియ్యి!" అన్నాడు. "సార్ కోసం ఒక భవిష్యత్తును, ఒక సత్యాన్ని బయటికి తియ్యి!" అంటూ దాన్ని ఉత్సాహ పరుస్తున్నాడు. చిలుక అటూ ఇటూ తిరిగి ఒక కార్డు బయటకు తీసింది. వాడు కార్డు తీశాడు. బాలకృష్ణుడు, నోట్లో సకల భువనాల్ని చూపిస్తున్నాడు వాళ్ళ అమ్మకు. "శుభం! గొప్ప అద్భుతం జరగబోతుంది మీ జీవితంలో ..." అన్నాడు వాడు. కార్డు లోపల రాసి ఉన్న వాక్యాల్ని చదివాడు. "అద్భుతాలు చేసే మనిషి మీకు ఎదురౌతాడు. అతని ద్వారా మీరు అనుకున్నవన్నీ జరుగుతాయి. డబ్బు, సుఖాలు అన్నీ. అయితే ఒక ప్రమాదం పొంచి ఉంది. జాగ్రత్త!" అని ఉంది. లేచి, వాడి చేతిలో వందరూపాయల నోటు పెట్టి, వాడి పైపు కన్నుగీటి "ఆ అద్భుతాలు చేసే మనిషి నేనే! ఆ సుఖం నేనే! ఆ ప్రమాదం నేనే! నన్ను బాగా స్టడీ చేసినందుకు ఈ వందా బహుమానం! చిన్న సలహా! కార్డు లోపల వాక్యాన్ని మార్చు! అద్భుతాలు జరిగే కాలం వెళ్ళిపోయింది. కొత్త శతాబ్దం వచ్చింది. రాబోయేదంతా దుఃఖమే! మరణమే! రేపటిలో ఏమున్నదనే ప్రశ్న మానవుడికి మిగిలింది! అన్ని కార్డుల్లోనూ ఈ ప్రశ్నే రాయి! గుర్తుంచుకో! బై! బై!" అంటూ చకచకా రోడ్డు దిగి, మోహనసుందరం ఇంటి వైపుకు నడిచాను.

..............................................

"నాటకానికి రెండు చావులూ, మూడు పుట్టుకలూ – అవును ముందు రచయిత దుఃఖంలోంచి పుడుతుంది. పేపరుపైన చచ్చిపోతుంది. నటుల భావోద్వేగంతో మళ్ళీ పుడుతుంది. స్టేజీపై మరోసారి చస్తుంది. చివరిగా ఆడియన్స్ రెస్పాన్స్‌లో పునరుద్ధాన్ని పొందుతుంది." మోహనసుందరం నాటకం గురించి లెక్చెరిస్తున్నాడు. మాలతి ఇంకా రాలేదు. పాయిత్రీ కేఫ్ ముందున్న అరుగులాంటి ప్రదేశంలో కూర్చుని, నేను, మరో ఇద్దరు కుర్రాళ్ళు. అతన్ని దీక్షగా వింటున్నాము. హఠాత్తుగా మోహనసుందరం గొంతెత్తి పాట అందుకున్నాడు. డైలాగులు ప్రాక్టీసు చేస్తున్న ఒక కుర్రవాడు అట్టతీసుకొని లయాత్మకంగా దరువు వేస్తున్నాడు. జానపదగీతం. బొంగురుగా వెదురుచెట్లన్నీ పెళపెళమంటూ విరుగుతున్న చప్పుడు. అతని స్వరం క్రమక్రమంగా పెద్దదవుతూ – భూమికి ఆవైపు వరకూ వినబడేంతగా – గొప్పగా ఊగిపోతున్నాడు. అంతకంతకూ స్వరాన్ని పెంచి, పక్కనే ఉన్న టేప్ రికార్డర్ టప్ మంటూ ఆన్ చేశాడు. పోలీసు ట్రక్కులు ప్రయాణిస్తున్న చప్పుడు. విసురుగా, వేగంగా. టేప్ రికార్డర్ లోని శబ్దాలకు పారలల్‌గా మోహనసుందరం కూడా పాడుతున్నాడు. టేప్ రికార్డర్ లోంచి ట్రక్కుల ప్రయాణం ఆగిపోయి, టకటక మంటూ పోలీసులు మార్చ్ చేస్తున్న చప్పుడు. తలుపులపై బాయ్‌నెట్లతో ధన్ ధన్‌మని పొడుస్తున్న చప్పుడు. లోపల గదిలో – సన్నని నవ్వు, కేరింత, ఇరవై మంది పిల్లల అల్లరి, తలుపు పెళ్ళుమని విరిగిన చప్పుడు. మోహనసుందరం పాడుతూనే ఉన్నాడు, ప్రపంచానికంతా వినబడే మహాస్వరంలా. పొట్టలో కుమ్మిన శబ్దం. సార్ సార్ అంటూ పిల్లలు గొల్లుమన్న శబ్దం. అమ్మా అన్న ఆర్తనాదం. నేలపై పొర్లించి మనిషిని లాక్కు వెళుతున్న చప్పుడు. భయవిహ్వలతతో, దుఃఖంతో కూడిన ఒక స్వరం "ఆయన్నేమీ చెయ్యకండి! ఆయన్నేమీ చెయ్యకండి!" అంటూ పెద్దగా అరుస్తున్న గొంతు. ఆ గొంతును గుర్తు పట్టాను. అది మాలతిది. టేప్ రికార్డర్ లోంచి, అన్ని చప్పుళ్ళు ఆగిపోయి మాలతి ఏడుపు మాత్రమే వినిపిస్తుంది. మోహనసుందరం పాట క్రమంగా ఫేడౌట్ అయినట్లుగా ఆగిపోయింది. "ఇవాళ మన నాటకంలో మొదటిరంగం ఇదే. మాలతి తండ్రిని పోలీసులు అరస్ట్ చెయ్యటం. అతని కోసం మాలతి చేసిన ప్రయత్నాలు, పోరాటం ఇదే నాటకానికి కథావస్తువు."

"ఇందులో డెత్ అనే కారెక్టరు, దాదాపు అన్ని రంగాల్లోనూ కనిపిస్తుంది. ఈ పాత్ర ఒక మెటాఫర్. ఒక అణిచివేతకు, హింసకు, విధ్వంసానికి. మొదటి రంగంలో – జానపదగీతం పాడే గాయకుడిలా డెత్ ప్రత్యక్షమవుతుంది. రెండో రంగంలో పొలిటీషన్‌లా. మూడోరంగంలో ..." మోహనసుందరం మాటలు పూర్తి కాకుండానే, ఒక యూనివర్సిటీ కుర్రాడు పగరుచుకుంటూ – "అన్నా అర్జెంటుగా గాంధీ హాస్పటల్‌కి పోవాల! లే!" అంటూ కంగారు పెట్టేడు. "ఏమైంది?" అన్నాడు తాపీగా మోహనసుందరం. "మాలతి వాళ్ళ నాన్న రాజయ్య సార్‌ను జైల్లో చంపేసినారు. కడుపునొప్పితో

చచ్చిపొయ్యాడని సర్టిఫై చేసి మార్చురీకి పంపారు. మాలతక్క అక్కడే ఉంది. బాడీని కూడా యియ్యరట!" మోహనసుందరం ముఖంలో క్షణం పాటు కంగారు. కోపం. వెంటనే తమాయించుకొని, లేచి "పద వెళ్దాం!" అంటూ అందర్నీ బయలుదేర దీశాడు. వేగంగా నడుస్తున్నాడు మోహనసుందరం. ఎటు చూసినా వ్యాధులే. నాగుపాములు కాళ్ళకు చుట్టుకున్నట్లుగా. వార్డుల పొడవునా వంగిపోయి, నలిగిపోయి, శుష్కించి, దుఃఖించి, మరణం వద్దు వద్దని విలపిస్తూ ప్రాణం పొయ్యండని ప్రార్థిస్తూ ... వార్డులన్నీ దాటుకొని – చివరన ఉన్న విశాలమైన గది దగ్గర ఆగాడు. మార్చురీ గది. గది ముందు పిట్టగోడ నానుకొని మాలతి.

గంభీరంగా "నేను శవాన్ని చూడాలి!" ఒక్క సారిగా పెద్దగా అరిచింది మాలతి. "సూపరెండెంటు నడిగితే పోలీసుల పర్మిషన్ కావాలంటూ మొండికేస్తున్నాడు!" గది వెనుక ఒక అద్దాల కిటికీ ఉంది. మోహనసుందరం, లేచి, ఒక లావాటి రాయిని తీసుకొని పెళ్ళుమని ఆ కిటికీని పగలగొట్టాడు. మనిషి పట్టే ఖాళీ వచ్చింది. "పద! శవాన్ని చూద్దాం!" అంటూ లోపలికి నడిచాడు. వెంట మాలతీ నేనూ. బయట వార్డ్ బోయ్‌ల సెంట్రీల కేకలు పట్టించుకోకుండా లోపలికి నడిచాము. శవం ముఖం నిండా తెల్లటి సైను గుడ్డ కప్పి ఉంది. గుడ్డ పైకి తీశాడు మోహనసుందరం. తల పగిలి ఉంది. రక్తం నల్లగా గడ్డ కట్టి – మాలతికి భయం సరే, దుఃఖమయినా రాదే! స్ట్రెచర్ పక్కనే ఉన్న లుంగీని, చొక్కాని మడత పెట్టుకొని బయటకు వచ్చింది మాలతి. నలుగురు పోలీసులు హడావుడిగా వస్తున్నారు. వాళ్ళను లెక్క చెయ్యనట్లుగా "పద ప్రెస్ మీట్ ఒకటి పెడదాం! ముందు!" అంటూ ముందుకు నడిచాడు. హఠాత్తుగా ఏదో గుర్తుకొచ్చిన దానిలా మార్చురీలోంచి తెచ్చిన బట్టల్ని నేలపై పెట్టి, ఎవరో కుర్రాడి స్కూటర్‌లోంచి పెట్రోలు తీసి, దానిపై పోసి, టఫ్ మని అగ్గిపుల్ల గీసి వేసింది. భగ్గు మంటా. ఆ మంట పక్కనే కూలబడి పెద్దగా ఏడవటం మొదలుపెట్టింది. చాలాసేపు ఏడ్చి, లేచి కళ్ళు తుడుచుకొని, ఒక యుద్ధానికి సిద్ధమైన దానిలా తయారైంది మాలతి. "నిరంజనా! నువ్వు యూనివర్సిటీ వైపుకు వెళ్ళి మన కుర్రవాళ్ళని మొబలైజ్ చెయ్యి! నేనూ, మోహనా, చిన్న ప్రెస్ మీట్ పెట్టి అటువైపే వస్తాము" అంటూ ముందుకు కదిలింది.

.................................................

యూనివర్సిటీ అంతా కళకళలాడుతుంది. కొత్తగా రంగులు పులుముకొని, రంగు కాగితాలు. వాద్య సంగీతాలు – గొప్ప పండగ వాతావరణం వచ్చేసింది. "వెల్‌కం 2000 యియర్" పెద్ద బెలూన్ ఆకాశంలో వేలాడుతుంది. ఒక మహాద్భుతం ఏదో జరిగినట్లుగా ఉందా ఉత్సవ వాతావరణం. ఆడిటోరియంలో పెద్ద ఫంక్షన్. ఈ శతాబ్దపు మేధావులందర్నీ గుర్తుచేసుకుంటూ, వాళ్ళ కోసం

గొప్పసభ. శతాబ్దాన్ని దాటి మిలెనియమ్‌లోని కొంతమంది గొప్పవాళ్ళని - నన్నయ, కృష్ణదేవరాయలు ఇంకా ఎవరెవరో జనం పోల్చుకోలేని వాళ్ళను కూడా స్మరించుకోవటం అట. గవర్నరు, పద్మశ్రీలు, పద్మభూషణ్‌లు చాలా మంది వచ్చారు. పదిగంటలకు ఆడిటోరియమంతా కిటకిటలాడుతుంది. ఎవరికైనా మాలతి దుఃఖగాథ చెప్పాలని, చిన్న ప్రొటెస్టు, పోనీ ఒక ఊరేగింపు ఊహ విసే మూడు లేదు. రంగుల బాడ్జీలు తగిలించుకొని, సుదీర్ఘమైన ఉపన్యాసాలు రాసుకొని - విద్యార్థి నాయకులంతా హడావుడిగా ఉన్నారు.

ముందువరసలో పదిమంది కవులు. ఐదుగురు ఆధునికులు, మరో ఐదుగురు ప్రాచీనులు. బహుశా పద్యాలు చదువుతారు కాబోలు. కొత్త మిలెనియం పై కవిసమ్మేళనమట. ఆడిటోరియంలో ప్రతి ఒకడూ గొప్ప జ్ఞాని, బాగా చదువుకొని ఉంటాడు, అనే ముఖాలు పెట్టుకొని, ఇంటలెక్చ్యువల్ క్రీచర్స్ అనిపించుకోవాలని తపన. ఆ ముఖాలపైని ముసుగు లాగేస్తే లోపలో తోడేలో, చిరుతో, జంతువో ఉండితీరుతుంది. సక్కర్స్! బ్లడీసక్కర్స్! విసుగ్గా బయటకు వెళుతుంటే, "నిరంజనా! నీ కోసమే చూస్తున్నాను. మోహనసుందరం నాటకాన్ని కాన్సిల్ చేశాము. ఆ టైమ్‌లో నీదో స్పీచ్ అరేంజ్ చేశాము! "ది న్యూ మిలెనియం అండ్ ఎ హోప్" గురించి మాట్లాడు!" అంటూ స్టూడెంట్స్ యూనియన్ సెక్రెటరీ రామకృష్ణ పని పురమాయించాడు. "మర్చిపోవద్దు! ప్రొఫెసర్ కూడా మరీమరీ చెప్పాడు. లాస్టియర్ నువ్విచ్చిన ఉపన్యాసాలు మొత్తం యూనివర్సిటీనే ఒక ఊపు ఊపాయి!" మరోసారి హెచ్చరించాడు. జేబులోంచి వెయ్యి రూపాయలు తీసి, ప్రీవియస్ కుర్రాణ్ణి పిలిచి, తార్నాకా దాకా వెళ్ళి నాలుగు రమ్ము సీసాలు పాక్ చేయించు రమ్మని పంపాను. వాడు "ఎందుకన్నా?" అంటూ ఆశ్చర్యంగా చూశాడు. "ఉపన్యాస మివ్వాలట! అందుకు! మూడ్ రావద్దూ!" అన్నాను. మీటింగ్ మొదలైంది. పండితులు మంత్రోచ్చారణ చేశారు. గొప్పమనిషి ఒకాయన జ్యోతిని వెలిగించాడు. అమ్మాయిలు నలుగురు కలిసి సరస్వతీ వందనాన్ని ఆలాపించారు. వేదిక పైకి ఒక్కొక్కళ్ళనే ముఖ్య అతిథుల్ని పిలుస్తున్నారు. ముందుగా గతశతాబ్దం మొదట్లో పుట్టి, ఇంకా బ్రతికున్న మేధావులు. కవులు, శాస్త్రవేత్తలు, గాయకులు వచ్చారు. వేదికపై పెద్ద సంతర్పణలా ఉంది. దాదాపు యాభై మంది. ముందువరసగా పదిమంది కవులు, కవిసమ్మేళనం చివరి అంశం కాబోలు. స్టూడెంట్ లీడర్ రామకృష్ణ స్టేజీ ఎక్కాడు. అందరికీ ఆహ్వానమన్నాడు. ఆ తరువాత కొత్త మిలెనియం సంవత్సరానికి స్వాగతమన్నాడు. అంతలోనే వాడొక కవిత చదవటం మొదలుపెట్టాడు.

గతం వద్దు! చంపేద్దాం! కొత్తది ఏదైనా సరే! క్లోనింగ్ గురించో, కొరియన్ ఎకానమీ గురించో ఆస్ట్రోఫిజిక్సో, అమరావతి తవ్వకాలో, ఏదో ఒకటి కొత్తగా మాట్లాడుదాం! పాత భావాల్ని తగల వేసి, కొత్తభావాల కచేరీని మొదలుపెడదాం!

వాడి కవితకు జనంలో గగ్గోలు. "ఇంక చాలు! ఇంక చాలు నీపైత్యం" అంటూ గొడవ. ఉపన్యాసాలు మొదలైనాయి. మేలుకొన్న ఆర్థిక వ్యవస్థ గురించి, చదువుల్లో సంస్కరణల గురించీ, కమ్యూనికేషన్ల గురించి ఒకటే వరసగా మొదలైనాయి ఉపన్యాసాలు. కుర్రవాడు, ప్లాస్టిక్ సంచిలో ప్యాక్ చేసుకొచ్చిన రమ్ము బాటిల్సు తెచ్చి ఇచ్చాడు. కొంచెం గోడ వారగా వెళ్ళి ఒక రమ్ము బాటిల్ మొత్తం గటగటా తాగేశాను. గొప్ప దుఃఖంలో నడుస్తున్న బాతువులా తూలుతూ ముందు వరుసలో కూర్చున్నాను. మిలెనియం మహానుభావుల గురించి ఉపన్యాసాలు మొదలైనాయి. ఆంధ్రా యూనివర్సిటీ నుంచో ప్రొఫెసరు. ముందు నన్నయ కావ్యం లోని పద్యాల్ని శ్రావ్యంగా చదవటం మొదలుపెట్టాడు. "వద్దురా బాబూ! కనీసం శ్రీశ్రీ అయినా బెటరు!" అంటూ వెనక నుంచి అరుపులు.

మరొక శతావధాని పెద్దన గురించి, శ్రీకృష్ణదేవరాయల గురించి మొదలుపెట్టాడు. వరూధిని రొమ్ముల్ని, చంకల్ని పెద్దన వర్ణించిన తీరును అమోఘంగా చెప్పేడు. అప్పుడు తీశాను రెండో బాటిల్. తల పక్కకు వంచి మొత్తం సీసా గటగటా తాగివేశాను. రాజ్యాంగాన్ని గురించి ప్రజల హక్కుల గురించి స్వాతంత్ర పోరాట యోధుల గురించి మరో వక్త మాటలాడటం మొదలు పెట్టాడు. ప్రజల హక్కులు అనేమాట వినబడి, నాలోపల ఒక వింత మృగం ఉలిక్కిపడింది. మూడో సీసా అప్పుడు తీశాను. "ఇప్పుడు నిరంజన, రీడర్, పొలిటికల్ సైన్సెస్ – 'కొత్త మిలెనియం – ఒక ఆశాగీతం' అనే విషయం గురించి మాట్లాడతాడు అన్న అనౌన్స్‌మెంటు వింటూనే నాల్గోసీసా బయటకు తీసి గుటగుటమంటూ మొత్తం ఖాళీ చేశాను.

గునగునమంటూ నడుస్తూ, పొట్టలోపల రమ్ము అటూ ఇటూ కదుల్తూ, సరస్సులను లోపల మోసుకెళ్తున్న మానవుడిలా ఉన్నాను. మైకు ముందకు వెళ్ళి, గొంతు సవరించుకొని, వేదికపై నున్న మాన్యశ్రీ, ఫలానా, ఫలానా అని అందర్నీ పేరుపేరునా పలకరించి, "గత మిలెనియమ్, శతాబ్ది గురించి నేనెక్కువ చెప్పను. అది మరణించింది. శవాల గురించి ఎందుకు మాట్లాడుకోవటం!" అని ఆగి, "నేనేదైనా మాట్లాడితే అది కొత్త మిలెనియం గురించే .." అంటూ ఒక్క సారిగా కళ్ళు తిరిగి, భూమి అదిరి, లోపలినుంచి, ఒక పెను దుఃఖమో, మహాక్రోధమో బయటకు వస్తున్నట్లు ఉండగా – భళ్ళుమని వాంతి అయి – లోపలనున్న పులిసిన సరస్సు బయటకు వస్తున్నట్లుగా – పులిసిన,

జిగటగా వాసన వేస్తున్న రమ్ము - "ఫూ....." అంటూ ఆడిటోరియం వైపు ఊసి, ఆవాంతి అట్లా అలలు అలలుగా వస్తూనే ఉంది. నా నోట్లోంచి సముద్రం బయటకు వస్తున్నట్లుగా - "కొత్త శతాబ్దం - కొత్త మిలెనియం గురించి నాకున్న అభిప్రాయం ఇదే!" అంటూ వేదిక పైన, ఆడిటోరియం లోనూ మడుగులా ప్రవహించే రమ్మును తొక్కుకుంటూ గునగునా క్రిందకు దిగాను.



# ప్రేక్షకుడు

హరి మద్దూరి

కబ్బాడి, కబ్బాడి, కబ్బాడి, కబ్బాడి . . .
సర్రుమని వెళ్ళాడు వాడు. నన్నైతే పట్టేస్తారేమో!
అమ్మో! పడ్డాడు వాడు. మోకాలంతా రక్తం!
"నెప్పిగా ఉందిరా?" అడిగాను నేను
మూలుగుతూనే, "కొంచెం" అన్నాడు వాడు
"ఇంకా నయం, ఆడాను కాను" అనుకున్నాను నేను

చెడుగుడు చెడుగుడు చెడుగుడు
ఎలా వెళ్ళిన వాణ్ణి అలా పట్టేశారు
గుడుగుడు గుడుగుడు గుడుగుడు
గీత దాటక పోతే సెలౌఫట్ అయ్యాడు
"నేనే గనక అయితేనా" అనుకున్నాను నేను

గవాస్కర్ సెంచెరీ కొట్టేడు
విని రేడియో చుట్టూ కేరింతలు కొట్టాను నేను
హాల్ వేసిన ఫాస్ట్ బాల్ కళ్ళకే కనపడ లేదుట
నారి కాంట్రాక్టర్ తల మాత్రం పగిలిందట
"క్రికెట్ బాల్ దేంజర్ సుమా!" అన్నాడు మామయా
"రిస్కీ గేంస్ ఎందుకాడతారో" అనుకున్నాను నేను

"కాయ్ రాజా కాయ్, కాస్తే ఉందీ, చూస్తే లేదు"
అరుస్తున్నాడు రథం బజార్లో గాంబ్లింగ్ వాడు
నయాపైసా పెట్టకుండా వినోదం చూశాను నేను
"అది జూదం, దాని జోలికి పోకు" అన్నాడు తాతయ్య
"అసలయినా అందులో డబ్బేం రాదు" తేల్చేశాను నేను

# రాయాలని ఉంది!

పింగళి నరసింహా రావు

రాయాలని ఉంది. .
మనిషి ఆశలనూ, భావాలనూ,
చెరిగి పోని జీవిత సత్యాలనూ
నింపుకున్న ఒక శాశ్వతమైన కవిత రాయాలని ఉంది. .

మనిషి ఉనికిలోని అంతరార్థాన్ని చాటి
మనిషి మనస్సు పని చేసే తీరును విశద పరిచే
ఒక సంపూర్ణమైన కవిత రాయాలని ఉంది. .

ఆది మానవుడి నుండి వ్యోమగామి దాకా
మనిషి హృదయం లో ఉప్పొంగే
మృదు భావాలను మెత్తగా చాటే
ఒక ఆర్ద్రమైన కవిత రాయాలని ఉంది. .

నందన వనం లో ఎగిరే
రంగురంగుల సీతాకోకచిలుకలా నైతేనేం
కీకారణ్యం లో వేగంగా
ఉరికే చిరుత పులిలా నైతేనేం
మనిషి మనస్సులో సదా పరుగులెత్తే
కోరికల గురించి రాయాలని ఉంది. .

ఉరిమే శ్రావణ మేఘంలా నైతేనేం
దూది పింజలా చెదిరే తెల్లటి మబ్బులా నైతేనేం

మనిషి మదిలో సదా మెదిలే
ప్రేమ భావం గురించి రాయాలని ఉంది. .

హేమంతం లో గాలిని నింపే పొగమంచులా నైతేనేం
గడ్డి రేకుల మీద నిలిచిన హిమ బిందువులా నైతేనేం
మనిషి మనసున నిండిన ఆర్ద్రత గురించి రాయాలని ఉంది. .

బొరియ లోంచి మళ్లీ మళ్లీ తల బయటకు పెట్టి చూసే
చిట్టెలుకలా నైతేనేం
ఎగిరెగిరి పడే మహా సముద్రపు కెరటంలా నైతేనేం
ఏదో చేయాలని మనిషి పడే ఆరాటం గురించి
వివరంగా రాయాలని తపనగా ఉంది. .

విశాలమైన పచ్చిక బయలులో ఏదో కదిలినట్లనిపించి
బెదురు చూపులు చూసే జింక పిల్లలా నైతేనేం
గుడి గంటలకే భయపడి
గోపురం మీద నుండి ఎగిరి పోయే పిట్టలలా నైతేనేం
అనంత జీవిత యాత్రలో అడుగడుగునా మనిషి అనుభవించే
అభద్రత గురించి రాయాలని ఉంది. .

ఎడారిలో అనంతంగా సాగే ఒంటె లాగా నైతేనేం
సముద్రం మధ్య కెరటాలు కోసేస్తున్నా
వందల యేళ్లగా నిలిచిన రాయి లాగా నైతేనేం
ఎన్ని కష్టాలనైనా తట్టుకుని నిలిచే
మనిషి గుండె లోని పట్టుదల గురించి
ఎలాగైనా రాయాలని ఉంది. .

ప్రతి కుహూరవం లోనూ కొత్త రాగాలొలికించే
కోయిలమ్మ తీయని పిలుపులా నైతేనేం
ప్రతి మేఘనాదానికీ వంద కొత్త భంగిమలు కనిపెట్టే
వయారి మయూరపు వాడి నృత్యంలా నైతేనేం

అనుక్షణం కొత్త కొత్త తీరాలను అన్వేషించే
మనిషి సృజనాత్మకతను గురించి
ఎవరూ రాయనిదేదో రాయాలని ఉంది. .

ఎవరూ ఇప్పటిదాకా మాటలలో పెట్టనిది,
ఐనా అనుక్షణం హృదయాలలో మెదిలేది,
ఇదీ అంటూ ఒక రూపం లేనిది,
ఆఇనా ప్రతి మనిషినీ ప్రేరేపించేది,
ఈ ప్రపంచాన్ని నడిపించేది,
మనిషి మనుగడకు కారణమైనది –
మనిషి గురించిన
ఆ శాశ్వత సత్యాన్ని
వివరంగా రాయాలని ఉంది. .

రాయాలని ఉంది. .



# రెండు ఆకాశాలు

-- శ్రీ వేదప్రభాస్

నడుస్తూనే వచ్చేసేను . . .

నాకు మరక్కడ ఉండటానికి ఇష్టం లేకపోయింది. చరచరా చిన్నన్నయ్య ఇంటి మెట్లు దిగిపోయి రోడ్డు మీదకి వచ్చేసేను. వాడు చూస్తూనే ఉండిపోయేడు. చెక్కిన బొమ్మలాగా చలనం లేకుండా వాడలా చూస్తూనే ఉండిపోయేడు.

నాలో దుఃఖం పాల పొంగు లాగా పైకి లేవబోయింది. బలవంతాన అదిమి పెట్టుకుని, చేతులు రెండూ పేంటు జేబుల్లో పెట్టేసుకుని, వెనక్కి తిరిగి చూడనైనా చూడకుండా నేను రోడ్డు మీదకి వచ్చి నడవటం మొదలు పెట్టేను.

నేను చిన్నవాణ్ణే. . . నా ముగ్గురన్నల కన్నా నేను వయస్సులో చాలా చిన్న వాణ్ణి. నేను స్పష్టంగా చూడగలిగిన విషయాన్ని. . . వాళ్ళెవరూ చూడలేకపోతున్నందుకు, వాళ్ళ గుండె తడులు ఇంకిపోయి వొట్టి గుడ్డబొమ్మలుగా మారిపోయినందుకు, నాకు మనసంతా మంటలు రేగిపోతున్నాయి. మళ్ళీ వాళ్ళల్లో తెలివి తక్కువ వాడెవ్వడూ లేడు.

"నీకు తెలియదు చిన్నా . . .! నువ్వొంటరి గాడివి. . నువ్వా పన్లు చెయ్యలేవు. . ఆవిడ వ్యవహారంలో తల దూర్చకు. . తర్వాత బాధ పడతావు. . నా మాట విను. ." అనేసి రెండో అన్నయ్య పేపర్లో ఉష్ట్రపక్షిలాగా తల దూర్చేడు. వాడంతే. . వాడికి వాడి ఉద్యోగమూ, డబ్బు లెక్కా తప్పితే మరింకేమి అక్కర్లేదు. చటుక్కున అడిగితే, వాడు వాడి కొడుకు పేరైనా చెప్పగలడో, లేదో నాకెప్పుడూ అనుమానమే. వాడికి కోపం అంటూ రావడం, నేను ఒక్క సారైనా చూడలేదు. బలంగా తోసేస్తే కిందకి దొర్లుకుంటూ వెళ్ళిపోయే కొండ మీది బండ రాయి లాగా వాడి జీవితం వెళ్ళిపోతోంది. వాడికేం చెప్పినా మరి లాభం లేదని, నేను విసిగి పోయి వచ్చేసేను.

నిన్న మూడో అన్నయ్య ఇంటికి వెళ్ళినప్పుడు వాడు, వీడికి భిన్నంగా వ్యవహరించలేదు. నాకు తోడుగా నిలబడతానన్లేదు.

మూడో అన్నయ్య విష్ణుమూర్తి సంగతే వేరు. వాడు పూర్తిగా కలల లోకం కాపురస్తుడు. ఊహా లోకపు విహారి. నాన్న ఎప్పుడూ వాణ్ణి "కలల కమల నయనా" అని పిలుస్తుండే వాడు. మిలట్రీ ఆఫీసర్ ఉద్యోగం చేస్తున్నా వాడు ఎప్పుడూ, వొడ్డు మీద కుర్చీలో కూర్చుని, ఎదురుగా ఉధృతంగా పరవళ్ళు తొక్కుతూ, ప్రవాహం లాగా సాగిపోయే జీవితాన్ని తన్మయత్వం తో చూస్తూ ఉన్నట్టే ఉంటాడు.

సాహిత్యం తో వాడు జీవితాన్ని కొలుస్తాడు. సంగీతంతో దానికి రంగు చీరలు చుడతాడు. ఏ క్షణాన వాడు ఇంట్లో ఉన్నప్పుడు మనం వెళ్ళినా .. ఏ సంగీత ఆలాపనో, సాగుతూ వచ్చి, మనని సాకేత పరిమళం లా చుట్టేసుకుంటుంది.

వాడన్నాడు నాతో, "చిన్నాడా ...! పాల పరువంలో ఉన్నావు. చక్కటి ఉద్యోగమూ ఉంది. బంగారు బొమ్మలంటి అమ్మాయిని చూసి, చేసుకుంటే, బ్రతుకు పైడి పువ్వుల పంట కాదురా ? నీ కెందుకురా.. ఈ తగమారి తంటాలు. నా మాట విని నువ్వలాంటిదేదీ తలకెత్తుకోకు. నేనెలాంటి సాయమూ చెయ్యను. ఆవిడెలా పోతే అలా పోనీ, ... ఏనాడన్నా మన మాట విన్న ఆవిడైతే కదా ...!"

నాకు అప్పుడు లాగి పెట్టి కొట్టాలనిపించింది. వీలైతే వాడి వొళ్ళంతా చిత్రిక పట్టాలనిపించింది. ఇంక పెద్దన్నయ్య ఏమంటాడో వినేస్తే సరి..

నాకు పెద్దన్నయ్య అంటే గురెక్కువ. ఎప్పుడూ తక్కువే మాట్లాడే పెద్దన్నయ్య ఇంటి బాధ్యతల్లో తక్కువ కష్టాలేం పడలేదు. అమ్మతో ఎన్ని భేదాలున్నా వాడేనాడు ఆమెని ఏమీ అనలేదు.

ఆలోచనల్లో మునిగి రోడ్డు మధ్యకి వచ్చేసేను. "కొంచెం, రోడ్డు చూసి నడవండి.. బాబూ..!" పక్కనుండి పోతూ రిక్షా అతడు చేసిన హెచ్చరికకి ఉలిక్కి పడ్డాను.

తల తిప్పి చూసేసరికి రైల్వేస్టేషన్ పక్కనే కనబడింది. ప్రవాహంలా సాగుతున్న జనాన్ని, వాహనాల్ని తప్పించుకుంటూ స్టేషన్ లోపలికి పోయి అడిగితే, అలెప్పి రైలు గంట లేటన్నారు. ప్లాట్‌ఫారం మీద కూర్చున్నాను తీరుపాటుగా.

అమ్మ ఎలాటి మనిషి! ఎవరికైనా అలాంటి అమ్మ ఉంటుందా అంటే ఆశ్చర్యమే.. ఆవిడేం తెలివి తక్కువది కాదు. గ్రాడ్యుయేషన్ ఆ రోజుల్లో ఫస్ట్ క్లాసులో పాసయ్యి, ప్రభుత్వ సంస్థలో సూపరెండెంట్‌గా మొన్నే రిటైరైంది. అది కూడా పేపర్లో చూస్తేనే తెలిసింది. అమ్మ చెప్పలేదు. చెప్పే

రకం కాదు కూడా...! మమ్మల్ని కన్నాక నాలుగేళ్ళకు అమ్మకి, నాన్నకి ఏవో గొడవలొచ్చేయట! ఉద్యోగం కోసం దరఖాస్తు చేసిన అమ్మ ఉద్యోగం రాగానే మమ్మల్ని, నాన్నని వొదిలేసి వెళ్ళింది. నాకు నాలుగేళ్ళుంటాయప్పుడు.

పెద్దన్నయ్యే మమ్మల్ని అమ్మై పెంచాడు. నాకిప్పటికీ ఆశ్చర్యమే..! ఎంత గొడవలొచ్చినా అమ్మ అలా వెళ్ళిపోవడమేమిటని.. నాలుగేళ్ళ నన్ను వొదిలేసి వెళ్ళిపోవటానికి అమ్మకి మనస్సెలా వొప్పుకుందని.

నా పధ్నాలుగో ఏట మొదటిసారిగా అమ్మని చూసేను. నా చిన్నప్పటి జ్ఞాపకాల్లో అమ్మ బొమ్మ లేనే లేదు.. ఇంట్లో కూడా నాన్న అమ్మ ఫొటోలేం ఉంచలేదు. అమ్మని చూసేదాకా నాకు అమ్మ రూపం తెలీనే తెలీదు.

పెద్దన్నయ్య తో కూడా 'విశాఖ' వెళ్ళేను. వాడు నన్ను కూడా రమ్మనగానే బయల్దేరిపోయేనే గాని, తిన్నగా నన్ను అమ్మ దగ్గరికి తీసుకుపోతాడని నాకు తెలీదు. అన్నయ్య చెప్పలేదు కూడా!

తిన్నగా అమ్మ ఆఫీసు కు తీసుకెళ్ళేడు అన్నయ్య. స్టాఫ్ రూం లో ఇద్దరం కూర్చున్నాం.. నా అయోమయపు మొహాన్ని చూసి అన్నయ్యకు జాలి వేసినట్టుంది.

"చిన్నాడా ..! అమ్మని చూడాలని అంటూ వుంటావు కదా..! అమ్మొస్తుంది.. చూడు.." అని నెమ్మదిగా నాకు వినబడేలాగే చెప్పేడు.

స్టాఫ్ రూం లో ఎవరూ లేరు. పొడవాటి కర్ర సోఫాలో మేమిద్దరమే కూర్చుని ఉన్నాం. నా ఒంట్లో రక్తం ఒక్కసారిగా తలలోకి పిచికారీ చేసినట్లైంది. ఒక్క క్షణం అన్నయ్య చెప్పిందేమిటో అర్థం కాలేదు. అర్థం అయ్యేలోగా అమ్మ వచ్చేసింది.

అన్నయ్య నిలబడగానే నాకు వచ్చింది అమ్మేనని తెలిసింది. అమ్మ ఇంకా స్టాఫ్ రూం లోకి అడుగు పెట్టక ముందే నా రక్తం అమ్మని పోల్చేసింది. అమ్మ వచ్చి మా ముందు నిలబడేసరికి నాకు ఎందుకోగాని ఏడుపొచ్చింది.

అన్నయ్య హెచ్చరికగా నా చెయ్యి పట్టుకోబట్టి గాని, లేకపోతే నేనెంత గట్టిగానో ఏడ్చే వాణ్ణక్కడ.

అమ్మ పొడవుగా ఉంది. కళ్ళద్దాలతో, చేతిలో పట్టుకున్న పెన్నుతో అమ్మ అచ్చం ఆఫీసర్లా ఉంది.

"చిన్నాడిని తెచ్చేనమ్మా..! నిన్ను చూడాలంటున్నాడు...!!" అన్నయ్య అబద్ధం చెప్పేడు. వచ్చేదాకా అమ్మ దగ్గరికని నాకసలు తెలీదు. నేను నమ్మలేనట్టు అన్నయ్య మొహం లోకి ఆశ్చర్యంతో చూసేను. అన్నయ్య నావైపు చూడనే లేదు.

అమ్మ నన్ను దగ్గరికి తీసుకొంటుందనుకున్నాను. నాలుగేళ్ళ నాడు నన్ను వదిలిపెట్టి పోయిన నా తల్లి నన్ను చూసి ఏడ్చేస్తుందనుకున్నాను.

అమ్మ అలా చెయ్యలేదు. కళ్ళద్దాల్లోంచి నా వంక ఓ సారి చూసింది. ఎత్తుగా ఉన్న అమ్మ మొహం లోకి చూడ్డానికి ఎందుకోగానీ, నాకు చేత కాలేదు. అలక నటిస్తే ఆవిడ దగ్గరికి తీసుకుంటుందని గాని, ఆశ పడ్డానేమో నాకు గుర్తు లేదు.

అమ్మ చీర కుచ్చిళ్ళు కదిలేయి. పెద్ద జరీ బోర్డరుతో అమ్మ ఆనాడు కట్టుకున్న గంధంరంగు చీరె నాకివ్వాళ్టికీ గుర్తే.

అమ్మ నడిచి వచ్చి సోఫాలో ఆ చివర్న కూర్చుంది. "కూర్చో... వాడినీ కూర్చోమను .." అమ్మ మొదటి మాట నాకు కంఠస్తమే..

"ఏం చదువుతున్నావు.. ?" నన్నే అడిగింది అమ్మ. నేను తలెత్తి అమ్మ కళ్ళల్లోకి చూసేను. అప్పుడు నాకు, నేను అచ్చం అమ్మ పోలికేనని తెలిసింది.

"పదో క్లాసు" గొణిగాను తల దించుకుని.

"పెద్ద వాడివయ్యేవు ..." అంది అమ్మ. ఆవిడ గొంతులో ఆవగింజంతైనా తడి వుందేమోనని వెతికాను మనస్సులో.

"వీడేమిటి...? బెల్లం కొట్టిన రాయిలా వున్నాడు. ఇంతకీ ఏం పనిమీద వొచ్చేవు..?" అని అమ్మ పెద్దన్నయ్య నడిగింది.

అన్నయ్య అమ్మతో ఏదో విషయం ఐదు నిముషాల పాటు చెప్పేడు క్లుప్తంగా.. స్టాంపు పేపర్లు ... పొలం లాంటి మాటలవి ...

"నేను సంతకం పెట్టను.. ఏం చేస్తాడో చేసుకోమను. పిల్లల్ని రాయబారం పంపితే, నేను లొంగుతాననుకుంటున్నాడేమో.. కుదరదు. వొరే.. నీకేదన్నా కావలిస్తే అడుగు. ఇస్తాను.. అదీ

మీరంతా నా కడుపులోంచి వచ్చినందుకు. నా బాధ్యతగా ఇస్తాను. ఆయనకు చేత కాదా... ?
మిమ్మల్ని నాకొదిలేయమను. నయా పైసా అడక్కుండా పెంచుకుంటాను ..
ఏమనుకుంటున్నాడో, అతను, ఈ కాంతిమతి అంటే ..."

అమ్మ కోపం గా ఉంది. డిగ్రీ చదువుకున్న అన్నయ్య ఏదో మాట్లాడబోయేడు.

అమ్మ లేచి నిలబడింది. ముడిపెట్టుకున్న అమ్మ తెలుపూ, నలుపూ జుత్తు కిటికీలోంచి వస్తున్న ఎండ పడి వెండి దారాలతో నేసిన దాన్లా మెరిసింది.

అమ్మ వెళ్ళిపోవటానికి సిద్ధపడి, పర్సులోంచి వందనోటు తీసి, పెద్దన్నయ్య కివ్వబోయింది.

అన్నయ్య "వద్దు, ... డబ్బుంది" అన్నాడు.

"నీకూ అతగాడి పొగరే వచ్చింది, పోలికలతో పాటు ..." అని ఆ నోటు నాకివ్వబోయింది.

నేను తల అడ్డంగా ఊపేను. నా కళ్ళు కన్నీళ్ళతో నిండిపోయేయి. మసకలు బారేయి. తీసుకుంటే అన్నయ్య ఊరుకోడు.

"సరే ... నేను వెళుతున్నాను ..." అని కదలబోతూ ఎందుకోగాని అమ్మ ఆగిపోయింది. నాలో ఆశల రేకులు అందంగా విరిసేయి.

ఒక్క క్షణం ఆలోచించి, చేతిలో ఉన్న పెన్ను నా జేబులో పెడుతూ, "పరీక్షలు బాగా రాయి ..." అంది అమ్మ నా తల మీద చెయ్యి వేసి. అమ్మ స్పర్శకి నా శరీరం కంపించింది. వొచ్చి పడిపోతున్న దుఃఖం ఆపుకోడానికి రెండు చేతులూ మొహం మీద కప్పుకున్నాను.

అమ్మ నన్ను ఓదార్చలేదు. నాకు నాలుగేళ్ళప్పుడు నన్ను వదిలి పెట్టి వెళ్ళిపోయిన అమ్మ నాకు పధ్నాలుగేళ్ళు వచ్చేక నేను కనిపించినా, నన్ను గుండెలకు హత్తుకోనేలేదు.

తటాలున తన చెయ్యి నా తల మీద నుంచి తీసేసి, "రాత ... రాతా ..." అంటూ తల కొట్టుకుంటూ వెళ్ళిపోయింది. ఆవిడ చీర చెంగు గాల్లో విసురుగా అటూ ఇటూ ఆడింది.

రైలు చప్పుడు వినిపించి గబుక్కున లేచి నిలబడ్డాను. ఆనాడు అమ్మ ఇచ్చిన పెన్ను, ఏ నాడూ నా జేబు వీడిపోలేదు. అన్ని పరీక్షలూ దానితోనే రాసేను. మొన్న అమ్మకు రాసిన ఉత్తరం కూడా...!

రైల్లో కూర్చున్నాక మళ్ళీ అమ్మ ఆలోచనలే.. అమ్మ జ్ఞాపకాలే.. ఎంతైనా అమ్మ కదా...!

*  *  *

ఏలూరు లో రైలు దిగి తిన్నగా అన్నయ్య ఇంటికి వెళ్ళేను. నా ఆఖరి ఆశ పెద్దన్నయ్యే.

అన్నయ్య ఇంకా స్కూలు నుంచి రాలేదు. వొదిన దగ్గర నాకు చనువు ఎక్కువ. అయినా నేను ఆవిడతో అమ్మ విషయం చెప్పలేదు. అన్నయ్యతో మాట్లేడేక, ఆవిడతో చెప్పొచ్చనుకున్నాను.

నేను టిఫిన్ తింటుంటే, వదిన ఎదురుగా కూర్చుని అడిగింది. "నువ్వు.. సుబ్బరామయ్య గారి అమ్మాయి సంగతి ఏం ఆలోచించావో చెప్పు.. రెండ్రోజుల క్రితం వాళ్ళబ్బాయి వచ్చేడు. రాధ బాగానే ఉంటుందిగా ...!"

వదిన నా పెళ్ళి గురించి పట్టు వదలకుండా ప్రయత్నాలు ఇంకా చేస్తూనే ఉంది. ఎప్పుడొచ్చినా ఏదో ఒక సంబంధం గురించి ఆవిడ చెప్పకుండా ఉండదు. అందుకే ఈ మధ్య ఏలూరు రావటం తగ్గించేను.

"నాకొ్కంచెం టైమివ్వు వొదినా ..! రాధనీ, సరోజనీ.. నన్ను బాధ పెట్టకు నువ్వు .. కనీసం కొన్నాళ్ళ దాకానైనా .. నేనింకా నా పెళ్ళి విషయం ఏదీ నిర్ణయించుకోలేదు... " సౌమ్యంగా చెప్పేనామెతో.

ఆమె మొహంలో లీలగా కోపం కనబడింది. సహజమే ..! నన్ను మరేం అనకుండా వదిన వంటింట్లోకి వెళ్ళిపోయింది. నేను టీవీ చూస్తూ కూర్చున్నాను. ఆరు గంటలయ్యేటప్పటికి అన్నయ్య వచ్చేడు.

"చిన్నా ...! ఎప్పుడొచ్చేవు ..." అని పలకరించి మామూలు ప్రశ్నలు వేసేడు.

అన్నయ్యలో పెద్దరికం చాయాలు బాగా కనబడుతున్నాయి. అచ్చం నాన్నలా ఉన్నాడు. నాన్నలాగే తక్కువ మాట్లాడటం వాడి అలవాటు. మాట్లాడేటపుడు ఎదుటి వాళ్ళ కళ్ళలోకి సూటిగా చూడటం, ముందుకు పడుతున్న క్రాపు చేత్తో వెనక్కి సర్దుకోవటం ... అన్నీ నాన్నలాగే ..

రాత్రి తీరుబాటుగా కూర్చున్నాక చెప్పేను. "అన్నయ్య ..! అమ్మ రిటైరైంది తెలుసా ..! "

"తెలుసు ..!" అన్నాడన్నయ్య నా కళ్ళలోకి సూటిగా చూస్తూ..

నేను మరేం మాట్లాడలేదు. నలిగిపోయిన మడతల్లో వున్న టెలిగ్రాం కాగితం జేబులోంచి తీసి, అన్నయ్య కిచ్చేను.

"కాంతిమతి ఈజ్ ఇన్ హాస్పిటల్.. వాంట్స్ టు సీ యూ ..." - వారం రోజుల క్రితం నా ఆఫీస్ ఎడ్రెస్ కు వచ్చిన తెలిగ్రాం అది. అన్నయ్య చదివేడు. టెలిగ్రాం చేత్తో పట్టుకుని కాసేపు ఆలోచనలో పడ్డాడు.

"ఏమంటోంది.. అమ్మ..?" నేను అమ్మ దగ్గరికి వెళ్ళిన సంగతి అన్నయ్య గ్రహించేడు. నెమ్మదిగా చెప్పేను "అమ్మ ఆరోగ్యం బాగా లేదు. ఉద్యోగంలో విపరీతంగా శ్రమ పడడంతో అమ్మ హార్ట్‌లో వాల్వ్ దెబ్బ తిని పోయిందని డాక్టరు చెప్పేడు.. ఆవిడకిప్పుడు సంరక్షణ కావాలి.."

"వస్తానంటోందా...?"

"వొప్పుకోవడం లేదు.. బలవంత పెట్టి తీసుకు రావాలి.."

"కష్టం... ఆవిడ రాదు." అన్నయ్య చెప్పేడు.

"నేను తీసుకొస్తాను.. వొదిన చెయ్యగలనంటే ... అన్నయ్య లిద్దరూ వాళ్ళ దగ్గర కుదరదన్నారు..."

అన్నయ్య ఆలోచనలో మునిగాడు. "చాలా జాగ్రత్తలు తీసుకోవాలి... వొకరి మాట వినేరకం కాదు ఆవిడ." "అయినా ఆవిడసలు వొప్పుకోదురా ..! ఎన్ని మార్లు బతిమాలినా రాని అమ్మ ఇప్పుడెందుకు వస్తుందిరా చిన్నా ...! నాన్న పోయినప్పుడే రాలేదు..." గుర్తు చేసేడు.

నేను మవునంగా వుండిపోయేను. నాన్న పోయి ఏడేళ్ళవుతుంది.. శీతాకాలంలో పోయేడాయన. శీతాకాలం సాయంత్రం వేళ చుట్టూ దట్టంగా మంచు తెరలు తెరలు గా దిగుతుంటే, వీధి గుమ్మం వైపే దృష్టి నిలిపి వుంచి చని పోయాడాయన.

రెండు రోజులకు చనిపోతాడనగా, ఆయన నన్ను పక్కన కూర్చో బెట్టుకున్నాడు. చిన్నన్నయ్య, రెండో అన్నయ్య ఆయన కాళ్ళు ఒత్తుతుంటే, పెద్దన్నయ్య హార్లిక్స్ కలుపుతున్నాడు.

నాన్న నా చేతిని తన గుండెల మీదకి తీసుకున్నాడు. ఆయన రెప్పల వెనుక కొంచెంగా తడి. అలా నాన్నని నేనెప్పుడూ చూడలేదు.

ఉన్న నాలుగెకరాల పొలంలో అహర్నిశలు గొడ్డు చాకిరీ చేసి నాన్న మమ్మల్ని చదివించేడు. ఏనాడు గుండె ధైర్యం పోనివ్వని మనిషి ఆయన.

"కాంతి, ఇంట్లోంచి వెళ్ళిపోయి పద్ధెనిమిదేళ్ళయ్యింది..." కొంచెం గొణుక్కున్నట్టుగా వచ్చేయి ఆయన మాటలు.

"మీకు అమ్మను లేకుండా చేసేను నేను ... తప్పే."

పెద్దన్నయ్య నాన్న దగ్గరికి వచ్చేడు. "నాన్న .. అవన్నీ ఇప్పుడొద్దు.. మీరు పడుకోండి !" అన్నాడు వాడు. వాడి వంక నాన్న చూసిన చూపులో వాడి మీద ఆయనకున్న ప్రేమ కనిపించిపోయింది.

"నారాయణా.. ! నువ్వే లేకపోతే, నేనిన్నాళ్ళు ఈ ఇల్లు గడపలేన్రా... నువ్వు బంగారం కదూ...!! తమ్ముళ్ళు జాగ్రత్త..!" అన్నయ్య చేయి పట్టుకుని అన్నాడు నాన్న.

నాకు కన్నీరాగలేదు. మిలట్రీ అన్నయ్యకీ గుండె చెరువైపోయినట్టుంది. వాడు నాన్న కాళ్ళ మీద చెయ్యి అలానే ఉంచేసేడు.

"ఇప్పుడెందుకీ అప్పగింతలు నాన్న..! ఒక్క వారం పోతే, లేచి తిరుగుతావు ... పొలంలో మందులు చల్లాలి కూడా ..." అన్నయ్య అన్నాడు.

"లేదు నారాయణా ...! నాకు తెలుసు. నువ్వేం చెప్పకు.. ఒక్క సారి మీ అమ్మని తీసుకు రాగలవా కన్నా ..!!"

నాన్న అకస్మాత్తుగా అడిగిన కోరిక విని మేం నలుగురం తెల్లబోయేం. ఏనాడు అమ్మ ప్రసక్తే తేని నాన్న అలా అడగడం మాకు కష్టంగా తోచింది.

అప్పుడు వెళ్ళేం మేం. . . వొకరి తర్వాత ఒకళ్ళం. . కసితో, పట్టుదలల్తో. . .

అమ్మ మనసు కరగలేదు. తను నాన్నని ఎప్పుడో మరచిపోయిందట. ఆయన తనకేం కాడట. మమ్మల్ని కూడా అందుకే ఆయన పోషణకే వొదిలేసిందట. నాన్నేమై పోయినా ఆవిడ కేం పట్టదుట.

ఎంత పగ అమ్మకి . . . ఎంత కక్ష నాన్న మీద. .

మిలట్రీ వాడికి కోపం వచ్చింది. "మరైతే మరో పెళ్ళి చేసుకోలేదేం నువ్వు . ." అని గట్టిగా అడిగేడు వాడు ఆవిడని.

అమ్మ తిరస్కారంగా చూసి, "నువ్వెవడివి . .? నన్నడిగేటందుకు . . .?"

నాన్న అసంతృప్తిగానే చచ్చిపోయేడు.

ఆయన పోయే ముందు అమ్మకీ, నాన్నకీ మధ్య గొడవకి కారణం తెలిసింది మాకు. కారణం తెలిసేక కూడా . . . అంత చిన్న కారణానికి కాపురం వొదిలేసుకుంటారా . . . అన్న అనుమానం మాకు రాలేదు. వాళ్ళిద్దరి సంగతి తెలుసు మాకు.

ఇద్దరూ రెండు భిన్న ధృవాలు . . . ఇద్దరూ జతకాని స్వరాలు . . .

నాన్న విత్తనాలు కొనడానికి వడ్డీకి వెయ్యి రూపాయలు తెచ్చి ఇంట్లో ఉంచేక ఎవరో దగ్గర బంధువు చనిపోతే, నాలుగు రోజులు ఊరికి వెళ్ళేడట . . .

ఆ డబ్బు అమ్మ యూనివర్శిటీ ఫీజులకీ, పుస్తకాలకీ వాడేసిందట. మాటా మాటా పెరిగి నాన్న అమ్మని కొడితే, అమ్మ కూడా నాన్న మీద చెయ్యి చేసుకున్నదట.

అంతే ఆ తర్వాత ఆవిడ ఇల్లు వొదలి వెళ్ళింది. ఏ రాయబారాలు ఫలించలేదు. ఆర్థిక స్వేచ్ఛకోసం ఆవిడ పోరాటం . .

నాన్న పోయేక, మేం అమ్మ గురించి పూర్తిగా పట్టించుకోవడమే మానేసేం. వొదినెలు వచ్చేక మా ఇంట్లో మళ్ళీ కౌటుంబిక ఆనందం ప్రవేశించింది.

అమ్మ మా జీవితాలకో పీడకలైంది. మా బ్రతుకుల్ని ఆవిడ శపించింది.

చిన్నన్నయ్యకీ, మా మిలట్రీ అన్నయ్యకీ ఆవిడంటే అంతులేని కోపం. మేం నాన్న అనే మొక్కకి అంటుకట్టబడ్డ వాళ్ళం. మాకసలు అమ్మ లేనే లేదు . . . !

*                *                      *

రాత్రి పడుకున్నానే గాని నిద్ర రాలేదు. కళ్ళ ముందు ఆక్సిజన్ మాస్క్ లో ఉన్న అమ్మ మొహం కదిలింది. శ్వాస కోసం పోరాడుతోంది అమ్మ. స్వేచ్ఛ కోసం పోరాడింది. ఆస్తి కోసం పోరాడింది. మరింక వేటి కోసమో ఆమె పోరాడుతూనే వచ్చింది. పోరాటం కోసం పోరాడిందో, మౌలికంగా పోరాటమే ఆవిడ తత్త్వమో నాకైతే తెలీదు.

నాన్నకే తెలీనిది నాకెలా తెలుస్తుంది?

"చిన్నా వా . . ?" అంది కళ్ళు తెరిచి నన్ను చూస్తూ. పెదవి విప్పి మాట్లాడలేదు నేను. . తలమాత్రం ఊపేను. "కూర్చో. . ." అంది.

కళ్ళ కింద నల్ల మచ్చలేర్పడ్డ అమ్మ మొహంలో అలసట మాత్రమే కనిపిస్తోంది. తలగడ కిందినుంచి కాయితాలు తీసి, "ఈ డాక్యుమెంట్లు . . . మీవి . . ఉంచు. . ." అంది.

నేను తీసుకోలేదు. అమ్మ దగ్గర్నుంచి ఏదీ తీసుకోవడం మాకెవ్వరికీ తెలీదు.

"నాకిక్కడ ఉండాలని లేదు . . . స్వయంగా వెళ్ళలేను. . కొంచం . . . ఇంటికి తీసుకెళ్ళగలవా . . . ?" అంది.

నేను తలూపాను. అంతలోకే అనుమానం వచ్చింది. అమ్మ అడుగుతోంది ఏ ఇంటికని.

ఇంతలో పక్కనే ఉన్న నర్సు కళ్ళు పెద్దవి చేసి చూస్తూ, "ఏమిటీ . . ? వెళ్ళిపోతానంటున్నారా. ? ఆవిడ . . నో, డాక్టరు వొప్పుకోరు." అంది.

అమ్మ పెదిమలు బిగించి "నేను వెళ్ళాలి . . ." అంది.

"నర్సు అదోలా చూసి, "డాక్టర్ని పిలుస్తాను . ." అని వెళ్ళింది. కొద్ది సేపట్లోనే డాక్టరు వచ్చేడు. రావటమే విసురుగా వచ్చేడు. "ఏం అనుకుంటున్నారు మీరసలు . . ? మీకు నచ్చినపుడు వచ్చి, వెళ్ళిపోవడానికి మీరేం టూరిస్టూ, ఇది హొటలూ కాదు. . అలాంటప్పుడు అసలు రాకుండానే

ఉండాల్సింది. ప్రస్తుతం మీరున్న పరిస్థితిలో మీరసలు కదల కూడదు. ఎవరితోనూ మాట్లాడ కూడదు. మీరెన్నాళ్ళు ఇక్కడ ఉండాలో మేం నిర్ణయించాలి. మీరు కాదు.. అలాటి ఆలోచనలేమీ పెట్టుకోకండి .." చూపుడు వేలు ఆడిస్తూ చెప్పేడు.

"నాకేం ఫర్వా లేదు.." అంది అమ్మ. బలమైన మాటలే అయినా బలహీనంగా వచ్చేయి. నోట్లోంచి చిన్నగా గురక వచ్చి ఆవిడ మెడ పక్కకి వాలిపోయింది.

నర్సు గభాలున వచ్చి అమ్మను పట్టుకుంది. డాక్టరు అమ్మకు ఆక్సిజన్ అమర్చేడు.

"సిట్యుయేషన్ ఈజ్ వెరీ బాడ్ .. ఐ థింక్ షి ఈస్ యువర్ మదర్. వై డింట్ యూ బ్రింగ్ హర్ ఎర్లియర్ ..?" తెలుగులో మొరటుగా ఉంటుందని కాబోలు డాక్టరు ఇంగ్లీషు ఉపయోగించేడు.

నా దగ్గర్నుంచి సమాధానం ఆశించకుండా, అతడు చెప్పుకు పోయేడు. " నాలుగైదు రోజులకు తక్కువ లేకుండా ఆవిడ మా కంట్రోల్ లో ఉండాలి. బంధువులెవరూ చీటికి మాటికి వచ్చి డిస్టర్బ్ చెయ్యకూడదు. మీకు తర్వాత చెబుతాను. ఆ తర్వాత మీరు ఆవిడని తీసుకెళ్ళినా ఆవిడ బ్రతికున్నంత కాలం చాలా జాగ్రత్తగా చూడాలి. చక్కటి హెల్దీ ఎట్మాస్ఫియర్ ఉండి తీరాలి. ఇక్కడ మీరుండడం కన్నా మీ మిసెస్ ఉండడం చాలా ఉపయోగం.."

నాకు పెళ్ళి కాలేదని డాక్టర్ కి చెప్పలేదు. రెండు, మూడు రోజుల్లో వస్తానని బయల్దేరి వచ్చేను.

నాన్న అమ్మ కోసం చూసి, చూసి పోయేడు. అమ్మ రాలేదు. ఇప్పుడు అమ్మకి ఆ పరిస్థితి రాకూడదు. ఆవిడ కన్న వాళ్ళం... అమ్మా నువ్వు మాక్కావాలి అనాలి.. ఆవిడని బతికించుకోవాలి. ఆ తల్లి పాల ఋణం తీర్చుకోవాలి. ఎవరూ లేని బ్రతుకు ఎంత దుర్భరమో నాకు బాగా తెలుసు.

ఆ పరిస్థితి అమ్మకి రాకూడదు.. రానివ్వకూడదు.

నా ప్రయత్నం, పట్టుదలా అదే.. ఇద్దరన్నలూ ఒప్పుకోక పోయినా పెద్దన్నయ్య, వొదినా కాదన్లేదు. అది చాలు. పెద్దన్నయ్య చెబితే వాళ్ళూ విని తీరుతారు. అమ్మ ఏ వెలుగూ పంచని ఓ వొంటరి నక్షత్రంలా, ఎవరూ చదవని ఓ వెయ్యి పేజీల పుస్తకంలా ఉండిపోకూడదు.

ఇంచుమించు తెల్లవారుతూంటే నాకు నిద్ర పట్టింది.

*          *            *

పెద్దన్నయ్య, నేనూ, వదిన 'విశాఖ' బయల్దేరేం. ప్రయాణం లో వదిన అడిగిన వాటికి నేను సమాధానాలు చెప్పేను. అన్నయ్య మామూలు గానే ఎక్కువ మాట్లాడలేదు. మేం హాస్పటలు చేరేసరికి టైం పదిగంటలయ్యింది.

ఆకాశం బాగా మబ్బు పట్టింది. నన్ను చూస్తూనే రిసెప్షనిస్టు ... "మిస్టరు ప్రకాష్ .. ! వుయ్ ఆర్ ఎక్స్ట్రీమ్లీ సారీ ...!" అని సానుభూతిగా అంది.

నాకర్థం కాలేదు. నేను అయోమయంగా చూడటం గ్రహించిందేమో ఆమె, "టెలిగ్రాం ... అందలేదా ...?" అనడిగింది అనుమానంగా.

తర్వాత తనే చెప్పింది. "మీ అమ్మ గారు తెల్లవారు ఝామున పోయేరు.. బాడి మార్చురీ లోకి పంపించి, మీకు టెలిగ్రాం ఇచ్చేం.."

నేను మాట్లాడలేక పోయేను. అన్నయ్యే మొదటగా షాక్ నుండి తేరుకున్నాడు. వదిన్నీ, నన్ను మార్చురీ లోకి తీసుకెళ్ళేడు.

అమ్మ నిద్ర పోతున్నట్టుంది. అమ్మ అప్పుడు ఆకాశం లో సగంలా ఉంది. మూసిన ఆవిడ కనురెప్పల వెనకాలా, నెరసిన ఆవిడ జుట్టు కింద ఉన్న మెదడులోనూ నిక్షిప్తమైపోయిన పరమ రహస్యం అయిన భావాలేమిటో ... మా కెవ్వరికీ తెలీవు.

ఆ తల్లి దేని కోసం పోరాటం సాగించిందో ... తన వొంటరి జీవితంలో ఏం సాధించిందన్న తృప్తితో గడిపిందో, మాకెన్నటికీ తెలియదు.

వొదిన, అమ్మ మెడలో గొలుసు తీస్తున్నప్పుడు, గొలుసు అడుగున రహస్యంగా వున్న మంగళ సూత్రాలు కనిపించేయి. అప్పుడు .. అప్పుడు, ఆ తల్లి అంతరంగం అవగతమై, ఆమె గుండె లోతుల్లో గుట్టుగా దాచుకున్న రహస్యం బహిర్గతమై అన్నయ్య చిన్న పిల్లాడిలా ఏడ్చేడు.

అమ్మ బిలాంగింగ్స్ లో ఉన్న చిన్న కాగితంలో ఆవిడ రాసిన నాలుగు వాక్యాలు చాలు .. ఆవిడ మనసు తెలిసి పోయింది.

తప్పు లెన్నైనా చేయొచ్చు
క్షమ ఉంది.
దేవుడి పట్ల తప్పు చెయ్యకూడదు.
క్షమ ఉండదు.. శిక్ష తప్ప.
మీ నాన్న దేవుడు.
శిక్ష పూర్తిగా అనుభవించేను.

నాన్న మీద అమ్మ కు ఎంత ప్రేమ.

అమ్మ ఆస్థికలున్న కలశాన్ని ఆప్యాయంగా నేను ముద్దు పెట్టుకుంటున్నపుడు అన్నయ్య నవ్వుతూ చూసేడు.

నాకప్పుడు నాన్న దీవించినట్లైంది.! ఎక్కడినుంచో అమ్మ కూడా...!!

* * *